# వాస్తువు శాస్త్రమా ?

## (Is Geomancy a Science)

రావిపూడి వెంకటాద్రి
ప్రఫుల్ల చంద్ర



హేమా పబ్లికేషన్స్
చీరాల - 523 155

303 - వాస్తు
93689

# వాస్తువు శాస్త్రమా?

**(Is Geomancy a Science)**


రావిపూడి వెంకటాద్రి

ప్రఫుల్లచంద్ర





హేమా పబ్లికేషన్స్

చీరాల - 523 155

# Vaastuvu Sastramaa?

**(Is Geomancy a Science?)**


**by : Ravipudi Venkatadri**
**Praphulla Chandra**



720
వెంక - వాస్తు



*తొలి ముద్రణ : జనవరి 1990*

*మలిముద్రణ : జులై 2001*

*రచయితలవి*

*వెల : రూ. 60/-*



కాపీలకు : **రావిపూడి వెంకటాద్రి**

**ఎడిటర్, హేతువాది**

**చీరాల - 523 155.**

**ఫోన్ : 33403**



టైప్‌సెట్టింగ్ : యాపిల్ గ్రాఫిక్స్, చీరాల. ఫోన్ - 36191

ముద్రణ : వాసు ఆఫ్‌సెట్ ప్రింటర్స్, విజయవాడ. ఫోన్ - 438324

ప్రచురణ : హేమా పబ్లికేషన్స్, చీరాల - 523 155.

*Surely science and superstition coexist, but are not complementary. Scientific knowledge is a rational process in which dogma, rigidity, revelation, ritual, mystic belief and miracles should not find a place. The greatest damage done by supersitions is that they deflect attention from the primary cause and lead to a defeatist attitude of helpless acceptance. They stand in the way of unearthing the root cause and undertaking adequate remedial steps. The worst of the supersitions is that they are easy to make and hard to destory. Scientific approach is to find consisteney between theory and practice, between apparent and real causes of phenomena, through free and creative thinking, experimentation and objective analysis. Science has a built-in method for correcting its own mistakes. It is both perceptive and deductive and thus has an element of creation and destruction. Science affects skills, attitudes and behavioural pattern to which tradition and supersition offer resistance. A strategy has to be evolved for weakening the forces impending this change and strengthening those that favour it. Scienctific attitude and rational outlook should become a way of life resisting regidity and resilent to change.*

*- Prof. Y. Nayudamma*

# రావిపూడి రచనలు

విశ్వాన్వేషణ
జీవమంటే ఏమిటి?
శాస్త్రం - పురాణం
మానవుడు - సమాజం - ప్రకృతి
(రాడికల్ హ్యూమనిస్టు దర్శనం)
మార్క్సిస్టు భౌతికవాదం
రాడికల్ హ్యూమనిజం
నాస్తికత్వం - నాస్తితత్వం
నాస్తికులున్నారు, జాగ్రత్త
హేతువాదం
హేతుత్వం - మతతత్వం
ఇస్లాం- ఒక అంచనా
భావవిప్లవం - వర్గచైతన్యం
మార్క్సిస్టు వాస్తవికత
ఎం.ఎన్.రాయ్ - భారత కమ్యూనిజం
శాస్త్రం - మతం
జ్యోతిషం శాస్త్రమా?
శంకరాచార్యుడి హత్య
విశ్వతత్వం
ఐన్‌స్టీన్ : మతం - దైవం
హేతువాద వైఖరి
హేతువాదం - అజ్ఞేయవాదం
చార్వాకుల కథలు
హేతువాద యుగకర్త - కవిరాజు
గతితర్కం శాస్త్రీయమా?
భౌతిక వాస్తవికవాదం
తెలుగు సాహిత్యంలో హేతువాదం
మానవవాదం - శాస్త్రీయదృక్పథం
అయోధ్యలో ఆలయమా?
ఆదిశంకరాచార్య: వ్యక్తిత్వం - తత్వం
హేతువాదం - మానవవాదం
రినైజాన్స్
హేతువాద మార్గం
జీవం - ఆత్మ
వివేకం - అవివేకం
వైమనస్యత
సత్తు - చిత్తు
కళ - శాస్త్రం - తత్వం - హేతువాదం
వైదికఛాందసం - మతపునరుజ్జీవన ప్రమాదం
సెక్యులరిజం - శాస్త్రప్రపంచం
శాస్త్రం - అశాస్త్రం
సత్యాన్వేషణ
స్వామినేని హితసూచని - పర్యాలోకనం
సెక్యులరిజం - హ్యూమనిజం
అడుగుజాడలు
బైబిలు గణాచారం
అయోధ్యలో ఆలయరాజకీయం
మతజాడ్యాల మచ్చుతునకలు
కార్యకారణత - నియతివాదం - మానవవాదం
హేతువాదం - నైతిక విప్లవం
బైబిలు సృష్టి వాదం
కమింటరన్‌లో ఎం.ఎన్.రాయ్
కర్మవాదం-నియతివాదం-స్వేచ్ఛావాదం
మనం ఏమి చేయాలి?
వాస్తువు శాస్త్రమా?
మనుధర్మశాస్త్రం మానవ ధర్మశాస్త్రమా?
మార్క్సిజం - హ్యూమనిజం
నియతివాదం - అనిశ్చయసూత్రం
లయ - అవలయ
Life and Soul
Reason & Unreason
Why Dialecticeal Materialism is unscientific
Rationalism
Why Rationalism?
మార్క్సిస్టు గతి తర్కం (సంకలనం)
జ్యోతిషం శాస్త్రం కాదు (సంకలనం)
ఎం.ఎన్.రాయ్ దర్శనం (సంకలనం)
భావవిప్లవ వైతాళికుడు కవిరాజు (సంకలనం)
చార్వాకుల చర్చ (సంకలనం)
డార్వినిజం - హేతువాదం (సంకలనం)
కవిరాజు పీఠికలు (సంకలనం)
హ్యూమనిస్టు ఆర్థిక విధానం (అనువాదం)
భారతదేశం - గోపూజ (అనువాదం)
ఫాసిజం (అనువాదం)

# ముందుమాట

**వాస్తువు, జ్యోతిషం శాస్త్రాలు కావు.**

ప్రతి మతమౌఢ్యాన్నీ అన్నట్లుగానే ప్రాచీన హిందువులు జ్యోతిర్వాస్తువులను కూడా శాస్త్రాలన్నారు కాని, అవి ఏ ప్రమాణాల ప్రకారం శాస్త్రాలో వారెన్నడూ, ఎక్కడా చెప్పలేదు.

వాస్తు ఫలాలు, జ్యోతిష ఫలాలు చెప్పడం శాస్త్రం కాదు.

జ్యోతిర్వాస్తు పండితులు చెప్పిన ఫలాలు ఎన్నడూ జరగలేదు - జరగవు, జరగడానికి అవకాశాలు లేవు. అవన్నీ మార్మికాలు, అబద్ధాలు, అయినా, వాటిపై వెర్రినమ్మకం జనాన్ని పట్టి వేధించడం మానలేదు.

వాస్తు పోకడ భారతదేశమంతటితో పాటు, ఇతర ప్రాచ్యదేశాలలో ఎంతో కొంత, ఏదో రూపంలో వుంది. కాని, ఈనాటి తెలుగుదేశంలో వాస్తు పూనకం విపరీతంగా విజృంభించింది.

"జ్యోతిషం శాస్త్రం కాదు, మౌఢ్యం, మోసం, గారడి, బూటకం, వ్యసనం, వేలంవెర్రి" అని నేను వ్రాసి 40 సంవత్సరాలు కావస్తున్నది. సరిగ్గా అవే లక్షణాలు వాస్తువులో కూడా వున్నాయి.

జ్యోతిర్వాస్తువులు రెండూ దేశంలో బహుళ వ్యాప్తిలో వున్నాయి.

తుమ్మినా, దగ్గినా, శకున ఫలాలు చూచే హిందువులు జ్యోతిషం ప్రకారం తిథి, వార, నక్షత్ర ఫలాలను పాటించకుండా ఏ పని చేయడానికీ పూనుకోరు. వాస్తు ఫలాలను తెలుసుకోకుండా ఏ గృహనిర్మాణాన్నీ ప్రారంభించరు.

ఇటీవల తెలుగులో కొత్త వాస్తుగ్రంథాలు కుప్పలు తెప్పలుగా వస్తున్నాయి. ముప్పాత వాస్తుగ్రంథాలు పునర్ముద్రణలవుతున్నాయి. వాస్తు ప్రక్రియ వ్యాపారంగా మారిపోయింది. ఎక్కడికక్కడ వాస్తు పండితులు పుట్టకొక్కుల్లా పుట్టుకొస్తున్నారు. కొత్త సంపన్నులూ, అధికార రాజకీయ నాయకులూ వారికి అండగా నిలుస్తున్నారు.

బ్రాహ్మణీకరణ జాడ్యం హిందూ కుల సమాజాన్ని పట్టి పీడిస్తున్నది. ఎవరికివారు తమనుతాము న్యూనంగా పరిగణించుకొని, పై కులాలనబడే వారి ఆచార వ్యవహారాలను అనుసరించాలని తాపత్రయ పడుతున్నారు. "పులిని చూచి నక్క వాత పెట్టుకున్న కథ" రీతిగా పై వర్గాలవారి మూఢాచార సంప్రదాయాలను క్రింది వర్గాలవారు అనుసరించడం ఫ్యాషనైంది. జ్యోతిర్వాస్తు మూఢ నమ్మకాల విషయంలో కూడా అంతే జరుగుతున్నది.

అధికార రాజకీయ నాయకులు అత్యాశాపరులు, అధికార ప్రలోభ పీడితులు పదవి లభించడం మొదలుగా, ఆ పదవి జీవితాంతందాక నిలుస్తుందా, లేదా, అనే ఆశా ప్రలోభాలు వారిని నిత్యమూ వేధిస్తుంటాయి. అందుకే, జ్యోతిర్వాస్తు ప్రక్రియలకు గిరాకీ పెరిగింది.

పూర్వకాలంలో రాజులుకూడా జ్యోతిర్వాస్తు ప్రక్రియల్ని సర్వవేళలా పాటించే వారు. యుద్ధాలకు ముహూర్తాల నిర్ణయాల్లో రాజులు జ్యోతిష్కుల్ని ఆశ్రయించే వారు యుద్ధాలలో గెలిచినవారు తమ గెలుపును జ్యోతిషంతో ముడి వేసేవారు. ఓడినవారు దాన్ని మరచేవారు. నాటి యుద్ధాలలో, నేటి ఎన్నికలలో కూడా మూర్ఖులు జ్యోతిష ప్రక్రియ మీద ఆధారపడుతున్నారంటే కారణం ఆశాప్రలోభాలే.

(గ్రీన్‌లాండ్స్ (హైదరాబాదు)లో ఉన్న ఒకప్పటి ఆంధ్ర ముఖ్యమంత్రులిద్దరికి రెండేసి సంవత్సరాలలోనే పదవి పూడింది కాబట్టి, అనంతరం వచ్చిన ముఖ్యమంత్రి మరో యింటిని ఎంపిక చేసుకున్న సంగతి చాలమందికి గుర్తుండే వుంటుంది. చిరకాలం పదవిలో కొనసాగాలనుకున్న మరో ముఖ్యమంత్రి తన నిలయాన్ని, కార్యాలయాన్ని షేపులు మార్పించిన సంగతి కూడా చాలమందికి గుర్తుండే వుంటుంది. వాస్తు పండితుల సలహాలను పాటించి, తమ నివాసాల షేపులు మార్పించుకొని, ప్రభుత్వ ఖాతాలో ఖర్చులు వ్రాయించిన మంత్రుల సంగతీ చాల మంది యెరుగుదురు. అలాంటివారిలో కొందరు ప్రభుత్వాలలో వుండి. ప్రజల సొమ్ము దోచుకతిని, నేరం క్రింద చిక్కక తప్పించుకున్న వారి పేర్లూ, చిక్కి కోర్టుల పాలు, జెయిళ్ళపాలు అయిన అధికార రాజకీయ నాయకుల పేర్లూ చాలమంది యెరుగుదురు. పైకి ఎవ్వరేమి చెప్పకున్నా, ప్రజలలో యీ విషయాలు చాలమందికి తెలుసు.

కాని, అధికార రాజకీయ నాయకులకు తెలియని ముఖ్య విషయం ఒకటి వుంది. భారత స్వాతంత్ర్య లబ్ధికి పూర్వం ఏ విధమైన వాస్తు గృహాలలో నివసించినందువల్ల, లేక ఏ ముహూర్తాలలో సత్యాగ్రహోదులు, విప్లవ కార్యక్రమాలు సాగించినందువల్ల వేలాదిమంది నాయకులు, స్వాతంత్ర్య సరమయోధులు జెయిళ్ళ పాలయ్యారో, ప్రాణాలు కోల్పోయారో – ఆ విషయం మాత్రం అధికార ప్రలోభ పీడితుల స్పృహలోకిరాదు. ఇక, వారి జ్ఞాన ప్రమాణాన్ని కొలిచేది ఎలా?

1947 ఆగస్టు 15న రాజకీయ నాయకులు స్వాతంత్ర్య ప్రకటన చేయడానికి శుభముహూర్తం కోసం అర్ధరాత్రి 12 గంటలదాక వేచివున్నారంటే, మన రాజకీయ నాయకులలో జ్యోతిషం విధించిన భావబానిసత్వం ఎంత లోతున నాటుకుపోయిందో అర్థం చేసుకోవచ్చు.

ఆ భావబానిసత్వం ఇంకా కొనసాగుతూనే వుంది.

జ్యోతిషం ఒంటరిగా ప్రయాణం చేస్తుంది కాని, జ్యోతిషం తోడు లేకపోతే వాస్తు ప్రయాణం ఆగిపోతుంది. అదీ, భారతీయ వాస్తు ప్రమాణం. అంటే వాస్తు వెప్పటికీ జ్యోతిషానికి గులామే.

ఎన్నికలలో నామినేషన్ పత్రాలు వేయబోయేముందు రాజకీయ నాయకులు ముహూర్తాలు పెట్టించుకుంటారు. ఓడిపోతే, ఫలాన్ని కర్మనెత్తికి అంటగడతారు. గెలిస్తే మంత్రి పదవికోసం ఉబలాటపడతారు. పదవివస్తే ప్రమాణానికి శుభముహూర్తం పెట్టించుకుంటారు. తిరిగి మంత్రాలయ ప్రవేశానికి జ్యోతిర్వాస్తు పండితుల్ని సంప్రదిస్తారు.

కొంతమంది రాజకీయ నాయకులు వాస్తుఫలాలకూ, జ్యోతిష ఫలాలకూ "మించిన ఫలాలను" ఆశిస్తారు. ఇతరుల్ని పదవిలోకి రాకుండా అడ్డుకోడానికీ, తాము పదవిలోకి రావడానికీ, వచ్చిన పదవిని పదిలంగా కాపాడుకోడానికీ యజ్ఞాలు చేసి, ఆటవికులకు దగ్గరవతారు.

యజ్ఞాలమీద నమ్మకం చాలక స్వాముల్ని, బాబాల్ని, అమ్మల్ని ఆశ్రయించి దీవనలందుకొనే రాజకీయ నాయకులున్నారు. ఎంత ఎక్కువగా భావబానిసలయితే, అంత యెక్కువగా వారు ఆశాప్రలోభాలకు బానిసలవతారు.

వాటన్నిటికి తోడు దైవానుగ్రహం కోసం దేవాలయాలచుట్టూ తిరిగి, ఇష్టదేవతలకు మ్రొక్కుకునే వాళ్లూ, ఇష్టప్రాప్తి జరిగాక ఆ దేవతలకు మ్రొక్కుబడులు తీర్చేవాళ్ళూ, ఇష్టం నేరవేరనపుడు దేవుళ్లను మరిచేవాళ్ళూ రాజకీయనాయకుల్లో కోకొల్లలు. ఇదంతా పరాధీన మనస్కతకు నిదర్శనం.

ఒకప్పుడు అయోధ్యలో రామాలయం వుండేదంటున్నారు. వుండి వుంటే, గింటే అది వాస్తు పద్ధతిలోనే నిర్మాణమై వుండాలి. బాబరు కాలంలో దాని ఆయుస్సు అంతటితో తీరివుండాలి.

అదే పద్ధతిని ఆలోచిస్తే, ఇస్లామిక్ పద్ధతిలో నిర్మించబడిన బాబ్రీమసీదు ఆయుస్సు *1992* డిశంబరు *6*వ తేదీవరకే వుండి వుండాలి. లేకుంటే, దాన్ని కూల్చే బుద్ధి హిందూత్వవాదులకు పుట్టకపోను!

ఒకప్పటి సోమనాధ దేవాలయం కూడ వాస్తు పద్ధతిని నిర్మించబడినదే కదా? దాని శంఖుస్థాపనకూడా శుభముహూర్తంలో జరిగి వుండాలి కదా? కాబట్టి దాని ఆయుస్సు తీరినప్పుడే దాన్ని గజనీ మహమ్మదు విధ్వంసం చేశాడనుకోవాలి. వాస్తుపద్ధతిలో ఆలోచిస్తే అంతే అనుకోవాలి.

కాశీ, మధురలలో, ఒకప్పుడు కూల్చివేయబడినవంటున్న హిందూ

దేవాలయాలు వాస్తుబలం కోల్పోవడం వల్లనే కూలినవనుకుందామా? ముస్లిములు కూల్చారంటున్న వేలాది దేవాలయాలు వాస్తులోపాలవల్లనే కూలాయనుకుందామా? వాస్తువులో, జ్యోతిష్యంలో బలంవుంటే, కట్టడాలు కూలే లోపాలు వాటిలోనే వుంటాయికాని, వాటిని ధ్వంసం చేసిన వారిలో కాదని అనుకోవచ్చునేమో, జ్యోతిర్వాస్తుపండితులు ఆలోచించాలి! ఎందుకంటే, వేలాది బౌద్ధారామాలను, జైన మందిరాలను హిందువులు నేలమట్టంచేసి, వాటిమీద దేవాలయాలు నిర్మించారు. అది హిందువులు కావాలని చేసిన పనికాదనీ, జ్యోతిర్వాస్తుపండితులు వాటికి నిర్ణయించిన ఆయుస్సు పూర్తయిందనీ సమర్థించి చెప్పుకోవచ్చు!

గత చరిత్రలోకి ఒకసారి తొంగిచూస్తే, వాస్తు పండితులు చెప్పే కథలన్నీ అబద్ధాల పుట్టలని తేలుతుంది. కాలం అబద్ధాలను దాచలేదు.

పూర్వకాలంలోని రాజులు చాలమంది దోపిడి ముఠాల దొరలే. వాళ్లను యెల్లప్పుడూ శత్రుభయం వెంటాడుతూ వుండేది. వాళ్ల కోటలు కొండలమీద వుండేవి. చదునైన ప్రదేశంలో వుంటే, ప్రహరీల వెలుపల నీటితో నింపబడిన అగడ్తలు (పెద్ద కందకాలు) వుండేవి. అన్నీ వాస్తుపద్ధతుల ప్రకారమే నిర్మించబడేవి. కోటల బురుజులమీద శత్రువుల రాకను గమనించడానికి కాపలా సైనికులుండేవారు. పురాణ ప్రసిద్ధ రాజుల కోటలు నూటికి నూరుపాళ్లు అదృశ్యంకాగా, మధ్యయుగానంతర కోటల్లో ఎక్కడో ఒకటి ఇప్పుడు శిధిలావస్థతో దర్శనమిస్తుంది. వాస్తు మహత్యం ఏమైందో, జ్యోతిషముహూర్తాల బలమేమైందో, ఇప్పుడా రాజ్యాలూ లేవు, రాజులూ లేరు, వారి కోటలూ లేవు. అవే జ్యోతిర్వాస్తు ప్రక్రియల ఫలాలు.

రాజులూ, రాజ్యాలూ పోయినా, భక్తిమాత్రం ఇంకా మిగిలే వుంది. అందువల్ల, పెద్ద పెద్ద చట్రాతిబండలతో, శిల్పాలతో మధ్యయుగానంతరం నిర్మాణమైన ప్రముఖ దేవాలయాలు కొన్ని యిప్పటికీ మిగిలివున్నాయి. అవి విమతస్థుల దాడిని తప్పించుకున్నందువల్లనే ఈనాటికీ నిలబడి వున్నాయి కాని, వాస్తు ప్రభావం వల్ల మాత్రం కాదు.

అయితే, ఏ దేవాలయ వాస్తువు శుభమైందో, ఏదికాదో నవీన వాస్తుపండితులు లెక్కలు తేలుస్తున్నారు. బలం ఆలయవాస్తువుదేకాని, దేవుడిది కాదని తేల్చి వేస్తున్నారు. నిజానికి, జ్యోతిర్వాస్తువులు మన జీవితాలను నడిపిస్తే, ఇక దేవుడితో పనేముంది? అయినా జ్యోతిర్వాస్తు విద్యావిశారదులు నాస్తికులు కారు.

ప్రజల్లో బుద్ధి ఎంతగా మందగిస్తే అంతగా వారిలో ఆశాప్రలోభాలు పెరుగుతాయి. భక్తిని పెంచడంలో రాజకీయ నాయకులు తమ వంతు కృషి తాము చేస్తున్నారు. చివరకు భక్తీ, తీర్థయాత్రలూ, పుణ్యక్షేత్రాల దర్శనం ఫ్యాషనై కూర్చుంది.

శీలం చెడిన తెలుగువారిప్పుడు కేరళలోని అయ్యప్పస్వామి దర్శనం కోసం నల్ల యూనిఫారాల్లో గుంపులు గుంపులుగా బయలుదేరుతున్నారు. ఇంతకుముందు ఇక్కడి గుడ్డిపోలికి కూడా అయ్యప్ప పేరు తెలియదు.

ఆపదలో చిక్కిన ఉత్తరాది వారిప్పుడు తిరుపతి వెంకన్న దర్శనం కోసం పరుగులెత్తుతున్నారు. స్వరాజ్యం రాక పూర్వం వెంకన్న గుడి సంగతి వారికి తెలియనే తెలియదు. తెలుగువార్లైనా ఈనాటి తిరునాళ్ళు ఆనాడు చేయలేదు.

నల్లధనం దాచుకొనే వసతికోసం నాయకులూ, మనశ్శాంతికోసం మతిచెడిన విదేశీమార్ఫియాగాళ్ళూ పుట్టపర్తి శాంతినిలయాన్ని దర్శించి సత్యసాయిబాబాను సేవిస్తున్నారు. సాయిబాబా పుట్టక ముందు ప్రజలకు మనశ్శాంతి కల్గించే దేవుడే లేడని దీని తాత్పర్యం.

అసలు పోలేరమ్మే లేదు కాని, అక్కడక్కడ ఏరియా పోలేరమ్మల కొలుపులు ఇప్పటికీ జరుగుతున్నాయి. మనవారి ఆటవిక నమ్మకాల అవశేషానికి అవి నిదర్శనంగా నిలుస్తున్నాయి.

ఆయా ఆలయాలు, నిలయాలు శుభవాస్తు నియమాలు కల్గివున్నందువల్లనే వాటిని ప్రజలు తండోపతండాలుగా దర్శిస్తున్నారని ఈనాటి వాస్తు గ్రంథకర్తలు తమ గ్రంథాలలో బాహాటంగా సిగ్గు విడిచి వ్రాసుకుంటున్నారు. యెరూషలేం యెహోవా దేవాలయం, మక్కామసీదుల వాస్తుప్రశస్తిని కూడా వాళ్ళు వదల్లేదు. వాస్తు పరిశీలనకోసం "పోతన్నగారి వైకుంఠాన్నే" సందర్శించిన వాస్తు సామ్రాట్టులు ఎక్కడ సందు దొరికితే అక్కడల్లా వాస్తు మహత్యాన్ని దూర్చారు. అడవులలో, కొండలలో, కొండ గుహలలో మరుగునపడిపోయిన దేవాలయాలను, మంగమ్మాలయాలను క్షాళనం చేసి పూజా పురస్కారాలకు పురికొల్పడం ఈనాడొక వ్యాపారనీతి అయి కూర్చుంది. నల్లరాతి బొమ్మకు పసుపురాసి, కుంకుమబొట్లు పెడితే - సాగిలబడి మ్రొక్కే జనం వున్నపుడు, భక్తీ పెరుగుతుంది, వాస్తువూ పెరుగుతుంది. భావదారిద్ర్యంతో సతమతమవుతున్న భారతీయులలో వాస్తువు సరికొత్త భావదాస్యాన్ని ప్రకోపింపజేస్తున్నది.

చైనా, ఇండోనేషియా మొదలైన ప్రాచ్య దేశాలలో కూడా ఫెంగ్ షూయి పేరుతో ఇప్పుడు వాస్తు వ్యాప్తి మొదలైంది. అదంతా కూడా మార్మికతతో కూడుకున్నదని వేరేచెప్పనవసరం లేదు. మనకు వాస్తు పురుషుడున్నట్లే, వారికి తెల్లపులి వుంది. కాబట్టి, వాస్తురోగం ప్రాచ్యదేశాలలో దాని వారసత్వాన్ని నిలబెట్టుకుంటున్నదని తేలుతుంది.

ఈ రోగం ప్రాచీన కాలంలో భారతదేశ మంతటిలో వ్యాప్తిలోవున్నా, తెలుగుదేశంలో అది ఇటీవల ఉధృతరూపం తాల్చింది. అందువల్ల "హేతువాది" పత్రిక

కోర్కె మన్నించి, మిత్రులు - ఆలూరి ప్రఫుల్లచంద్ర *1992* ఫిబ్రవరి మొదలు అక్టోబరు వరకు *"వాస్తులో వాస్తవమెంత?"* అనే శీర్షికతో ధారావాహికంగా వ్రాశారు. దాన్ని ప్రత్యేక కరపత్రంగా ముద్రించమని కోరిన మిత్రులున్నారు. కాని, వాస్తువుపై మరింత పెద్ద పుస్తకం వ్రాయాలన్న వుద్దేశంతో ఆ కరపత్రాన్ని రూపొందించలేదు. పైగా "వాస్తువులో వాస్తవమెంత?" అనే శీర్షిక వాస్తువులో "ఏ మాత్రమయినా" వాస్తవం వుందేమోనన్న అపార్థానికి దారితీస్తుందన్న సంకోచం కూడా మాలో వుంది. "వాస్తువుశాస్త్రం కాదు, కాదు, కానేకాదు"అనే అభిప్రాయం మాకు వుండడంవల్ల, వాస్తువుపై స్థూలంగా వ్రాసిన మా అభిప్రాయాలు ఈ పుస్తకంగా రూపుతాల్చాయి. వాస్తువుపై ఇంకా విస్తృతంగా వ్రాయవచ్చు. కాని, అనవసరమైన కాగితం ఖర్చు అని యింతటితో సరిపెట్టుకుంటున్నాము.

ఏ వాస్తుపండితుడైనా, లేక వాస్తువులో వాస్తవాన్ని వెదకబూనే ఏ ఇంజనీరయినా వాస్తువుశాస్త్రమని రుజువు చేస్తే చూడాలని వుంది. ఈ రచనను వాస్తుపండితులకు సవాలుగానే మేము విడుదల చేస్తున్నాము.

ఏ నగరంలోనైనా ***100-500*** ఇండ్లు గల బ్లాకును ఎంపిక చేసుకొని, ఆ బ్లాకులోని యిండ్లలోని వాస్తు విశేషాలను, వాటిలో నివసించేవారికి అవి యిస్తున్న ఫలాలను సమీకరించి రుజువు చేయడానికి ఏ వాస్తుపండితుడైనా సిద్ధపడితే - ఆ సవాలును మేము స్వీకరించడానికి సిద్ధంగా వున్నాము. ఇది మా సవాలు.

ముగింపుగా మరోసారి చెప్తున్నాము.

వాస్తువు శాస్త్రం కాదు.

వాస్తు ఫలాలన్నీ అబద్ధాలు

సెలవు.....

**రావిపూడి వెంకటాద్రి**

ఎడిటర్, హేతువాది, చీరాల - *523 155.*

అధ్యక్షులు : భారత హేతువాద సంఘం

చీరాల

21, డిశంబరు 1998

# రెండో ముద్రణకు మరో ముందుమాట :

He, who begins to work as an architect without knowing the science of architecture and is proud with false knowledge, must be put to death by the king as one who ruins the kingdom.

Bhojaraja : Samarangana Sutradharam

నిర్మాణ శిల్పం తెలియకుండానే మిడిమిడి జ్ఞానంతో గృహాదుల నిర్మాణం చేపట్టే శిల్పులకు సమరాంగణ సూత్రధారం మరణదండనను ప్రతిపాదించింది. ఆ ప్రతిపాదన నిర్మాణశిల్పులకు సంబంధించినదేకాని, వాస్తు పండితులకు సంబంధించిందికాదు. కాని, నిర్మాణ శిల్పం అసలే తెలియని యీనాటి వాస్తు పండితులు చెపుతున్న గృహ నిర్మాణవాస్తు ఫలాలు నిజాలు కావు. అవి నిజాలు కావని రుజువైన తర్వాత, ఆ ఫలాలను చెప్పిన వాస్తు పండితులకు మరణదండన కాకపోయినా, మరో రకమైన తీవ్రదండన అయినా విధించకపోతే, ఈనాడు చెలరేగుతున్న వాస్తు ఉప్పెన ఆగదు. అది ఆగకపోతే ఆ మౌఢ్యానికి దాదాపు సామాజికులందరూ బలి అవుతూనేవుంటారు.

విజ్ఞానశాస్త్రజ్ఞులు చెప్పిన శాస్త్రీయ ఫలితాలు వారు చెప్పినట్లుగా జరుగుతాయి. కొంచెం అటుయిటుగా కూడా తొలగవు. అంటే, విజ్ఞానశాస్త్రంలో మార్మికత వుండదు. మార్మికత వుండగలది శాస్త్ర విజ్ఞానం కాదు. కాని, వాస్తు గ్రంథాలలో వుండేదంతా మార్మికత తప్ప, శాస్త్రం కాదు. ప్రాచీన వాస్తు గ్రంథాల్లో ఎంత మార్మికత వుందో, నవీన వాస్తు గ్రంథాల్లోనూ అంతే మార్మికత వుంది. అవి చెప్పే ఫలాలు ఎన్నడూ నిజం కాలేదు, నిజం కాబోవు కూడా. అందుకే, వాస్తువును శాస్త్రం కాదంటున్నాం.

అందువల్లనే, "వాస్తువు శాస్త్రమా?" అన్ని ప్రశ్నించి "కాదు, కానే కాదు" అని రుజువు చేయడానికే ఈ గ్రంథాన్ని పాఠకుల ముందుంచాం.

ఇందులో 10 అధ్యాయాలున్నాయి. అవి ముందుగా "హేతువాది" మాసపత్రికలో 1998లో ధారావాహికంగా అచ్చయినై. పత్రిక అచ్చవుతున్నపుడే ఆ వ్యాసాల తాలూకు ఫారాల కాపీలను కొన్నిటిని పుస్తకం కోసం విడిగా తీయించాం. వాటికి ముందుమాటను, చివరి మాటను కలిపి, 1999 జనవరిలో పుస్తక రూపం యిచ్చాం. పుస్తకాల కాపీలు 500

మాత్రమే దిగాయి. ఒకటి రెండు నెలల్లోనే కాపీలన్నీ అయిపోయాయి. పునర్ముద్రణ కోసం ఒక్క కాపీ తప్ప, మా వద్ద ఏమీ మిగలలేదు. దీని ప్రథమ ముద్రణ తర్వాత "హేమా ప్రచురణలు" 10 దాక కొత్త గ్రంథాలను ప్రచురించవలసి వచ్చింది. అందువల్ల "వాస్తువు శాస్త్రమా?" పునర్ముద్రణను తీసుకురావడంలో ఇంతగా జాప్యం జరిగింది.

నిజానికి ఒక్కో వాస్తు గ్రంథం మీద ఒక్కో ఖండన గ్రంథం వ్రాయవచ్చు. కాని, చాలా వాస్తు గ్రంథాల మౌలిక మార్మికతలో సారూప్యత వుంది. అందువల్ల, అంత బండచాకిరీ చేయవలసిన అవసరం లేదనిపించింది. మాకు అందికలో వున్న కొన్ని వాస్తు గ్రంథాలను పట్టి చూచి, వాస్తు వెంత బూటకమో రుజువులు చూపడానికి ఈ రచనలో ప్రయత్నించాం.

కులం గబ్బు, జ్యోతిషం జబ్బు లేని ప్రాచీన వాస్తు గ్రంథం లేదు. దిక్కులు, దిక్పాలకులు, మెరకపల్లాల ప్రస్తావన లేని వాస్తు గ్రంథం లేదు. వాస్తు పురుషుడు, జలవాస్తువు, జిలవాస్తువు, శల్యవాస్తువు, పూజా పురస్కారాల ప్రస్తావనలేని వాస్తు గ్రంథం లేదు. తిథులు, వారాలు, మాసాలు, నక్షత్రాలు వెదకి, శుభాశుభ ముహూర్తాలను నిర్ణయించని వాస్తు గ్రంథం అరుదు. మహర్షుల పేర్లు వల్లించి, ప్రాచీన వాస్తు గ్రంథాల్లోని శ్లోకాలను అప్పగించని నవీన వాస్తు పండితులు దొరకరు. కొందరు వేమన పద్యాలను కూడా ఉటంకించడం సరికొత్త ఫ్యాషనైంది. వారిదంతా అలీక పాండిత్యం – మేక (మెడ క్రింద వుండే) చళ్లనుంచి పాలుపితికే విద్య వారి సొంతం.

విజ్ఞానానికి అత్యంత విషాదకరమైన అంశమేమంటే, ఈ దేశంలో యుజిసి ఛైర్మన్ హరిగౌతమ్‌గారు విశ్వవిద్యాలయాల్లో జ్యోతిర్వాస్తువుల్నీ, యోగానూ, సంస్కృతాభ్యాసాన్నీ, పౌరోహిత్యాన్నీ ప్రవేశపెట్టడానికి ఉద్యమిస్తున్నారు. వాటి ప్రచారం కోసం తన పదవిని దుర్వినియోగించుకుంటూ, మరల భారతదేశంలో నియోబ్రాహ్మినిజాన్ని స్థాపించడానికి సమకడుతున్నారు. ఈ ప్రక్రియలు భారతదేశంలో బాగా వూపులో వున్నపుడే దేశం తరతరాలుగా అన్యాక్రాంతమవుతూ వచ్చిందనే విషయాన్ని మరుస్తున్నారు. ఇలాంటి చీడపురుగులు ప్రభుత్వాలను ప్రభావితం చేయడం వల్లనే, భారతదేశాన్ని తిరిగి, శిలాయుగ సంస్కృతిలోకి నడపడానికి ప్రభుత్వాలు నడిపే వారు సిగ్గుపడడం లేదు. చరిత్రలో బారుకీ భారతీయ రాజ్యాల్లో ప్రభువులు బ్రాహ్మణ భాగోతాలకు లోను కావడం వల్లనే శక్తిహీనులయ్యారనే వాస్తవాంశం వీరి జ్ఞానానికి అందడం లేదు. వీరి వైఖరి అంతా బావిలోని కప్పలను, ఇసుకలో తలదూర్చే ఉష్ట్రపక్షులను తలపింపజేస్తుంది. అన్ని రకాల ఫండమెంటలిజాలూ ప్రపంచాన్ని వెనక్కునడపడానికి ప్రయత్నిస్తాయి. హిందూ ఫండమెంటలిజం భారతదేశాన్ని అధోగతి వైపు నడిపించడానికి ప్రయత్నిస్తున్నదనడంలో ఎలాంటి సంశయమూ వుండనవసరం లేదు. వారు కోట్ చేసే శాస్త్రాలూ, వాటిని రచించారంటున్న మహర్షులూ అందరూ సంఘ విద్రోహశక్తులే.

ఈ దేశమొక్కటే యావత్ ప్రపంచమనీ, ఇక్కడే మనుషులున్నారనీ, వీరిని విరాట్పురుషుడు తన ముఖబాహూరుపాదాలనుంచి బ్రాహ్మణ క్షత్రియవైశ్య శూద్ర వర్ణాలుగా సృష్టించాడనీ మహర్షులనబడే వారు నమ్మారు. ప్రపంచంలో ఇంకా ఇతర దేశాలు చాలా వున్నవని వారికి తెలియదు. వాటిలో కూడా జనం వున్నట్లు వారికి తెలియదు. ఆజనమంతా యిళ్లు కట్టుకున్నారనీ, తమ దేవుళ్లకు కూడా యిళ్లు కట్టి పెట్టారనీ వారికి తెలియదు. ఆజనం గణేశపూజ, వాస్తు పురుష పూజ చేయకుండా, శుభాశుభ ముహూర్తాలు చూడకుండా, మన వాస్తు నియమాలను పాటించకుండా గృహాదుల నిర్మాణం చేపట్టారని వారికి తెలియదు. అయినా, ఆ మహర్షులనబడే వారే వాస్తుశాస్త్ర గ్రంథాలనే వాటిని రచించి, ఈనాటి వాస్తుపండితులకు వారసత్వ ఆస్తిగా వదలిపెటిపోయారు. ఆ గ్రంధాలే ఈనాటి వాస్తుపండితుల సంపాదనకు మూలమయ్యాయి.

వాస్తు పండితులు ఎంతోడంబంగా చెప్పుకొనే వాస్తు పద్ధతుల ప్రకారం నిర్మించబడ్డ అతి ప్రాచీన కట్టడాలు మచ్చుకైనా ఈనాడు కన్పించవు. అవన్నీ నామరూపాలు లేకుండా పోయాయి. మన వాస్తు నియమాలను అనుసరించకుండా ఇతర దేశాలవారు నిర్మించుకున్న ప్రాచీన కట్టడాల శిధిలావశేషాలు ఇప్పటికీ చాలా విదేశాల్లో దర్శనమిస్తున్నాయి. వాస్తు బలంలేని విదేశీకట్టడాలు శిథిలమయ్యాయంటే మనం అర్థం చేసుకోవచ్చు. కానీ, మహర్షి ప్రోక్త వాస్తు శాస్త్ర బలం ఎంతగానో వున్నదంటున్న ప్రాచీన భారతీయ కట్టడాలు ఒక్కటైనా యీనాటివరకు నిలచివుండక పోవడానికి కారణం ఏమని చెప్పుకోవాలి? ఈ విధమైన ప్రశ్న వివేకవంతులందరికీ రావాలి. కాని, అలా రావడం లేదు. కారణం?

వాస్తు పండితులందరిదీ డంబాచారం.

వాస్తు నమ్మకస్తులందరిదీ గొర్రెదాటు వ్యవహారం.

ఈ పునర్ముద్రణలో గ్రంథాన్ని మేమేమీ సవరించలేదు. ఆ అవసరం కనిపించలేదు. కొద్దిచోట్ల స్వల్ప వివరణలు చేర్చాము. వాస్తు పండితులకు సవాళ్లు విసిరాము. శబ్దాలకు కృతక అర్థాలను సాధించే పద్ధతి అనారోగ్యకరం, అశాస్త్రీయం అని వక్కాణించాము. అలీక పాండిత్యం వ్యర్థమని నొక్కి చెప్పాము. వాస్తు పండితుల ప్రతిస్పందన కోసం ఎదురుచూస్తున్నాము. సెలవు.

07 మార్చి 2001
చీరాల – 523 155.

**రావిపూడి వెంకటాద్రి**
అధ్యక్షులు, భారతహేతువాద సంఘం

## ఇందులో....


ముందుమాట 1

రెండో ముద్రణకు ముందుమాట 7

1. శాస్త్రం - ప్రాతిపదికలు - వాస్తువు 11
వాస్తువుకు దిక్కేమిటి?; కాలమానాలు; గ్రహఫలాలు - గృహఫలాలు
కట్టడానికి వాస్తు - పడగొట్టడానికి వాస్తు; వాస్తు ప్రాణం ఎక్కడవుంది?

2. వాస్తు వారసత్వం 21
వాస్తుకులాలు; కులం పట్టింపులేని వాస్తువెక్కడ?; ఆశలు - భయాలు; అర్ధం లేని అబద్ధాలు

3. వాస్తువంటే ఏమిటి? 30
వాస్తోపనిషత్తు; వాస్తుపురుషుడు; శల్యపరీక్ష - మెటల్ డిటెక్టర్లు - బోన్ డిటెక్టర్లు;
నాటుమెటల్ డిటెక్టర్ల కొత్తపద్ధతి

4. కులం : ఎత్తుపల్లాల భాగోతం 41
స్థలాల ఎత్తు పల్లాలు - కులాలు; స్థలాల ఎత్తుపల్లాలు - ఫలాలు; ఎత్తుపల్లాల భాగోతం

5. కూపవాస్తు - కూపస్థ జ్ఞానం 51
బూటకాలు-బీరాలు; కాశ్యపమతం; బ్రహ్మావాస్తువు; బావిత్రవ్వకం దిక్కులు-ఫలాలు;
వాస్తు రుషుల కూపస్థకాలజ్ఞానం

6. గృహస్థులు - వాస్తు పండితులు 63
ఖగోళ విజ్ఞానంలో కొత్తమలుపు; జ్యోతిషం మాడు పగిలింది; జ్యోతిష్కుల అజ్ఞానం;
గ్రహణాలు, రాహుకేతువులు; తిథులంటే ఏమిటి? ; పంచాంగాలు; తిథుల ఫలాలు;
మాసఫలాలు; నక్షత్రాలూ-రాసులూ; వాస్తులో దూరిన జ్యోతిషఫలాలు; నక్షత్రఫలాలు- రాసి ఫలాలు

7. అపార్ధాల దశలు 76
తప్పుదారినుంచి ఒప్పుదారికి; అజ్ఞానపునరుద్ధరణ ధోరణి; జ్యోతిష ఫలాలు;
మాయింటి కథ; గ్రహశాస్త్రంలో కొత్తలేమీ లేవా?; జ్యోతిష్కులకేమి తెలుసు?
మనవారి భూపరిజ్ఞానం; సూర్యకుటుంబ స్థూలవివరాలు; జాతీయఅహం;

8. కొత్త బిచ్చగాళ్ళు 92
కొత్త సీసాలో పాతసారా; లోకాభిరామాయణం; పురాణవాస్తు - నవీనవాస్తు -
బ్రాహ్మణవాస్తు; నిర్మాణశాస్త్రం ఎటుపోయిందో; మూసగ్రంధాలు, క్షేత్రవాస్తువు పేర్మానదం ఫాషనైంది;

9. అజ్ఞాన ప్రచారానికి వైజ్ఞానిక పరికరాలా? 107
డామేశాసరుకు; తలతిక్కఉదాహరణలు, వాస్తువంటే పంచకూళ్లపంచాంగమా? ఏమి వాస్తురహస్యాలు;

10. ఇంజనీరింగ్ - వాస్తువు 117
అతకనిటంకం; ఆర్యవాస్తువా?; భూతాలు - దిక్కులు; రాజీపడని విజ్ఞానం

చివరిమాట 124
అనుబంధం 1 127
అనుబంధం 2 135
సంప్రదించిన గ్రంధాలు 142

# వాస్తువు శాస్త్రమా?

# 1. శాస్త్రం ప్రాతిపదికలు - వాస్తువు

విజ్ఞానమంటే ఏమిటో తెలిసినవారు వాస్తువును శాస్త్రమనరు. మన పూర్వులకు శాస్త్రం కానిదేమీ లేదు, దైవప్రోక్తంకాని శాస్త్రమూ లేదు. దైవప్రోక్తాలైన శాస్త్రాలు ఒకదానికొకటి ఎలా భిన్నంగా వుండగలవో ఏ వాస్తుసిద్ధాంతీ చెప్పడు. జ్ఞానమంతా మనుషులు అర్జిస్తున్నది కాన, వేర్వేరు కాలాల్లోని మనుషులు ఒకరికొకరు భిన్నంగా ఆలోచించడంవల్ల, శాస్త్రాల పేరుతో ప్రాచీన కాలం నుంచి దిగుమతి అయిన అంశాల్లో భిన్నత్వం కన్పిస్తున్నదని వారి వూహకు రాదు. అన్ని శాస్త్రాలూ అలా పెంపొందినవేననీ, అందువల్ల ప్రాచీనకాలంలో విజ్ఞానంగా యేదైనా వుంటే అది మార్పు చెందవలసి వుందనీ, కానీ, కొన్ని స్వార్థ సాంఘిక శక్తులు విజ్ఞానాన్ని పరిణామం చెందకుండా వ్యవస్థీకరించాయనీ, ఆధునిక విజ్ఞానం ఆ దశలన్నిటినీ దాటి ముందుకు నడిచిందనీ, కాబట్టి పాతకాలపు విజ్ఞానం పేరుతో పిలువబడేదాన్ని ఈనాటి మనం త్రోసివేయాలనీ, సనాతనులకు తోచదు.

తమ కాలం నాటికైనా, పూర్వులు శాస్త్రాల పేరుతో చెప్పినవన్నీ విజ్ఞాన శాస్త్రాలు కావు. అవి అన్నీ ఆనాటి జాతుల దురభిమానాలతో, ఈర్ష్యాద్వేషాలతో నిండి వున్నాయి. వాటినిండా కులంగబ్బు వుంది. మూఢనమ్మకాల జబ్బు వుంది.

జ్యోతిషం, వాస్తువు, సాముద్రికం, సోదె, బల్లిశాస్త్రం, పిల్లిశాస్త్రం, శకున శాస్త్రం మొదలైన మూఢనమ్మకాలన్నీ ఒకనాటివారు శాస్త్రం పేరుతో ప్రతిపాదించిన అంశాలే. "శాస్త్రం" పేరుతో, ఆచారం పేరుతో ఈనాటి మనుషులు అనుసరిస్తున్న జాడ్యాలన్నీ మూఢనమ్మకాలే.

అయితే, ప్రాచీన కాలంలో వీటికి భిన్నంగా ఇతర దేశాలతో పాటు భారత దేశంలో కూడా ఖగోళ విజ్ఞానం, గణితం, శిల్పం, ఆర్కిటెక్చర్, మెటలర్జీ వంటి అంశాలు కొంత శాస్త్రీయంగా అభివృద్ధి చెందిన మాట నిజం. అయినా, చెట్టు పేరు చెప్పుకొని విత్తులమ్ముకొన్నట్లు – ఆపాటి శాస్త్రాన్ని వుదహరించి మూఢ నమ్మకాల్ని పోషించడం శుష్కవైజ్ఞానికులకు రివాజయింది. అనుసరించడం సామాన్య ప్రజలకు అలవాటయింది. ఈ స్థితి భారతదేశంలో వున్నంతగా ప్రాచీన కాలంలో విజ్ఞానం పెంపొందిన యితర దేశాలలో లేదు. వారు పాతకు విడాకులిచ్చి ఆధునిక విజ్ఞానాన్ని ఆశ్రయిస్తున్నారు.

నిజానికి, ఒకనాటి విజ్ఞానం చారిత్రక ప్రాధాన్యత కలది తప్ప, ఈనాటి విజ్ఞానశాస్త్రంతో సరిపోల్చదగింది కాదు.

అది, ఆనాటివారి విజ్ఞానస్థాయిని మెచ్చుకోడానికి పనికివస్తుంది తప్ప, ఈనాటి శాస్త్రీయ వినియోగానికి చాలదు. కాన, పనికిరాదు.

## విజ్ఞానశాస్త్రమంటే ఏమిటి?

క్రమబద్ధమైన జ్ఞానాన్ని మనం శాస్త్రమంటాం. ఆ విజ్ఞానాన్ని సూత్రాలుగా కుదిస్తాం. సిద్ధాంతాలుగా కూరుస్తాం. కొత్త పరిశోధనలు వాటికి సవరణల్ని సూచిస్తే, అందుకు అనుగుణంగా పాత సూత్రాలను, సిద్ధాంతాలను సవరించుకుంటాం. అభివృద్ధి పరచుకుంటాం. పాతవి తప్పని కొత్త పరిశోధనలు రుజువు చేస్తే, పాత వాటిని త్రోసివేస్తాం. పాత వాటినే పట్టుకొని వూగులాడం.

నిజానికి శాస్త్రీయ సూత్రాలు నిత్యమూ సాంకేతిక విజ్ఞాన పరిధిలో పరీక్షకు గురవుతూనే వుంటాయి. ఈనాటి విజ్ఞానశాస్త్ర పరిధిలో త్రోసివేయదగిన సూత్రాలు, సిద్ధాంతాలు వుండడం చాలా అరుదు. పరికల్పనలు మాత్రమే కొన్ని సందర్భాలలో నిరాకరణకు గురవుతాయి! తప్పుల్ని సవరించుకొనే దశనుంచి తప్పులు చేయని దశకు ఆధునిక విజ్ఞానం పరివర్తన చెందింది. శాస్త్రీయ పద్ధతి చాల నిక్కచ్చి అయినదిగా పెంపొందడమే అందుకు ముఖ్య కారణం.

మన జ్ఞానానికి అందిన మేరకు విశ్వం యొక్క నడక సర్వత్రా ఒకేవిధంగా వుంది. అందువల్ల ఆధునిక వైజ్ఞానిక సూత్రాలు విశ్వంలో యే ప్రాంతంలోనైనా ఒకే విధంగా చలామణి అవుతాయి. విశ్వవర్తనను మనం అర్థం చేసుకున్న మేరకు కొన్ని సూత్రాలను రూపొందించుకున్నాం. $E = mc^2$; $P_1V_1 = P_2V_2$ వంటి వేలాది సూత్రాలు, అన్ని వైజ్ఞానిక శాస్త్రశాఖలలోనూ అలా రూపొందినవే. నిత్యమూ జరుగుతున్న ప్రయోగాలు వాటిని మరిమరీ ధ్రువపరిచాయి. వాటిని ఎక్కడ పరీక్షకు పెట్టినా, వాటి నిక్కచ్చితనం (accuracy) మారదు.

అలాంటి సూత్రాలు ఆధారంగానే మనం అనేక శాస్త్రీయ పరికరాలను తయారుచేసుకొంటున్నాం. దాన్ని మనం సాంకేతిక విజ్ఞానం (technology) అంటున్నాం. కార్లు, రైళ్ళు, విమానాలు, విద్యుత్తు, రేడియోలు, టెలివిజన్లు, కంప్యూటర్లు ఒకటేమిటి? ఈ మొదలైన వాటినన్నిటినీ మనం ఆధునిక విజ్ఞానశాస్త్ర సూత్రాల ద్వారా సాధించుకున్నాం. నిత్య జీవితంలో మనం వాటిని వుపయోగించుకుంటున్నాం. అయినా, మంత్ర, తంత్ర, యంత్ర విద్యలన్నీ మన పూర్వులకు తెలుసుననే సనాతన ఛాందసుల నోళ్ళకు కళ్ళేలు పడడం లేదు.

ఈనాడు మనం రాకెట్లను నిర్మించగలుగుతున్నాం. చాల సంశ్లిష్ట సాంకేతిక పరికరాలు గల కృత్రిమ ఉపగ్రహాలను రోదసిలోకి పంపగల్గుతున్నాం. అవి రోదసిలోని గ్రహ, ఉపగ్రహ, నక్షత్రాదులకు సంబంధించిన సమాచారాన్ని సేకరించి మనకు పంపిస్తున్నవి. ఇటీవల రోదసిలోకి విడుదల చేసిన పాత్‌ఫైండర్ రోదసి లోలోతులకు పోతున్నది. ఇంకా పోతూనే వుంటుంది. మనం పంపిన వుపగ్రహాలు "అక్కడ" చెడిపోతే, "ఇక్కడ" నేలమీది మనం రిమోట్ కంట్రోల్ ద్వారా వాటిని మరమ్మత్తు చేయగల్గుతున్నాం.

ఇలాంటి అపూర్వ విషయాలను సాధించడానికి తోడ్పడిన ఆధునిక విజ్ఞాన శాస్త్ర సూత్రాలు ఎంత నిక్కచ్చి అయినవో గ్రహించాలి. అదీ శాస్త్రమంటే – అదీ విజ్ఞానశాస్త్రమంటే. అందువల్ల, దేన్నిపడితే దాన్ని శాస్త్రమనడం సరికాదు. గుడ్డినమ్మకాలన్నీ గుడ్డిశాస్త్రాల ప్రతిపాదనలే. గుడ్డిశాస్త్రాలన్నీ శుష్కశాస్త్రాలే. (Pseudo - Sciences). శుష్కశాస్త్రాలు విజ్ఞానశాస్త్రాలు కావు.

దేని ఆధారంగా ఒకరు ఒక ఫలితాన్ని, మరొకరు మరొక ఫలితాన్ని "సూచిస్తారో" అది శాస్త్రం కాదు.

ఏ యిద్దరు జ్యోతిష్కులూ ఒకే రకమైన ఫలితాలను చెప్పలేరు. ఏ యిద్దరు వాస్తు సిద్ధాంతులూ ఒకే రకమైన వాస్తుఫలాలను చెప్పలేరు.

అందువల్లనే శాస్త్రాల పేరుతో వారు వ్యాపారం సాగించడానికి తోడ్పడుతున్న "జ్యోతిషం – వాస్తువు" శాస్త్రాలు కావు. విజ్ఞానశాస్త్రంలో పరస్పర వైరుధ్యాలుండవు. శాస్త్రజ్ఞులంతా ఏకముఖంగా ఆమోదించిన పరిశోధనల ఫలితాలు మాత్రమే విజ్ఞానశాస్త్ర పరిధిలోకి వస్తాయి.

## వాస్తువుకు దిక్కేమిటి?

దిక్కులే వాస్తువుకు ప్రధానమైన దిక్కు. దిక్కులు లేకపోతే, వాస్తువుకు దిక్కూలేదు, భూమికా లేదు.

దిక్కులనేవి వస్తుతః ప్రకృతిలో యెక్కడా లేవు. అవి భూమిమీద స్థానాలను

గుర్తించడానికి మనుషులు కల్పించుకున్నవే. దేవుళ్ళూ, స్వర్గాలూ, నరకాలూ, ఆత్మలూ, పునర్జన్మలూ మొదలైనవి ఎలా మానవకల్పితాలో, అలానే దిక్కులున్నూ మానవ కల్పితాలే.

స్థానాల గుర్తింపుకోసం, జీవన సౌకర్యంకోసం మనిషి యేర్పరచుకున్న దిక్కుల్ని వాస్తు పండితులు చిలిపిగా మనుషులకు గుదిబండలుగా మార్చారు. వాటికి మార్మిక స్వభావాన్ని అంటగట్టారు.

భూమి ఒక్కటేకాదు – గ్రహాలూ, ఉపగ్రహాలూ, నక్షత్రాదులూ అన్నీ గుండ్రంగానే వుంటాయి. గుండ్రంగా వుండే గోళీకాయకు దిక్కులెలా వుంటాయి, ఎక్కడ వుంటాయి? అలాగే భూగోళానికిన్నీ దిక్కులు లేవు. విశ్వంలో యెక్కడా దిక్కులు లేవు. భూమి మీద వాటిని మనం కల్పించుకున్నది మనపై ఏ భయ సందేహాల బరువులో మోపడానికి కాదు.

ఒకప్పటి మనుషులు భూమిని నలుచదరపు బల్లగా వూహించారు. దానికి నాలుగు దిక్కుల్నీ, నాలుగు మూలల్నీ కల్పించుకున్నారు. వాటిని అష్టదిక్కులన్నారు. వాటికి కాపలాగా అష్టదిక్పాలకులనే కల్ల దేవతల్ని కల్పించుకున్నారు. ఆనాటి మనుషులకు భూమి గోళమన్న వాస్తవం తెలియదు. ఈ గోళం "పైన" మనం ఇక్కడ "పైన" వుంటే, దీని "క్రింద" అవతలి వైపునవున్న అమెరికా ఖండాల వాసులు అక్కడ కూడా "పైన"నే వున్నారు. దేవుళ్ళ పేర్లతో ఫోర్జరీలను సృష్టించేవారికి ఈ విషయాలు తెలియవు.

భూమి గంటకు 60 వేల మైళ్ళ వేగంతో సూర్యుడిచుట్టూ దీర్ఘవృత్తాకార కక్ష్యలో తిరుగుతున్నది. అది ఏ దిక్కుగా తిరుగుతున్నదో ఏ వాస్తు సిద్ధాంతులైనా చెప్పగలరా? అలానే, చంద్రుడు ఏ దిక్కుగా తిరుగుతున్నదో చెప్పగలరా? చెప్పలేరు, ఎందుకంటే, భూమి సూర్యుడి చుట్టూ తిరుగుతున్నదన్న వాస్తవమే వారికి తెలియదు.

ఆ సూర్యుడు కూడా పాలపుంత చుట్టూ ఒకసారి తిరగడానికి 20 కోట్ల సంవత్సరాలు పడుతుంది. అది ఏ దిక్కుగా తిరుగుతున్నదో ఏ వాస్తుపండితులైనా చెప్పగలరా? అలా తిరగడంలో సూర్యుడు తన గ్రహ కుటుంబంతో సహా వేలాది నక్షత్రాలను దాటుతుందని ఏ వాస్తుసిద్ధాంతికైనా తెలుసా? నక్షత్రాలన్నీ వేలాది మైళ్ళ వేగాలతో ఒకదానికొకటి దూర దూరమైపోతున్నాయని తెలుసా? ఈ విషయాలేమీ తెలియకపోయినా, వారి దిక్కుల వాస్తువంతా వేదాల్లోనే వుందని ప్రలాపించేవారికీ, ఔనని తలలూపేవారికీ ఈదేశంలో కొదవలేదు. జాతీయవాదం, మత పునరుజ్జీవనవాదం జతకలిపి పెనవేసుకోవడమే అందుకు కారణం.

ఈనాటి మనిషి భూమిని వదలి రోదసిలోకీ, రోదసిలోనూ ప్రయాణం చేయగల్గుతున్నాడు. రోదసిలో దిక్కులెలా వుంటాయో ఎప్పుడైనా ఏ వాస్తు సిద్ధాంతి అయినా ఆలోచించాడా?

నలుచదరపు భూమిమీద ఎదురెదురుగా దిక్కులేర్పరచుకున్న మనిషి భూమికి

"పైన" "క్రింద" వున్న దిక్కులకు దిక్కులపరంగా యే పేర్లూ పెట్టలేదు. ఎందుకు పెట్టలేదో, వాటిని వాస్తువులో ఎందుకు యిరికించలేదో వాస్తుసిద్ధాంతులే చెప్పాలి.

తన చుట్టూ తాను పరిభ్రమిస్తున్న భూమి మీద నివసించే మనుషులు తమకు సూర్యకాంతి సోకడం ప్రారంభించిన వైపును తూర్పుగాను, అలా సోకడం ఆగిపోయిన వైపును పడమరగానూ గుర్తుపెట్టుకున్నారు. ఎడమవైపును ఉత్తరంగా, కుడివైపును దక్షిణంగా గుర్తించుకున్నారు. అలానే మూలలకూ పేర్లు పెట్టుకొని వస్తువులు ఒకదానికొకటి ఏ వైపుగా వున్నవో చెప్పుకోడానికి సులువైన పద్ధతిని యేర్పరుచుకున్నారు. అవే దిక్కులైనాయి. అంత మాత్రాన ఆ దిక్కులకు ఫలాలెలా వుంటాయి? దిశాఫలాలు మొదట అపోహలతో ప్రారంభమైనా, చివరకు అవి మోసగాళ్ల చేతుల్లోబడి, వంచకులకు, వంచితులకు ప్రమాణాలయ్యాయి. మనం యేర్పరచుకున్న ఉత్తర దక్షిణాలకు $23^{0}$ తేడాతో భూగర్భంలో అయస్కాంత శక్తి వున్నదని ఆనాటి వాస్తుశాస్త్రజ్ఞులనబడేవారికి తెలుసా?

## కాలమానాలు

భూమి తన చుట్టూ తాను ఒకసారి తిరగడానికి పట్టే కాలాన్ని రోజనీ, సూర్యుడి చుట్టూ ఒకసారి తిరగడానికి పట్టే కాలాన్ని సంవత్సరమనీ మనం పేర్లు పెట్టుకున్నాం. ఇలాంటి రోజులూ, సంవత్సరాలూ ప్రతి గ్రహానికీ వున్నాయి. అయితే ఆయా గ్రహాల రోజులూ, సంవత్సరాలూ, భూమి రోజులకంటె, సంవత్సరాలకంటె పొడవుగానో, కురచగానో వున్నాయి. అందువల్ల మన కాలమానం భూమికి మాత్రమే పరిమితమైవుంది. భూమిమీద కూడా ఒక ప్రాంతంవారి కాలమానం కంటె, మరొక ప్రాంతంవారి కాలమానం భిన్నం. ఒక ప్రాంతంలో రాత్రయితే, మరొకచోట పగలవుతుంది.

చంద్రుడు భూమి చుట్టూ తిరిగేటపుడు చంద్రుడి ఒకవైపు మాత్రమే అన్ని వేళలలో భూమికి ముఖం చూపుతుంది. అందువల్ల చంద్రుడి మీద పడే సూర్యకాంతి భూమికి చేరడంలో పాడ్యమినుంచి పౌర్ణమిదాకా పెరుగుతుంది. మరల పాడ్యమి నుంచి అమావాస్య దాక తరుగుతుంది. పౌర్ణమి నుంచి పౌర్ణమి దాక వుండే చాంద్రమాసం 29.5రోజుల్ని రెండు పక్షాలుగా విభజించి, ఒక్కో పక్షాన్ని 15 తిథుల మధ్య మన పూర్వులు పంచారు. తిథులన్నీ చంద్రకళలకు పెట్టుకున్న పేర్లే. ప్రపంచంలో చాలకాలం చాంద్రమానం అమలులో వుండేది. కాని, సౌర సంవత్సరానికి 365 1/4 రోజులు కావడంవల్ల, 12 చాంద్రమాసాలు సౌర సంవత్సరానికి చాలకపోవడం వల్ల, సౌరమానానికి తుల్యంగా చాంద్రమానాన్ని సరిదిద్దడానికి మన పూర్వులు అధికమాసాలను కల్పించుకున్నారు. చాంద్రమాసాలకు, చాంద్రకళలకు (తిథులకు) మంచి చెడ్డల్ని

అంటగట్టారు. అది చాలక సంవత్సరాలకు కూడా మంచి చెడ్డల్ని అంటించి, ప్రభవ మొదలు అక్షయదాక 60 సంవత్సరాల ఆవర్త చక్రాన్ని కల్పించారు.

ఇప్పటికీ మనవారికి తిథుల తీటవదల్లేదు. అంతటితో వూరుకోక, నక్షత్రమైన సూర్యుణ్ణి, ఉపగ్రహమైన చంద్రుణ్ణి గ్రహాలన్నారు. వాటిని బుధ, శుక్ర, అంగారక, గురు, శని గ్రహాలతో కలిపి వాటిపేర ఏడేసి రోజుల వారాల కాలచక్రం ఒకటి కల్పించారు. ఆ వారాలకున్నూ మంచి చెడ్డలూ, వారశూలలూ అంటగట్టారు.

అంతే కాదు - పైన కన్పిస్తున్న చుక్కల్ని గుంపులుగా వూహించి, వాటికి ఆకారాలు కల్పించారు. వాటికి తిథులతో, వారాలతో, గ్రహాలతో లంకెవేసి, లెక్కల గజిబిజితో కలిపి ఫలాలను అంటగట్టారు.

ఒకదానికొకటి కోట్లాది మైళ్ళదూరంలో వుండి, వేలాది మైళ్ళ వేగంతో దూరదూరంగా జరిగిపోతున్న నక్షత్రాలను రాసులుగా చేసి, మీటింగులు పెట్టించారు. ఖగోళ విజ్ఞానం ప్రారంభ దినాలలోవున్న అజ్ఞానాన్ని శ్లోకాలలో బంధించిన వాస్తు పండితులు, జ్యోతిషంలోని ఫలభాగాన్ని వాస్తువులో దూర్చుకున్నారు.

మన వాస్తు పండితులు, జ్యోతిష్కులు కల్పించుకున్న కాలమానాలు - ఘడియలు, విఘడియలు, తిథులు, నక్షత్రాలు, వారాలు, మాసాలు - ఒకనాటివారు తమ స్థాయిలో ప్రకృతిని అర్థం చేసుకోడానికి యత్నించిన ప్రక్రియలో వుత్పన్నమైన శుష్కచిత్రాలు. ప్రపంచంలో వేర్వేరు ప్రాంతాలవారు వేర్వేరు కాలమానాలు, తులామానాలు, దీర్ఘమానాలు నిర్ణయించుకున్నారు. ముఖ్యంగా మన దేశంలో పురోహిత వర్గం వాటన్నిటికీ మార్మికతను అంటగట్టింది.

ప్రతి దాన్నీ వ్యవస్థీకరించడం మత లక్షణం. ఆ లక్షణం ప్రపంచ వ్యాప్తంగానూ విజ్ఞానాభివృద్ధికి అవరోధంగా నిలిచింది. అందువల్ల కొందరు ఆధునికులు సైతం ఆధునిక విజ్ఞాన తాత్విక ఫలితాల దాపులకు చేరలేకపోతున్నారు. మార్మికవాద మాయాజాలం నుంచి బయటపడలేకపోతున్నారు.

ఆధునిక విశ్వవిజ్ఞానం ప్రకారం విశ్వంలో పైనలేదు, క్రిందలేదు, ప్రక్కలు లేవు, దిక్కులు లేవు, అవతలలేదు, ఇవతలలేదు, ముందులేదు, వెనుకలేదు, ఆది లేదు, అంతంలేదు, ఉన్నదంతా పరిణామంలో వుంది. ఉండడమంటే, పరిణామంలో వుండడమే. అందువల్ల, ఆయా నక్షత్రాదుల స్థానాలకు అర్థం మారిపోయింది. వేల కోట్ల గెలాక్సీలలో మన పాలపుంత ఒకటి. దానిలోని 10వేల కోట్ల నక్షత్రాలలో సూర్యుడొక సామాన్య నక్షత్రం. ఇది పాలపుంత కేంద్రం నుంచి 30వేల కాంతి సంవత్సరాల దూరంలో వుండి, దాని చుట్టూ తిరుగుతున్నది. (ఒక కాంతి సంవత్సరం సుమారు 580 వేల కోట్ల మైళ్ళు). ఆ సూర్యుడికి భూమి సుమారు 9,30,00,000

మైళ్ళ దూరంలో వుండి, దాని చుట్టూ తిరుగుతున్నది. ఆ భూమి మీద వున్న మనం ప్రకృతిని "ఉన్నదాన్ని ఉన్నట్లుగా, పరిణమిస్తున్న దాన్ని పరిణమిస్తున్నట్లుగా" అర్థం చేసుకోవాలి. అందుకు బదులు అరకొరగా అర్థమైనదానికి మార్మికలక్షణాలను కల్పించడం వైజ్ఞానిక విద్రోహమవుతుంది.

## గ్రహ ఫలాలు – గృహఫలాలు

మనుషుల జనన కాలానికీ, నక్షత్రాల వునికికీ జ్యోతిష్కులు ముడివేశారు. దాని ప్రకారం మనుషుల జీవితాలలోని భోగ భాగ్యానుభవాన్నీ, మంచి చెడ్డలనూ, మరణకాలాన్నీ వారు చెపుతారు. అవి అన్నీ పచ్చి అబద్ధాలు.

వాస్తువు కూడా జ్యోతిషంతో కొంతవరకు కలగాపులగమైంది. అయినా, "దిశ **తిరిగితే దశ తిరుగుతుంది" అని వాస్తువు చెపుతుంది.**

అంటే, వాస్తువు ప్రకారం గృహాలు నిర్మించుకొంటే, గ్రహాలు నిర్దేశించిన జాతక **ఫలాలు మారతాయన్నమాట! కాబట్టి గ్రహఫలాలు నిజమైతే గృహఫలాలు కల్లకావాలి. గృహఫలాలు నిజమైతే గ్రహఫలాలు అబద్ధం కావాలి.**

**ఇంగిత జ్ఞానానికి సంబంధించిన యీ "మెలిక" జ్యోతిర్వాస్తు పండితులకూ, వారి మాటలకు ఊ కొట్టేవారికీ ఎందుకు తట్టడం లేదో అర్థం కాదు. అంతే కాదు, వాటిలో ఏ ఒక్కటి నిజమైనా, దేవుడి పెత్తనానికే అవకాశం లేకుండా పోతుందని ఆస్తికుల ఆలోచనకైనా ఎందుకు రావడం లేదో అర్థం కాదు.**

అంతే కాదు – మనం మనుషుల్ని గుర్తించడానికి పేర్లు పెట్టుకున్నాం. ఆ పేర్లకూ నక్షత్రాలకూ మనవారు ముడివేశారు. నామనక్షత్ర ఫలాలనబడే వాటిని కల్పించారు. నామ నక్షత్రాలకూ, జన్మ నక్షత్రాలకూ మధ్య వుండే వైరుధ్యాన్ని జ్యోతిష్కులెలా పరిష్కరిస్తారో మరి!

శుభాశుభాలను గురించి దైవజ్ఞుల్ని (జ్యోతిష్కుల్ని) చేరి ప్రశ్నించే వారున్నారు. పృచ్ఛకుని ప్రశ్నలోని మొదటి అక్షరాన్ని తీసుకొని, అక్షరమాలలో అది ఎన్నవ అక్షరమో లెక్కించి, ఆ సంఖ్యను గుణకార, భాగహార, సంకలన, వ్యవకలనాలతో పిసికి, పృచ్ఛకుడి ప్రశ్నకు సమాధానం చెపుతారు. వేర్వేరు భాషలలో ఆ అక్షరానికి వేర్వేరు సంఖ్యాక్రమం **వుంటుందన్న ఇంగిత జ్ఞానం దైవజ్ఞులకు వుండదు. వారికి "దైవజ్ఞానం" తప్ప ప్రపంచ జ్ఞానం వుండదు.**

ఈ సరుకునంతా దైవజ్ఞులు శాస్త్రం పేరుతో అమ్ముకుంటారు. ఆధునిక విజ్ఞానశాస్త్రపదజాలాన్ని తమ అశాస్త్రీయాంశాలకు జోడించి తమ మౌఢ్యాన్ని సమర్థించుకో జూస్తారు. అబద్ధాలతో గంతులు వేసే ఈ మర్కటాలు ప్రజల్ని నమ్మిస్తారు, ప్రజలు నమ్ముతారు.

## కట్టడానికి వాస్తు - పడగొట్టడానికి వాస్తు

గుడిసెలు, పూరిళ్ళు వేసుకొనే పేద ప్రజానీకానికి వాస్తువుతో నిమిత్తం లేదు. వారు పిలిచినా వాస్తు సిద్ధాంతులు దయచూపరు. వాటికి వాస్తువుతో పని లేదంటారు. కాగా, కొంచెం ఆర్థికస్తోమతగలవారూ, సంపన్నులూ వాస్తు సిద్ధాంతుల్ని సంప్రదించి, వారి సూచనల ప్రకారం గృహాలు నిర్మించుకుంటారు.

కుటుంబంలో భోగభాగ్యాల విషయంలోగాని, ఆరోగ్యం విషయంలోగాని, ఇతర విషయాలలోగాని విషమ పరిస్థితులు తటస్థించినపుడు మరో వాస్తు సిద్ధాంతి వచ్చి గృహవాస్తులో లోపాలవల్ల ఆ పరిస్థితులు వచ్చాయని వాస్తుభేదాలు వల్లిస్తాడు. గోడలు పడగొట్టిస్తాడు, వాకిళ్ళు మార్పిస్తాడు, ఇంటి షేపునే మార్చేస్తాడు.

అలా, యిళ్ళు కట్టించే సిద్ధాంతి ఒకడైతే, వాటిని పడగొట్టించే వాస్తు సిద్ధాంతి మరొకడు బయలుదేరతాడు.

ఒకడు ఒక వాస్తు విధానాన్నీ, మరొకడు మరొక వాస్తు విధానాన్నీ అనుసరించడం వల్ల ఇలాంటి పరిస్థితి తలెత్తుతుంది. వాస్తు విధానాలెన్ని వున్నాయో, వాటి మధ్య భిన్నత్వం అంత వుంది.

ఉత్తరం, ఈశాన్యం, తూర్పు "దిక్కులు" పల్లంగా వుండాలని చాలమంది వాస్తు సిద్ధాంతులు చెపుతారు. కాని, అది కూడా సరికాదని చెప్పే వాస్తుసిద్ధాంతులు వున్నారు.

**ఫలానా గృహ నిర్మాణంలో వాస్తువు అన్ని విధాలుగానూ సరిగ్గా వున్నదని ఏ పండితుడూ చెప్పలేడు. అలా చెప్పగలిగినవాణ్ణి ఏదో ఒక వాస్తు విధానం ప్రకారం తప్పు పట్టవచ్చు. అందుకే వాస్తువు శాస్త్రం కాదంటాం.**

ఆధునిక విజ్ఞానశాఖలు చాలా వున్నాయి. వాటిపై వేలాది లక్షలాది గ్రంథాలు వ్రాయబడి వున్నాయి. శాస్త్రీయాంశాల విషయంలో ఏ ఒక్క గ్రంథమూ ఏ యితర గ్రంథాలతోనూ భిన్నంగా వుండదు, వుండడానికి వీలులేదు. ఒక సూత్రాన్ని, నియమాన్ని ఒక గ్రంథం ఒప్పు అని చెపితే, అది తప్పు అని చెప్పే మరో గ్రంథం శాస్త్ర పరిధిలో వుండదు. అదీ, విజ్ఞానశాస్త్రమంటే.

## వాస్తు ప్రాణం ఎక్కడ వుంది?

వాస్తువు ప్రాణం దిక్కులలో వుంది. ఆ దిక్కుల ప్రాణం వాస్తువును నమ్మేవారి భయాలలో వుంది. ఆ భయాల ప్రాణం వారి అవివేకంలో వుంది. ఆ అవివేకం ప్రాణం అత్యాశలో వుంది.

ఒక స్థలం పడమర, దక్షిణం పల్లంగా వుండి, దాని నీటివాలు ఆ వైపులుగా

వుంటే, అలాంటి చోట ఉత్తరం, తూర్పు పల్లంగా వుండేట్లు గృహం యెలా నిర్మించుకోవాలి? ఇరుగుపొరుగు గృహస్థుల స్థలాలు ఉత్తరం, తూర్పులలో మెరకగా వుంటే, పడమర-దక్షిణం స్థలంవారు నీటిని ఏవాలుగా బయటకు పంపుకోవాలి? అలాంటి సందర్భాలలో తూర్పు, ఉత్తరం వైపులలో మురికి గుంటలో, చెరువులో నిర్మించుకోమనడం, అలా నిర్మించుకోవడం మూర్ఖత్వం కాదా?

ఎటునుంచి గాలి కొడుతుందో, ఎటునుంచి ఎండ వస్తుందో, ఎటునుంచి వాన జల్లులు పడతాయో సగటు తెలివికల - వయసు వచ్చిన వారందరికీ అనుభవ జ్ఞానం చెపుతుంది. దాన్ని బట్టివారు తమ యిల్లు యెక్కడ నిర్మించుకొంటే సౌకర్యవంతంగా వుంటుందో నిర్ణయించుకోగలరు. కొంచెంపాటి లెక్కలు వచ్చినవారు చతురస్రాకారంగానో, దీర్ఘచతురస్రాకారంగానో, మరో ఆకారంగానో వున్న స్థలంలో యిల్లు నిర్మించుకోదలచినవారు, "ఐ మూలలు" రాకుండా, మూలలు $90^0$ కోణం చేసే విధంగానూ, ఎదురెదురు భుజాలు సమానమైన పొడవుగానూ, ఏ వైపునా అదనపు భారం పడకుండాను చూచుకోగలరు. అది వారి వల్ల కాకపోతే, కొంచెం రేఖాగణితం తెలిసినవారిని ఆశ్రయించి వారి సహాయం, సూచనలు పొందగలరు. పెద్ద గృహాన్ని నిర్మించుకోవాలనుకున్నపుడు, మూఢనమ్మకాలులేని ఇంజనీర్ల వద్ద ప్లానులు వేయించుకొని, వారి సూచనల మేరకు గృహనిర్మాణం చేపట్టగలరు.

ఇంకా, యిందులో వాస్తు ప్రస్తావన యెందుకు వస్తుంది?

గృహ యాజమానుల సౌకర్యాలను, ఆరోగ్యాలను దృష్టిలో వుంచుకొని, వాస్తువు శాస్త్రీయ నిర్ణయాలు చేస్తుందనే "నడమంత్రపు" వాదంలో అర్థం లేదు. అయినా, కొందరు ప్రబుద్ధులు - చదువుకొన్నవాళ్లూ, ఇంజనీర్లూ సైతం - అలాంటి కృత్రిమ వాదం చేస్తారు. మన "సాంస్కృతిక" వారసత్వజాడ్యమే వారిని అందుకు ప్రోత్సహిస్తుంది. వస్తుతః వారిలో వున్న వివేచనాశక్తిని మరుగున పడవేస్తుంది.

ఏ దిక్కు ఎందుకు పల్లంగా వుండాలో, ఏ దిక్కు ఎందుకు మెరకగా వుండాలో, వంటగది ఆగ్నేయదిశలోనే యెందుకు నిర్మించుకోవాలో, బావులు ఈశాన్య దిశలోనే ఎందుకు త్రవ్వించుకోవాలో ఏ వాస్తుసిద్ధాంతీ చెప్పలేదు. వారు చెప్పే కారణం ఒక్కటే. అష్టదిక్పాలకుల కాపలా. అష్టదిక్పాలకులున్నారన్నందుకు రుజువు లేదు. తిథి, వార, నక్షత్రాదులు శుభాశుభాలు చేకూరుస్తాయనేందుకు రుజువు లేదు. ఆ కల్పనలన్నీ మార్మికతతో కూడి వున్నాయి. మార్మికత వుండేది శాస్త్రం కాదు. అందువల్ల, వాస్తుసిద్ధాంతులెంతగా ఘోషించినా, వాస్తువుశాస్త్రం కానేరదు. తెలిసింది జ్ఞానం, తెలియనిది అజ్ఞానం. తెలియజెప్పేది శాస్త్రం, దాచి వుంచేది మర్మం, ఎంత ప్రాకులాడినా మార్మికత శాస్త్రం కాదు.

వాస్తువు పేరుతో ప్రచారమయే భయాలు అన్నీ ఇన్నీ కాదు. ఈ దిక్కు ఎక్కువైతే గృహస్థుడి మరణం, ఆ దిశ యెక్కువైతే గృహస్థుడి భార్య మరణం, మరో దిక్కు యెక్కువైతే సంతానం మరణం, ఆ మూల యెక్కువైతే మహాసౌభాగ్యం. ఈ మూల ఎక్కువైతే పరమ దరిద్రం, మరో మూల యెక్కువైతే సర్వనాశనం – అంటూ వెధవ భయాలతో బెదరగొట్టి, కల్ల ఆశలతో ప్రలోభపెట్టి గృహస్థుల్ని లొంగదీసుకోవటం వాస్తుసిద్ధాంతులకు వెన్నతో బెట్టిన విద్య. వారి వాక్చాతుర్యం గృహస్థుల ఇంగితాన్ని పక్షవాతానికి గురిచేస్తుంది. అందుకే వాస్తు పిచ్చ రోజురోజుకూ ముదిరిపోతున్నది.

స్వరాజం వచ్చాక పెరుగుతున్న అంటువ్యాధులలో వాస్తువు కూడా ఒకటి. ఒకప్పటి మసూచిలాగా, ప్లేగులాగా, దూముల్లాగా ఇప్పుడు తెలుగుదేశంలో మరిన్నీ వాస్తువు కాటక విహారం చేస్తున్నది. కొత్త సంపన్నులు దాన్ని పోషిస్తున్నారు. వాస్తుశాస్తుర్లు కూడా సంపన్నులై పోతున్నారు. బస్తీల్లో ఖరీదైన హోటళ్ళలో, ఖరీదైన గదులలో వాస్తు దుకాణాలు పెడుతున్నారు. వాస్తువుపై పుస్తకాల మీద పుస్తకాలు రాసేస్తున్నారు.

అంటే, ప్రాచీనకాలంలో వాస్తువు మీద పుస్తకాలు లేవని కాదు. చాలా వున్నాయి. అవి వాస్తు ఫలితాలను ఒకదానికొకటి భిన్నంగా చెప్పాయి. ఈనాటి పుస్తకాలలో వ్రాయబడుతున్న వాస్తు ఫలితాలు కూడా ఒకదానికొకటి భిన్నంగా వుంటాయి. అంతేకాదు– ఆనాటి పుస్తకాలూ, ఈనాటి పుస్తకాలూ ఒకదానికొకటి భిన్నమైన వాస్తు నియమాలను చెపుతున్నాయి. వాస్తు గ్రంథకర్తలలో యెవరేమి చెప్పినా, వాటి సూత్రాలనునిగ్గు తేల్చి "ఇదీ వాస్తు శాస్త్రం" అని రుజువు చేసిన వాళ్ళు లేరు. పూర్వులవైనా, ఈనాటివారివైనా, వాస్తు నియమాలన్నీ మార్మికతమీద ఆధారపడినవే, అవి మార్మిక శాస్త్రాలు. మార్మిక శాస్త్రాలు పేరుకు శాస్త్రాలే కాని, విజ్ఞాన శాస్త్రాలు కావు.

ఆధునిక సాంకేతిక పరికరాలను తయారుచేయడం విజ్ఞానశాస్త్ర సూత్రాల మీద ఆధారపడి జరుగుతున్నది. ఆ సూత్రాలెక్కడా తప్పుపోవడం లేదు. ఆ సూత్రాలను అనుసరించి చేసిన సాంకేతిక పరికరాలు మనం ఆశించిన విధంగానే పనిచేస్తున్నాయి. కారు, రైలు, విమానం, టెలివిజన్, కంప్యూటరు, రాకెట్, కృత్రిమ ఉపగ్రహాలు మొదలైన ఒక్కో పరికరాన్ని నిర్మించుకోవడంలో వందలాది విజ్ఞానశాస్త్ర సూత్రాలు పనిచేస్తున్నాయి. అవి యెక్కడా, ఎప్పుడూ విఫలం కాలేదు. ఆ సూత్రాలన్నీ – ప్రపంచ శాస్త్రజ్ఞులందరి ఆమోదాన్నీ పొందినవే. విజ్ఞానశాస్త్ర సూత్రాలకు, నిమయాలకు, సిద్ధాంతాలకు సంబంధించినంతవరకు శాస్త్రజ్ఞుల మధ్య ఏకీభావం వుంటుంది. అదీ శాస్త్రమంటే, పరస్పర విరుద్ధ ఫలితాలను చెప్పే వివిధ వాస్తు పద్ధతులలో ఏ ఒక్కటీ శాస్త్రం కాదనడం అందుకే.

# 2. వాస్తు వారసత్వం

శాస్త్రం పేరెత్తితే ఛాందసులు వేదాలతో మొదలెత్తుకుంటారు. అన్ని "శాస్త్రాలకూ" మూలాన్ని వేదాల్లో చూడడానికీ, చూపడానికీ సన్నాహమవుతారు. వేద పంకిలాన్ని అన్నిటికీ పూయడానికి ప్రయత్నిస్తారు.

వేదాలు అపౌరుషేయాలనీ, అవి బ్రహ్మ ముఖాలనుంచి వూడిపడి, బ్రాహ్మణుల నోళ్ళలో జొరబడ్డాయనీ వైదికులంటారు. హిందూమత గ్రంథాలన్నీ అందుకు సాక్ష్యం పలుకుతాయి.

శాస్త్రాలన్నీ బ్రహ్మదేవుడు రుషులకు చెప్పాడనీ, అవి గురుశిష్య పరంపరగా తాటాకుల్లోకి యెక్కాయనీ, వాటిని చెదపురుగులు తినగా మిగిలిన బ్రహ్మవాక్కులు మనకు అందాయనీ సనాతన వాదులు చెపుతారు. అంటే చెదలయెంగిలి బ్రహ్మవాక్కులే మిగిలాయన్నమాట. వాస్తువు కూడా ఆ కోవలోకి చేరిన శాస్త్రమే.

బ్రహ్మకే యిల్లులేదు. ఆయన యింటిని వర్ణించిన కవులూలేరు. కాని,ఇతరుల యిళ్ళకు ఆయన ప్లాన్లు చెప్పాడని పురాతన వాస్తు గ్రంథాలు చెపుతున్నాయి. నిజానికి, దేవుళ్ళందరికీ వూరూరా గుడులున్నాయికాని, బ్రహ్మకు గుళ్ళు సైతం యెక్కడా వున్నట్లులేదు. దానికి కారణంగా సనాతనులు "శాపం కథలు" చెపుతారు. గుంటూరు జిల్లా చేబ్రోలు గ్రామంలో మాత్రం వాసిరెడ్డి వెంకటాద్రినాయుడు ఓ శతాబ్ధికి పూర్వం ఓ బ్రహ్మదేవాలయాన్ని కట్టించాడు కాని, దానికి పూజాపురస్కారాలేమీ జరగడం లేదు. రాజస్థాన్‌లో పుష్కర్ అనే పుణ్యక్షేత్రంలో బ్రహ్మదేవాలయం ఒకటి వుందట. 1976కు పూర్వం అందులోని బ్రహ్మ విగ్రహానికి పూజాపురస్కారాలు లేవట. స్వరాజ్యం రాకతో దానికీ గీరాకి పెరిగి, ఇతర దేవాలయాల వలెనే దానికి జనాదరణ పెరిగిందట. అక్కడ కార్తీక పౌర్ణమి మొదలు 12 రోజుల పాటు ఉత్సవాలు జరుగుతాయట. (ఈనాడు 8.11.98 ఆదివారం ప్రత్యేక సంచిక)

ఇల్లు లేకపోవడం బ్రహ్మకొక్కడికే కాదు, వాస్తుశాస్త్రాలు వ్రాశారంటున్న రుష్యాదులకూ లేవు. అడవులలో యజ్ఞయాగాదులు చేసుకొంటూ సోమపానంచేసి, నిప్పుల్లో మాంసం చీకులు కాల్చుకొని తిన్న రుష్యాదులకు మాత్రం ఇళ్లెక్కడివి? వారివన్నీ గుడిసెలే. వాటిని సంస్కృతంలో పర్ణశాలలన్నారు కాని, పర్ణశాలలంటే ఆకులతో కప్పువేసిన గుడిసెలే. ఆ రుషులే వాస్తువు అనేదాన్ని తలకొక విధంగా శ్లోకాల్లో బంధించారుట. అలా అని ప్రాచీన వాస్తు గ్రంధాలు మనకు చెపుతున్నాయి.

పరాశరుడు బృహద్రథుడికీ, బృహద్రథుడు విశ్వకర్మకూ వాస్తుబోధ చేయగా, దాన్ని "విశ్వకర్మ ప్రకాశిక" అనే గ్రంథంగా శ్లోకాల్లో విశ్వకర్మ రచించాడని విశ్వకర్మ ప్రకాశిక చెపుతున్నది.[1]

భరద్వాజుడనే రుషి వాస్తువును చెప్పినట్లు "వాస్తు దర్పణం" మరో కథనాన్ని విన్పిస్తుంది.[2]

బ్రహ్మ, ఇంద్రుడు, యముడు, శుక్రుడు, అంగీరసుడు, ధ్రువుడు, గౌతముడు, గార్గేయుడు, మనువు, వ్యాసుడు, భృగుడు, విశ్వకర్మ ప్రభృతులు వాస్తు గ్రంథాలు వ్రాశారని "పంచవస్తు పారిజాతం" అంటున్నది.[3]

అగస్త్యుడు, నంది, నారదుడు, బృహస్పతి, తిమ్యలోకుడు, కాశ్యపుడు, కాత్యాయనుడు, మరీచి, చిత్రతోయకుడు, పాలకావ్యుడు, పుండరీకుడు, దీర్ఘదర్శి, పునర్వసు, యోగసారుడు మొదలైనవారు వాస్తుశాస్త్రం చెప్పారని "విశ్వకర్మ వాస్తుశాస్త్రం" అంటున్నది.[4]

భృగువు, అత్రి, వసిష్టుడు, విశ్వకర్మ, మయుడు, నారదుడు, నగ్నజిత్తు, విశాలాక్షుడు, పురందరుడు, బ్రహ్మ, కుమారుడు, నందీశుడు, శౌనకుడు, గర్గుడు, వాసుదేవుడు, అనురుద్ధుడు, శుక్రుడు, బృహస్పతి వాస్తుశాస్త్రాన్ని చెప్పిన వారిలో ముఖ్యులని మత్స్యపురాణం అంటున్నది.[5]

---

1. పరాశరః ప్రాహ బృహద్రథాయ బృహద్రథః ప్రాహవిశ్వకర్మణే
సవిశ్వకర్మా జగతాంహితాయ ప్రోవాచ శాస్త్రం బహుభేదం యుక్తం (విశ్వకర్మ ప్రకాశిక 1 : 4)
2. సర్వశాస్త్ర సమాలోచ్య భరద్వాజేన భణ్యతే
తచ్చ కాలాంతరత్వేన జీర్ణత్వానోపలభ్యతే (వాస్తు దర్పణం 1 : 2)
3. బ్రహ్మే ఇంద్రో యమాశ్చైవ భార్గవాంగీర సౌధ్రువ ః
గౌతమశ్చైవ గార్గేయ మనుర్వ్యాసో భృగుస్తథా
విశ్వకర్మ ప్రభృతయో వాస్తు విద్యావిశారదా :
సర్వైశ్చ యత్కృతం శాస్త్రసార ముద్ధృత్యయత్నతః (పంచవాస్తు పారిజాతం 1 : 1)
4. విశ్వకర్మ వాస్తు శాస్త్రం - 18
5. మత్స్యపురాణం - 252

అసలీ వాస్తు గ్రంధాలు 32 అంటుంది వాస్తు సర్వస్వం.[6]

ప్రాచీన వాస్తు గ్రంథాలన్నీ మనకు దొరకవు. వాటిని ఎవరు వ్రాశారో కూడా చాల గ్రంథాల విషయంలో మనకు తెలియదు. ఆయా గ్రంథాలలో కొన్ని ప్రాచీన వాస్తు గ్రంధాల పేర్లు ప్రస్తావనకు రావడాన్ని బట్టి, కొన్నిటి పేర్లు మనం చెప్పుకోవచ్చు. సమరాంగణ సూత్రధారం, వాస్తురాజవల్లభం, శిల్పరత్నం, వసిష్ట సంహిత, విశ్వకర్మ ప్రకాశిక, విశ్వకర్మ వాస్తుశాస్త్రం, సనత్కుమారం, కాలామృతం, మయమతం, మానసారం, కాశ్యపం, వైఖానసం, సకలాధికారం, మయవాస్తుశాస్త్రం, అపరాజితపృచ్ఛ, వాస్తు ప్రదీపం, రాజసింహవాస్తు, దీపార్ణవం, వాస్తుదర్పణం, వాస్తు దీపిక – ఇలా అనేక పేర్లతో ప్రాచీన వాస్తు గ్రంథాలున్నాయి.

పై వాస్తు గ్రంథాలేకాదు, హిందువుల, ఇతర ప్రాచీన గ్రంథాలన్నీ సంస్కృతంలోనే వున్నాయి. భూమిమీది ఏ ప్రజలకూ సంస్కృతం మాతృభాష కాదు. దాన్ని దేవభాషగా వైదిక హిందువులు చిత్రించారు. అది భూదేవులైన బ్రాహ్మణుల గుత్త సొత్తన్నారు. ఇతరులకు అర్ధం కాని ఆ భాషలోని గ్రంథాలను శాస్త్ర గ్రంథాలన్నారు. వేదాలు, బ్రాహ్మణాలు, అరణ్యకాలు, స్మృతులు, రామాయణ భారత భాగవత పురాణకథలు – అన్నీ శాస్త్ర గ్రంథాలన్నారు. అయితే, కులతత్వాన్ని ప్రమాణంగా స్వీకరించని "శాస్త్రమే" లేదు. బ్రాహ్మణుల్ని అగ్రభాగాన నిలపని శాస్త్రమూలేదు. చివరకు గ్రహాలకు కూడా వారు వర్ణవ్యవస్థను తగిలించారు. గురు శుక్రులు బ్రాహ్మణ గ్రహాలనీ, అంగారక సూర్యులు క్షత్రియగ్రహాలనీ, (నిజానికి సూర్యుడు నక్షత్రమేకాని గ్రహం కాదు) చంద్ర బుధులు వైశ్యగ్రహాలనీ, (నిజానికి చంద్రుడు వుపగ్రహమేకాని గ్రహం కాదు) శని శూద్రగ్రహమనీ "కాలామృతం" అంటుంది.[7] భూమిని గ్రహంగా ప్రపంచంలో ఏ ప్రాచీనులూ చిత్రించలేదు.

శాస్త్రానికీ, విజ్ఞానానికీ కులాలుంటాయా? గ్రహాలకు, నేలకు కులాలుంటాయా? మనుషుల్ని కులాలుగా విభజించి వారికి జన్మతః ఉచ్చనీచత్వాలు అంటగట్టేది శాస్త్రమా?

ఈ ప్రశ్నలు వాస్తు పండితుల్ని అడిగితే, అవుననే అంటారు. ఎందుకంటే, ప్రాచీన వాస్తు గ్రంథాలన్నీ కులతత్వంతో కుళ్ళుకంపుకొడుతున్నవే. అయినా, సంస్కృత గ్రంథాలు ఎంత పాతవైతే అంత మంచివనీ, అవి రుషి ప్రోక్తాలనీ, రుషులు సాక్షాత్తు దైవస్వరూపులనీ, వారు తపోశక్తివల్లనూ – అంతర్దృష్టి వల్లనూ, దైవకృపవల్లనూ గ్రహించి

---

6. ద్వాత్రింశద్వాస్తు శాస్త్రాణి సమాలోచ్య ప్రయత్నతః
శల్యవాస్తు ప్రవక్ష్యామి వాస్తు సర్వస్వసంగ్రహే (వాస్తు సర్వస్వం 1 : 1)

7. గురుభృగూవిప్రౌ, కుజార్కేనృపౌ, వైశ్యౌచంద్రబుధౌ,
తదన్య కులజో మందస్తు పాపగ్రహం (కాలామృతం 1 : 5)

శ్లోకాలలో మనకు అందించినవన్నీ నిర్దుష్టాలనీ మన పండితుల నమ్మకం. వారు కులతత్వం విషయంలో ఐక్య కంఠంతోను, వాస్తు నియమాలలో పరస్పరం భిన్నంగానూ సూత్రీకరించినా - వారి భేదాలు మతభేదాలన్నారు తప్ప, వాటిలో తప్పొప్పులను యెంచే ధైర్యం మన పండితులు చేయలేదు. అందువల్ల, ఈనాటి వాస్తు పండితులు కొందరు కుల వాస్తువును కొంత విడిచినా, తలకొక రీతిగా వాస్తు సూత్రాలను వివరించే దౌర్భాగ్యాన్ని విడవలేదు.

**వాస్తు కులాలు :**

మనుషుల రంగును (వర్ణాన్ని) బట్టి నాలుగు వర్ణాల సాంఘిక వ్యవస్థను హిందువులు కల్పించారు. ఆ తరహాలోనే మనుషులలోని నాలుగు వర్ణాలను భూమికి కూడా అంటగట్టారు, వాస్తు పండితులు. రంగు ప్రకారమే ఆయా భూములు ఆయా వర్ణస్థులకు తగినవన్నారు. అంటే, ఇల్లు కట్టుకొనే స్థలాన్ని నిర్ణయించేటపుడు వాస్తులో కులం దూరుతుందన్నమాట.

గృహ నిర్మాణానికి తెల్లని భూమి ఉత్తమమట, ఎర్రనిభూమి మధ్యమమూ, పసుపు రంగు భూమి అధమమూ, నల్లభూమి అధమాధమమూనట.[8]

అందువల్ల ఉత్తమమైన తెల్లభూమి బ్రాహ్మణులకు, మధ్యమమైన ఎర్రభూమి క్షత్రియులకు, అధమమైన పసుపుభూమి వైశ్యులకు, అధమాధమమైన నల్లభూమి శూద్రులకు తగినవట.[9]

ఇళ్లు కట్టుకోడానికి తీయనిభూమి ఉత్తమమట. కారం రుచిగల భూమి మధ్యమమూ, పుల్లనిభూమి అధమమూ, చేదురుచిగల భూమి అధమాధమమూనట.[10]

అందువల్ల తీయని భూమి బ్రాహ్మణులకు, కారం రుచి గల భూమి క్షత్రియులకు, పుల్లనిభూమి వైశ్యులకు, చేదురుచిగల భూమి శూద్రులకు అనువైనవట.[11]

పద్మాల వాసన యిచ్చే భూమి ఉత్తమమట. గుర్రపు వాసన వచ్చే భూమి

---

8. ఉత్తమం శ్వేతవర్ణంచ మధ్యమం లోహితం తథా
అధమం పీతవర్ణంచ కృష్ణాస్యాదధమాధమం (వాస్తు దర్పణం)
9. అథాతస్సం ప్రవక్ష్యామి లోకానాం హితకామ్యయా (వాస్తు దీపిక)
శ్వేతారక్తా తథాపీతాకృష్ణా వర్ణాను పూర్వత: (విశ్వకర్మ ప్రకాశిక 1 - 24)
10. ఉత్తమం మధురం జ్ఞేయం మధ్యమం కషాయకం
అధమం అల్లరుచికం తిక్తం స్యాదదధమాధమం (వాస్తు దర్పణం)
11. మధురా బ్రాహ్మణీభూమి : కషాయాక్షత్రియామతా
అమ్లా వైశ్యాభవే ద్భూమిస్తిక్తా శూద్రాపకీర్తితా (విశ్వకర్మ ప్రకాశిక 1 : 26)

మధ్యమము, పశు-ధాన్యాల వాసన వచ్చే భూమి అధమమూ, ఇతర వాసనలు వచ్చే భూమి నింద్యమూనట.[12]

అందువల్ల మంచి వాసన యిచ్చే భూమి బ్రాహ్మణులకు, నెత్తురు వాసన వచ్చే భూమి క్షత్రియులకు, మధువు వాసన వచ్చే భూమి వైశ్యులకు, కల్లు వాసన వచ్చే భూమి శూద్రులకు తగినవట.[13]

అంతేకాదు, గంభీరమైన భూమి బ్రాహ్మణులకు, ఎత్తయిన భూమి క్షత్రియులకు, సమమైనది వైశ్యులకు, ఎత్తు పల్లాలతో ఎగుడుదిగుడుగా వున్న భూమి శూద్రులకు తగినవట.[14]

రెల్లు, దర్భలు మొలిచే భూమి బ్రాహ్మణులకు, గరిక మొలిచే భూమి క్షత్రియులకు, పంటలిచ్చే భూమి వైశ్యులకు, ఊబచెత్త మొలిచే భూమి శూద్రులకు తగినవట.[15]

అంతే కాదు - బ్రాహ్మణులకు నేతి వాసన గల భూమి, క్షత్రియులకు నెత్తురు వాసనగల భూమి, వైశ్యులకు అన్నంవాసన గల భూమి, శూద్రులకు కల్లు వాసన గల భూమి శ్రేష్టమని "గృహకారిక" చెపుతున్నది.[16]

అగ్నేయం, దక్షిణం, నైరుతి దిశలు ఎత్తుగాను - ఉత్తరం పల్లంగాను వుండే భూమి బ్రాహ్మణులకు శ్రేష్టమట.[17]

---

12. ఉత్తమం పద్మగంధం చ మధ్యమం వాజి గంధం
అధమం పశుధాన్యాది ఇతరం పరివర్జయేత్ (వాస్తు దర్పణం)
13. సుగంధా బ్రాహ్మణీ భూమీ రక్తగంధాతు క్షత్రిణీ
మధుగంధార్భవేత్ వైశ్యా మద్య గంధాచ శూద్రిణీ (విశ్వకర్మప్రకాశిక)
14. గంభీరా బ్రాహ్మణీ భూమిర్ను పాణాంతుంగ మాశ్రితా
వైశ్యానాం సమయభూమిశ్చ శూద్రాణాం వికటాన్మృతా (విశ్వకర్మ ప్రకాశిక - వాస్తు దీపిక)
15. కుశకాశయుతా బ్రాహ్మీ దూర్వాన్నృపతివర్గతా
ఫలపుష్పలతా వైశ్యా శూద్రాణాంతృణ సంయుతా (వాస్తు దీపిక)

*ఇల్లు నిర్మించుకోడానికి స్థలాన్ని నిర్ణయించడంలో వర్ణవ్యవస్థను ప్రమాణంగా అంగీకరించని ప్రాచీన వాస్తు గ్రంథం లేదు. సమరాంగణం, వాస్తు ప్రదీపం, వాస్తురాజవల్లభం, రాజసింహవాస్తు, దీపార్ణవం వంటి గ్రంథాలన్నీ అలా చేసినవే.

16. ఘృతాసృగన్న మద్యానాం గంధాశ్చ క్రమతశ్శుభా
విప్రక్షత్రియవిట్శూద్ర జాతీనాం వాస్తు భూమిషు (గృహకారిక)
17. నిర్భత్యగ్నియమేషూచం నీచం చంద్రమ సంపతి
ద్విజేంద్రాణాంతు సుస్థానమవనీ సముదాహృతా (శిల్ప రత్నం)

నైరుతి, పశ్చిమం, వాయువ్యం ఎత్తుగాను - తూర్పుపల్లంగాను వుండే భూమి క్షత్రియులకు శ్రేష్టమట.[18]

వాయువ్యం, ఉత్తరం, ఈశాన్యం మెరకగాను - దక్షిణం పల్లంగాను వుండే భూమి వైశ్యులకు శ్రేష్టమట.[19]

ఈశాన్యం, తూర్పు, ఆగ్నేయం మెరకగాను - పడమర పల్లంగాను వుండే భూమి శూద్రులకు శ్రేష్టమట.[20] కాబట్టి ఎత్తు పల్లాల గురించి వాస్తు పండితులు యిప్పుడు చెపుతున్నవన్నీ అబద్ధాలన్నమాట. అవి వాస్తుశాస్త్రీయాలు కావన్నమాట.

అంతేకాక, గ్రామాలలో బొడ్డురాయికి ఈశాన్య ఆగ్నేయాలలో బ్రాహ్మణులు - తూర్పు దక్షిణాలలో క్షత్రియులూ - వాయువ్య, ఉత్తరాలలో వైశ్యులూ - పడమర శూద్రులూ - నైరుతిలో సంకరవర్ణాలవారూ నివసించాలట.[21]

## కులం పట్టింపులేని వాస్తు వెక్కడ?

ఇల్లు కట్టుకోవాలంటే కులాలను బట్టి స్తలాలను ఎన్నుకోవాలనే కులవాస్తు చండాలం గురించి ప్రాచీన గ్రంథాలు ఎలా చెపుతున్నాయో చూచాం. ఆయా కులాలవాళ్లు ఏయే "దిక్కుల్ని" మెరకగా వుంచుకోవాలో, ఏయే "దిక్కుల్ని" పల్లంగా వుంచుకోవాలో కూడా ఆ గ్రంథాలు చెపుతున్నాయి. ఒక కులంవారికి ఏవి ఏ దిక్కులలో పల్లంగా వుంటాయో మరోకులం వారికి అవి ఆ దిక్కునే మెరకగా వుండాలని కూడా ఆ గ్రంథాలు చెప్పాయి. అంతేకాక, ఆయా కులాలవాళ్ళు గ్రామాలలో ఏయే దిశలలో తమ వర్గంవారి యిళ్ళు నిర్మించుకోవాలో కూడా ఆ గ్రంథాలు చెపుతున్నాయి. ఒక వర్ణం వారి స్థలాల రంగు, రుచి, వాసన మరో వర్ణం వారికి పనికిరాదు - ఇదీ మన రుషుల వాస్తు శాస్త్రం వరస.

ఇతర విషయాలలో కూడా ఇంకా రుషిప్రోక్తవాస్తుశాస్త్రాలు యేమంటున్నాయో చూద్దాం.

---

18. నీచమింద్రే భవేదుచ్చం నిర్రుత్యాం పశ్చిమానిలే
సులభం నామ తద్వాస్తు రాజరాష్ట్ర వివర్ధస్య (శిల్పరత్నం)

19. సౌమ్యేశపవనేషూచ్చం నీచం భవతి చేద్యం
నామ్నావాస్తువరం నామవైశ్యవరాం తదభీష్టకృత్ (శిల్పరత్నం)

20. నీచం వరుణ ముచ్చం చే దీశానేంద్రాగ్ని షుక్రమాత్
సత్పథం నామ తద్వాస్తు శూద్రాణాం తదభీష్టకృత్

21. ఆగ్నేయాది క్రమేణైన అంత్యజా వర్ణసంకరా :
(ముళ్ళపూడి లీలా కృష్ణమూర్తి : వాస్తు సుధానిధి, పేజి 33)

ఇంటి పొడవు వెడల్పులను 7 చేత గుణించి, అలా లభించిన విలువను 8 చేత భాగించి, అలా చేయగా వచ్చిన శేషాన్ని "ఆయం" అంటారు. శేషాన్ని బట్టి ఆయాలకు పేర్లు పెట్టారు.

| | | | | | |
|---|---|---|---|---|---|
| శేషం | 1 | ధ్వజాయం: | శేషం | 2 | ధూమాయం |
| ,, | 3 | సింహాయం: | ,, | 4 | శునకాయం |
| ,, | 5 | వృషభాయం : | ,, | 6 | ఖరాయం |
| ,, | 7 | గజాయం: | ,, | 8 | వేకాయం |

ఇందులో బేసిసంఖ్య గలవి శుభాయాలట. సరిసంఖ్య గలవి అశుభాయాలట. వాటిలో ధ్వజాయం బ్రాహ్మణులకు, సింహాయం క్షత్రియులకు, వృషభాయం వైశ్యులకు, గజాయం శూద్రులకూనట.[22]

ఈ విచక్షణ వెనుకవున్న రహస్యమేమిటో వారెక్కడా చెప్పలేదు.

బారలు, మూరలు, జానలు, బెత్తలు ధైర్ఘ్యమానాలుగా మనరుష్యాది వాస్తు విద్యావిశారదులు నిర్ణయించుకున్నారు. చేతి మధ్యవ్రేలి మధ్య కణువుల మధ్య వుండే దూరాన్ని అంగుళమన్నారు. మనుషుల ఒడ్డు పొడవుల్ని బట్టి ఆ ప్రమాణాలు మారతాయని ఇంగితజ్ఞానం వున్న వారికందరకూ తెలుసు. ఆ కొలతలలోని మార్పుల్ని బట్టి ఆయాలలోని కొలతలలో కూడా మార్పులు వస్తాయి. అయినా, వారు ఈ అహేతుక ప్రమాణాలను "శాస్త్ర" బద్ధమన్నారు. కులాల్ని బట్టి ఆయాలను కేటాయించారు. ఎందుకీ గజిబజి అంటే, అవిద్యావంతుల్ని, అమాయకుల్ని ఆర్థికంగాను, మానసికంగాను దోపిడీ చేయడానికేనని తేలుతుంది.

వాస్తు పూజ కోసం రేఖాకరణం చేసేటపుడు బ్రాహ్మణులు శిరస్సును, క్షత్రియులు కండ్లను, వైశ్యులు తొడల్ని, శూద్రులు పాదాల్ని తాకాలిట.[23]

ఎందుకంటారా? పురోహితవర్గం అల్లిన కథల ప్రకారం బ్రాహ్మణుడు బ్రహ్మముఖం నుంచీ, క్షత్రియుడు బాహువులనుంచి, వైశ్యుడు తొడలనుంచి, శూద్రుడు పాదాలనుంచి కదా పుట్టింది!!

ఇండ్ల నిర్మాణంలో వాడే కొయ్యకు కూడా కులతత్వాన్ని అంటించారు ప్రాచీన వాస్తు పండితులు. బ్రాహ్మణులకు సురదారు, చందన, జమ్మి, మధూకవృక్షాలు, క్షత్రియులకు ఖదరం, బిల్వం, అర్జునం, శింశుఫలం, శాలతూనీకం, సరళం, వైశ్యులకు ఖాదిరం, సింధు, స్యందనం.[24]

శూద్రులకు తిందుకం, అర్జనం కొమ్మలు, వైసర, అమ్రవృక్షాలు.

---

22. విశ్వకర్మ ప్రకాశిక - 1 అ
23. విశ్వకర్మ ప్రకాశిక - 4 అ
24. విశ్వకర్మ ప్రకాశిక - 9 అ

**ఆశలు - భయాలు :**

మనుషుల ఆశల్ని, భయాల్ని అవకాశంగా తీసుకొని వాస్తుధూర్తులు వాస్తువుపై పిచ్చి నమ్మకాన్ని పెంచుతున్నారు. ఒక విధంగా చేస్తే ధనధాన్యాభివృద్ధి, దాంపత్యసుఖం, పుత్రమిత్రలాభం, కీర్తిప్రతిష్ఠలు, రాజగౌరవం లాంటివి పెరుగుతాయని ఆశపెడతారు. మరొక విధంగా చేస్తే దారిద్ర్యం, ఇంటిపోరు, పుత్రమిత్రనాశనం, అగౌరవం, అప్రతిష్ఠ, నిర్బంధం, కారాగారవాసం లాంటివి ప్రాప్తమవతాయని భయపెడతారు. జ్యోతిష్కుల వృత్తికీ, వాస్తుపండితుల వృత్తికీ ప్రజల ఆశా భయాలే ప్రాణాలు. ప్రజల ప్రలోభాలే వారికి కూడుగుడ్డలు.

స్థలం ఎత్తు పల్లాలనుబట్టి వాస్తు విశారదులు వాస్తువుకు వేర్వేరు పేర్లు పెట్టి వాటికి ఫలాలను చెప్పారు. వాటి నిండా ఆశలూ, భయాలే.

దక్షిణం, నైరుతి, పడమర, వాయువ్యం మెరకగా వుండి, మిగతా నాల్గు దిశలుగా పల్లంగా వుంటే దాన్ని గజపృష్టవాస్తు వంటారుట. ఫలితంగా గృహస్థుడికి ఆయుస్సు, ధనం ఇతర సంపదలు చేకూరతాయట.

మధ్య మెరకగా వుండి, చుట్టూ అన్ని దిశలలోనూ పల్లంగా వుంటే దాన్ని కూర్మపృష్టవాస్తువంటారు. ఫలితంగా గృహస్థుడికి నిత్యోత్సాహం, సుఖం, ధనధాన్యాభివృద్ధి జరుగుతుందట.

తూర్పు, ఆగ్నేయం, ఈశాన్యం మెరకగా వుండి పడమర పల్లంగా వుంటే దాన్ని దైత్యపృష్టవాస్తునంటారు. ఫలితంగా గృహస్తుడికి ధనం, పుత్రులు, పశువులు తగ్గిపోతాయట.

తూర్పు, పడమర పొడవు యెక్కువగా వుండి, దక్షిణం ఉత్తరం మెరకగా వుంటే నాగపృష్ఠ వాస్తువంటారుట. దీని ఫలితంగా మృత్యుభయం, శత్రుభయం, పుత్రహాని, పత్నిహాని సంభవిస్తాయిట.[25]

వాస్తు గ్రంథాలలో చెప్పిన ఫలాలు జరగడమంటే, మనిషిని నిష్క్రియాపరుడుగా పరిగణించడమే. మనుషులలో ఆశలు, భయాలు పురికొల్పడంలోనే వాస్తు పండితుల దుష్టత్వం, వాచాలత్వం బహిర్గతమవుతాయి. గృహ నిర్మాణానికి ముందు నుంచి ప్రారంభమై, గృహప్రవేశం పూర్తయ్యేవరకు గృహ నిర్మాత జరిపే కార్యకలాపాలన్నిటిలోనూ ప్రాచీన వాస్తువు కులపక్షపాతాన్ని చొప్పించింది. ఆపక్షపాతం ఈనాడున్నూ ఇతర రూపాలతో ప్రదర్శితమవుతున్నది.

---

25. వాస్తుశాస్త్ర వివేకం : మధురకృష్ణమూర్తిశాస్త్రి -
ఇందుకు ప్రమాణ శ్లోకాలు ఉదహరించాడు (పేజి : 37-8)

అర్థంలేని అబద్ధాలు :

వాస్తువులో "ప్రధమం భూ పరీక్షాచ" అన్నారు కాబట్టి, భూమి ఏయే వర్ణాల వారికి ఎలా నిర్ణయించారో చూచాం. దాన్ని బట్టి ఆ వాస్తుగ్రంథాల రచయితలు ఎంతటి జాతి మదమాత్సర్యగ్రస్తులో చూచాం. వర్ణవ్యవస్థకు వారు దాసులు కావడమేకాక, ఇతరుల్ని కూడా దాసులుగా మార్చడానికి వాస్తువులో సర్వత్రా కులపక్షపాతాన్ని ఎలా దోపారో చూచాం.

నగరమైనా, పట్టణమైనా, గ్రామమైనా నిర్మాణమైనచోట నాలుగు రంగులు, నాలుగు రుచులు, నాలుగు వాసనలు గల స్థలాలు ఎలా వుంటాయి? ప్రతి నగరంలోను, పట్టణంలోను, గ్రామంలోను వివిధ "వర్ణాల" వారుంటారు. ఆ వర్ణాలవారికి తగిన రంగు రుచి వాసన గల ప్రదేశాలు అక్కడ వుండడం యెలా సాధ్యం? అలా యేర్పడిన జనావాసం ఈ దేశంలో యెక్కడైనా వున్నదా? వుంటే అది యెక్కడ వున్నదో ఏ వాస్తు ద్రిమ్మరి అయినా చూపగలడా? ఇది సవాలు సుమా?

చరిత్రలో వేలాది జైనమందిరాలూ, బౌద్ధస్థూపాలూ నేలమట్టం చేయబడ్డాయి. వందలాది దేవాలయాలు (మసీదులూ, చర్చిలు) కూల్చివేయబడ్డాయి. వందలాది రాజమందిరాలూ, కోటలూ నామరూపాలు లేకుండా విధ్వంసమయ్యాయి. అవి అన్నీ వాస్తు పండితుల సూచనల ప్రకారం నిర్మించబడినవే. అవి ఎందుకు. ఎలా, ఏ వాస్తు దోషాలవల్ల కూలాయో ఏ వాస్తు పండితుడైనా చెప్పగలడా? రాజ్యాలు, సామ్రాజ్యాలు ఎందుకు కూలాయో ఏ వాస్తు విద్యావిశారదుడైనా చెప్పగలడా? సోమనాధుడి వైభోగం ఏ వాస్తు తప్పుల వల్ల అంతరించిందో, ఏ వాస్తు దోషం వల్ల సోమనాధుడి విగ్రహం ముక్కలు చక్కలై ముస్లిం దండయాత్రికుల సింహాసనాల మెట్లకు అమర్చబడ్డాయో, ఏ వాస్తు పండితుడైనా చెప్పగలడా? ఏ వాస్తు దోషం వల్ల బాబ్రీ మసీదు కూలిందో ఏ వాస్తు వల్లభుడైనా చెప్పగలడా? ఉత్తరాన ఎత్తుగా వున్న హిమాలయాలను, రాష్ట్రాలను భారతదేశం వదలుకొంటే, మిగతా ఇండియా సుభిక్షం కాగలదేమో వాస్తు పండితులు భారత ప్రభుత్వానికి సలహాయిస్తే - కాశ్మీరు సమస్యకు వారు పరిష్కారాన్ని చూపినవారవతారు. ఆ ప్రయత్నం ఏ వాస్తు పండితుడైనా చేయగలడా? వాస్తువుపై పిచ్చ నమ్మకం వున్న మన ప్రభువులు ఈ విషయంలో వాస్తు పండితుల సలహాలడిగి, వారి సూచనల ప్రకారం ఆసేతుహిమాచల పర్యంతం ఎత్తుపల్లాలను సరిచేయించగలరా? అప్పుడు ఈ దేశం సుభిక్షం కాగలదేమో చూద్దాం.

# 3. వాస్తువంటే ఏమిటి?

ఏ విషయం ప్రస్తావనకు వచ్చినా, మన సనాతన ఛాందసులు వేదం వైపు వ్రేలెత్తి చూపుతారు. అంతా ఒందులోనే వుంది, చూడమంటారు. అది "మన సంస్కృతి" జబ్బు.

అందువల్ల, వాస్తు ప్రస్తావన వచ్చినా, దాని మూలాన్ని వేదంలో వెదకడానికి ప్రయత్నిస్తారు. అయితే, వేదంకాలంనాటి ఆర్యులకు యిండ్లులేవు. వారికున్నవన్నీ గుడిసెలే. ఆ గుడిసెలైనా, తిరుగుడు జాతుల దశను దాటిన తర్వాత యేర్పరచుకొన్నవే.

ఒకనాటి భారతదేశంలోని నాగరిక జాతుల మీద ఆర్యుల పోరాటాన్ని వేదం బారుకీ వర్ణించింది. ఆ నాగరికుల జీవితం నగర జీవితమే. వారి నగరాలను విధ్వంసం చేయడంవల్లనే ఇంద్రుడికి పురందరుడని పేరు వచ్చింది. అనార్యుల నగర జీవనానికి వాస్తువున్నట్లులేదు. వారు కేవలం సౌకర్యాలకోసమే గృహనిర్మాణం చేసుకున్నట్లు తెలుస్తుంది.

అనార్యుల ఓటమితో – అణచివేతతో ఇక్కడి సామాజిక జీవనంలో ఆర్యుల అవలక్షణాన్నీ చోటు చేసుకున్నాయి. అందువల్ల ప్రతిదానికీ వేదంలో ప్రమాణం వెదకడం మన పండితులకు అలవాటైంది.

"వస నివాసే" అనే ధాతువు నుంచి వాస్తు శబ్దం వుత్పన్నమైందట. ఋగ్వేదంలో కూడా నివాసస్థానం అనే అర్థంలోనే ఆపదం ప్రయోగించబడిందట.[1]

ఆ తర్వాత వాస్తు పండితులు పుట్టుకొచ్చారు. దేవతలు, మనుషులు, ఏనుగులు, ఆవులు, గుర్రాలు మొదలైనవాటి నివాసస్థానం అనే అర్థంలోనే వాస్తువు అనే పదాన్ని

---

1. తాం వాం వాస్తూన్యుశ్మసి గమధె (ఋగ్వేదం 1 - 156 - 6)

శిల్పజ్ఞులు ప్రయోగించారుట.[2]

దేవతలు, మనుషులు నివసించే స్థలాన్ని "వస్తువు" అంటారని మయమతం చెపుతున్నది.[3]

వస్తువంటే నివాసయోగ్యమైన భూమి అని పండితాభిప్రాయంగా మానసారం కూడా అంటున్నది.[4] అందువల్ల వస్తుసంబంధమైన శుభాశుభాలను శాసించేది వాస్తు శాస్త్రమని కూడా అది అంటున్నది.[5]

మయమతం మరొక మాట కూడా అంటున్నది. పంచభూతాలలో మొదటిది భూమి అట. ఈ భూమియే ముఖ్య వస్తువుట. ఈ భూమిపై పుట్టిన వివిధ వస్తు సమ్మిశ్రితాలతో దానిమీద నిర్మించబడ్డ ప్రాసాదాదులే వాస్తువులట. వాటి విషయంలో గుణదోషాలను చర్చించే విషయాన్నే వాస్తుశాస్త్ర మంటుంది మయమతం.[6]

ప్రతి మనిషికీ నివాసయోగ్యమైన భూమి అవసరం. గృహస్థాశ్రమ క్రియాకలాపాలన్నీ గృహస్థు స్వగృహంలోనే నెరవేర్చాలి.[7] అలాకాక, ఇతర గృహాలలో నిర్వహించే కార్యకలాపాలన్నీ నిర్వాహకుడికి ఫలితం యివ్వనివే. ఎందుకంటే, ఆ ఫలితాలు గృహయజమానికే చెందుతాయి.[8]

ఇంటిలో వుండేది ఇంటి యజమానేకాక కుటుంబ సభ్యులందరూ వుంటారు. వారి జాతకాలు ఒకే విధంగా వుండవు. వారి నామనక్షత్రాలు ఒకే నమూనాలో వుండవు. కాబట్టి యజమాని బారలు, మూరలు, జేనలు, బెత్తల కొలతలతో యేర్పాటు చేసిన

---

2. దేవతానాం నరాణాం చ గజగోవాజి సమపి
నివాస భూమి శిల్పజ్ఞైర్వాస్తు సంజ్ఞమతీరితే ॥ (విశ్వకర్మవాస్తు శాస్త్రం 7 - 1)

3. అమర్త్యాశ్చైవ మర్త్యాశ్చ యత్ర యత్ర వసంతి పా
తద్వస్త్వితి మతం తద్జ్ఞై .... (మయమతం)

4. తైతిలాశ్చ నరాశ్చైవ యస్మిన్ యస్మిన్ పరిస్థితా
తద్వస్తు సూరిభి: ప్రోక్తం .... ... (మానసారం)

5. వస్తు సంబంధీ శుభాశుభం శాసయతీతి వాస్తు శాస్త్రం (మానసారం)

6. భూతానామాది భూతత్వా దాధారజ్జగత : స్థితి
భూరేవ ముఖ్య వస్తు సాత్ తత్రజాతాని యూనిహి
ప్రాసాదా దీని వాస్తూని వస్తుత్వాచ్ వస్తు వంశ్రయత్
వస్తూన్యేనహి తాన్యేవ ప్రోక్తాన్యస్మిన్ పురాతనై ః (మయమతం)

7. గృహస్థస్య క్రియాస్సర్వాన సిద్ధ్యంతి గృహంవినా
యత స్తస్మాద్గృహారంభ ప్రవేశ సమయంబ్రువే (మత్స్యపురాణం)

8. పరగేహ కృతాస్సర్వా : శ్రౌతస్మార్త క్రియాశ్శుభా :
నిష్ఫలా స్సర్వత స్తానాం భూమీశః ఫలమశ్నుతే (భవిష్యోత్తరపురాణం)

యిల్లు ఆ యింటిలోని వారికందరికీ శుభప్రద మెలా అవుతుందో వాస్తు పండితులే చెప్పాలి.

దానికివారు యేదో ఒక గుడ్డిసాకు చెపుతారు. గృహస్థులందరూ సుఖంగా వుండాలంటే గృహస్థుడు వాస్తువును అనుసరించాలని చెపుతారు. గ్రామక్షేత్ర అర్చణాలు చూచుకోవాలంటారు. భూ పరీక్ష చేయాలంటారు. శుభదినాన, శుభముహూర్తంలో గృహనిర్మాణం ఆరంభించాలంటారు, అదే వాస్తు శాస్త్ర పద్ధతి అని ఘంటాపథంగా చెపుతారు.

అయితే, వాస్తువనేది శాస్త్రమా, లేక కళా? అనే ప్రశ్న కూడా వుంది. వాస్తువు నిరలంకృతమైతే శిల్పమనీ, సాలంకృతమైతే కళ అనీ చెప్పవచ్చునంటున్నారు కొందరు వాస్తు పండితులు.

వాత్సాయనుడు చెప్పిన చతుష్షష్టి కళలలో వాస్తు విద్య 37వదిగా వుంది.

శుక్రాచార్యుడు వాస్తువును కళగానే పేర్కొన్నాడు.[9] అంటే అది కళే కాని, శాస్త్రం కాదని శుక్రాచార్యుడు అంగీకరించినట్లయింది.

వస్తు సముదాయాన్ని సాలంకృతంగా, సక్రమంగా అమర్చి, అకృతికి అందాన్ని, ప్రయోజనాన్ని సిద్ధింపజేసి, దాని దర్శనీయతను అధికం చేసే గృహనిర్మాణ కళకే "వాస్తు కళ" అని పేరని ఎన్‌సైక్లోపెడియా బ్రిటానికా అంటుంది.[10]

అయితే, అధునాతన నిర్వచనానికీ, శాస్త్రం పేరుతో వాస్తువును మార్మికంగా గందరగోళ పరిచే పద్ధతికీ సంబంధం లేదు. భారతదేశంలో, హైందవ మతం పేరిట మనుషులు నివసించడానికి అవసరమైన గృహ నిర్మాణానికి సైతం "మతం బురద" పులమబడింది.

భారతదేశంలో వాస్తు కళ ప్రధాన శిల్పమనీ, తక్కిన కళలన్నీ ఇంచు మించుగా దాని అనుబంధ కళలుగానే అభివృద్ధి చెందాయనీ ఎన్‌సైక్లోపెడియా ఆఫ్ రిలిజియన్ అండ్ ఎథిక్స్ అంటుంది.[11]

అంటే, మత సంప్రదాయంగా పెరిగిన కళగానే వాస్తువును గుర్తించవలసి వుంటుంది. దేవాలయాల నిర్మాణ వాస్తువును గురించీ, విగ్రహాల చెక్కడాల వాస్తువు గురించీ, తిరుపతి వెంకటేశ్వరుడి ఆలయ వాస్తువును గురించీ, భద్రాద్రి రామాలయ వాస్తువును గురించీ యిప్పటికీ వాస్తు పండితులు గ్రుద్దులాడుకుంటూనే వున్నారు.

---

9. తడగవాపీ ప్రాసాద సమభూమి క్రియాకలా

10. Architecture = the art of building to secure beauty and unity by arranging plan masses and embelishments of a structure to enhance its appearance (vol II, P-27)

11. Vol I, P-740

హిందూ దేవాలయాలన్నీ (ఆగమ) వాస్తు సిద్ధాంతాల ప్రకారం నిర్మించబడినవే, కాని, అవి విధ్వంసం కాకుండా వాటి వాస్తు నిబంధనలు ఆపలేకపోయాయి. జైనమందిరాలూ, బౌద్ధ ఆరామాలూ, ఏవిధమైన వాస్తువును అనుసరించాయో తెలియదు. కాని, అవి నూటికి 99 పాళ్లు నామరూపాలు లేకుండా విధ్వంసమయ్యాయి. అందుకు కారణం వాస్తు బలహీనత కాదు. హిందువుల పరమత విద్వేషమే వాటిని ఆనవాళ్ళు లేకుండా నిర్మూలించిందని గ్రహించాలి.

హరప్పా, మహేంజొదారో మొదలైన పురావస్తు త్రవ్వకాలలో బయల్పబడిన కట్టడాల అవశేషాలు చాలా వున్నాయి. అవి యే వాస్తువునూ అనుసరించినట్లు కన్పించదు. అవి, అందానికి కాక, ఉపయోగానికే యెక్కువ ప్రాధాన్యత యిచ్చినట్లు తెలుస్తుంది.

వాస్తువును గురించిన నిర్వచనాలేవీ దాన్ని శాస్త్రంగా తేల్చలేకపోయాయి. ఆలయాలలో వున్న రాతి చెక్కడాల్ని బట్టి దాన్ని కళ అంటే అనవచ్చు. "మా రాజులు" కట్టించుకొనే యిళ్ళలో కూడా బొమ్మల చెక్కడాలుంటే, దానినీ కళ అనవచ్చు. కాని, దాన్ని శాస్త్రమనడానికి ఆధారం యేమీ లేదు. వూరికే మార్మిక భయాలు, శుష్కవాగ్దానాలు చేసినంత మాత్రాన, ఏదీ శాస్త్రం కాదు.

కేవలం శుభలక్షణాలు గల వాస్తువును అనుసరిస్తే సుఖం, ధనం, బుద్ధి, సంతతి లభిస్తాయనీ. అశుభ లక్షణాలు గల వాస్తువును అనుసరిస్తే దుఃఖం, విఘ్నం కల్గుతాయనీ అనడం శాస్త్రం కాదు.[12]

జ్యోతిషానికీ, వాస్తువుకూ పీట ముడివేశారు మన సనాతన పండితులు. అవి రెండూ మూఢనమ్మకాలేకాని, శాస్త్రాలు కావు. రెండూ మార్మికతకు సంబంధించినవేకాని, వాస్తవాలు కావు. రెండు ఖాళీకుండలకు వాసెనకట్టి ఏ కుండలో యేమున్నదో చెప్పమంటే, ఏమి చెప్పాలి? అలానే జ్యోతిషంలో ఏమి వుందో, వాస్తువులో కూడా అదే వుంటుంది .. హుళక్కి

## వాస్తోపనిషత్తు :

మనకున్న ఉపనిషత్తులకు కొదవేమీలేదు. ముక్తికోపనిషత్తులో క్రోడీకరించిన 108 ఉపనిషత్తులే కాకుండా, అల్లా ఉపనిషత్తు, వాస్తోపనిషత్తు వంటివి కూడా వున్నాయి.

---

12. సుఖం ధనాని బుద్ధిశ్చ సంతతి స్సర్వదానృణాం
ప్రియాణ్యేషాంచ సంసిద్ధ్యై సర్వంస్యాచ్ఛుభ లక్షణం॥
యాత్ర విందిత లక్ష్మాత్ర తదే తేషాం విఘాతకృత్
అతస్సర్వముపాదేయం యద్భవేచ్ఛు భలక్షణం - (సమరాంగణం సూత్రధారం)

వాస్తోపనిషత్తు అనేది అధర్వవేదంలోని పిప్పలాద కల్పానికి సంబంధించినదట. అది ఒరియాలిపిలో వుంది. దాన్ని డా॥ ఆలిస్ బోనర్ అనే ఆవిడ నాగరలిపిలో సవ్యాఖ్యానంగా ప్రకటించింది. అసలు అధర్వవేదం దొరికిందే ఒరియాలిపిలో ననేవాదం ఒకటి వుంది.

వాస్తోపనిషత్తు ప్రకారం ఈ ప్రపంచమంతా వస్తుమయం. ప్రతి వస్తువులోనూ దేవుడున్నాడు. అతడి పేరు వాస్తోష్పతి. అతడే విశ్వకర్మ – అంటే వస్తువులను ఆశ్రయించి వుండేవాడు. వస్తువులకు వస్తువు (Content) పరవస్తువే – అంటే పరమాత్మ. అతన్ని గురించి తెలుసుకోవాలంటే, ముందుగా నిన్ను గురించి నీవు తెలుసుకోవాలి. ఎందుకంటే నీవూ పరమాత్మవే కదా?

వస్తువులన్నీ వివిధ రూపాలలో వున్నాయి. వీటన్నిటినీ ఎవరు చేశాౕ? ఎలా చేశారు? అని ప్రశ్నించుకుంటే ఈ ప్రపంచ సృష్టికి మొదటి కర్త (భగవంతుడు) కొన్ని సూత్రాలను చూపాడనీ, వాటిని అనుసరించి ఈ సృష్టి జరుగుతున్నదనీ, దాన్నే శిల్పమని అంటామనీ వాస్తోపనిషత్తు చెపుతుంది.

మొదట పరమాత్మ వెలుగులా గోచరించాడుట. స్తంభంలా ప్రకాశించాడుట. ఆ వెలుగుల్లో రేఖలు, వలయాలు గోచరించాయట. ఆ రేఖల్ని, వలయాల్ని గ్రహించినవాడే స్థపతి (శిల్పి). వాటి ఆధారంగానే బ్రహ్మవిద్య మొదలైందిట.

దేవుడికి రూపం వుందా, లేదా అనే మీమాంసకు ఈ ఉపనిషత్తు రూపం వుందనే చెపుతుంది. లేకపోతే, నీ మనస్సును నిలకడగా ఎలా వుంచగలవు? పరమాత్మను ఎలా ధ్యానించగలవు? అని ప్రశ్నరూపంగా సమాధానం చెపుతుంది. ప్రతిమలను, శిల్పాలను చెక్కడం వంటి విషయాలను ఈ ఉపనిషత్తు వివరిస్తుంది. అందువల్లనే ఇది, వాస్తు సూత్రోపనిషత్తు అయింది. దీనిలో వాస్తోష్పతిగా పరమాత్మను పేర్కొన్నారు.

ఇంతకు మించి ఈ ఉపనిషత్తులో వాస్తువుకు సంబంధించిన ప్రత్యేక అంశాలేమీ లేవు. కొయ్యతో, రాతితో, దేవతామూర్తుల్ని, ఎలా చెక్కాలో, వాటి పరిమాణాలు ప్రమాణాలు ఏవిధంగా వుండాలో, వాటికి వాళ్ళు యేర్పరచిన తాత్విక భూమిక లేమిటో మాత్రమే అందులో చర్చించబడ్డాయి. ఇవి అన్నీ ఒకనాటి మనిషి ఆలోచనలు.

సృష్టి జరగలేదనీ, అంతా పరిణామంలో వున్నదనీ, అందువల్ల సృష్టికర్త భావం తప్పనీ ఈనాడు మనకు తెలుసు. వస్తువుల్ని గుర్తించడానికి రేఖలు, వలయాలు మాత్రమే చాలవనీ, అవి ఆదిమశిల్పి – చిత్రకారుల భావనలనీ మనకు తెలుసు. ఈనాటి విజ్ఞానశాస్త్ర పరిధిలో వేలాది ధర్మాలు, గుణగణాలు పరిగణనలోకి తీసుకోవాలని మనకు తెలుసు. కాబట్టి వాస్తోపనిషత్తులోని భావాలు ఎంత ఆదిమమైనవో ఈనాటి మనిషి వూహించుకోవచ్చు.

**వాస్తుపురుషుడు :**

మన పూర్వులు మార్మికతతో కూడిన కల్పనలు చాలా చేశారు. దాన్నే మనవారు సృజనాత్మకత గా భావించి వుండవచ్చు. కాని, వారి వ్యర్థ కల్పనలన్నీ వ్యవస్థీకరణ పొంది "మన మతాల్లో" భాగాలై పోయాయి. వ్యవస్థీకరణ వున్నచోట సృజనాత్మకత వుండదు.

మనవారి కట్టుకథల్లో వాస్తుపురుషుడు కూడా ఒక "వ్యక్తే". ఆ కథ ప్రకారం కృతయుగంలో వాస్తువు లేదు. ఎందుకంటే వాస్తు పురుషుడు కృతయుగంలో పుట్టలేదు.

త్రేతాయుగంలో అతి భయంకరమైన భూతం ఒకటి వుండేదిట. అది యెల్లప్పుడూ నిద్రపోతూ వుండేదిట. దాన్ని చూచి ఇంద్రాది దేవతలు భయపడి బ్రహ్మవద్దకు పోయి మొరపెట్టుకొన్నారు. బ్రహ్మ వారిమొరవిని ఆ భూతాన్ని అధోముఖంగా పడద్రోసి దానిపై కూర్చోమన్నాడుట. వారు ఆ విధంగానే చేశారు. దానినే వాస్తు పురుషునిగా బ్రహ్మ సృష్టించాడుట. (అంటే బ్రహ్మ నేరుగా భూతాన్ని సృష్టించ లేదన్నమాట). పుట్టీ పుట్టగానే ఆ వాస్తు పురుషుడు బ్రహ్మవద్దకు పోయి మొరపెట్టుకున్నాడుట. నిరపరాధినైన తనను దేవతలు అ న్యాయంగా పీడిస్తున్నారనీ, రక్షించమనీ వేడుకున్నాడు. అప్పుడు బ్రహ్మ సంతోషించి "గ్రామాలలో, పట్టణాలలో నగరాలలో, దుర్గాలలో, ప్రాసాదాల్లో, గృహ నిర్మాణాలలో, జలోద్యానాలలో అతన్ని పూజించని మనిషి అమంగళాలను, అకాల మృత్యువును, అనేక విఘ్నాలను చవిచూస్తాడనీ, వాస్తుపూజ చేయనివారు అతనికి ఆహారమవుతారనీ, వరమిచ్చి అంతర్ధానమయ్యాడుట.[13]

చూచారా! దేవతలు, రాక్షసులు లేనిదే మన పూర్వులకు కథలు అల్లడం కూడ చేతకాదు. ఎందులో చూచినా, వారి ప్రస్తావనే. పూర్వం ఈ దేశంలో దేవతలు, రాక్షసులు మాత్రమే వుండే వారన్నమాట.

వాస్తు పురుషుణ్ణి పూజించకపోతే అశుభాలు జరగడమేకాదు – ఆ భూతం గృహయజమానిని కూడ భక్షిస్తుందని వాస్తువంటుంది.

అందువల్ల గృహ నిర్మాణాలలో, ప్రవేశాలలో, ఉగాదినాడు, యజ్ఞయగాది క్రతువులలో, జనన – ఉపనయన – వివాహాది సమయాలలో, జీర్ణోద్ధార క్రియలలో, శల్య విన్యాసంలో, పిడుగుపాటుకు, అగ్ని ప్రమాదాలకు, పాములు – చండాలురు – గుడ్లగూబ వచ్చినపుడు, కాకి, మృగం ఏడు రాత్రులు నివసించినపుడు, ఆవులు – పిల్లులు అరచిన గృహంలో, ఏనుగులు, గుర్రాలు రమించినచోట, స్త్రీలు పోట్లాడుకున్న చోట పావురాలు, తేనెపట్టు చేరిన యింట – ఇంకా ఎన్నో "ఉత్పాతాలు" జరిగినచోట

13. విశ్వకర్మ ప్రకాశిక – 1, అ.శ్లో 1 నుంచి 17 వరకు

శాంతి కోసం వాస్తు పురుషుణ్ణి పూజించాలని వాస్తువు చెపుతుంది.[14]

అయితే, వాస్తోపనిషత్తులో పేర్కోబడ్డ వాస్తోష్పతీ, వాస్తు పూజలో పేర్కోబడ్డ వాస్తు పురుషుడూ ఒక్కరు కాదు. వాడు పనికి వచ్చినపుడు వాణ్ణీ, వీడు పనికి వచ్చినపుడు వీణ్ణీ, వాడుకోవడం వాస్తునీతి సంప్రదాయం.

అయితే, బోరగిలబడ్డ వాస్తుపురుషుణ్ణి బ్రహ్మ వెల్లకిల త్రిప్పాడో, లేదో అర్థంకాదు. ఎందుకంటే, బోరగిల పడివుంటే, కుడి ఎడమగా, ఎడమ కుడిగా మారుతుంది. ఈ కుడి యెడమల ప్రాధాన్యత శల్య వాస్తువులో వుంది. గృహయజమానికి ఏ అవయవంలో దురదపుడితే వాస్తు పురుషుడికీ అదే అవయవంలో దురద పుడుతుందిట.[15] ఆ దురదను బట్టి భూమి లోపలి యెముకల్ని, లోహాలు మొదలైన వాటిని గుర్తించవచ్చునట.

ఈ బండారం బయట పడడానికి శల్య పరీక్షకే పరీక్ష పెట్టాలి.

## శల్య పరీక్ష : మెటల్ డిటెక్టర్లు – బోన్ డిటెక్టర్లు :

ముఖం ఈశాన్యం వైపు, కాళ్ళు నైరుతివైపు వుండేటట్లుగా వాస్తు పురుషుడు పడి వుంటాడుట. అతని హృదయ స్థానంలో బ్రహ్మ వుండగా, ఇతర దేవతలు 44 మంది అతని చుట్టూ వుంటారుట. వాస్తు పురుషుడి దేహాన్ని 81 మండలాలుగా విభజించుకోవాలిట. గృహ యజమాని ప్రశ్నిస్తూ దురదపుట్టి ఏ అవయవాన్ని స్పృశిస్తాడో, వాస్తు పురుషుని ఆ అవయవం వద్ద త్రవ్వితే అక్కడ ఎముకలుంటాయిట. ఇది వాస్తువు యొక్క ఎముకల సైన్సు.

| | |
|---|---|
| తలతాకితే | 8 అడుగుల లోతున బంగారపు కడ్డీ వుంటుందిట |
| ముక్కు తాకితే | 7 అడుగుల లోతున చందనపు కట్టె వుంటుందిట |
| కంఠాన్ని తాకితే | 6 అడుగుల లోతున ఏనుగు ఎముకలుంటాయిట |
| తొడ తాకితే | 5 అడుగుల లోతున వెండి వుంటుందిట |
| బొడ్డు తాకితే | 4 అడుగుల లోతున కంచు కడ్డీ వుంటుందిట |
| మర్మాంగం తాకితే | 3 అడుగుల లోతున రాగి ముక్కలుంటాయిట |
| మోకాలు క్రింద తాకితే | చేతెడు లోతున ఇనుముంటుందిట |
| చీలమండల్ని తాకితే | చేతెడు లోతున సీసం వుంటుందిట |
| భుజాలు తాకితే | చేతెడు లోతున పాము యెముక లుంటాయిట. |

---

14. విశ్వకర్మ ప్రకాశిక

15. గృహారంభేతి కండూతి స్స్వామ్యంగే యత్రజాయతే
శల్యం త్వపనయేత్తత్ర ప్రాసాదే భవనే పిచ ॥ వాస్తు సర్వస్వం

ప్రక్కలను తాకితే చేతెడు లోతున మేక యెముక లుంటాయిట.[16]

ఈ సైన్సును ప్రయోగాల ద్వారా తేలికగా రుజువు చేసుకోవచ్చు. గడ్డపలుగు, చెలగపార తీసుకొని త్రవ్వితే ఏ బంగారపు కడ్డీలో దొరకకపోతాయా? బంగారం కాకపోతే వెండి అయినా, కంచు అయినా, రాగి అయినా దొరుకుతుందేమో ఏ వాస్తు పండితుడైనా – లేక, వారి మాటలు వినే ఏ దూడూ బసవన్నలైనా, ఎప్పుడైనా పరీక్షకు పెట్టి చూచారా?

అయితే, యీ సైన్సుకు విరుద్ధంగా తీర్పు చెప్పే సైన్సులు కూడా యితర వాస్తు గ్రంధాల్లోనే వున్నాయి. ఆ గ్రంథకర్తలేమి చెప్పారో చూద్దాం. "సిద్ధాంత శేఖరం" అనే మరో "వాస్తు సైన్సు" పుస్తకం శల్యపరీక్షను యీ క్రింది విధంగా చెప్పింది.

| | |
|---|---|
| తల తాకితే | 8 అడుగుల లోతున శల్యం వుంటుందిట |
| ముక్కు తాకితే | 1 అడుగు లోతున చందనం |
| చెవులు తాకితే | 1 అడుగు లోతున బంగారం, వెండి, పగడం, |
| మర్మాంగం తాకితే | రాగి |
| తొడలు తాకితే | 1/2 చేతెడు లోతున తొడ యెముక |
| మోకాలు తాకితే | రొమ్ములలోతున మంగలికత్తి |
| పాదం తాకితే | 16 అంగుళాల్లోతున ఏనుగు దంతాలు |
| భుజం తాకితే | చేతెడు లోతున కత్తి |
| ప్రక్కలు తాకితే | 3 చేతుల్లోతున బొగ్గులు |
| చేతులు తాకితే | చేతెడు లోతున కత్తి ఉంటాయిట.[17] |

---

16. గురుఃకర్తార మన్వీక్ష్య వదేచ్ఛల్యం తు తద్బుధై
యదంగ స్పర్శనం కర్తుర్వాస్తు దేహే తదంగకే
శల్యం వినిర్దే శేత్ప్రాజ్ఞ శ్శిరసి స్పర్శనేయది
శిరస్థానే హేమశల్యం నాశికా స్పర్శనేయది
నాశికాయాం చైవ వాస్తోశ్చందనం సప్తతాలకే
గళస్పర్శే హస్తిశల్యం స్యాత్ షట్తాళ ప్రమాణ తః
ఊరు సంస్పర్శనే చైవరంజితం పంచతాళకే
నాభిస్పర్శే చతుస్తాలం కాంశ్య శల్యం వినిర్దిశేత్
గుహ్యం సంస్పర్శనే తామ్రశల్యం చైవత్రితాలకే
తథాగుల్ఫస్య సంస్పర్శే త్రపుశల్యం వినిర్దిశేత్
బాహ్వోశ్చ స్పర్శనే చైవ అజానాం శల్యముద్ధరేత్ ॥
– కారణాగమం : వాస్తు సర్వస్వం : శల్యపరీక్ష – 12

17. సిద్ధాంత శేఖరం C/o. వాస్తు సర్వస్వం, పేజి – 16-17

ఇలా యెక్కడ దురద పుడితే అక్కడల్లా శల్యాదులుంటాయని వాస్తు గ్రంధాలు చెపుతున్నాయి. వాస్తు సంగ్రహం, మానసారం, సనత్కుమారవాస్తు, మహాకపిల పాంచరాత్రం, మయవాస్తువు, విశ్వకర్మవాస్తువు మొదలైన గ్రంధాలన్నీ ఎముకలవేట గురించి చెప్పినవే. ఐతే, అందులో ఏ రెండు గ్రంధాలూ ఏకీభవించడం లేదు. మతిమాలిన వాడైతే తప్ప, వాటిని శాస్త్ర గ్రంధాలని చెప్పుకోరు.

## నాటు మెటల్ డిటెక్టర్ల కొత్త పద్ధతి :

వాస్తు పురుషుడికి దురద పుట్టించి భూమిలో ఏయే శల్యాలు, లోహాలు, వున్నవో కనుక్కొనే పద్ధతిని - వాస్తు పద్ధతినిపైన చూచాం. నిజానికి, అవి గృహయజమానికి పట్టించిన వాస్తు దురదను గోకడానికే.

శల్య పరీక్షకు యితర పద్ధతులు కూడా వున్నాయి.

పక్షి కూసినపుడు గృహ యజమాని ఏ అవయవం అదురుతుందో, వాస్తు పురుషుని ఆ అంగం వద్ద మనిషి శల్యం వుంటుందిట.

ఏనుగు, గుర్రం, క్రూరమృగం అరచినపుడు గృహ యజమాని ఏ అవయవం అదురుతుందో, వాస్తు పురుషుని ఆ అవయవాల వద్ద ఆయా జంతువుల శల్యాలుంటాయిట.

సూత్రం (కొస) పట్టేటపుడు దాన్ని యే జంతువులు దాటుతాయో, ఏ జంతువులు భయంకరంగా కూస్తాయో, ఆ స్థలాల్లో వాటి శల్యాలుంటాయిట.

ఈశాన్యంలో కాకి మృదువుగా కూస్తే, ఆ ప్రదేశంలో ధనం వుంటుందిట. ఇలాంటి ధనార్జన పరిశోధన ఎవరైనా చేశారో లేదో మనకు తెలియదు. [18]

ఇలా వాస్తు గ్రంథాలు ఒకదాని కొకటి పొంతన లేకుండా యెముకల సైన్సు గురింఛి చెప్పాయి. కాని, అలా యెముకలు భూమిలో వుంటే ఏమి జరుగుతుంది? ఏమి అరిష్టాలు జరుగుతాయి? అంటే, ఆ విషయాన్ని కూడా వాస్తు గ్రంథాలే చెప్పాయి.

| | |
|---|---|
| మోకాళ్ళ యెముకలుంటే, | పరస్థల ప్రయాణమట |
| తొడ యెముకలుంటే, | ఋణబాధ |
| నడుము యెముకలుంటే, | శత్రుద్వేషం |
| మర్మస్థానంలో యెముకలుంటే, | స్త్రీ నాశనం |
| బాహువులలో ఎముకలుంటే, | చెరసాల |
| తల యెముకలుంటే, | మరణం - అని ఒక గ్రంథం [19] |

18. (య దీశానే తు దిగ్భాగే మధురం రౌతి వాయసం
ధనం తత్ర విజానీయాద్భాగే వాయదధిష్ఠితే॥) వాస్తు సర్వస్వం - మా 15

19. మానసారం : సనత్కుమారవాస్తువు వాస్తు సర్వస్వం - 18, 19

| | |
|---|---|
| శిరస్సు స్థానంలో యెముకలుంటే, | అగ్నిభయం, ధనహాని |
| బాహువులలో ఎముకలుంటే, | ఇతర దేశయానం, మరణం |
| తొడలలో ఎముకలుంటే, | భార్య వ్యభిచారి, కీర్తినాశనం |
| అరచేతిలో యెముకలుంటే, | భయం, మరణం, రోగాలు |
| వీపున యెముకలుంటే, | భార్య వ్యభిచారిణి |
| పాదాలలో యెముకలుంటే, | పశునాశనం, రాజదండనం, సస్యనాశనం |
| కడుపులో యెముకలుంటే, | పాముకాటు |
| చెవులలో యెముకలుంటే, | అగ్నిభయం, మనస్తాపం, దుఃఖం |

అని మరో గ్రంథం.[20]

కాబట్టి, భూమి లోపలి యెముకల్ని ముందుగా త్రవ్వితీయాలని వాస్తువు చెపుతుంది. అవి యెక్కడ వున్నవో తెలిసేది యెలా?

గృహ యజమాని వేసే ప్రశ్నలలోని మొదటి అక్షరాన్ని బట్టి భూమిలోని ఎముకల్ని కనిపెట్టే ప్రక్రియ కూడా వాస్తు పండితులు అమలులో పెట్టారు. దీన్ని పస్తీ అనే పేరుతో కూడా పిలుస్తారు.

విశ్వకర్మ ప్రకాశిక శల్యాలను కనిపెట్టడానికి ఒక ప్రతిపాదన చేసింది. దాని ప్రకారం 3 x 3 = 9 గళ్ళు గీచుకోవాలి.

| ఈశాన్యం | | తూర్పు | | ఆగ్నేయం |
|---|---|---|---|---|
| | శ | అ | క | |
| ఉత్తరం | య | హ | చ | దక్షిణం |
| | ప | త | ట | |
| వాయువ్యం | | పడమర | | నైరుతి |

పై తొమ్మిది గళ్ళతో ఏ గడిలో వ్రేలు పెడితే ఆ అక్షరాన్ని బట్టి శల్యాలు ఆ దిక్కున వున్నట్లు తెలుసుకోవాలిట. ఒక్కో అక్షరం ఒక్కో వర్గానికి ప్రాతినిధ్యం వహిస్తుంది. అంటే 'అ' కారం అ ఆ ఇ ఈ ఉ ఊ ఋ ౠ ఎ ఏ ఐ ఒ ఓ ఔ లకూ, 'క' కారం క ఖ గ ఘ ఙ లకూ, 'చ' కారం చ ఛ జ ఝ ఞ లకూ,'ట' కారం ట ఠ డ ఢ ణ లకూ, 'త' కారం త థ ద ధ న లకూ, 'ప' కారం ప ఫ బ భ మ లకూ, 'య' కారం య ర

20. మహాకపిల పాంచరాత్రం-వాస్తు సర్వస్వం - 20

ల వ లకూ, 'శ' కారం శ ష స లకూ, 'హ' కారం హకూ ప్రాతినిధ్యం వహిస్తాయి. ఇక గృహ యజమాని ఆ అక్షరాలపైన వ్రేలు పెట్టడాన్ని బట్టి భూమిలో శల్యం యెక్కడ వుండేదీ నిర్ణయిస్తారన్నమాట.

అకారం – తూర్పున 1 1/2 హస్తాల లోతులో నరశల్యాలు
క కారం – ఆగ్నేయ దిశను 2 చేతుల లోతున నరశల్యాలు – రాజదండన
చ కారం – దక్షిణ దిశను మొల లోతున నరశల్యాలు – మరణం
ట కారం – నైరుతి దిశను 1 1/2 చేతులలోతున కుక్క శల్యాలు – ప్రవాసం
త కారం – పశ్చిమ దిశను 4 1/2 చేతులలోతు నరశల్యం – మరణం
ప కారం – వాయువ్య దిశను 4 చేతులలోతు మంత్రనాశన శల్యాలు
య కారం – ఉత్తరాన 4 1/2 చేతుల లోతు గాడిద శల్యాలు
శ కారం – ఈశాన్యాన 1 1/2 చేతులలోతు గోశల్యాలు – గో, ధననాశాలు
హ కారం – రొమ్ముల లోతున మనిషి తల వెంట్రుకలు, బూడిద – మృత్యువు
ఇలా అయెముకలన్నీ అశుభకారకాలే.

ఇది మాత్రమే కాదు, నామనక్షత్రాలను బట్టి, ప్రశ్న మొదటి అక్షరాన్ని బట్టి కూడా యీవర్గులు నిర్ణయిస్తారు. ఇందులో ఒక వాస్తు గ్రంథంలో చెప్పిన దానికి, మరో గ్రంథంలో చెప్పినదానికి ఎంతో భేదముంది. అయితే, అన్ని అమంగళాలనూ శాంతింపజేయడానికి ఎవరి మంత్రాలు వారికున్నాయి. ఒకరి మంత్రానికీ, మరొకరి మంత్రానికీ గిట్టదు. ఒకరి మతానికీ, మరొకరి మతానికీ గిట్టదు. ప్రతి ఒక్కరూ వాస్తు దోషాలతో గృహ యజమానిని భయపెట్టేవారే. ఆ భయం తొలగడానికి బ్రాహ్మణ్యం చేయించే క్రతువులకు లెక్కలేదు. అందుకే వాస్తువు నూటికి నూరుపాళ్ళు వంచనతో కూడిన వృత్తి అంటున్నాం.

# 4. కులం : ఎత్తు పల్లాల భాగోతం

హిందువుల వాస్తువు ప్రకారం ఇళ్లు మనుషులు కట్టుకోరు, కులాలు కట్టుకుంటాయి. పాళేలు, పేటలు కూడా కులాల ప్రకారమే కట్టుబడి అవతాయి. ఆ వాస్తువునే మనవాళ్లు సిగ్గులేకుండా శాస్త్రమంటారు. దాని ప్రకారమే ఇళ్లు కట్టించుకుంటా మంటారు. దాని నియమాలు తప్పితే ఇళ్లు పడగొట్టించుకుంటారు. ఈ "దౌర్భాగ్య వాస్తుశాస్త్ర దాస్యం" మన వారిని వదలిపెట్టగల రోజుకోసం మనం ఎదురుచూడాలి.

## స్థలాల యెత్తు పల్లాలు : కులాలు

కులవాస్తు పండితుల సిద్ధాంతాల ప్రకారం - దక్షిణం బారుకీ మెరకగా వుండి, ఉత్తరం బారుకీ పల్లంగా వుండే స్థలం బ్రాహ్మణులకు తగిన స్థానం.

పడమర బారుకీ మెరకగావుండి, తూర్పు బారుకీ పల్లంగా వుండే స్థలం క్షత్రియులకు శ్రేయస్కరం -

దక్షిణం బారుకీ పల్లంగా వుండి, ఉత్తరం బారుకీ మెరకగా వుండే స్థలం వైశ్యుల అభీష్టాన్ని నెరవేరుస్తుంది.

పడమర బారుకీ పల్లంగా వుండి, తూర్పు బారుకీ మెరకగా వుండే స్థలం శూద్రుల అభీష్టాన్ని నెరవేరుస్తుంది.

అంటే, మనుషులుగా మనుషులందరికీ శుభాన్ని చేకూర్చే వాస్తు పద్ధతి మన దేశంలో లేదు. అందుకే వాస్తువు శాస్త్రం కాదంటాం.

అది కుళ్ళు సమాజపాలకులు కుట్రతో, పాలితుల మీద చిన్నచూపుతో వారి నెత్తిమీద రుద్దిన నియమావళి. అందులో బ్రాహ్మణాధిక్యత నిర్ద్వంద్వంగా కనిపిస్తుంది. కొందరు వాస్తు పండితులు ఈ విచక్షణను ఈనాడు కూడా సమర్థించడానికి సమకట్టి తమ దుర్బుద్ధిని చాటుకుంటారు.

ఈ యెత్తు పల్లాల ప్రస్తావన మరల ఇక్కడ తేవడానికి కారణం వుంది. తూర్పు మెరకగా వుండి పడమర పల్లంగా వుండడాన్ని చాలా వాస్తు పద్ధతులు అంగీకరించవు. పడమర పల్లంగా వుంటే అశుభం, దరిద్రం, మరణం అంటూ వాస్తు పండితులు దీవనలిచ్చారు. అలాంటి స్థలాన్ని వాస్తువు శూద్రులకు ఎలా కేటాయించింది???

వరాహమిహిరుడు సైతం "బృహత్సంహిత"లో పై వాస్తు నియమాన్ని స్పష్టంగానే ఉటంకిస్తాడు.[1] అంతటితో సంతృప్తిపడక బ్రాహ్మణులకు ఏ దిక్కున నీటివాలున్నా ఫర్వాలేదట. క్షత్రియులకు ఉత్తరం తప్ప, మిగతా వైపులకు నీటి వాలుండవచ్చునట. వైశ్యులకు ఉత్తరం, తూర్పు తప్ప, మిగతా వైపులకు నీటివాలు వుండవచ్చునట. ఒక్క శూద్రులకు మాత్రమే పడమటివైపు పల్లంగా వుండే ప్రదేశం తప్ప, మిగతా వేవీ పనికిరావట! అంటే, శూద్రాది దిగువ వర్ణాలవారు నిత్యదారిద్ర్యంలో మ్రగ్గి నాశనం కావాలని వాస్తు పండితుల అభిప్రాయం !

## స్థలాల ఎత్తు పల్లాలు : ఫలాలు

ఇండ్ల స్థలాల ఎత్తు పల్లాల గురించీ, వాటి ఫలాల గురించీ వాస్తు పండితులు ఏకాభిప్రాయంలో వుండరు. అలా లేరంటేనే వాస్తువు శాస్త్రం కాదని తేలిపోతుంది.

ఇండ్ల స్థలాల ఎత్తు పల్లాల గురించీ, వాటి ఫలాల గురించీ "వాస్తు విద్య" అనే గ్రంథం ఇలా అంటుంది?

| | | |
|---|---|---|
| పడమర మెరక, తూర్పు పల్లం | గోవీధి | శుభం |
| వాయువ్యం మెరక, ఆగ్నేయం పల్లం | వైశ్వానర వీధి | కలహాలు |
| ఉత్తరం మెరక, దక్షిణం పల్లం | యమవీధి | కులనాశనం |
| ఈశాన్యం మెరక, నైరుతి పల్లం | భూత వీధి | రోగాలు |
| తూర్పు మెరక, పడమర పల్లం | జలవీధి | నాశనం |
| ఆగ్నేయం మెరక, వాయువ్యం పల్లం | నాగవీధి | ప్రశస్తఫలం |

1. ఉదగాది ప్లవమిష్టం విప్రాదీనాం ప్రదక్షిణేనైవ
విప్రః సర్వత్ర వసే దనువర్ణ మదేష్ట మన్యేషాం (బృహత్సంహిత)

| | | |
|---|---|---|
| దక్షిణం మెరక, ఉత్తరం పల్లం | గజవీధి | శుభం |
| నైరుతి మెరక, ఈశాన్యం పల్లం | ధన వీధి | వంశవృద్ధి[2] |

కాని, ఇండ్ల స్థలాల ఎత్తు పల్లాల గురించీ, వాటి ఫలాల గురించీ "శిల్ప రత్నం" అనే మరో వాస్తు గ్రంథం ఇలా చెప్పింది.

| | | |
|---|---|---|
| తూర్పు, ఆగ్నేయం పల్లం | పైతా వీధి | శుభం |
| ఆగ్నేయం, దక్షిణం పల్లం | అపథ వీధి | కలహాలు |
| దక్షిణం, నైరుతి పల్లం | శ్మశాన వీధి | కులనాశనం |
| నైరుతి, పడమర పల్లం | రోగవర్ధన వీధి | రోగాలు |
| పడమర, వాయవ్యం పల్లం | అసుర వీధి | నాశనం |
| వాయవ్యం, ఉత్తరం పల్లం | ప్రథమ వీధి | ప్రశస్త ఫలం |
| ఉత్తరం, ఈశాన్యం పల్లం | పుణ్యవీధి | శుభం |
| ఈశాన్యం, తూర్పు పల్లం | దీర్ఘాయుర్వీధి | వంశవృద్ధి. [3] |

ఈ ఎత్తు పల్లాల గురించీ, వాటి ఫలాల గురించీ "వాస్తుశాస్త్ర వివేకం" అనే గ్రంథం మరో విధంగా ఉదహరించింది :

| | |
|---|---|
| ఆగ్నేయం పల్లం, మిగతా మూడువిదిక్కులు మెరక | శ్యానకం–వినాశం, మరణం |
| నైరుతిపల్లం, మిగతా మూడువిదిక్కులు మెరక | శ్వముఖం– దరిద్రం |

---

2. వారుణోచ్చ సమాయుక్తా నీచమాహేంద్ర సంయుతా
గోవీధిరితి సాజ్ఞేయా వాస్తు జ్ఞాన విశారదైః॥
వాయూచ్చమగ్ని నీచంచ వీధిం వైశ్వానరీం విదుః
సోమోచ్చా యమనీచాచ యమ వీధీతి కధ్యతే ॥
ఈశోచ్చం నిర్భతి నీచం భూతలం భూతవీధికం
జల వీధిరితి ప్రోక్తా ఐంద్రోచ్చా నీచవారుణా ॥
ఆగ్నేయోచ్చం వాయు నీచం నాగవీధీతి కధ్యతే
యమోచ్చా సోమ నీచాచ గజవీధీతి కధ్యతే ॥
నిర్భత్యుచ్చమీశ నీచం ధనవీధీ త్యుదాహృతం ॥ (వాస్తు విద్య – వాస్తు శాస్త్ర వివేకం)

3. ఇంద్రా గ్న్యోరంతరాద్యంతరాతి నీచవశా త్క్రమాత్
పైతా మహాపధాభ్యాచ శ్మశానం రోగవర్ధనం ॥
అసురం ప్రధమం పుణ్యం దీర్ఘాయుశ్చేతి వీధయ ః
దుద్యుస్తే త్వంతరాలాభ్యా ః స్వనామసదృశం ఫలం (శిల్పరత్నం 3 – 30)

*ఈ వీధుల వివరాలు, ఫలాలు "వాస్తువిద్య" లో వివరంగా ఉన్నాయి.

| | | |
|---|---|---|
| వాయువ్యంపల్లం, మిగతా మూడువిదిక్కులు మెరక | | బ్రాహ్మణ్యం-కష్టాలు |
| ఈశాన్యం పల్లం, మిగతా మూడు విదిక్కులు మెరక | | ప్రశస్తం.[4] |

అయితే ఆగ్నేయం మాత్రమే యెత్తు, మిగతా మూడువిదిక్కులు పల్లంగా వున్నా దోషంకాదంటూ వాస్తుశాస్త్ర వివేకమే ఉదహరించింది :

| | | |
|---|---|---|
| ఆగ్నేయం మెరక | స్థావరం | శుభప్రదం |
| నైరుతి మెరక | స్థండిలం | దోషంకాదు |
| ఈశాన్యం మెరక | శాండులం | అశుభం.[5] |

ఈ ఎత్తు పల్లాల వాస్తునే పృష్టవాస్తు పేర్లతో మరోవిధంగా వ్యక్తీకరించబడింది. దాని ప్రకారం :

| | | |
|---|---|---|
| పడమర ఎత్తు, తూర్పు పల్లం | గజపృష్ట వాస్తు | ఆయురారోగ్య సంపదలు |
| తూర్పు ఎత్తు, పడమర పల్లం | దైత్యపృష్ట వాస్తు | ధన, పుత్ర, పశుహీనం |
| దక్షిణోత్తరాలు ఎత్తు | | పత్నీపుత్రులకు అశుభం |
| తూర్పు పడమరలు పొడవు | నాగ పృష్టవాస్తు | మృత్యువు |
| మధ్య ఎత్తు, చుట్టూ పల్లం | కూర్మపృష్టవాస్తు | ధనధాన్యసుఖాలు.[6] |

ఇండ్ల స్థలాల నీటి వాలును గురించి "వాస్తుశాస్త్ర వివేకం" మరో విధంగా కూడా అవివేకించింది :

| | |
|---|---|
| ఆగ్నేయం నీటివాలు | అగ్నిభయం, శత్రుభయం, పాపం |
| దక్షిణం నీటివాలు | ధనహాని, రోగాలు, వినాశం – దేవతాశక్తి కూడా క్షీణం |

---

4. నీచమగ్నౌ భవేదుచ్చం నిరృతీ శానవాయుషు
శ్యౌనకం నామ తద్వాస్తు నాశాయ మరణాయచ ॥
రుద్రాగ్ని వారుణే షూచ్చం నీచం స్యాన్నిరృతౌ తథా
శ్వముఖంనామ తద్వాస్తు దారిద్ర్యం కారయేత్ఫలం ॥
నిరృత్యగ్ని శివేషూచ్చం నీచం వాయౌభవేత్తదా
బ్రహ్మఘ్నం నామ తద్వాస్తు నేష్టం ప్రాణభృతాం సదా ॥

(వాస్తు శాస్త్ర వివేకం)

5. ఆగ్నౌ యది భవేయచ్చం నీచం నిరృతి రుద్రయోః
వాత నిఘ్నంచ తద్వాస్తు స్థావరం నామశోభనం ॥
ఉచ్చం నిరృతిభాగే స్యాన్నీచం జ్వలన వాతయో
రుద్ర నిమ్నంచ తద్వాస్తు స్థండిలం నామశోభనం ॥
రుద్రోచ్చం యదినిమ్నం స్యాత్ వహ్నౌ నిరృతివాతయోః
శాండులం నామ తద్వాస్తు ప్రాపయత్య శుభం సదా ॥ (వాస్తు శాస్త్ర వివేకం)

6. వాస్తు శాస్త్ర వివేకం – శ్లో 52 – 59

| | |
|---|---|
| నైరుతి నీటివాలు | మృత్యురోగాలు, ధనహాని |
| పడమర నీటివాలు | ధనధాన్య వ్యయం, శోకకారకం |
| వాయువ్యం నీటివాలు | శత్రుభయం, విరక్తి, వంశక్షయం, దుఃఖం, భయం, స్త్రీ సంతాన నష్టం, అజీర్ణ రోగాలు |
| ఉత్తరం నీటివాలు | పూజ్యం, లాభకరం, పుత్రపౌత్రాభివృద్ధి కామ, భోగ, ధనకారకం |
| ఈశాన్యం నీటివాలు | సౌభాగ్యం, అష్టైశ్వర్యాలు, ధర్మపరత |
| తూర్పు నీటివాలు | ఆయుర్దాయం, సంపద, బలం, రాజపూజ, విద్య, ధనం, పుత్ర పౌత్ర వృద్ధి, ఆరోగ్యం, దానశీలత. [7] |

అయితే, ఆపస్తంబుడు "గృహ్య సూత్రాల"లో వాస్తు పండితులందరినీ అల్లకల్లోలం చేసే బాంబు ఒకటి ప్రేల్చాడు. ఆయన చెప్పిన ప్రకారం నీటివాలు దక్షిణంగా

---

7. ఆగ్నేయ ప్లవకాభూమి రగ్నిదాహ భయావహా
శత్రు సంతాపదానిత్యం కదిదోగ్నిప్లవ ః స్మృతః॥
ధనహాని కరోనిత్యం రోగకృ ద్దక్షిణప్లవః
నశ్యంతి పురుషాస్త్రత్ర దేవతాచ ప్రణశ్యతి ॥
ప్రవర్తయే ద్గృహేపుంసాం రోగాంశ్చ మృత్యుదాయకాన్
ధనహానిం తథానిత్యం కురుతే నైరృతిప్లవా॥
పశ్చిమ ప్లవకాభూమి ర్ధనధాన్య వినాశినీ
శోకదాహ్యం కులం తత్ర యత్ర భూః పశ్చిమ ప్లవా॥
శత్రు కర్త్రీ విరాగాచ గోత్రక్షయ కరీతథా
గృహేచ కన్యాకాహంత్రీ సదాదుఃఖ భయావహా
భుక్తంన జీర్యతే తస్యమహ్యాం తత్రతు యోవసేత్
ఏతాన్ దోషానావహతి దోషదా వాయుదిక్ప వా॥
పూజ్యా లాభకరీ నిత్యం పుత్రపౌత్ర వివర్ధినీ
కామదా భోగదా చైన ధనదా చోత్తర ప్లవా ॥
నరసౌఖ్యసతీ సత్య సౌభాగ్యాది వివర్ధినీ
ధనార్థైశ్వర్య సంపన్నా ధర్మదేశాన దిక్ప్లవా॥
పూర్వప్లవాధరాశ్రేష్ట్యా హ్యాయుః శ్రీ బలవర్ధనే।
రాజపూజ్యా సదానందా ప్రాక్ప్లవాచే ద్భవేన్మహీ॥
సర్వసంపత్కరీ పుంసాం ప్రాసాదానాం విభూతిదా॥
సావిద్యా ధనసంపన్నా సర్వలోకహితా వహా
వినయాచార సంపన్న పుత్ర పౌత్రాది సంకులా
నీరోగా దానశీలాచ విశిష్ట జనసేవితా
పూర్వప్లవాతు యాభూమిః శోభనాసా ప్రకీర్తితా॥ (వాస్తు శాస్త్ర వివేకం)

గాని, పడమరగా గాని, లేక ఆ రెండు దిశల మధ్యభాగమైన నైరుతి దిశలోగాని వుండాలని అన్నాడు.[8] అంటే, ఆమూడు దిశలూ పల్లంగా వుండాలనే కదా అర్థం?

ఇలా దక్షిణం, పడమర, నైరుతి నీటివాలు వుండడం అశుభమని విశ్వకర్మ ప్రకాశిక అంటుంది. దాని ప్రకారం :

| | |
|---|---|
| తూర్పు పల్లం : లక్ష్మీ ప్రదం | ఆగ్నేయం పల్లం : శోకం |
| దక్షిణం పల్లం : మరణం | నైరుతిపల్లం : మహాభయం |
| పశ్చిమం పల్లం : కలహం | వాయువ్యం పల్లం : మృత్యువు |
| ఉత్తరం పల్లం : వంశవృద్ధి | ఈశాన్యం పల్లం : రత్నలాభం.[9] |

గృహాలు నిర్మించుకొనే స్థలం పడమర, దక్షిణం వైపుల కొంచెం మిర్రుగా వుంటే, గృహస్థుడికి భాగ్యం చేకూరుతుందని "కాలామృతం" అంటుంది.

అలా లేకపోతే దారిద్ర్యం కల్గుతుందిట.

అంతేకాక, మరో వ్యాసంలో మనం వుదహరించుకున్న రీతిగా, ఇళ్ళు నిర్మించుకొనే స్థలాలు ఆయా వర్ణ (కుల) క్రమానుసారంగా రంగు, రుచి, వాసన, కల్గిన భూములై వుండాలిట. అంటే, కులాల జాడ్యాన్ని ఎక్కడ పడితే అక్కడ దోపడానికి ప్రతి ప్రాచీన వాస్తు రచయితా ప్రయత్నించాడన్నమాట.[10]

ఉత్తరం, ఈశాన్యం, తూర్పు పల్లంగా వుండే విధానాన్ని స్థలం విషయం లోనే అనుసరించాలిగాని, ఇంటి విషయంలో ఆ నియమాన్ని అనుసరించకూడదనే వారు

---

8. దక్షిణా ప్రత్యక్ప్రవణ మగారావకాశ ముద్ధృత్య పాలాశేన
శమీమయేనవో దూహేనైతా మేవదిశ ముత్తరయో దూహతి॥
దీని వ్యాఖ్య యిలావుంది :
"తత్రయస్మి న్ప్రదేశే గారంచి కీర్షతం సో గారావకాశః॥
సదక్షిణా ప్రత్య క్ప్రవణోభవతి ॥
దక్షిణా ప్రతీచ్యోరంతారాలే నిమ్నో భవతి॥
ఏవం విధే దేశే గారం కర్తవ్య మిత్యర్థం ॥" (వాస్తుశాస్త్ర వివేకం)

9. పూర్వప్లవే భవేలక్ష్మీ ఆగ్నేయం శోకమాదిశేత్
యామ్యాంయాతి యమద్వార నైరుతేచ మహాభయం
పశ్చిమే కలహం కుర్యాద్వాయవ్యాం మృత్యుమాదిశేత్
ఉత్తరే వంశవృద్ధి స్యాదీశానే రత్న సంచయః ॥ (విశ్వకర్మ ప్రకాశిక: 2-15, 16)

10. ఈషత్పశ్చిమ దక్షిణోన్నత మహీ లక్ష్మీప్రదా నేతరా
సమ్యగ్గంధ సమన్వితా కనకదా దుర్గంధ యుక్తార్తిదా
క్షేత్రం శ్వేత మధాల్పరక్త మఖిలం పీతంచ కృష్ణం క్రమా
ద్విప్రాదౌర్మధుదం భవేచ్ఛ కటుకంతి క్తం కషాయం శుభం। (కాలామృతం)

కొందరూ, అనుసరించక తప్పదనే వారు కొందరూ వాస్తు పండితుల మధ్యనే వున్నారు. ఆయా దిక్కులు పల్లంగా వుండాలనే వారి నిర్ణయం ప్రకారం

| | |
|---|---|
| తూర్పు పల్లమైతే | వృద్ధి |
| పడమర పల్లమయితే | ధననాశనం |
| దక్షిణం ఎత్తయితే | ధన లాభం |
| ఉత్తరం ఎత్తయితే | వినాశనం. [11] |

కాని, సమరాంగణ సూత్రధారం ఇంటి ఎత్తు పల్లాల గురించి మరో విధంగా చెప్పింది. దాని ప్రకారం ఇంటి ముందు భాగం పల్లంగా వుండకూడదు. వెనుక భాగం మెరకగా వుండకూడదు. అలా వుంటే గృహ యజమానికి విరక్తి, వ్యసనం కల్గుతాయిట. [12]

ఏ వైపు సింహద్వారం (ముఖద్వారం) వుంటుందో అదే ముందు భాగమనీ, ఏ వైపు దొడ్డివాకిలి వుంటుందో అది వెనుక భాగమని కూడా సమరాంగణ సూత్రధారం నిర్వచించింది. [13]

అయితే ఉత్తర, ఈశాన్య దిక్కులకు ఇంటి నీరు ప్రవహించడం గృహ యజమానికి శుభకరమని కాలామృతం కూడా అంటుంది. [14]

ఇండ్ల యొక్క, ఇండ్ల స్థలాల యొక్క మెరకలు, పల్లాలు, వాటి ఫలాలు, కొంతవరకు చూచాం. ఇక యింటిలోపల ఏయే గదులు ఎందుకు వుపయోగించాలో, ఏయే వస్తువులు ఎక్కడ పెట్టాలో "కాలామృతం" ఈ విధంగా పంపిణీ చేసింది.

| | | |
|---|---|---|
| తూర్పు | : | స్నాన గృహం |
| ఆగ్నేయం | : | వంట యిల్లు |
| దక్షిణం | : | పడకటిల్లు |

---

11. స్యోదున్నతిః పూర్వనతే నారాణాం వాస్తే ధనం
దక్షిణ భాగతుంగే క్షయోధనాం వినతే
ప్రతీచ్యాం ఉచ్చైర్వినా శోధ్రున ముత్తరేతు (వాస్తుదీపిక)
12. అగ్రతశ్చ యదాహీనం పృష్ట తశ్చోచ్ఛ్రితం భవేత్
భవనం స్వామినోహ్యేశు విరాగ వ్యస నాయతత్ ॥ (సమరాంగణ, సూత్రధారం)
13. అగ్రతః పృష్టతః శబ్దౌ ద్వారేణ నియతౌగృహే
యతోద్వారం తదగ్రంస్యా త్పృష్టం పృష్ట ముదాహృతం ॥
(12, 13 సమరాంగణ సూత్రధారం - 20 అ)
14. ప్రాగీశాన్య కుబేరదేశ గళితం స్వక్షేత్ర తోయం శుభం.
(కాలామృతం- 240)

| | | |
|---|---|---|
| నైరుతి | : | ఆయుధ గృహం |
| పడమర | : | భోజన గృహం |
| వాయువ్యం | : | పశువుల గృహం |
| ఉత్తరం | : | ధనాగారం |
| ఈశాన్యం | : | పూజా గృహం |

| | |
|---|---|
| తూర్పు – ఆగ్నేయం మధ్యలో | పెరుగు కవ్వానికి |
| దక్షిణం – ఆగ్నేయం మధ్యలో | ధాన్యం రోలుకు |
| నైరుతి – దక్షిణం మధ్యలో | మలమూత్రాదులకు |
| నైరుతి – పడమర మధ్యలో | విద్యాభ్యాసానికి |
| పడమర – వాయువ్యం మధ్యలో | దుఃఖించడానికి |
| ఉత్తరం – వాయువ్యం మధ్యలో | క్రీడించడానికి |
| ఉత్తరం – ఈశాన్యం మధ్యలో | వైద్యానికి |
| తూర్పు – ఈశాన్యం మధ్యలో | ప్రసూతి గృహం. [15] |

ఇలా ఇంటి భాగాలను కేటాయిస్తే మంగళకరమట

అంటూ కాలామృతం కవ్వాలకు, రోళ్ళకు కూడా అవి వుండవలసిన ప్రదేశాలను నిర్ణయించింది. కాగా, ప్రసూతి గృహాన్ని తూర్పు – ఈశాన్యం మధ్యలో నిర్మించాలని కాలామృతం అంటుంటే, నైరుతి దిక్కున నిర్మించడం ఐశ్వర్యప్రదమని విశ్వకర్మ ప్రకాశిక అంటున్నది.[16]

15. ప్రాచ్యాం స్నానగృహంచ పాకసదనం వహ్నౌతు స్తుస్త్యాలయో
యామ్యాయా మథశస్త్ర సద్మదనుజే భుక్తాలయః పశ్చిమే,
వాయువ్యాం పశుమందిరం శుభకరం భండార వేశ్మోత్తరే
శైవేదేవ గృహం ప్రశస్త మఖిలం స్వస్వాయ కార్యం సదా ... (కాలామృతం253)
ఇంద్రాగ్న్యోరథ మంథనస్య సదనం ఘృతం యమాగ్న్యోర్గృహం
దైతే యాంతకయోః పురీషసదనం విద్యాగృహం మధ్యమే,
రక్షోవారుణ యోశ్చ రోదనగృహం తోయేశ వాయువ్యయో
ర్మధ్యే కామగృహం కుబేరమరుతో కుర్యాత్సదాభూపతి ... (కాలామృతం259)
కౌబేరీశ్వరయోశ్చ వైద్యభవనం శాక్రేశయోస్సూతికం ... (కాలామృతం260)

16. నైరుత్యాం సూతికాగేహం నృపాణాం భూతి మిచ్ఛతాం (విశ్వకర్మ ప్రకాశిక 2–98)

## ఎత్తు - పల్లాల భాగోతం :

తూర్పు పల్లమైతే శుభమని చాల వాస్తు గ్రంథాలు చెపుతున్నాయి. కాని, గృహ్యసూత్రాల ప్రకారం దక్షిణం, నైరుతి, పడమర వైపులు మాత్రమే పల్లంగా వుండాలి.

ఆగ్నేయం పల్లమైతే, కలహాలని "వాస్తు విద్య" చెప్పింది. కాని, వినాశనం, మరణం అని ఒకచోట, అగ్నిభయం, శత్రుభయం, పాపం అని మరొకచోట, "వాస్తు శాస్త్ర వివేకం" ప్రాచీనులను కోట్ చేసి చెప్పింది.

దక్షిణం పల్లమైతే కులనాశనమని "వాస్తు విద్య" అంటుంది. ధనహాని, 'రోగాలు, వినాశనం, జరగడమేకాక దేవస్థానాలు కూడా పూజార్హత కోల్పోతాయని "వాస్తుశాస్త్ర వివేకం" అంటుంది. మరణమని "విశ్మకర్మ ప్రకాశిక" చెపుతున్నది.

నైరుతి పల్లమైతే రోగాలని "వాస్తు విద్య", "శిల్పరత్నం" చెప్పాయి. దరిద్రమని ఒకచోట, మృత్యురోగాలని మరోచోట "వాస్తుశాస్త్ర వివేకం" చెప్పింది.

పడమర పల్లమైతే నాశనమని "వాస్తు విద్య" చెప్పింది. ధనవ్యయం, శోకం అని "వాస్తుశాస్త్ర వివేకం" చెప్పింది.

కాని, దక్షిణం - నైరుతి - పడమర పల్లంగా వుండడం శ్రేయస్కరమని గృహ్యా సూత్రాలు చెప్పాయి.

వాయువ్యం పల్లమైతే ప్రశస్తఫలమని "వాస్తు విద్య", నాశనమని "శిల్పరత్నం" చెప్పాయి. కష్టాలని ఒకచోట, శత్రుభయం, విరక్తి, వంశక్షయం, దుఃఖం, భయం, స్త్రీ సంతాన నష్టం, అజీర్ణరోగాలు అని మరోచోట "వాస్తుశాస్త్ర వివేకం" చెప్పింది.

ఉత్తరం పల్లమైతే శుభమని "వాస్తు విద్య", ప్రశస్త ఫలమని "శిల్పరత్నం", పూజ్యం, లాభకరం, పుత్రపౌత్రాభివృద్ధి, కామాన్ని - భోగాన్ని - ధనాన్ని చేకూరుస్తుందని "వాస్తు శాస్త్ర వివేకం", వంశవృద్ధి అని "విశ్వకర్మ ప్రకాశిక" అంటున్నాయి.

ఈశాన్యం పల్లమైతే వంశవృద్ధి అని "వాస్తు విద్య" చెప్పింది. ప్రశస్తమని ఒకచోట, సౌభాగ్యం, అష్టైశ్వర్యాలు, ధర్మపరత అని మరొకచోట ప్రాచీనులను కోట్‌చేసి "వాస్తుశాస్త్ర వివేకం" చెప్పింది.

ఆ విషయాలు అలా వుంచుదాం.

ఇంటి ఉత్తర, ఈశాన్య తూర్పు భాగాలు కూడా పల్లంగా వుండాలని మన వాస్తు పండితుల్లో చాలమంది అభిప్రాయం. ముఖద్వారం ఏవైపున వున్నా, ఈ నియమాన్ని మన వాస్తుపండితులు అనుసరిస్తున్నారు.

కాని, సమరాంగణ సూత్రధారంలో ఇంటి ముఖద్వారం ఎటువైపువుంటే, అటు వైపు మెరకగా వుండాలనీ, దొడ్డి వాకిలి వైపు పల్లంగా వుండాలనీ చెప్పింది.

అలా భిన్న తరహాలలో చెప్పిన వాస్తు గ్రంథాలలో ఏదిశాస్త్రం? ఏది అశాస్త్రం?

అందుకు ఆధారాలేమిటి?

అసలు ఏవైపు మెరక వుండాలి, ఏ వైపు పల్లంగా వుండాలి? అనే విషయం మనం యిల్లు కట్టుకొనే ప్రదేశం మీద ఆధారపడి వుంది. ఏవైపు నీటివాలు పెట్టుకోడానికి అభ్యంతరం వుండదో, ఏ వైపు నీటివాలు పెట్టుకొంటే సౌకర్యంగా వుంటుందో - దాన్ని బట్టి స్థలాల యెత్తు పల్లాలు కాని, ఇంటి నీటివాలుగాని నిర్ణయించుకోవాలి. ఫలానావైపే నీటివాలుగాని, సింహద్వారంకాని వుండాలనే నియమం విజ్ఞానశాస్త్రీయం కాదు. దానిని ఏ వంకతో సమర్థించజూచినా, అది నిలవదు.

పైగా "వాస్తుశాస్త్ర వివేకం" అనే గ్రంథం ఈశాన్యంలో కట్టడాలు చేయవచ్చునంటున్నది. నైరుతి లోపం తప్పంటున్నది. సర్వదిక్కులూ సమంగా వుండాలని వాస్తువు నిర్దేశిస్తున్నదని చెపుతున్నది.[17] కాని, మన వాస్తు ప్రభువులు స్థలాలకు, నీటివాలులకు దిక్కులను నిర్దేశిస్తున్నారు. గృహస్థులు వాస్తు "పిచ్చ" లోపడి నడమంత్రపు వాస్తుగాళ్ళ సలహాల మేరకు ఇళ్ళు కట్టించుకుంటున్నారు, పడగొట్టించుకుంటున్నారు.

హిమాలయాలకు దక్షిణభూభాగమంతా పల్లంగానేవుంది, వుంటుంది. అక్కడ కట్టుకొనే యిళ్లు ఉత్తరం మెరకగాను, దక్షిణం పల్లంగా వుండే భూముల్లో కట్టుకుంటారు. నీరు దక్షిణం వాలుకే పారుతుంది. అరేబియా సముద్రతీరానికి తూర్పున వుండే భూమి అంతా మెరకగానే వుంటుంది. అక్కడ యిళ్లు కట్టుకొనే వారు తూర్పు నుంచి పడమటి వాలుకే నీరు ప్రవహించేటట్లు చూచుకుంటారు. ప్రపంచంలో ఏ దేశాల్లోనైనా మెరకలోవున్న భూమినుంచి పల్లంలో వున్న నదులలోకి, సముద్రాలలోకి నీరు ప్రవహిస్తుంది. ఆ ప్రవాహాలను ఏ దిక్కులూ అడ్డుకోవు. కానీ, ఏ దిక్కుకు నీరు పారాలనేది స్థలాన్ని బట్టి వుంటుంది. కాని, నీటివాలును బట్టి ఫలాలుండవు. కాని, అలాంటి ఫలాలను వూహించేవారు ఎంతటి మోసకారులో, వారి నిర్ణయాలను శిరసావహించేవారు ఎంతగా వంచితులో ఒకసారి వెనక్కుతిరిగి ఆలోచించాలి.

17. వాస్తుశాస్త్ర వివేకం - పే - 147, 148

A/C.No. 93689

# 5. కూపవాస్తువు : కూపస్థ జ్ఞానం

ఈనాటి భారతదేశ జనాభా 100 కోట్ల దాక చేరింది. 60 సంవత్సరాల క్రిందట ఈ జనాభా ఇందులో మూడో వంతు కూడా లేదు. ఈ 60 సంవత్సరాల్లోనే ఈ జనాభా ఇంతగా ఎలా పెరిగింది?

ఇటీవలి కాలంలోనే శాస్త్ర విజ్ఞానం క్రొత్త పుంతలు త్రొక్కుతున్నది. రాక్షస వైద్యాలు వైదొలగుతున్నాయి. నూతన శాస్త్రీయ వైద్యాలు అందరి అందికలోకి వస్తున్నాయి. ఆరోగ్య వసతులు పెరుగుతున్నాయి. ఆహారోత్పత్తి రాసిలోనూ, వాసిలోనూ పెరుగుతున్నది. పంపిణీ సౌకర్యాలు కూడా కొంత మెరుగవుతున్నాయి. కరవు, కాటకాలు తరిగిపోతున్నాయి. మనిషి జీవన ప్రమాణం, ఆయుఃప్రమాణం పెరుగుతున్నాయి. కేవలం ప్రకృతి దయాదాక్షిణ్యాల మీద ఆధారపడి బ్రతికే రీతి మారింది. కష్ట సుఖాల కారణాలను కర్మకు ఆపాదించడం తగ్గుతున్నది. ఫలితంగా జనాభా విస్ఫోటనం ఒక్క భారతదేశంలోనే కాదు – ప్రపంచం మొత్తంలో గత 60 సంవత్సరాల్లో 200 కోట్ల నుంచి 600 కోట్ల దాక చేరుకుంది.

ఈ పెరుగుదలకు మంత్ర తంత్రాలు కారణం కాదు. జ్యోతిర్వాస్తువులూ, ఇతర మార్మిక ప్రక్రియాలూ కారణాలు కావు. అవి వేలాది సంవత్సరాలూగా ఉన్నాయి. రాక్షస వైద్యాలు తగ్గించలేని ప్రసూతి మరణాలనూ, బాలారిష్టాలనూ, ప్లేగూ, కలరా, స్ఫోటకం, క్షయ, మలేరియా లాంటి వ్యాధులనూ ఆధునిక వైద్య విజ్ఞానం తగ్గించగలిగింది. నివారించగలుగుతున్నది.

ఇటీవలే మనం 21వ శతాబ్దిలో ప్రవేశించాం. ఈ శతాబ్ది ఆరంభంలో ఈ దేశ జనాభా ఎంతో మన లెక్కలకు అందుతుంది. ఇక్కడ నుంచి 100 ఏండ్లు, 1000 ఏండ్లు, 2000 ఏండ్లు వెనక్కు వెళ్లి అప్పటి జనాభా ఎంత వుండేదో చక్రవృద్ధిని వెనక్కు నడిపి (చక్ర క్షీణత ప్రకారం) లెక్క కట్టవచ్చు. దానివల్ల అప్పటి ఈ దేశ జనాభా ఎంత వుండేదో, జనావాసాలు ఎన్ని వుండేవో, వాటి స్థాయియేమిటో అర్థమవుతుంది. ఇప్పటి ప్రపంచ జనాభా 600 కోట్లు. ఈ శతాబ్ది ఆరంభంలో 200 కోట్లకు లోపలే కాగా, 19వ శతాబ్ది ఆరంభంలో 100 కోట్లు మాత్రమే.

ఆనాడు జనాభా పెంచుకోవలసిన సమస్య వుంటే, ఈనాడు జనాభాను తగ్గించుకోవలసిన సంక్లిష్ట పరిస్థితి వుంది. అందువల్లనే, మనుషుల్ని మూకుమ్మడిగా చంపకుండానే జనాభాను తగ్గించుకొనే ప్రక్రియల్ని గురించి మనం ఆలోచిస్తున్నాం. రోగాల్ని చాలవరకు జయించాం. మరణాన్ని జయించే దిశలో ఆధునిక విజ్ఞానాభివృద్ధి వేగంతో మనమూ పరుగెడుతున్నాం. మార్మిక ప్రక్రియలకు దూరం కమ్మని ఆధునిక విజ్ఞానం మనకు సూచిస్తున్నది.

ఇదంతా ఎందుకు చెప్పుకొంటున్నాం? జనాభా ఇంత సమృద్ధిగాలేని రోజుల్లో బ్రహ్మవద్ద మొదలుపెట్టి ఆయా రుషులు వాస్తువును నేర్చుకున్నట్లు మన వాస్తు పండితులు చెపుతున్నారు. ప్రతిదాన్నీ దేవుడికి ముడిపెట్టడం మనవారి దౌర్భాగ్య వారసత్వం. అలా చెప్పిన వాస్తువంతా పురోహితవర్గ వాస్తువు, రాజరిక వర్గ వాస్తువు. రాజరికం అంతర్ధానమైనా పురోహితమతమూ, సమాజంపై ఆ వర్గ అజమాయిషీ ఇంకా కొనసాగుతూనే వుంది. అందుకు తార్కాణం జ్యోతిర్వాస్తువులే.

ప్రపంచంలో అనేక ప్రదేశాలలో వున్నట్లుగా భారతదేశంలో కూడా ఆనాటి రాజులంతా నగరాధీశులేకాని, రాజ్యాధీశులుకాదు. వర్ణ వాస్తువు ప్రకారం, నగర వాసుల ఇండ్లన్నీ వర్ణక్రమానుసారంగా వుండేవేమో! రుషులు జనపదాల్లో నివసిస్తూ నగరసమాజ పాలన కూడా చేస్తుండేవాళ్లు. రాజవైద్యులు, రాజ పురోహితులు, రాజ్యాంగ మంత్రులు, రాజజ్యోతిష్కులు అందరూ పురోహిత వర్గంవాళ్లే. నగరజీవనానికి వెలుపలవుండే వాళ్ళంతా ఆటవికులే. వారి నివాసాలు కూడా రుషుల నివాసాలవలె గుడిసెలే. అంటే, ఆనాడు వుంటే గింటే, నగరవాస్తువుండేదేమో! అది ఎంత పకడ్బందీగావుంటే, పురోహితవర్గ సమాజపాలన అంత కట్టుదిట్టంగా వుంటుంది.

దుర్గాలు, ప్రాసాదాలు కట్టుకోవడం మొదలు రాచరిక చర్యలన్నీ రుషుల "సలహాలవంటి ఆదేశాలపై" ఆధారపడి వుండేవి. అందుకు అన్ని రకాల భయాలనూ పురోహితవర్గం కల్పించి క్రోడీకరించి పెట్టింది. ఆ భయాలను ఆసరా చేసుకొని ఈనాటి వాస్తు ఛాందసులు బ్రతుకుతున్నారు.

**బూటకాలు - బీరాలు :**

అయోధ్యా నగరవాస్తు, లంకానగరవాస్తు, హస్తినాపురవాస్తు, ఇంద్రప్రస్థపుర వాస్తు, వైకుంఠపురవాస్తు అంటూ మన రామాయణ, భారత, భాగవతాది పురాణ గ్రంథాల్లో వర్ణించబడిన విధానాన్ని మన వాస్తు పండితులు వుదహరిస్తారు. మయసభ వాస్తు వైభవాన్ని ప్రస్తుతిస్తారు. ఉంటేగింటే, ఆనాటి మనుషులకు చిత్తభ్రమ కల్పించే విధంగా కొన్ని కట్టడాలుండేవో లేక వాటిని కవులు కల్పించారో కాని, అవి యెక్కడ ఉండేవో, ఇప్పుడేమైనాయో వాటి శిధిలావశేషాలు కూడా చారిత్రకులకు అందడంలేదు.

బాణాలతో, కత్తులతో, దుడ్డుకర్రలతో కొట్లాడుకున్న రామాయణ భారత యుద్ధాలు వాస్తవం కావడంకంటే, కల్పనలు కావడానికే యెక్కువ అవకాశం వుంది.

భారత యుద్ధంలో 18 అక్షౌహిణుల సైన్యం పాల్గొన్నట్లు కథలైతే వున్నాయి.[1] సైనిక బలాలమాట అటుంచి, ఆనాటి జనాభా మొత్తం అంతవున్నదా? అనేదే సందేహాస్పదం. అది ఎంత నిజమో, మయసభల్లాంటి విచిత్రకట్టడాలు కూడా అంతే నిజం.

---

1. అక్షౌహిణి అంటే మన నిఘంటువుల ప్రకారం 21,870 రథాలు 21,870 ఏనుగులు, 65,610 గుర్రాలు 1,09,350 కాల్బలం-

ఒక్కో రథానికి చోదకుడూ, యోధుడూ - ఒక్కో ఏనుగుకు మావటీడూ, యోధుడూ - ఒక్కో రథానికి కనీసం రెండు గుర్రాలూ అవసరమవతాయి. దానికి 18 రెట్లు చేస్తే భారతయుద్ధంలో పాల్గొన్నవారి సంఖ్య వస్తుంది.

| | |
|---|---|
| 21,870 x 18 = 3,93,630 రథాలు x 2 యోధులు | 7,87,320 |
| 21,870 x 18 = 3,93,660 ఏనుగులు x 2 యోధులు | 7,87,320 |
| 65610 x 18 = 11,80,980 గుర్రాలు - యోధులు | 11,80,980 |
| కాల్బలంలోని యోధులు 1,09,350 x 18 = | 19,68,300 |
| వెరసి మొత్తం చతురంగ బలాల్లో యోధుల సంఖ్య | 47,23,920 |

సైనిక బలమే 47 లక్షలకు పైన వుంటే, వారికి వంట - వార్పు - ఇతర సౌకర్యాలు చేకూర్చే సైనిక సహాయక బలమూ, ఇండ్ల వద్ద వున్న వాళ్ళ పెళ్ళాలు, బాలలు, వృద్ధులు, ఇతర జనాభా మొత్తం కలిసి ఎంత వుంటుంది? అంత జనాబా ఆనాడు వున్నదా? ఆనాటి వారి సైనిక బలంలో 3,93,660 ఏనుగులున్నవా? ఇంకా అశ్వదళంలోని 11,80.980 రథానికి 2 చొప్పున మొత్తం వారి సైన్యంలో 15,74,640 గుర్రాలున్నవా? 1600 సం॥ నాడు 10 కోట్లున్న భారత జనాభా ఇప్పటికి 200 కోట్లయింది. 1600 సంవత్సరం నుంచి భారతయుద్ధం(?) దాక వెనక్కు లెక్కవేస్తే ఆనాటి భారత జనాభా లక్షల్లోనైనా వుండేదో, లేదో!

## భూగర్భ మార్మిక పాండిత్యం :

మన ప్రాచీన వాస్తు విద్యావిశారదుల భూగర్భ మార్మిక పాండిత్యం గురించి శల్యవాస్తువు కొంత చెపుతుంది.

ఇక నీరు భూగర్భంలో ఎక్కడెక్కడ పుష్కలంగా దొరుకుతుందో వారి జలవాస్తు బూటక నిర్ణయాలలో మనం చూడవచ్చు.

బావి త్రవ్వించదలచుకున్న గృహయజమాని దైవజ్ఞుణ్ణి చేరి, ఏ దిక్కుకు ఎదురుగా నిలబడి ప్రశ్న వేస్తాడో, దాన్ని బట్టి ఫలం వుంటుందని "శిల్పాచార్య మతం" అంటుంది.

అంటే, నైరుతి దిక్కుకు చూస్తూ ప్రశ్నిస్తే, ఆ దిక్కున నీరు వుండదట. ఆగ్నేయ దిక్కున చూస్తూ ప్రశ్నిస్తే గృహయజమానికి మరణమట. మిగతా దిక్కుల్ని చూస్తూ ప్రశ్నిస్తే సమృద్ధిగా నీరు లభిస్తుందట.[2]

అంటే, నైరుతి, ఆగ్నేయ దిశలలో తప్ప – మిగతా అన్ని దిక్కులలోను బావి త్రవ్వించవచ్చునని తేలుతుంది.

## కాశ్యపమతం

"కాశ్యపమతం" బావి త్రవ్వకాన్ని దిక్కులతోకాక, కాలంతో ముడిపెట్టింది. గృహయజమాని దైవజ్ఞుణ్ణి ప్రశ్నించిన కాలానికి గల సంక్రమణల సంఖ్యను నక్షత్ర, తిథి, వారాల సంఖ్యలతో కలిపి, లబ్ధాన్ని 7 చేత హెచ్చించి 8 చేత భాగించగా వచ్చిన శేషాన్ని బట్టి బావిలో నీరు లభిస్తుందో లేదో, ఎలాంటి నీరు లభిస్తుందో అది చెపుతుంది.

| | |
|---|---|
| 1 శేషం వస్తే క్షారోదకం | 5 శేషం వస్తే మంచినీరు |
| 2 శేషం వస్తే నీరుండదు | 6 శేషం వస్తే మరింత మంచినీరు |
| 3 శేషం వస్తే రాళ్ళుంటాయి | 7 శేషం వస్తే కొద్దిగానీరు |
| 4 శేషం వస్తే కొద్దిగా నీరు | నిశ్శేషమయితే రాళ్ళు.[3] |

ఇలాంటి పిచ్చిశాస్త్రాన్ని ఆచరణలో పెట్టి చూడాలి.

---

2. కూపాద్యా రంభకాలే తుకర్తా యద్దిజ్ముఖోభవేత్
తద్దిక్ఫలం వదేత్సర్వం వాస్తుశాస్త్ర విశారదః
సంపృచ్ఛేద్యది దైవజ్ఞం కర్తా నైరృత్యసమ్ముఖః
తత్ఫలే జలహీనం స్యాస్తథా చాగ్నేయ సమ్ముఖః
తద్భూమావనలంజ్ఞేయంతథా వాయువ్య సమ్ముఖః
తత్స్థానే మృతిరేవ స్యాచ్చేష దిక్షుజలంస్మృతం ॥ (శిల్పాచార్య మతం C/o. వాస్తు సర్వస్వం)

3. సంక్రాంతి తారా తిథి వారసంఖ్యాసప్తాహతానంద విభాజితాస్యాత్
క్షారోదకం నిర్జలమశ్మ సంఘ మల్పాంబు మాధుర్యజలం క్రమాత్స్యాత్
స్వాదూదకం చాల్పతోయం శిలాసంఘమితి స్మృతం
పృచ్ఛకస్య ప్రశ్నకాలేవ దేద్దైవజ్ఞ సత్తమః ॥ (కాశ్యపమతం C/o.వాస్తు సర్వస్వం)

## బ్రహ్మవాస్తువు :

"బ్రహ్మవాస్తువు"లో నీటికోసం మరో పూజా ప్రక్రియ చెప్పబడింది. బావి త్రవ్వించదలచుకొన్న స్థలంలో ఒక అడుగులోతున చదరపుగుంట త్రవ్వాలట. దాని నిండుగా నీరుపోసి గంధ పుష్పాదులతో పూజించాలట. మరునాడు ప్రొద్దున లేచి చూచినపుడు ఆ గుంటలో నీరుంటే అక్కడ పుష్కలంగా నీరుంటుందనీ, బురద వుంటే చాల తక్కువ నీరుంటుందనీ తెలుసుకోవాలిట.[4]

గుంటలో నీరు మిగులుతుందో, బురద మిగులుతుందో తెలుసుకోడానికి పూజలెందుకు? సముద్ర ప్రాంతాల ఇసుకలో గుంట తీసి నీరు పోస్తే, నీరు పోసీ పోయగానే ఇంకిపోతుంది. బంకమట్టి వుండే ప్రాంతాల్లో గుంట తీసి నీరుపోస్తే నీరు సూర్యరశ్మికి ఆవిరై పోవలసిందేకాని, అసలు ఇంకనే ఇంకదు. ఏమి వాస్తు పాండిత్యం?

## బావి త్రవ్వకం దిక్కులు - ఫలాలు :

బావిని ఇంటికి ఏ వైపు త్రవ్వించాలో, దాని ఫలమేమిటో "విశ్వకర్మ ప్రకాశిక" చెప్పింది. నైరుతి, దక్షిణ, ఆగ్నేయ, వాయువ్య దిశలలో బావులు నిర్మించకూడదట. తూర్పు, ఉత్తరం, ఈశాన్యం, పడమర దిశలలో త్రవ్వించడం సుఖప్రదమట. అయితే, ఆయా దిక్కులలో బావుల త్రవ్వకం ఫలాలు ఎలా వుంటాయంటే,

| | | | | | |
|---|---|---|---|---|---|
| తూర్పు | - | పుత్రార్తి | పడమర | - | హితం |
| ఆగ్నేయం | - | అగ్నిభయం | వాయువ్యం | - | దారిద్ర్యం |
| దక్షిణం | - | వినాశనం | ఉత్తరం | - | ధనం |
| నైరుతి | - | స్త్రీ కలహం | ఈశాన్యం | - | పుత్రవృద్ధి.[5] |

కాళిదాసు చేత రచించబడిందంటున్న "కాలామృతం" ఈశాన్య దిశలో బావిని ప్రస్తావించనేలేదు. ఇంటి నీరు మాత్రమే ఉత్తర, ఈశాన్య, తూర్పుదిశలుగా ప్రవహించాలని అన్నది.

బావుల విషయం వచ్చేటప్పటికి ఇంటికి తూర్పు. పడమర, ఉత్తరదిశలలో మాత్రమే బావి త్రవ్వాలన్నది.

---

4. స్వేష్టప్రదేశే ఖనయే ద్వాదశాంగుర మానతః
చతురస్రం చతుర్దిక్షు గంధపుష్పాది భిర్యజేత్
నిశాదౌ పూరయేత్తోయం ప్రాతఃకాలే పరీక్షయేత్
స్థితంచే దక్షయం తోయం పంకేచాల్పజలం స్మృతం ॥ (బ్రహ్మవాస్తువు C/o.వాస్తు సర్వస్వం)

5. న పూర్వకం వారుణ దిక్స్థితం చ వివర్జయే స్మధ్యగృహస్థితించ
క్రమేణ గర్గాది వసిష్టముఖ్యాది శాస్త్రితానాంచ జలాశయానాం
పుత్రార్తి వహ్నేశ్చ భయం వినాశః స్త్రీణాం కలహర్భాహృధధేష్ట్యమేవ
నైస్వ్యం ధనం పుత్ర వివృద్ధిరుక్తా పూర్వాది దిక్షుఫలమే తదేవ॥ (విశ్వకర్మ ప్రకాశిక 8-15. 16)

అలా త్రవ్విన బావిలో రాళ్లు మొదలైనవి దర్శనమిస్తే లక్ష్మీప్రదమట, ఎముకలుంటే గృహయజమానికి మృత్యువు దాపురిస్తుందిట.[6]

కాబట్టి, ఈశాన్య దిశలో బావిని "కాలామృతం" అంగీకరించదు. తూర్పు, పడమర, ఉత్తర దిశలకు ఈశాన్యాన్ని కూడా చేర్చి, ఆ దిశలలో బావిని త్రవ్వ వచ్చని "విశ్వకర్మ ప్రకాశిక" సర్టిఫై చేసింది. కాని, దక్షిణంతోపాటు పడమర కూడా బావిని త్రవ్వరాదని అంటున్నది "మయమతం".[7] అంటే, కాలామృతం ఈశాన్యదిశ బావిని నిషేధిస్తే, మయమతం పడమరదిశ బావిని కూడా నిషేధిస్తున్నదన్నమాట.

ఇంటికి ఏ దిశలో బావిని త్రవ్విస్తే ఏమి ఫలం వుంటుందో "వాస్తు సంగ్రహం" ఇలా పేర్కొన్నది.

| | | | | | |
|---|---|---|---|---|---|
| ఈశాన్యం | - | పుష్టి | నైరుతి | - | మరణం |
| తూర్పు | - | సంపద | పడమర | - | సంపద |
| ఆగ్నేయం | - | పుత్రనాశనం | వాయువ్యం | - | శస్త్రబాధ |
| దక్షిణం | - | భార్యనాశనం | ఉత్తరం | - | అల్పసౌఖ్యం.[8] |

ఇంటికి ఎటువైపు బావి త్రవ్విస్తే ఏమి ఫలితం వస్తుందో "వాస్తు సర్వస్వం" మరొక శ్లోకాన్ని ఉదహరించింది.[9] దాని ప్రకారం - ఈశాన్యమొక్కటే బావికి అర్హం.

| | | | | | |
|---|---|---|---|---|---|
| తూర్పు | - | పుత్రనాశనం | పడమర | - | స్త్రీ వ్యభిచారం |
| ఆగ్నేయం | - | అగ్నిభయం | వాయవ్యం | - | నిష్ట |
| దక్షిణం | - | శత్రుభయం | ఉత్తరం | - | చింత |
| నైరుతి | - | స్త్రీ కలహం | ఈశాన్యం | - | పుత్రవృద్ధి |

---

6. ప్రాగీశాన్య కుబేర గళితం స్వక్షేత్రతోయం శుభం
సౌమ్య ప్రాగ్జలధీశ కూపఖననం కర్తుశ్చ లక్ష్మీప్రదం
పాషాణాది లభేత్సుఖంచఖననే స్యాదస్థిలాభోమృతి ః ॥ (కాలామృతం 6-240)
("ఉత్తర కాలామృతమే" కాళిదాసుచేత రచించబడింది కాని, "పూర్వ కాలామృతం" ఆయనచేత రచించబడినట్లు తోచదు. పై నుదహించిన శ్లోకం "పూర్వ కాలామృతం" లోనిది).

7. దక్షిణేత్వశుభం నింద్యాస్తథా వరుణ భాగకే ॥ (మయమతంC/o. వాస్తు సర్వస్వం)

8. పుష్టిం భూతిం పుత్రనాశనం పురంధ్రీనాశం
మృత్యుం సంపదం శస్త్రబాధాం
కించిత్సౌఖ్యం శంభుకోణాది కురా
త్కూపస్థానంసద్మ 'మధ్యే ర్థహానిం॥ (వాస్తు సంగ్రహం C/o.వాస్తు సర్వస్వం)

9. ప్రాచ్యాది దిక్స్థేసలిలే సుతహాని
శ్శిఖి భయం రిపుభయంచ
స్త్రీ కలహం స్త్రీ దౌష్ట్యం
నిష్టా చింతాత్మజ వివృద్ధి ః ॥ (వాస్తు సర్వస్వం - జలవాస్తు)

"వరాహమిహిరుడి సిద్ధాంతం" ప్రకారం ఆగ్నేయ దిశలో బావి త్రవ్వితే నీరు స్వల్పమై సంతాపాన్ని కల్గిస్తుందిట. నైరుతి దిశలో త్రవ్విస్తే పుత్రహాని జరుగుతుందిట. వాయువ్య దిశలో అయితే భార్య నాశనమవుతుందిట. మిగతా దిశలన్నీ శుభాన్ని చేకూరుస్తాయిట.[10]

ఈ దిక్కుమాలిన దిక్కుల వాస్తువును బట్టి కొన్ని ప్రాచీన గ్రంథాల్లో పేర్కొన్న బావుల దిశలను, వాటి ఫలాలను ఒక పట్టికలో చేర్చి చూస్తే, అవి ఏక ముఖంగా లేవనీ, పరస్పర విరుద్ధంగా చెప్పాయనీ తేలుతుంది.

| దిక్కు | వి. ప్రకాశిక | కాలామృతం | మయమతం | వాస్తుసంగ్రహం | వాస్తుసర్వస్వం | వరాహమిహిరుడు |
|---|---|---|---|---|---|---|
| తూర్పు | పుత్రార్తి | శుభం | ఆమోదం | సంపద | పుత్రనాశనం | శుభం |
| ఆగ్నేయం | అగ్నిభయం | అశుభం | ఆమోదం | పుత్రనాశనం | అగ్నిభయం | సంతాపం |
| దక్షిణం | వినాశనం | అశుభం | నిషిద్ధం | భార్యనాశనం | శత్రుభయం | శుభం |
| నైరుతి | స్త్రీ కలహం | అసుభం | ఆమోదం | మరణం | స్త్రీ కలహం | పుత్రహాని |
| పడమర | హితం | శుభం | నిషిద్ధం | సంపద | స్త్రీ వ్యభిచారం | శుభం |
| వాయవ్యం | దారిద్ర్యం | అశుభం | ఆమోదం | శస్త్రబాధ | నిష్ఠ | భార్యనాశనం |
| ఉత్తరం | ధనం | శుభం | ఆమోదం | అల్పసౌఖ్యం | చింత | శుభం |
| ఈశాన్యం | పుత్రవృద్ధి | అశుభం | ఆమోదం | పుష్టి | పుత్రవృద్ధి | శుభం |

4 దిక్కులూ, 4 విదిక్కులూ వున్నాయి కదా, వాస్తువు ప్రకారం? అందులో ఒకవైపు బావి త్రవ్వితే ఒక వాస్తు పద్ధతి అంగీకరిస్తుంది, మరో వాస్తు పద్ధతి అంగీకరించదు. పై పట్టికను చూస్తే ఆ విషయం అర్థమవుతుంది. అయితే, ఆకాశంలో బావిని త్రవ్వే మార్గం వుంటే, ఇక ఆ పని చేయమని వాస్తు విద్యావిశారదులు చెప్పాలి, అంతేనా?

మనం పైన ఉదహరించుకున్న గ్రంథాలు కొన్ని మాత్రమే. మరికొన్ని గ్రంథాల నుంచి కూడా ఇలాంటి దిక్కులు, బావులు, ఫలాలు ఉదహరించుకోవచ్చు. దానివల్ల పరిస్థితి మరింత గందరగోళమవుతుంది. వాస్తువును శాస్త్రమని భ్రమపడే వారు మరోసారి ఆలోచించాలి.

---

10. ఆగ్నేయే యదికోణే గ్రామస్య పురస్య వాభపతి కూపః
నిత్యం కరోతి దాహం జలమపితత్రైవ చంచలప్రాయం
నైర్రుతికోణే బాలక్షయం చ వనితా క్షయం చ వాయువ్యే
దిక్త్రయమేత త్త్యక్త్వాశేషాస్తు శుభావహాః ప్రోక్తాః ॥ (వరాహమిహిర C/o.వాస్తు సర్వస్వం)

## వాస్తురుషుల కూవస్థ కాలజ్ఞానం :

వాస్తు పురుషుడు నేలమీదకాని, నేల లోపలగాని లేడు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో అంధ వాస్తు పురుషులు మనచుట్టూ తిరుగుతూనే వున్నారు. వీరంతా మాట్లాడితే ప్రాచీన వాస్తు గ్రంథాలనుంచి శ్లోకాలు వల్లిస్తారు. బావి ఇంటికి ఏవైపు త్రవ్వాలనే విషయంలో ప్రాచీన వాస్తు విద్యావిశారదులు పడినపాట్లు చూచాం. ఆ బావులే ఎప్పుడు త్రవ్వాలో, ఎప్పుడు త్రవ్వకూడదో, వారి కూవస్థ కాలజ్ఞానం ఏమి చెపుతున్నదో చూద్దాం.

"విశ్మకర్మ ప్రకాశిక" బావి నిర్మాణం ఏనెలల్లో చేపడితే ఏమి ఫలం వస్తుందో ఇలా చెపుతుంది : ముందుగా నెలలతో ప్రారంభించి, తర్వాత నక్షత్రాలతో కొనసాగించి, వారాల్లో కూడా బావుల త్రవ్వకాలను, వాటి ఫలాలను పేర్కొన్నది.

| | | | | | |
|---|---|---|---|---|---|
| చైత్రం | – | కోశం | అశ్వయుజం | – | రోగం |
| వైశాఖం | – | ధాన్యం | కార్తీకం | – | దుఃఖం |
| జ్యేష్టం | – | భయం | మార్గశిరం | – | కీర్తి |
| ఆషాఢం | – | శోకనాశనం | పుష్యం | – | ధనం |
| శ్రావణం | – | సౌఖ్యం | మాఘం | – | అగ్నిభయం |
| భాద్రపదం | – | భయం | ఫాల్గుణం | – | యశస్సు.[11] |

అంటే ఆయా నెలల్లో బావి త్రవ్విస్తే ఆయా ఫలాలు వస్తాయన్నమాట.

రోహిణి, ఉత్తర, ఉత్తరాషాఢ, ఉత్తరాభాద్ర, పుష్యమి అనూరాధ, శతభిషం, మఖ, ధనిష్ట నక్షత్రాలు బావి త్రవ్వించడానికి ప్రశస్తమైనవట.[12] అంటే మిగతా నక్షత్రాలు బావి త్రవ్వకానికి నిషిద్ధమన్నమాట. తొమ్మిది నక్షత్రాలు బావి త్రవ్వించడానికి అనుకూలం. పద్దెనిమిది నక్షత్రాలు అందుకు వ్యతిరేకం.

ఆది, మంగళ వారాలలో బావి త్రవ్విస్తే, నీరు పుష్కలంగా లభిస్తుందట. (అంటే ఆ వారాలలో ఎడారులలో బావి త్రవ్వినా నీరు పుష్కలంగా లభిస్తుందేమో) శనివారం బావి త్రవ్విస్తే మురికినీరు దొరుకుతుందిట.[13] అంటే సోమ, బుధ, గురు,

---

11. కోశోధాన్యం భయం శోకనాశనం సౌఖ్యమేవచ
భయం, రోగం తథా దుఃఖం కీర్తిం ద్రవ్యాగ్నేయం భయం
శయ్యస్యక్రమ తే చైత్రమాసాదే తత్ఫలం స్మృతం ॥ (విశ్మకర్మ ప్రకాశిక 8 – 5)

12. రోహిణి చోత్తరాత్రీణి పుష్యమైత్రంచ వారుణం
విత్ర్యంచ వసుదైవత్వం భగణో వారి బంధనే
జలశోభాభవే త్సూర్యేభౌమేరిక్త వినిర్దిశేత్ ॥ (విశ్మకర్మ ప్రకాశిక 8–6)

13. విశ్మకర్మ ప్రకాశిక 8–6, 7

శుక్రవారాలలో బావులు త్రవ్విస్తే అసలు నీరే లభ్యం కాదేమో!

విశ్వకర్మ ప్రకాశికకు భిన్నంగా "వాస్తు సంగ్రహం" బావి త్రవ్వకాన్ని ఆరంభించడానికి ఇతర నక్షత్రాలు యోగ్యమని చెప్పింది : పూర్వాభాద్ర, పుబ్బ, కృత్తిక, విశాఖ, మూల, పూర్వాషాఢ, మఖ, ఆశ్రేష, భరణి – ఈ తొమ్మిది అధో ముఖ నక్షత్రాలట. ఈ నక్షత్రాలలో బావి త్రవ్వకం ఆరంభిస్తే జలం సమృద్ధిగా లభిస్తుందట.[14]

ఈ తొమ్మిది నక్షత్రాలలో బావి త్రవ్విస్తే నీరు పుష్కలంగా వుంటుందనీ, ఇతర నక్షత్రాలలో త్రవ్విస్తే నీరు లభించదనీ వాస్తు సంగ్రహం అంటున్నది. అయితే, మఖ నక్షత్రం ఒక్కటే వాస్తు సంగ్రహంలోను, విశ్వకర్మ ప్రకాశికలోను సమానంగా వుంది. ఇతర నక్షత్రాల విషయంలో ఈ రెండు గ్రంధాలకూ పొంతన కుదరడం లేదు.

వాస్తు సర్వస్వం మరొక శ్లోకాన్ని ఉదహరిస్తున్నది. దాని ప్రకాం చిత్త, స్వాతి, పునర్వసు, మృగశిర, మూల, అశ్వని, రోహిణి, హస్త, పుష్యమి, ధనిష్ట, శతభిషం, అనూరాధ, ఉత్తర, ఉత్తరాషాఢ, ఉత్తరాభాద్ర, రేవతి – ఈ 16 నక్షత్రాలలో బావినిత్రవ్విస్తే చాల మేలు జరుగుతుందట. అంతేకాక, శ్రవణ నక్షత్రంతో కూడిన మకర, కుంభ, మీన లగ్నాలలో, శుభగ్రహవారాలలో బావిత్రవ్వించినా మేలు జరుగుతుందిట.[15]

అంటే, గురు, బుధ, శుక్ర, సోమ వారాలలోనూ –

విదియ, తదియ, పంచమి, సప్తమి, దశమి, త్రయోదశి తిధులలోనూ బావి త్రవ్విస్తే మంచి జరుగుతుందని కూడా వాస్తు సర్వస్వం అంటుంది.

ఆది, మంగళవారాలలో బావి త్రవ్వకం ఆరంభించడం మంచిదని విశ్వకర్మ ప్రకాశిక అంటే, సోమ, బుధ, గురు, శుక్ర వారాలలో ఆరంభించడం మంచిదని వాస్తు సర్వస్వం అంటుంది. ఇది శాస్త్రమా?

శ్రవణం, అనూరాధ, ధనిష్ట, ఉత్తర, రోహిణి, శతభిషం బావి త్రవ్వకానికి మంచి నక్షత్రాలని జలార్గళ శాస్త్రమంట్నునది.[16]

వివాహ ప్రశస్తాలైన రేవతి, ఉత్తర, ఉత్తరాషాఢ, ఉత్తరాభాద్ర, రోహిణి, హస్త, మఘ, స్వాతి, మృగశిర, అనూరాధ, మూల నక్షత్రాలలోను, శ్రవణం, ధనిష్ట, శతభిషం,

---

14. అజైక పాద్భాగ్య వహ్ని విశాఖా సురతారకాః
పూర్వాషాఢా మఘాశ్రేషాయామ్యాఖ్యా స్యురధోముఖాః.
వాపకూప తటాకా నామారంభే సుఖదాస్మృతాః॥ (వాస్తు సంగ్రహం C/o.వాస్తు సర్వస్వం)

15. చిత్రాస్వాతి పునర్వసూ మృగశిర మూలాశ్వినీ రోహిణీ
హస్తః పుష్యధనిష్టకే శతభిష జ్మిత్రోత్తరా, రేవతీ
ఏతేషు శ్రవణాన్వితే చమకరేలగ్నే చ కుంబేఝుషే (వాస్తు సర్వస్వం)

16. శ్రవణాశ్చానూరాధా తిష్యధనిష్టోత్తరాణి రోహిణ్యః
శతభిషగి త్యారంభే కూపానాం శస్యతే భగణః ॥ (జలార్గళ శాస్త్రం వా.స)

పునర్వసు, అశ్వని, పుష్యమి నక్షత్రాలలోను తటాకాదులు నిర్మించడం సుఖమని ముహూర్తమార్తాండం అంటుంది.[17]

బావులు ఏ దిశలలో త్రవ్వించాలో ఒక ప్రాచీన గ్రంధానికీ, మరో ప్రాచీన గ్రంధానికీ ఏకీభావం లేదు.

బావులు ఏ తిధి నక్షత్ర వారాలలో త్రవ్వించాలో కూడా అలానే వాటి మధ్య ఏకీభావం లేదు.

అయితే, నీరు యెక్కడ లభిస్తుందో తేలాలి కదా? అప్పుడు కదా బావుల్ని త్రవ్వించే పని చేపట్టేది?

నేలలో నీరు లభ్యమయ్యే ప్రదేశాన్ని కనుగోడానికి "మయమతం" ఒక చిక్కు పద్ధతిని ప్రతిపాదించింది. దీని ప్రకారం 9 గదుల చదరాన్ని గీసి

| | |
|---|---|
| ఈశాన్య, ఉత్తర, వాయువ్య గదులలో | 8,3,4 |
| ఆగ్నేయ, దక్షిణ, నైరుతి గదులలో | 6,7,2 |
| తూర్పు, పడమర, మధ్య గదులలో | 1,5,9 |

అంకెలు వేసి, వాటికి పూజ చేసి, ఆ అంకె స్థానానికి ఏ గ్రహం సరిపోతుందో – దాన్ని బట్టి ఫలం చెప్పాలిట. ఆ విధానాన్ని అనుసరిస్తే నేలలో నీరు ఎక్కడ, ఎంత లోతున, ఏ ప్రమాణంలో లభ్యమవుతుందో – బావిలో ఏ రకమైన రాళ్ళు ఎక్కడెక్కడ తటస్థిస్తాయో కూడా చెప్పవచ్చునట.[18]

వాస్తు పిచ్చి ముదరడ మొక్కటేకాదు, అసలు వాస్తువే పిచ్చి, ఆ పిచ్చిని ప్రాచీనులు జలవాస్తువును గురించి చెప్పిన మాటలలో కొంత చూచాం. ఆ మాటలలో చాలూ మూలాలేదు, దారీ డొంకా లేదు. ఎవడికి తోచిన మార్మిక పటాటోపాన్ని వాడు ప్రదర్శించాడు. అవి అన్నీ అమాయకుల్నీ, అవిజ్ఞానుల్నీ వంచించడానికి చెప్పిన బులిబుచ్చికాయమాటలే. దైవజ్ఞులు వాస్తవజ్ఞులుకాదు – వారు అజ్ఞులూ, వంచకులూను. ఆ అర్థాన్నే వారి టక్కరిమాటలు, ప్రక్రియలు సార్థకం చేస్తున్నాయి. వారి జ్యోతిర్వాస్తు మర్మ ప్రక్రియలు శాస్త్రం పేరున కొనసాగడం మన దౌర్భాగ్యం.

భూమిలో నీరు ఎక్కడ దొరుకుతుందనేదానికి "మయమతం" పేర్కొన్న పిచ్చి పద్ధతిని పైన చూచాం. అధునిక వంచకులు కొందరు బయలుదేరి డౌజింగ్ పేరుతోను,

17. ఉద్వాహ రిక్షహరి త్రయాదితి హాయేజర్ క్షైస్తటాకాదయో
జ్ఞే జ్యాక్షైస్తనుగ్రెస్సితే దశమగే సిద్ధ్యంతి సద్వాసరే ॥
(ముహూర్తమార్తాండం C/o వాస్తు సర్వస్వం)

18. అష్టౌ చత్రీణి చత్వారి ఏకపంచ నవైవచ
రస సప్తకరశ్చైవ మయేన పరిభాషితం ॥ (మయమతం – వాస్తుసర్వస్వం)

డోలకం పేరుతోను భూజలాన్ని పసికట్టగలమని దంబాలు పలుకుతున్నారు.

శాస్త్రం పేరుతో ఆ మార్మిక ప్రయోగాలతో వ్యాపారం చేస్తున్నారు. చివరకు వంచన కూడా వ్యాపారమై కూర్చుంది.డౌజింగ్ ప్రక్రియలో ఇంగ్లీషు అక్షరాలలో Y ఆకారం గల పంగాల పుల్లనో, లేక అదే ఆకారంగా వంచబడ్డ తీగనో రెండు బొటన వ్రేళ్ళ మధ్య రెండు పై కొనలను పట్టుకొని తిరుగుతారు. ఆ పుల్ల ఎక్కడ తలక్రిందులవుతుందో అక్కడ త్రవ్వితే నీరు లభ్యమవుతుందనేది డౌజింగ్ ప్రక్రియ.

ప్రపంచంలో సముద్రతీర ప్రాంతమంతటా నీరు సాధ్యమైనంత పై భాగాన లభ్యమవుతుంది - అలానే నదీతీర, పర్వత దరీ ప్రాంతాలలో కూడా; ఈ పంగాల పుల్ల ప్రయోగం వాస్తవమయితే అది ఆ ప్రాంతాలంతటా క్రిందికి వాలి వుండాలి కాని, పైకి లేవకూడదు. మోసపోయే వారున్నపుడు మోసం చేయడానికి ఏదో ఒక మార్గాన్ని ఎన్నుకుంటారు వంచకులు.

ఈ మధ్య డోలకం (పెండ్యులం) ప్రయోగం ఒకటి బయలుదేరింది. ఆ పేరుతో పుస్తకం ఒకటి వ్రాసి "పెండ్యులం సర్వరోగ నివారిణి - సర్వశుభదాయిని" అంటూ ఎ.ఆర్. హరి అనే ఆయన బెంగుళూరులో పెండ్యులాల తయారీ పరిశ్రమపెట్టి పెండ్యులాల వ్యాపారం కూడా సాగిస్తున్నాడు. ముమ్ముందు ఇది బి.వి.రామన్‌గారి జ్యోతిషం వ్యాపారాన్ని కూడా మింగివేయవచ్చు.

ఇందులో సన్ననిదారం క్రింది కొనకు చిన్న బరువును కట్టి, చదరపు దిమ్మకు వ్రేలాడదీస్తారు. అదే పెండ్యులం అంటే. దాన్ని పట్టుకొని నడుస్తుంటే, క్రింది బరువు వూగడం ప్రారంభిస్తుంది. ఆ వూపు యెంత యెక్కువైతే అక్కడ అంతగా నీరున్నట్లు పెండ్యులం నిర్ణయం చేస్తుందన్నమాట. ఈ పెండ్యులం మానవ జీవితంలోని అన్ని కార్యకలాపాలకూ, శుభాశుభాలకూ పనికి వస్తుందని పెండ్యులిస్టు ఇంగ్లీషులో ఒక పుస్తకమే వ్రాశాడు. [19] ఇంగ్లీషు చదువుకున్న అవిద్యావంతులలో యెక్కువశాతం యిలాంటి ప్రలోభాలకు లొంగిపోతారని బహుశ అతనికి తెలిసి వుంటుంది. వారే కదా, యుక్తీకరణ ధోరణి తో తేలికగా మోసపోయేదీ, ఇతరులను మోసగించేదీని, ఇలాంటి మార్మికప్రక్రియల్ని ఎదుర్కొని, వాస్తవికతను వెల్లడించడమే ఇంతకాలంగానూ విజ్ఞానశాస్త్రం చేస్తున్న కృషి. అయినా, ప్రజల వివేకాన్ని ప్రక్కదారి పట్టించడానికి అలాంటి మార్మిక ప్రక్రియల్ని కనుక్కుంటూనే వుంటారు.

కాని, డౌజింగు, పెండ్యులం చూపే నీటిదారి, వాస్తువు చూపిన నీటి దారికి భిన్నమైతే వాస్తుపండితులిక తల గోక్కోవాలా? లేక వారితో తల పడతారా? ఇద్దరు వంచకుల మధ్య యుద్ధం సాగితే, ఆ తమాషా యెలా వుంటుందో చూడాలి మరి!

---

19. Mysterious Powers of the Pendulum by A.R. Hari

# 6. గృహస్థులు - వాస్తు పండితులు

స్వంత స్థలం కలవారు తమ స్థలంలోనే యిల్లు కట్టుకుంటారు. స్థలసేకరణ చేయవలసివస్తే చతురస్రంగానో, దీర్ఘచతురస్రంగానో వుండే స్థలాన్ని కొనుక్కుంటారు. తమకు అనువనితోస్తే, మరొక ఆకారం గల స్థలాన్ని కొనుక్కుంటారు. అందులో ఏనుగు, ఎద్దు, త్రిశూలం, లింగం, కుండ ఆకారం గల స్థలాలు వున్నవా, లేవా అని చూడరు. స్థలాలకు పాము, కప్ప, గాడిద, కాకి, గుడ్లగూబ ఆకారాలుండవు. త్రికోణంగా గాని, బహుకోణంగా గాని తమకున్న స్థలాన్ని వదలి ఎవ్వరూ ఇల్లు కట్టుకోరు.

ప్రాచీనులు ఆకాశంలోని నక్షత్రాలను గుమిగూడ్చి, వాటికి పిచ్చి పిచ్చి ఆకారాలను కల్పించారు. అదే తరహాలో నేలమీది స్థలాలకు కూడా ఏవేవో ఆకారాలను కల్పించుకొని తమ భయ సందేహాల మార్మికతను వాటిలోకి చొప్పించారు. వాస్తు పండితులు వదలుకొమ్మని చెప్పిన స్థలాలేవీ వదలుకొనే వెర్రిబాగులవాళ్ళు ఈనాడులేరు. స్థల ఆకారాన్ని బట్టి ఇంటి ప్లానింగు వేసుకోవచ్చు. స్వయంగాకాని, ఇంజనీరింగ్ సలహాల ప్రకారంకాని ఆ పని చేయవచ్చు. తమ స్థలాకారంలో ఎవ్వరూ పాముల్నీ, కప్పల్నీ, కాకుల్నీ, గుడ్లగూబల్నీ చూడరు.

వాస్తువులో నమ్మకం వున్నవాళ్ళు స్థలాల కొనుగోలులో ఈశాన్యం మిగులున్నదా, లేదా అని చూస్తారు. ఈశాన్యం తరుగుంటే, కొనడానికి వెనుకాడుతారు. వాళ్ళయినా, స్థలం రంగు, రుచి, వాసన చూడరు. కులాలనుబట్టి స్థలాలను ఎంపికచేసుకోరు.

కాని, ఇల్లు కట్టుకున్న తర్వాత కుటుంబంలో ఏదైనా అశుభం తొంగిచూస్తే, ఆ వ్యవహారంలో ఇక వాస్తు పండితులు చొరబడతారు. అశుభాలకు కారణాలు వెదకుతారు. ఇంటి స్థలంలోనో, కట్టుబడిలోనో వాటిని చూస్తారు. ఇంటి యజమానికి చూపిస్తారు.

ఈశాన్యం మిగులు లేదంటారు. ఆగ్నేయం పెరిగిందంటారు. ఉత్తరం, ఈశాన్యం, తూర్పు నీటివాలు లేదంటారు. ఈశాన్యంలో ఏ చిన్న నిర్మాణమున్నా, ఈశాన్యం బరువెక్కిందంటారు. నైరుతిలో బరువు పెట్టాలంటారు. ఆగ్నేయ, నైరుతి, దక్షిణ, పడమర, వాయువ్యాలు పల్లుగా వున్నాయంటారు. వీధిపోటో, స్తంభంపోటో వున్న వంటారు.

ఇంటి కట్టడంలో మార్పులు చేయాలంటారు. వాకిళ్ళు మార్పిస్తారు. కిటికీలు మార్పిస్తారు. వాటిని వీటిగా, వీటిని వాటిగా మార్పిస్తారు. కొన్నిటిని మూయిస్తారు. కొన్ని గోడలు పడగొట్టిస్తారు. మరికొన్ని గోడలు కట్టిస్తారు. ఇంటి లోపలి గదుల్ని మార్పిస్తారు.

ఈశాన్యంలో బావి లేకపోతే గొయ్యి తీయిస్తారు. మరుగుదొడ్లు మార్పిస్తారు. రోళ్ళు, రోకళ్ళు, తిరగళ్ళు, చల్లకవ్వాలు, ఎక్కడెక్కడ పెట్టుకోవాలో నిర్దేశిస్తారు. డబ్బు ఏ మూల దాచుకోవాలో ఆదేశిస్తారు. మంచాలు, కంచాలు ఏయే గదులలో వుంచుకోవాలో సూచిస్తారు.

ఏ గదులలో ప్రసవించాలో, ఏ గదులలో ఏడ్వాలో చెపుతారు. కుటుంబ పెద్ద, ఇతర కుటుంబీకులు ఏయే గదులలో శయనించాలో, తలాపి యెటుపెట్టుకోవాలో సలహా యిస్తారు.[1]

---

1. ప్రాచ్యాం స్నానగృహంచ పాకసదనం వహ్నౌతుసుప్త్యాలయో
యామ్యాయా మథకస్త్రసద్మ దనుజే భుక్త్యాలయః పశ్చిమే
వాయువ్యాం పశుమందిరం శుభకరం భండారవేశ్మోత్తరే
శైవే దేవగృహం ప్రశస్త మఖిలం స్వస్వాయ కార్యం సదా (కాలామృతం. 6-27)
ఇంద్రాగ్న్యోరథ మంథనస్య సదనం ఘృతం యమాగ్న్యోర్గృహం
దైతేయాంతకయోః పురీషసదనం విద్యాగృహం మధ్యమే
రక్షోవారుణ యోశ్చ రోదనగృహం తోయేశవాయువ్యయో
ర్మధ్యేకామగృహం కుబేరమరుతోః కుర్యాత్సదా భూపతి (కాలామృతం 6 -28)
కౌబేరీశ్వరయోశ్చ వైద్యభవనం శాక్రేశయోస్సొతికం
జ్యేష్ఠ భ్రాతృ పితృవ్యమాతృభవనం స్వస్మాద్యమే పశ్చిమే
శాలానా ముపరిస్థి తేషు భవనేష్వేవం విచింత్యం బుధైః
రత్యుచ్చంనహి నాతినీచ మథవా సామ్యం గృహంకారయేత్॥ (కాలామృతం 6-29)

ఇంటిలోపల, వెలుపల ఎక్కడెక్కడ ఏయే వసతులు యేర్పరచుకోవాలో ఇంటివారికి తెలుసు. కాని, వారికేమీ తెలియనట్లు వాస్తు పండితులు భిన్న సూచనలిచ్చి వసతులు మార్పిస్తారు. ఇంటి ముందు, వెనుక, ప్రక్కల ఏయే చెట్లు పెంచుకోవాలో - ఉన్నవాటిలో వేటిని పీకివేయాలో కూడా వాస్తు పండితులు చెపుతారు. ఇలా చెప్పుకొంటూపోతే, వాళ్ళు సూచించే మార్పులు ఇన్నీ అన్నీ కాదు. అన్నిటికీ ప్రమాణాలుగా వాళ్ళు సంస్కృత శ్లోకాలనో, వేమన పద్యాలనో దంచుతారు. నిజానికి, ఈ వసతులన్నీ మహాసంపన్నుల భవంతులకు చెందినవే.

వీటిన్నిటికి తోడు గ్రహ, నక్షత్ర, రాసి, మాస, తిథి, వారఫలాలను కూడా వాస్తువుకు సంధిస్తారు. వాస్తు పురుషుడికీ, విఘ్నేశ్వరుడికీ, ఇతర దేవతలకూ పూజా పురస్కారాలు చేయిస్తారు, బ్రాహ్మణులకు దానా లిప్పిస్తారు.

ఇంటి యజమానిని పీల్చి పిప్పి చేస్తారు. పిప్పి కావడానికి, గృహయజమాని సిద్ధపడతాడు. వాస్తు శిల్పి వంచనా, గృహయజమాని ఆశాభయాలూ సరిసమానంగా ప్రయాణిస్తాయి. అదే వాస్తువంటే - ఈ తిప్పల భాగోతాన్నంతా వాస్తు పండితులు "శాస్త్రం" పేరుతో సాగిస్తారు. ఆ భాగోతంలో వారి కుక్షింభరిత్వమే ప్రధానపాత్ర వహిస్తుంది.

వాస్తు కుక్షింభరిత్వంతో పాటు జ్యోతిష కుక్షింభరిత్వం కూడా కాడి కలిపి గృహస్థుల్ని వేధిస్తుంది. గ్రహ వారాలతో ప్రారంభించి, మాస తిథులతో పయనం సాగించి, నక్షత్రాలతో, రాసులతో జ్యోతిషం పరాకాష్ట నందుకుంటుంది.

మన జ్యోతిష్కులు మాట మాట్లాడితే గ్రహ నక్షత్రాదుల పేర్లు ఘనంగా వాడుకుంటారు. ఆదిమ ఖగోళ విజ్ఞానం అధారంగా అల్లికైన గిజిగాడుగూడునే వారు ఆశ్రయిస్తారు. దానికీ, అధునిక ఖగోళ విజ్ఞానానికీ పోలికేలేదు. ఖగోళాల గురించి ప్రాచీనులకు లభించిన సమాచారం చాల తక్కువ. అదీన్నీ తప్పులతడక. అంతకంటె ఎక్కువ సమాచారాన్ని సేకరించడానికి వారికి అవకాశం లేదు. తమకు అందిన స్వల్ప సమాచారాన్ని వారు మార్మిక మాయాజాలంలో ఇరికించారు. ఒక్క భారతీయులకే కాదు, ప్రాచీన కాలంలో కొంత వైజ్ఞానికంగా పెంపొందిన ప్రపంచ దేశాలన్నింటిలోనూ దాదాపు ఇదే పరిస్థితి వుంది.

## ఖగోళ విజ్ఞానంలో కొత్త మలుపు

కోపర్నికస్ భూకేంద్ర సిద్ధాంతాన్ని బ్రద్దలు కొట్టాడు. సూర్యకేంద్ర సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. గెలెలియో దూరదర్శినిని కనుగొన్నాడు. దూర దూరంగా వున్న ఖగోళాలను దగ్గర దగ్గరగా చూడడానికి అవకాశం కల్పించాడు.

ఈ రెండు ఆవిష్కరణలతో ఖగోళ విజ్ఞానం క్రొత్త పుంతలు త్రొక్కడం ప్రారంభించింది. గణితం, భౌతిక పదార్థ విజ్ఞానం, రసాయన విజ్ఞానం, ఇంకా బహుముఖ విజ్ఞానాన్ని తోడు చేసుకొని ఖగోళ విజ్ఞానం ఎల్లలులేని విధంగా పెంపొందుతూ వచ్చింది. ఇంతా జరిగింది 450 సంవత్సరాల కాలం లోపలే. అనాదిగా వున్న ఖగోళ విజ్ఞానం ఎదుగూ బొదుగూ లేకుండా జ్యోతిష కబంధ హస్తాలలో నలిగిపోయింది.

## జ్యోతిషం మాడు పగిలింది

నిజానికి సూర్యకేంద్ర సిద్ధాంతంతో జ్యోతిషం మాడు పగిలింది. వారాలూ, తిథులూ, మాసాలూ ఎగిరిపోవలసి వుంది. నక్షత్రాలూ, రాసులూ ఎగిరి పోవలసి వుంది. ఘడియలూ, ముహూర్తాలూ ఎగిరిపోవలసి వుంది. కాని, వాటిని ఎగిరి పోనీయకుండా జ్యోతిష్కులు అదిమి పట్టుకున్నారు. వారి మార్మిక ప్రక్రియల్లో అవి ప్రధానాంశాలు. మనిషి పుట్టింది మొదలు చచ్చేవరకూ ఏ కార్యక్రమాలు చేయాలన్నా హిందువులు అంగాలులేని పంచాంగం ఆధారంగా మంచి చెడ్డ ముహూర్తాలను లెక్కిస్తారు. అందుకు జ్యోతిష పండితుల్ని ఆశ్రయించడం సాధారణ ప్రజల అలవాటు.

ఇక జ్యోతిష పండితుల విషయమందామా? ఈనాటి ఖగోళ విజ్ఞాన పరిధుల్ని చూడగల్గడం వారికి సాధ్యమేకాదు. చూచినా, తామెంతో తప్పు చేస్తున్నామన్న వాస్తవం అనేది వారి సిగ్గుకు తెలియదు. బుద్ధి తక్కువ వల్ల తమ వైఖరి రూపొందిందని వారి స్పృహకురాదు. వారి వృత్తి వంచన. అందువల్ల, దాన్ని ఎలానైనా సమర్థించుకోడానికి వారు ప్రయత్నిస్తారు. అందుకు "మన జాతీయత" – "మన సంస్కృతి" అద్దకం వేస్తారు. వేలాది సంవత్సరాలనాటి అపార్థాలను – తిథి, వార, నక్షత్రాదుల మార్మిక ఫలాలను ఈనాటికీ వదలకుండా వ్యాపారం సాగిస్తారు. వారి ఖగోళ విజ్ఞానం బండారం బయటపెడితే, వారి శుభాశుభ ఫలాల బండారం కూడా బయటపడుతుంది.

## జ్యోతిష్కుల అజ్ఞానం :

రాహు, కేతువులు రాక్షస గ్రహాలనీ, అవి సూర్యచంద్రుల్ని మ్రింగడంవల్ల సూర్యచంద్ర గ్రహణాలేర్పడుతున్నాయనీ ప్రాచీన హిందూ ఖగోళ శాస్త్రజ్ఞులు చాల ఆలస్యంగా భ్రమపడ్డారు. ఈ రాహు కేతువులు, ఇతర దేశాల ప్రాచీన విజ్ఞానం (!)లో లేవు.

అలా భ్రమపడక పూర్వం మనవారికి 5 గ్రహాలే తెలుసు – అంగారక, బుధ, గురు, శుక్ర, శని గ్రహాలు. వారిది భూకేంద్ర సిద్ధాంతం కాన, భూమి గ్రహమని వారు

అభిప్రాయపడడానికే వీలులేదు. భూమి గ్రహమని వూహించిన పూర్వులు ప్రపంచంలో యెక్కడా లేరు. అయినా, అంతా మన పూర్వులకు తెలుసునన్న పిచ్చవాదాన్ని మన ఛాందసులుమానరు.

సూర్యచంద్రుల్ని కూడా గ్రహాలుగా పరిగణించి, వాటిని ఐదు గ్రహాలకు కలిపి, మొత్తం 7 గ్రహాలుగా లెక్కించారు. ఎందుకంటే, సూర్యచంద్రులు కూడా మిగతా గ్రహాలవలె భూమి చుట్టూ తిరుగుతున్నాయని వారి దృష్టి కందిన సమాచారం.

కాని, సూర్యుడు గ్రహంకాదు నక్షత్రమనీ, చంద్రుడు గ్రహం కాదు ఉపగ్రహమనీ వారికి తెలియదు. వారికి తెలిసిన జ్యోతిషం ఈ విషయం వారికి తెలియపరచలేదు.

కాగా, వారికి తెలిసిన (?) ఏడు గ్రహాలూ (నక్షత్ర మండలంతో కలిపి) భూమి చుట్టూ తిరుగుతున్నాయన్న భ్రమ నుంచి వారు తేరుకోలేని కాలమది. కాని, చంద్రుడొక్కటే భూమి చుట్టూ తిరుగుతున్నది.

ఇప్పుడు మనకు తెలిసిన గ్రహాల వరుస యిలా వుంది.

బుధ, శుక్ర, భూమి, అంగారక, లఘుగ్రహ కూటమి, గురు, శని, యురేనస్, నెప్ట్యూన్, ప్లుటో – గ్రహ కుటుంబంలో ఇన్ని గ్రహాలున్నట్లు జ్యోతిషం యెవరికీ చెప్పలేదు. సూర్యుడి చుట్టూ తిరుగుతున్న మరో రెండు గ్రహాలను ఇటీవల భారత ఖగోళ శాస్త్రజ్ఞులు కనుగొన్నారు. ఈ గ్రహ కుటుంబమంతా సూర్యుడి చుట్టూ తిరుగుతున్నది. ఈ విషయం కూడా వారికి జ్యోతిషం చెప్పలేదు. కాని, నక్షత్రాలేవీ సూర్యుడిచుట్టూ కూడా తిరగడంలేదు.

భూమికేకాక, మిగతా గ్రహాలకు కూడా చంద్రులున్నారని మన జ్యోతిష్కులకు తెలియదు. జ్యోతిషం వారికి చెప్పలేదు.

వారికి తెలిసిందల్లా (సూర్య, చంద్ర) అంగారక, బుధ, గురు, శుక్ర, శని గ్రహాలు మాత్రమే. గ్రహజ్ఞానం సరిగా లేని జ్యోతిష్కులు తాము గ్రహాలుగా పరిగణించిన ఏడింటితోనే 7 వారాల చక్రాన్ని ఒకదాన్ని యేర్పాటు చేసుకున్నారు. 7 రోజుల తర్వాత ప్రతివారమూ అవృతమవుతుంది.

ఆ 7 వారాలలో కొన్ని మంచివీ, కొన్ని చెడ్డవీ అన్నారు. ఏ వారాలు ఎందుకు మంచివో, ఏ వారాలు ఎందుకు చెడ్డవో ఏనాడూ ఎవ్వరూ చెప్పలేదు. ప్రశ్నించుకోనూ లేదు. వా ారాల పేర్లూ, ఆ వారసూచకాలైన గ్రహాల వరుసలూ ఇలా వున్నాయి.

| | |
|---|---|
| ారం (ఆదివారం) | సూర్యుడు |
| ారం | చంద్రుడు |
| ంగళవారం | అంగారకుడు |
| ుధవారం | బుధుడు |

| | |
|---|---|
| గురువారం | గురుడు (బృహస్పతి) |
| శుక్రవారం | శుక్రుడు |
| శనివారం | శని |

హిందూ పురాణ గాధలలో ఈ గ్రహాలన్నీ పురుష దేవతలే. కాగా, భూమి స్త్రీ దేవత. కాని పూర్వం అన్ని దేశాలకూ తెలిసిన గ్రహాలూ, వారాలు కూడా ఇవే.

7 వారాలకు మన జ్యోతిష్కులు శూలలు కూడా కల్పించారు. శని, సోమ వారాలు తూర్పు దిక్కుకు – గురువారం దక్షిణ దిక్కుకు – ఆది, శుక్ర వారాలు పడమర దిక్కుకు – మంగళ, బుధ వారాలు ఉత్తర దిక్కుకు ప్రయాణం చేయరాదుట.[2]

కాని, పై మాట చెప్పిన కాలామృతమే అంతకు ముందు శ్లోకంలో ఆది, మంగళ, శని వారాలు ప్రయాణానికి నిషిద్ధాలని చెప్పింది.[3]

గృహారంభానికి వారఫలాలు చెప్పడంలో కూడా వేర్వేరు గ్రంథాలు వేర్వేరు విధాలుగా చెప్పాయి.

| వారం | వాస్తుదర్పణం | శ్రీకృష్ణవాస్తు | సనత్కుమారం | వాస్తుదీపిక | వి.ప్రకాశిక |
|---|---|---|---|---|---|
| ఆదివారం | వ్యాధి | అగ్నిభయం | అగ్నిభయం | నిషిద్ధం | నిషిద్ధం |
| సోమవారం | శుభం | ఉపద్రవం | హాని | నిషిద్ధం | శుభం |
| మంగళవారం | మృత్యువు | అగ్నిభయం | కష్టం | నిషిద్ధం | నిషిద్ధం |
| బుధవారం | ధనలాభం | సౌఖ్యం | ఐశ్వర్యం | శుభం | శుభం |
| గురువారం | ఆయుష్యం | సౌఖ్యం | సుఖం | శుభం | శుభం |
| శుక్రవారం | ఐశ్వర్యం | సౌఖ్యం | శుభం | శుభం | శుభం |
| శనివారం | దరిద్రం[4] | చోరభయం[5] | చోరభయం[6] | నిషిద్ధం[7] | శుభం[8] |

మంచి చెడ్డల్ని కల్పించే శక్తిని 7 గ్రహాలకూ (?) జ్యోతిష్కులు కల్పించారు.

---

2. శూలాఖ్యేష్వధ వారభేషు గమనం యాతుర్భవేద్రోగకృత్
చంద్రార్కాత్మజ వారయో సురపభే ప్రాచీం నగచ్ఛేద్ధి శం
జీవే జాంఘ్రిభ ఏవ చాంతక దిశం శుక్రార్కయోః స్రష్టృభే
పశ్చాదర్య ముఖేకుజజ్ఞదివ యోర్యాతాచ సౌమ్యాదింశం (కాలామృతం 5 - 6)
3. కాలామృతం (5–5)
4. వాస్తు దర్పణం పే - 43, చల్లా లక్ష్మీనృసింహశాస్త్రి
5. శ్రీకృష్ణవాస్తు శాస్త్రం – పే 8 – సోమల గణపయామాత్య.
6. శ్రీకృష్ణవాస్తుశాస్త్రం పే – 8, 9–సోమల గణపయామాత్య
7. వాస్తు దీపిక పే - 72, చల్లా లక్ష్మీనృసింహశాస్త్రి
8. ఆదిత్య భౌమవర్జంతు వారా సర్వేశుభావహాః (విశ్వకర్మ ప్రకాశిక, 3–3)

అంటే, గృహ నిర్మాణానికి జ్యోతిషం ప్రమేయం కూడా వున్నదన్న మాట. అసలు గ్రహాలెన్నో తెలియనివారు వాటికి మంచి చెడ్డల్ని, స్వభావాలను అంట గట్టడమేమిటి? గ్రహాలలో, మంచివీ, చెడ్డవీ అంటే ఏమిటి?

## గ్రహణాలు - రాహుకేతువులు :

సూర్య చంద్ర గ్రహణాలు పట్టే ఘడియలు చెడ్డవి అనడంలో జ్యోతిష్కుల మార్మిక ధోరణికి అర్థం లేదు.

సూర్యుడి చుట్టూ భూమి, భూమి చుట్టూ చంద్రుడు తిరిగేటప్పుడు ఆ మూడూ $5^{0}$ల తేడాతో ఒకే సరళరేఖకు దగ్గరగా వస్తాయి. అలా $5^{0}$ తేడా లేకుండా పూర్తిగాకాని, లేక దాదాపు పూర్తిగా కాని ఒకే సరళరేఖలోనికి వచ్చినపుడు సూర్యుడి కాంతి భూమికి చేరకుండా చంద్రుడు అడ్డం వస్తుంది. అది సూర్యగ్రహణం. అది అమావాస్యనాడే రావడానికి కారణం చంద్రుడి వెలుగుముఖం భూమివైపుకాక, సూర్యుడి వైపు చూపడమే.

అలానే సూర్యుడికీ, చంద్రుడికీ మధ్య భూమి అడ్డువచ్చినపుడు చంద్ర గ్రహణం పడుతుంది. అది పౌర్ణమినాడే రావడానికి కారణం చంద్రుడి పూర్తి వెలుగు ముఖం భూమి వైపు వుండడమే. (చంద్రుడు సూర్యకాంతినే ప్రతిబింబిస్తుంది)

ఒక గ్రహణానికీ, మరో గ్రహణానికీ మధ్య వ్యవధిని సారోస్ అంటారు. అది 6585 రోజుల 8 గంటలు. గ్రహణాలు చక్రికాబంధంలో ఈ గడువుకే జరుగుతుంటాయి.

ప్రదేశంలో ఒక ఖగోళం నీడ మరొక ఖగోళం మీద పడితే, దానివల్ల భూవాసులకు అపచారం జరగడమేమిటి? ఈ గ్రహణాలు సూర్యచంద్రులకేకాక, ఇతర గ్రహాలకు కూడా వున్నాయి. ఆ విషయం పూర్వులకు తెలియదు. రాహుకేతువులు రాక్షస గ్రహాలనడం, అవి సూర్యచంద్రుల్ని మ్రింగుతున్నాయనడం, రాహుకాలం - కేతుకాలం చెడ్డవనడం - అంతా మార్మిక వ్యవహరమే.

పూర్వం సూర్యచంద్రగ్రహణాల కాలంలో వాటిని వదలగొట్టడానికి డప్పులు, డమారాలు మ్రోగించి జనం గోలచేసేవారట. అది విని, గ్రహణాలు తొలగిపోతాయని వాళ్ళు అపోహపడేవాళ్ళు. గ్రహణాల వల్ల చెడు జరుగుతుందనే ఆదిమవాసుల భయమే అందుకు కారణం. గ్రహణాలు ఎందుకు పడుతున్నాయో ఈనాడు మనకు తెలిసినా, గుప్తభయం వెన్నాడుతూ వుండటంవల్లనే హిందువులిప్పటికీ గ్రహణ కాలంలో శుద్ధి కార్యక్రమాలు జరుపుకొంటున్నారు. పవిత్రస్నానాలు చేస్తున్నారు.

ఒకసారి ప్రముఖ శాస్త్రజ్ఞుడు జూలియస్ హక్స్లీ బెనారస్ హిందూ విశ్వవిద్యాలయానికి వచ్చినపుడు గంగాతీరంలో 50,000 మంది గుంపు కూడి స్నానం చేస్తున్నారట. అది చూచి ఆయన "ఆ గుంపేమిటి?" అని ప్రశ్నించాడు. "ఈ రోజు

సూర్యగ్రహణం కాబట్టి, దోషహరణం కోసం వారంతా గంగా స్నానం చేస్తున్నా"రని చెపితే, ఆయన విస్తు పోయాడుట. గ్రహణ సమయంలో పుణ్యతీర్థ స్నానం చేస్తే, దోషం హరిస్తుందని హిందువుల విశ్వాసం.

## తిథులంటే ఏమిటి :

వారాల తర్వాత తిథులు కూడా శుభాశుభ ఫలాలు యిస్తాయని హిందువుల మూఢనమ్మకం. చంద్రుడు భూమి చుట్టూ ఒకసారి తిరగడానికి సుమారు 27 1/3 రోజులు పడుతుంది. (అది కచ్చితంగా 27 రోజుల 7 గంటల 43 నిమిషాలు 12 సెకండ్లు) రెండు నెల పొడుపుల మధ్య వున్న 29.53 (29 రో॥ 12 గం. 44 ని॥) రోజుల చాంద్రమాసాన్ని పూర్వులు రెండు పక్షాలు చేశారు.

భూమి నుంచి చూచినపుడు సూర్యచంద్రులు ఒకేదిశవైపు కదులుతున్నట్లు కన్పిస్తుంది. కాని, 24 గంటలలో సూర్యుడికంటె చంద్రుడు $12^0-10'$ ముందుంటాడు. $360^0$ పూర్తయేటప్పటికి చంద్రుడు తిరిగి యథా(సౌర) స్థానంలోకే వస్తాడు. అప్పటికి 29.53 రోజులు గడుస్తుంది. అలా ఒక నెల పొడుపుకు, మరో నెల పొడుపుకు మధ్య వుండే 29.53 రోజుల్ని చాంద్రమాసం అంటాం. చంద్రుడు, భూమి చుట్టూ ఒకసారి తిరగడానికి 27.32 రోజులు పడుతుంది. అంటే, చంద్రభ్రమణం కాలం కంటె చాంద్రమాసం 2.1 రోజులెక్కువ. చంద్రుడు భూమి చుట్టూ తిరుగుతున్న కాలంలో భూమికూడా సూర్యుడి చుట్టూ తిరగడంవల్ల, చంద్రభ్రమణ కాలానికీ, చాంద్రమాసానికీ మధ్య 2.1 రోజులు తేడావస్తుందన్నమాట.

చంద్రతలం ఎప్పుడూ ఒకవైపు మాత్రమే భూమికి ఎదురుగా వుండడంవల్ల, భూసూర్యుల మధ్య చంద్రుడు వచ్చినపుడు అమావాస్య, సూర్యచంద్రుల మధ్య భూమి వచ్చినపుడు పౌర్ణమి వస్తాయి. అమావాస్య నుంచి పౌర్ణమిదాక చంద్రకళలు క్రమంగా పెరుగుతాయి. పౌర్ణమి నుంచి అమావాస్య దాక క్రమంగా తరుగుతాయి. ఈ పెరగడానికీ, తరగడానికీ 15 పేర్లు పెట్టుకొని, వాటినే తిథులన్నారు. ఆ తిథులు రెండు పక్షాలలోనూ పునరావృతమవుతుంటాయి. కళలు పెరిగేటపుడు కానీ, తరిగేటపుడు కానీ ఒకానొక కళ దశ మంచిదికాదనీ, మరొక దశ మంచిదనీ నిర్ణయించడంలోని అవివేకం మనకు అర్థం కాదు. ఏ శాస్త్రీయ సూత్రాల ప్రకారం ఆ నిర్ణయం జరిగిందో జ్యోతిష్కులే మనకు చెప్పాలి.

చాంద్రమానం సబబైనది కాదని ఖగోళ శాస్త్రజ్ఞులు సౌరమానానికి చేరి శతాబ్దాలు గడిచింది. అయినా, హిందువుల తిథుల గుల తీరలేదు.

**పంచాంగాలు :**

పండితులతో నిమిత్తం లేకుండానే చాలమంది సామాన్య హిందువులు వారాల, తిథుల మంచిచెడ్డల్ని చాల పట్టింపుతో పాటిస్తుంటారు. కాని, మనకు 7 రోజులు వారమైతే, మాయన్ సంస్కృతిలోని వారికి 13 రోజుల వారం.[9] మనకు సుమారు 30 రోజుల నెలలయితే, మాయన్లకు 20 రోజుల నెలలు. వారికి 13 నెలల సంవత్సరమూ, 18 నెలల సంవత్సరమూ అంటూ రెండు ప్రమాణాల సంవత్సరాలున్నాయి. మనకు 60 సంవత్సరాల ఆవర్తచక్రాలుంటే, మాయన్లకు 52 సంవత్సరాల ఆవర్త చక్రాలున్నాయి.[10] చైనీయులవి 56 సంవత్సరాల ఆవర్త సంవత్సర చక్రాలు.[11] అలానే వివిధ దేశాలవారు, నాగరికతలవారు నక్షత్రాలను, రాసులను వారివారి స్థూలదృష్టికి అవగాహన అయిన మేరకు ఆకారాలలోను, సంఖ్యలలోను భిన్న రీతులలో నిర్ణయించుకున్నారు. కొందరు సవరించుకొన్నారు. మరికొందరు బావిలో కప్పలు వాటినే పట్టుకొని వ్రేలాడుతున్నారు. పాశ్చాత్యుల పంచాంగాలు (క్యాలెండర్లు) ఎన్నోసార్లు మారాయి. శుభాశుభాల పంకిలాన్ని తుడిపివేసుకోడానికి మన పంచాంగాల కింకా సాధ్యం కాలేదు. మనం శుభాశుభాల పంకిలాన్ని కడిగి వేసుకున్నాము కనుకనా, దానితో ముడిబడ్డ పంచాంగ కూపం నుంచి బయటపడడానికి? జ్యోతిర్వాస్తు పండితుల వంటివారే పనిగట్టుకొని వీటిని ప్రచారంలో పెడుతున్నారు. మన ప్రభుత్వాల వారు వాటిని ప్రోత్సహిస్తున్నారు. మనది "ప్రజాస్వామ్యం" కదా! యథా ప్రజా, తథారాజా! ప్రజల్ని యథాస్థితి నుంచి మేల్కోనీయకపోవడమే "మన ప్రజాస్వామ్య" పరమావధి! ఇది దారుణాతి దారుణం.

**తిథుల ఫలాలు :**

మన పంచాంగలోని తిథులూ, మాసాలూ చంద్రమానాన్ని అనుసరిస్తాయి. గృహ నిర్మాణానికి తిథుల ఫలాలను "శ్రీకృష్ణవాస్తు శాస్త్రం" అనే గ్రంథం ఇలా చెప్పింది:

| | | | |
|---|---|---|---|
| పాడ్యమి, షష్ఠి, ఏకాదశి | నంద తిథులు | – | ధననాశనం |
| విదియ, సప్తమి, ద్వాదశి | భద్రతిథులు | – | బంధనం |
| తదియ, అష్టమి, త్రయోదశి | జయ తిథులు | – | శుభం |
| పంచమి, దశమి, పూర్ణిమ | పూర్ణతిథులు | – | సంపద |

---

9. The Blood of kings: Dynasty and Ritual in Maya Art by Linda Sehele and Mary Ellen Miller; Time Among the Maya by Ronald Wright

10. పై పుస్తకాల్లోనే

11. Feng Shui by Lillian Too

| | | | |
|---|---|---|---|
| చవితి, నవమి,చతుర్దశి | రిక్త తిథులు | - | మరణం |
| అమావాస్య | దర్శతిథి | - | మరణం.[12] |

"విశ్వకర్మ ప్రకాశిక" అనే మరో వాస్తు గ్రంథం పాడ్యమి, అష్టమి, చవితి, నవమి, చతుర్దశి, అమావాస్య తప్ప – మిగతా తిథులన్నీ గృహారంభానికి శుభప్రదమే నంటున్నది.[13] తమిళనాడువారు అమావాస్యనే అత్యంత శుభతిథిగా పరిగణిస్తారు. మరి, అమావాస్యను దర్శతిథిగా పేర్కొన్న మన పూర్వులంతా తెలుగువారేనా?

మాస ఫలాలు :

అలానే గృహారంభానికి చాంద్రమాసఫలాలను కూడా వాస్తుగ్రంథాలు చెప్పకుండా వదలలేదు. ఆయా మాసాలు ఆయా ఫలాలెందుకు యిస్తాయో యెవ్వరూ చెప్పలేదు, చెప్పలేరు. ఎందుకంటే అలాంటి ఫలాలేమీ లేవు.

వైశాఖం, శ్రావణం, కార్తీకం, మాఘం, ఫాల్గుణం మాసాలు గృహారంభానికి మంచివట.[14] చైత్రం శోకకరమనీ, జ్యేష్ఠ మృత్యుకరమనీ, ఆషాడం భృత్యుహరమనీ, భాద్రపదం హానికరం అనీ, ఆశ్వయుజం భార్యకు హానికరం అనీ, పుష్యం, మార్గశిరం చోరభయమనీ[15] అలా అలా వేర్వేరుగ్రంథాలు గృహారంభ మాసాలను శుభకారకాలనీ, అశుభకారకాలనీ విభజించి చెప్పాయి.

జ్యోతిర్వాస్తు గ్రంథాలన్నీ ఒక్కొక్కటి ఒక్కొక్క విధంగా చెప్పి తగలబడి యేడ్చాయి. వాస్తువిద్యావిశారదులమని చెప్పుకొనే వారంతా ఒక్కొక్కరు ఒక్కొక్క విధానాన్ని ప్రమాణంగా స్వీకరిస్తారు. ఒకరి ప్రమాణం ప్రకారం మరొకరిది తప్పవుతుంది. అందువల్ల ప్రతి జ్యోతిర్వాస్తు పండితుణ్ణీ తప్పు పట్టవచ్చు.

గృహం నిర్మించదలచుకొన్నవారు స్థలసేకరణ చేయాలి. గృహారంభం చేయాలి. ద్వారాలు, కిటికీలు అమర్చాలి. గృహం పూర్తయ్యాక ప్రవేశం చేయాలి. వీటికి సలహాలిచ్చే ఏ వాస్తు పండితుణ్ణయినా మరొక వాస్తు విధానం ప్రకారం తప్పు పట్టవచ్చు. అది ఏ దశలోనైనా చేయవచ్చు. పైగా "శ్రీకృష్ణ వాస్తుశాస్త్రం" యేమంటుందంటే,

---

12. శ్రీ కృష్ణ వాస్తుశాస్త్రం : సోమల గణపయామాత్య పే - 8
13. ద్వితీయాచ తృతీయాచ షష్టీచ పంచమీ తథా
సప్తమీ దశమీ చైవ ద్వాదశ్యేకాదశీతథా
త్రయోదశీ పంచదశీతిథ యస్యు: శుభావహా (విశ్వకర్మ ప్రకాశిక 3 -3, 4)
14. సౌమ్యైః ఫాల్గుణ వైశాఖమాఘశ్రావణ కార్తికాః
మాసాస్యుర్గృహనిర్మాణే పుత్రారోగ్య ఫలప్రదాః (వాస్తు దీపిక, పే - 7)
15. వాస్తు దీపిక ( పే - 71)

శ్రావణమాసంలో కట్టే యింటికి తలవాకిలి తూర్పున, కార్తీకమాసంలో కట్టే యింటికి దక్షిణాన, మాఘమాసంలో కట్టే యింటికి ఉత్తరాన పెట్టాలిట. ఇతర మాసాలలో ఇళ్ళు కట్టనూకూడదు. వాకిళ్ళు పెట్టనూకూడదట.[16] ఎంత వింత శాస్త్రం!

ఇంగిత జ్ఞానమున్నవారికి ఇలాంటి నియమాలు బుద్ధిహీనంగా కన్పిస్తాయి. ఇల్లు కట్టడమంటే గుడిసె వేసుకోవడం కాదు. ఇంటి కట్టుబడికి ముందే ఇంటి ప్లాను నిర్ణయించుకుంటారు. మునిసిపాలిటీ వుద్యోగులకు, కార్పొరేషన్ ఉద్యోగులకు లంచాలు చెల్లించుకుంటారు. కాగా, మధ్యలో, ప్రతి సందర్భంలోనూ ముడుపులు చెల్లించి వాస్తుపండితుల సలహా ఏ మూఢుడూ తీసుకోడు.

## నక్షత్రాలూ - రాసులూ :

వారాలు, తిథులు, మాసాలతో వదలక మన పండితులు నక్షత్రఫలాలు, రాసి ఫలాలు కూడా చూస్తున్నారు.

సూర్యచంద్రులూ, గ్రహాలూ భూమికి వున్న దూరాలలో, కక్ష్యలలో ఒక క్రమాన్ని పాటిస్తున్నట్లు మన స్థూల దృష్టికి గోచరిస్తుంది. ఆ దృష్టి భూకేంద్ర సిద్ధాంతాన్ని అనుసరిస్తుంది. కాని, గ్రహాలకేంద్రం భూమికాదు - సూర్యుడు.

సూర్యుడొక సామాన్య నక్షత్రం. సూర్యుదున్న నక్షత్ర కూటమిని పాలపుంత అంటాం. ఈ పాలపుంతలోనే 10,000,0000000 నక్షత్రాలున్నవని అంచనా. ఈ నక్షత్రాలేవీ వున్నచోట వుండడంలేదు. ఒకదాని కొకటి దూరదూరంగా సెకండుకు వేలాది మైళ్ళ వేగాలతో పరుగెత్తి పోతున్నాయి. మిగతా గెలాక్సీలు, నక్షత్రాలు కూడా ఇలానే పరుగెడుతున్నాయి.

అంటే, ఏ నక్షత్రస్థానాన్నీ, "ఇది ఫలానాచోట" స్థిరంగా వుందనికానీ, భూమికి "ఇంత దూరంలో" వుందనికానీ చెప్పలేము. అవి, ఒకదానికొకటి కోటానుకోట్ల మైళ్ళ దూరంలో, పరుగులో వున్నాయి. కాని, మన జ్యోతిష్కులు వాటి స్థిరస్థానాల్ని గుర్తిస్తున్నట్లు చెపుతారు. ఆ నక్షత్రాల సంఖ్య 27 అని తేల్చారు. వాటిని మరల 12 రాసులుగా కూర్చారు. రాసుల మధ్య నక్షత్రాలను పంపిణీ చేశారు. రాసిని బట్టీ, రాసిలో వున్న నక్షత్రాల్ని బట్టీ ఫలాలు నిర్ణయించారు. రాసి, నక్షత్రాలతో పాటు మాస, వార, తిథులను కూడా పరిగణనలోకి తీసుకొని - వాటన్నిటి మధ్య వియ్యాలనూ, కయ్యాలనూ కల్పించారు. నక్షత్రాలూ, రాసులూ ఎప్పటికప్పుడు మారతాయన్న ఊహే వారి ఆలోచన పరిధిలోకి రాలేదు. రావడానికి అవకాశంలేదు కూడా.

వీటికి తోడు నామనక్షత్రాలనే వాటిని కల్పించారు. మనుషుల పేర్లలో మెదటి

16. శ్రీకృష్ణవాస్తు శాస్త్రం, పే - 82, సోమల గణపయామాత్య

అక్షరాలను బట్టి వారి రాసులను, నక్షత్రాలను ప్రత్యేకిస్తారు. లేక, వారు వేసే ప్రశ్నలో మొదటి అక్షరాన్ని పరిగణనలోకి తీసుకొని అక్షర వర్గాల ప్రకారం ఫలాలను లాటరీ వేస్తారు. జ్యోతిర్వాస్తు పండితులు అల్లే యీ మాయాజాలంలో పడి చాలమంది కుడితిలో పడ్డ ఎలుకల్లాగా గిల గిల తన్నుకుంటారు.

అయితే, ఈ ఫలాలు ఎలుకల కన్నాలకు, క్రూరమృగాల గుహలకు, పక్షులగూళ్లకు ఇతర జంతుజాల ఆవాసాలకు వర్తిస్తాయో లేదో ఎక్కడా వాస్తు విద్యా విశారదులు చెప్పలేదు. జ్యోతిషం చెప్పే ఫలాలు 'మోస పోగల మనుషుల్ని' మోసం చేయడానికే తప్ప, మోసపోని జంతుజాలానికి అవి వర్తించవని తేలుతుంది. ఆలోచన చేయగల్గిన మనిషి తన ఆలోచనవల్లనే మోసపోతున్నాడు. మోసం చేయగల్గిన కొంతమంది స్వార్ధ కుక్షింభరుల వంచనకు బలి అవుతున్నారు.

## వాస్తువులో దూరిన జ్యోతిష ఫలాలు :

నవనాగరికుల మనుకొనేవారు కొందరు తమను తాము బ్రాహ్మణీకరించుకోడానికి ప్రయత్నిస్తారు. ఆ జబ్బుకు గురైనవారే నిష్ఠ పాటిస్తారు. గ్రహచారఫలాలు, గృహవాస్తు ఫలాలు పాటించడం కూడా వారి నిష్ఠలో భాగమే.

హిందువులలో అగ్రవర్ణాల్లోని అత్యధిక సంఖ్యాకులు ఏ కార్యక్రమాన్ని ప్రారంభించాలన్నా తిథి, వార, నక్షత్ర, రాశి ఫలాలకై వెంపరలాడతారు. శకునాలు చూస్తారు. దాన్ని కూడా కులాల ప్రకారం విభజించారు. ప్రయాణ విషయాలలో బ్రాహ్మణుడైతే నక్షత్రాన్నీ, క్షత్రియుడైతే లగ్న యోగాలనీ, వైశ్యుడైతే దినశుద్ధినీ చూడాలిట. శూద్రుడైతే కేవలం శకునం చూచుకొంటే చాలునట.[17]

ఓడిపోయిన మన దేశీయ రాజులంతా అనాదినుంచీ విజయ ఫలాలను జ్యోతిష పండితులచేత చెప్పించుకొని యుద్ధాలకు బయలుదేరి ఓడిపోయినవారే. శుభాశుభాలు, జయాపజయాలు అన్నీ మానవ ప్రయత్నాలమీద ఆధారపడేవే. దిన, వార, మాస, తిథి, రాసి, నక్షత్రాలేవీ మానవచర్యల మీద పనిచేయవు. వాటికసలు చర్యలులేవు. ఎందుకంటే, తెలిసి చేసేదే చర్య. చర్యల్ని కల్పించడానికే వాటికి పూర్వులు దేవతల పేర్లు కల్పించారు.

17. యాత్రాదిష్వ గుణైర్ద్విజ స్యఫలదా సిద్ధిర్గుణైర్లగ్నజై
ర్నావాయోగగతైర్న్ప పస్యతు విశాంసిద్ధిర్దినోత్థైర్గుణైః
శూద్రాణం శకునై శ్శుభైశ్శుభఫలం యాత్రాను కూలాభవే
దన్యేషాంతు ము హూర్తశక్తి బలతస్స్యాత్కార్య స్సిద్ధిస్సదా (కాలమృతం 5-74)

**నక్షత్ర ఫలాలు :**

గృహారంభానికి "వాస్తు దర్పణం" చెప్పిన నక్షత్ర, రాశి ఫలాలు ఎంత విచిత్రంగా వున్నవో చూడండి.

| | | | |
|---|---|---|---|
| అశ్విని | సర్వసంపదలు | స్వాతి | స్థిరత్వం |
| భరణి | యజమాని మరణం | విశాఖ | అగ్నిభయం |
| కృత్తిక | అగ్నిభయం | అనూరాధ | యశోవృద్ధి |
| రోహిణి | పుత్రసంతతి | జ్యేష్ట | ఆకలిభయం |
| మృగశిర | యశఃప్రాప్తి | మూల | శత్రుప్రదం |
| ఆరుద్ర | భయం | పూర్వాషాఢ | జలభయం |
| పునర్వసు | ధనప్రాప్తి | ఉత్తరాషాఢ | ధనసంతోషాలు |
| పుష్యమి | సంతోషం | (అభిజిత్తు) | (శుభం) |
| ఆశ్లేష | రాజభయం | శ్రవణం | కీర్తివృద్ధి |
| మఘ | పీడ | ధనిష్ట | సంతోషం |
| పుబ్బ | ధననష్టం | శతభిషం | ఆయురారోగ్యాలు |
| ఉత్తర | శుభం | పూర్వాభాద్ర | పశుపీడ |
| హస్త | యశోవృద్ధి | ఉత్తరాభాద్ర | సంతోషం |
| చిత్త | వస్త్రలాభం | రేవతి | పశువృద్ధి [18] |

రాసి ఫలాలు :

| | | | |
|---|---|---|---|
| మేషం | శోక రోగాలు | కన్య | దరిద్రం |
| వృషభం | ధనసంపద | తుల | భయం |
| మిధునం | అగ్నిభయం | వృశ్చికం | ధనహాని |
| కర్కటకం | ఆయుర్వృద్ధి | ధనురాసి | ధననాశనం |
| సింహం | పశునాశనం | మకరం | ధనసంపద. [19] |

వాస్తువుకు జ్యోతిషంతో గల సంబంధాలు గృహారంభానికి – గృహ ప్రవేశానికి – ఆ మధ్య జరిగే వివిధ తంతులకు సంబంధించిన తిథి, వార, మాస, నక్షత్ర, రాసి ఫలాలను గురించినదే. వాటిలో కొన్ని మంచివి, కొన్ని చెడ్డవి అనే కల్పన అంతా కుక్షింభరులదే. ఈదేశంలోలాగా ఈజిప్టు, చైనా వంటి దేశాలలో కూడా పురోహిత

18. వాస్తు దర్పణం, పే – 48. సంచయం : చల్లా లక్ష్మీనరసింహశాస్త్రి

19. వాస్తు దర్పణం, పే – 48. సంచయం : చల్లా లక్ష్మీనరసింహశాస్త్రి

మతాధిపత్యం క్రింద జ్యోతిషాన్ని, వాస్తువును కలగాపులగం చేసినట్లు తెలుస్తుంది కాని, మన దేశంలోని కులతత్వం, కుల విభాగం అక్కడలేవు.

చైనాలో వాస్తువును ఫెంగ్‌షూయి అంటారు. వాళ్ళ వాస్తువులో కూడా జ్యోతిష ఫలాలను మిళితం చేశారు. మన దేశంలోలోగా వారిప్పుడు తిరిగి ఫెంగ్‌షూయిని పునరుద్ధరించి ప్రాచుర్యం కల్పిస్తున్నారు.[20] ఈ పునరుజ్జీవనాని కంతటికీ మూలం జాతీయాభిమానం కంటె జాతీయ అహంకారమని చెప్పవచ్చు. ముఖ్యంగా వలస విమోచన పొందిన దేశాలలో ఈ జాతీయ అహం జబ్బు ఉధృతంగా వుంది. తమ దేశాలలో పూర్వకాలంలో చాలా గొప్ప సంస్కృతి వున్నట్లుగా ఈ జాతీయతా జాడ్య పీడితులు భ్రమపడతారు. దాన్ని సమర్థించుకోడానికి ఆధునిక విజ్ఞాన పరిభాషను వాడతారు. ప్రాచీన కాలపు మార్మికతకు శాస్త్రీయ ప్రతిపత్తిని కల్పించడానికి ప్రాకులాడతారు. ఆ పరిధిని దాటవలసిన ఆధునిక వైజ్ఞానిక యుగంలో మనం వున్నాం. దాటకపోతే మానవజాతికే భద్రత లోపిస్తుందని మనం గుర్తించాలి.

"ప్రాచీన సంస్కృతి", "జాతీయ సంస్కృతి" పేరుతో ప్రచారమయ్యేదంతా మత సంస్కారమే. మతానికి మారుపేరుగా ఇప్పుడు జాతీయతను వాడడం నాజూకైంది. తాము మత రాజ్యాలుగా ప్రకటించుకొన్నవారు బహిరంగంగానే మతాన్ని ప్రచారిస్తున్నారు. వారికి ఏ ఆధునిక విజ్ఞానం మాటునో దాగవలసిన అవసరంలేదు. జాతీయతాభావం చాటున దాగిన మతాన్ని గుర్తించడం కష్టం. కాన్న "మన సంస్కృతి" ముసుగును దేశీయులు ఆరాధిస్తున్నారు. మార్మిక ప్రక్రియల్ని వేటినయినా సమర్థించడం వారి ప్రవృత్తి. జ్యోతిషం, వాస్తువు కూడా మార్మిక ప్రక్రియలు కాన, నవనాగరికుల మనుకొనేవారు వాటికి బలికావడం చాల సుళువు.

20. Feng Shui : Lillian Too

# 7. అపార్థాల దశలు

మానవుడు ప్రకృతిని గమనించి, మేథావంతంగా ప్రతిస్పందించడం ప్రారంభించి పదిహేనువేల సంవత్సరాలైనట్లు ఒక అంచనా.

అప్పటినుంచి ప్రకృతిలోని వివిధ వస్తువుల మధ్య సంబంధాలను అర్థం చేసుకొంటూ వచ్చాడు. అందులో భాగంగా "ఆకాశం"లోని సూర్యచంద్ర గ్రహనక్షత్రాల కదలికల మధ్య క్రమాన్ని గ్రహిస్తూ వచ్చాడు. దానికొక సమగ్ర స్వరూపాన్ని యివ్వడానికి ప్రయత్నించాడు. ప్రపంచంలో వేర్వేరు దేశాలలోని మేధావులు వేర్వేరు స్థాయిలలో ఆ పని చేశారు. అలాంటి ఆలోచనలు చేసినవారిలో ఈజిప్షియనులు, కాల్డియనులు, సుమేరియన్లు, చైనీయులు, గ్రీకులు, భారతీయులు, మాయన్లు మొదలైనవారున్నారు.

సూర్య చంద్ర గ్రహ నక్షత్రాదులన్నీ మనుషులందరి స్థూలదృష్టికి దాదాపు ఒకే నమూనాలో కన్పిస్తాయి. అందువల్ల వాటిని గురించిన ఆలోచనలలో ఒకరి కొకరికి ఎంత భేదమున్నా, కొంత సారూప్యత కన్పిస్తుంది. అందులో కొందరు విశిష్టమైన ఆలోచనలు చేశారు. అలా చేసిన వారిలో భారతీయులు కూడా వున్నారు.

ఖగోళ- గమనాలలోని క్రమాన్ని గుర్తించడంలో గణితశాస్త్రం తోడు చాల అవసరం. అందువల్ల; ఖగోళవిజ్ఞానంతో పాటు గణితశాస్త్ర విజ్ఞానం కూడా పెరిగింది. ఆ తర్వాత మిగతా శాఖల విజ్ఞానం అందిపుచ్చుకున్నది. వివిధ దేశాలలోని వారు ఎవరి పంచాంగాలు వారు వ్రాసుకున్నారు. నాడు తాము వ్రాసుకున్న పంచాంగాలనే భారతీయులీనాటికీ అనుసరిస్తున్నారు. జ్ఞానం ఎంత పెరిగినా, వీరి తీరు సుంతైనా మారలేదు.

## మార్మిక దశ:

ప్రకృతి బలంతో పోలిస్తే మానవశక్తి చాల తక్కువ. ప్రకృతిలో తరచుగా జరిగే ఉత్పాతాలకు కారణాన్ని మనిషి మొదట కనుక్కోలేకపోయాడు. అందువల్ల, ఆ కారణాన్ని

మరో అజ్ఞాతశక్తి మీదకు నెట్టాడు. ఇలాంటి మార్మిక ఆలోచన ఆదిమజాతులన్నిటిలోనూ చోటు చేసుకొంది. వేర్వేరు దేశీయులు, వ్యక్తులు వేర్వేరు కాలాలలో చేసిన మార్మిక ఆలోచనలు వేర్వేరు విధాలుగాను, వేర్వేరుస్థాయిలలోను వున్నాయి. మార్మిక శక్తులకు ఆపాదించిన ఉత్పాతాలను నివారించుకోడానికి వేర్వేరు ప్రాంతాలవారు వేర్వేరు శాంతి ప్రక్రియలను అనుసరించారు. వాటిని సమర్ధించుకోవడం కోసం ఎవరి తరహాలో వారు కథలూ, గాథలూ కల్పించుకున్నారు.

అయితే, ఈ కథలకూ – మార్మిక ప్రక్రియలకూ భిన్నంగా చాలా దేశాలలో చెప్పుకోదగిన స్థాయిలో ప్రాచీన విజ్ఞానం పెరగకపోలేదు. కాని, దాన్ని ప్రాయోగిక ఆధారాలతో పరీక్షించి నిర్ధారణ చేసుకోడానికి వారికానాడు సాంకేతిక విజ్ఞాన సహాయంలేదు. వారు కట్టుకున్న మూసలలో వైజ్ఞానికంగా పెరగడానికి అంతకంటె వారికి సాధ్యం కాలేదు.

## తప్పు దారినుంచి – ఒప్పుదారికి :

ప్రాచీనులందరూ ఖగోళ విజ్ఞాన విషయంలో భూకేంద్ర సిద్ధాంతాన్నే అనుసరించారు. వారి దృష్టిలో భూమి చదరపు బల్లలా వుంది. దానిచుట్టూ సూర్యచంద్ర నక్షత్రాదులు తిరుగుతూ వుండేవి. వారి స్థూలదృష్టికి అంతకంటె లోతులు అందలేదు, దాన్ని అనుసరించిన తార్కిక వూహలే సంప్రదాయ తాత్విక వ్యవస్థలకు మూలకందాలయ్యాయి.

సాంప్రదాయిక ఆలోచనలు కలకాలం అలా కొనసాగలేదు – వాటికి భిన్నంగా ఆలోచించేవారు బయలుదేరారు. భూమి గుండ్రంగా వున్నదని వూహించినవారు ఒకరిద్దరు కన్పిస్తారు.[1] కాని, వారిని సమర్ధించినవారు వారి సమకాలిక వైజ్ఞానికులలోనే లేరు.

భూచలనాన్ని వూహించిన వారున్నారు.[2] కాని, వారిని సమర్ధించినవారు వారి సమకాలీన వైజ్ఞానికులలో లేరు.

భూమి సూర్యుడి చుట్టూ తిరుగుతున్నదని అరిస్టార్కస్ ప్రతిపాదించాడు.[3] అయితే, రుజువులతో దాన్ని నిర్ధారించలేదు. అందువల్లనే, ఆనాటి వారెవ్వరూ దాన్ని తీవ్రంగా పరిగణించలేదు.

భారతదేశంలో ముంజాలాదులు అయన చలనాన్ని లెక్కగట్టినమాట నిజమే.

1. గ్రీకు విజ్ఞాని పార్మెనైడ్స్ : క్రీ.పూ. 5 వ.శ : భారతీయ విజ్ఞాని ఆర్యభట్టు క్రీ.శ. 5 వ.శ.
2. గ్రీకు విజ్ఞాని అరిస్టార్కస్ : క్రీ.పూ. 3 వ.శ. : భారతీయ విజ్ఞాని ఆర్యభట్టు క్రీ.శ. 5 వ.శ.
3. గ్రీకు విజ్ఞాని అరిస్టార్కస్ క్రీ.పూ. 3 వ.శ.

కాని, అంతకుముందు వెయ్యి సంవత్సరాల క్రితమే గ్రీకు విజ్ఞాని హిప్పార్కస్ భూ అక్షచలనాన్ని గుర్తించి లెక్కగట్టాడు.[4] దీన్నిబట్టి దేశకాలాలకు అతీతంగా విజ్ఞానం పెంపొందుతూ వచ్చిందని మనం గమనించాలి. (ఈ సందర్భంగా వివరాల కోసం రావిపూడి వెంకటాద్రిగారు రచించిన 1) విశ్వాన్వేషణ 2) శాస్త్రం – అశాస్త్రం చూడవచ్చు.)

ఇప్పుడు మనం చెప్పుకొన్నదంతా ప్రాచీనుల "ఖగోళ విజ్ఞాన పరిధి" గురించి మాత్రమే.

జ్యోతిషం విజ్ఞానమూకాదు, శాస్త్రమూ కాదు. అది ఖగోళ విజ్ఞానాన్ని ఆసరా చేసుకొని పెరిగిన మార్మిక ప్రక్రియ. ఈ మార్మిక ప్రక్రియ మరో మార్మిక ప్రక్రియ అయిన వాస్తువులో కూడా దూరినందువల్లనే ఇక్కడ దాని ప్రస్తావన.

గ్రీకు విజ్ఞాని టోలెమీ ఖగోళ విజ్ఞానరంగంలోకి దిగకముందు ఆ రంగమంతా చిందర వందరగా వుండేది. అయన వచ్చి భూకేంద్ర సిద్ధాంతాన్ని పకడ్బందీగా రూపొందించాడు. అది మౌలికంగా తప్పయినా, ఖగోళ విజ్ఞానంలో మొలకెత్తిన చాల ప్రశ్నలకు అది సమాధానం చెప్పింది. అయినా, వాస్తవరూపమైన సూర్యకేంద్ర సిద్ధాంతం రంగంలోకి దిగడంతోనే భూకేంద్ర సిద్ధాంతం వన్నెమాసి, క్రమంగా అంతర్ధానమైంది.

కోపర్నికస్ అనే పోలిష్ ఖగోళ గణిత శాస్త్రజ్ఞుడు సూర్యకేంద్ర సిద్ధాంతాన్ని గణితబద్ధంగా ప్రతిపాదించాడు. దానితో ఖగోళ విజ్ఞానంలోనే తొలిసారి విప్లవం చెలరేగింది. అది బహుముఖ వైజ్ఞానిక విప్లవాలకు స్ఫూర్తి యిచ్చింది. సూర్యకేంద్ర సిద్ధాంతం వేసిన బాటలోనే అధునిక విశ్వశాస్త్రం క్రమ వికాసం చెందుతున్నది.

## అజ్ఞాన పునరుద్ధరణ ధోరణి :

ఈదేశంలో అన్ని రంగాలలోవలెనే ఖగోళ విజ్ఞానంలో కూడా మనం (మత) పునరుజ్జీవన దశను దాటలేదు. అధునిక ఖగోళ విజ్ఞానానికి కూడా అందని లోతులు ప్రాచీన భారతీయ విజ్ఞానంలో వున్నాయని శ్లోకాలు అప్పగించే వాళ్ళకు మన దేశంలో కొరతలేదు. వాటికి లేనిపోని అర్థాలు, వ్యాఖ్యానాలు కల్పించేవారు ఈ దేశంలో ఎక్కువైపోతున్నారు.

భూమి చలించడంవల్ల నక్షత్రాలు కదులుతున్నట్లు అనిపిస్తున్నాయని అర్యభట్టు వూహించిన మాట వాస్తవమే. కాని, దాన్ని ఆయన సిద్ధాంతీకరించి గట్టి పునాదులపై నిలబెట్టలేదు. భూమి సూర్యుడి చుట్టూ తిరుగుతున్నదనే వూహ ఆయనకు రాలేదు. మిగతా ప్రాచీన భారతీయ ఖగోళశాస్త్రజ్ఞులెవ్వరూ అయన భూ చలన వూహను

---

4. గ్రీకు విజ్ఞాని హిప్పార్కస్ :క్రీ.పూ. 125 : భారతీయ విజ్ఞాని ముంజాలుడు : క్రీ.శ 932

ఆమోదించలేదు. పైగా, తీవ్రంగా ఆక్షేపించి, ఖండించారు కూడా.

మన పూర్వులకు "చాలా" తెలిసిన మాట వాస్తవమే. వారి కాలానికి వారికి ఎంత తెలియడానికి అవకాశం వుందో "అంత" అని ఆ "చాలా" కు అర్థం. వారికి తెలిసిన "కాస్తను" ఈనాడు మనకు అందుతున్న "చాలా" ఖగోళ విజ్ఞానంతో పోల్చి మన పూర్వులకు "అంతా" తెలుసునని లొట్టలు వేయడం వైజ్ఞానిక దారిద్ర్యానికి తార్కాణం.

ఏ దేశానికి చెందినవారైనా ప్రాచీనకాలంలోని విజ్ఞానులు చాలా తప్పులు చేప్పే అవకాశం వుంది. దాన్ని, తప్పులు చెప్పడం అనడం కంటె అసమగ్రంగా చెప్పడం అనడమే అర్థవంతమవుతుంది. అంతకంటెవారు చెప్పగలిగిందిలేదని మనం గుర్తించాలి. వారి జ్ఞానానికి చారిత్రక వైజ్ఞానిక పరిమితులున్నాయని మనం గ్రహించాలి.

ఐనా, జ్యోతిషం వంటి మార్మిక ప్రక్రియను ఖగోళవిజ్ఞానంతో లంకెవేయడాన్ని మనం తీవ్రంగా అభ్యంతరపెడతాం. అందునా భారతీయ జ్యోతిషం మరీ అధ్వాన్నస్థితికి చేరుకొన్నది. ఈనాడు ఖగోళ విజ్ఞానం ఎంతగానో పెరిగింది. తమ మార్మిక ప్రక్రియలో సాధనంగా దాన్నయినా జ్యోతిర్వాస్తు పండితులు వినియోగించుకోరు. అది కొంతలో కొంతమేలు. అజ్ఞానస్థాయినుంచివారు బెత్తెడయినా ముందుకు కదల్లేదు.

వరాహమిహిరుడు గొప్ప ఖగోళ గణిత శాస్త్రజ్ఞుడే. తన నాటి భూకేంద్ర సిద్ధాంతాన్ని పట్టుకొని ఆయన వ్రేలాడాడన్నా మనకు బాధలేదు. కాని, ఆయన తన వైజ్ఞానిక పాటవాన్ని బహుథా మార్మిక మూఢనమ్మకాలకు బలిచేశాడు.

"మనుషులు చెడుచేస్తే పాపం, ఆ పాపం కష్టాలను తెచ్చి పెడుతుంది. వాటిని ఖగోళాలు, వాతావరణం, భూమి ముందుగా సూచిస్తాయి".[5] అని బృహత్సంహితలో వ్రాశాడు. ఆయన కూడా పొట్టకూటికి జ్యోతిషం చెప్పేవాడు కాబట్టి, పై విధంగా జ్యోతిషాన్ని సమర్థించుకున్నాడు.

అంతటితో ఆగక "పురుషుడి మర్మావయవం కురచగా వుంటే అతనికి సంపద వుంటుందికాని, సంతతి వుండదు. మర్మావయవం పొడవుగా వుంటే సంతతి జాస్తి, సంపద నాస్తి, ఎడమ ప్రక్కకు వంగి వుంటే సంతతి, సంపద – రెండూ వుండవు, కుడి ప్రక్కకు వుంగి వుంటే, కొడుకులు పుడతారు.[6] అన్నాడు. ఈ విచిత్ర మౌఢ్యంఆయనకు అత్రి, గర్గుడు మొదలైనవారు చెప్పారుట.

అంటే కేవలం ఖగోళ గణితంలో మేధావులైనంత మాత్రాన, వాళ్ళు

---

5. అపచారేణ నరాణాం ఉపసర్గః పాపసంచయాత్భవతి
సంసూచయంతి దివ్యాంతరిక్ష భౌమాస్త ఉపాతాః (బృహత్సంహిత : 46-2)

6. బృహత్సంహిత : 67-8

మూఢనమ్మకాలకూ, అశాస్త్రీయతర్కానికి అతీతులని మనం గుర్తించలేము. మూఢనమ్మకాలనేవి ఆ శాస్త్రజ్ఞుల సంస్కారం 'Character training' లో భాగమే. అందువల్ల, ఏ శాస్త్రజ్ఞుడైనా మూఢనమ్మకాలు కలిగి వున్నాడంటే, అది అతని శాస్త్రవిజ్ఞాన ఫలితమని భావించడం సరికాదు. అతనికి తెలిసిన శాస్త్ర విజ్ఞానం ప్రతిపాదిస్తున్న తాత్విక ఫలితాలు అతనికి తెలియవని మనం అర్థం చేసుకోవాలి.

ఏ పిచ్చికైనా ఓ పద్ధతంటూ వుంటుందంటాడు షేక్స్‌పియర్. కాని, జ్యోతిషం పిచ్చికీ, వాస్తు పిచ్చికీ ఒక పద్ధతంటూ లేదనిపిస్తుంది.

శిశుపాలుడు నేల గూలినప్పుడు మేఘాలు లేకుండానే పిడుగులు, వర్షాలు పడ్డాయిట! సముద్రాలతో, పర్వతాలతో భూమి గిరగిరా తిరిగిందట! అలా నన్నయ భారతం వర్ణించింది కాబట్టి, కోపర్నికస్ ప్రతిపాదించిన సూర్యకేంద్ర సిద్ధాంతం కోపర్నికస్‌కు ముందు 400 సంవత్సరాల క్రితమే నన్నయకు తెలుసునని ఓ వాస్తు వ్యాపారి తన గ్రంథంలో యిరికించాడు.[7] పైగా ఆ రచయిత తనకు మూఢనమ్మకాలు లేవని చెప్పుకుంటాడు.

నిజానికి, ఈనాడు మూఢనమ్మకాలున్న వారికంటే వాటిని సమర్థించే మత పునరుజ్జీవన వాదులే ఎక్కువ ప్రమాదకారులు. మేఘాలు లేకుండా పిడుగులు,

---

7. గౌరు తిరుపతిరెడ్డి: వాస్తు శాస్త్ర వాస్తవాలు, పే - 30-35

"ఘనజాలము లేకయె పెలుచన పిడుగులతోడి వృష్టిచైద్యుని పాతం బునకురిసె,
సముద్రమహాద్రి నికాయముతో ధరిత్రి దిర్దిర తిరిగెన్॥

అని నన్నయ శిశుపాలవధ సందర్భంగా వర్ణించాడు. అందులో శిశుపాలుడు నేలపై కూలినప్పుడు మేఘాలు లేకుండానే పిడుగులు, వర్షాలు పడ్డాయిట! అదీ నన్నయ సైన్సు! అప్పుడు భూమి సముద్రాలతో, పర్వతాలతో దిర్దిరతిరిగిందట! భూమి తన చుట్టూ తాను తిరిగిందో, లేక సూర్యుడి చుట్టూ తిరిగిందో నన్నయ చెప్పలేదు. భూమి అదిరింది అనడానికి అతిశయోక్తిగా నన్నయ ఏదో వ్రాస్తే, దాన్ని సూర్యకేంద్ర సిద్ధాంతంగా మార్చి అన్వయించడం మన మతపునరుజ్జీవన వాదుల ప్రవృత్తికి దర్పణం పడుతుంది. అయినా, శిశుపాలుడు పడినప్పుడు భూమి తిరిగిదంటే - అంతకుముందూ, ఆ తర్వాతనూ తిరగలేదని అర్థం కాదా? పైగా, తిరుపతిరెడ్డిగారు వ్యాఖ్యానిస్తారూ, మంచివాళ్లు పుట్టినప్పుడు దేవదుందుభులు మ్రోగుతాయిట, గాలి చల్లగా వీస్తుందట! చెడ్డవాళ్ళు పుట్టినపుడు, చచ్చినపుడు తుఫానులు, భూకంపాలు వస్తాయట! ఏమి సైన్సండీ! అలానే అల్లసాని పెద్దనకూ భూ భ్రమణాన్ని గురించి తెలుసునని ఒక చాటువుకు విపరీతార్థం తీశారు. కాని, "కనకగిరిన్ ప్రదక్షిణముగా శశిభాస్కరతారకాగణంబనవరతంబు ద్రిమ్మరు మహామునిసప్తకంబుతో" (అరణ్యపర్వం, 6ఆ, 38ప.) అని వర్ణించిన తిక్కనగారికి మాత్రం భూమిమీది వింధ్యపరత్వం చుట్టూ చంద్ర, సూర్య, నక్షత్రాలన్నీ నిరంతరం తిరుగుతున్నాయని మాత్రమే తెలుసు! భూమిని చాపగా చుట్టించిన పోతన్న భాగవతానికికూడా భూమి చాపలాగా వున్నదని తప్ప గోళమని తెలియదు. ఇలాంటి భావ దారిద్ర్యాన్ని దాచుకున్నందువల్ల ప్రయోజనం ఏమీ వుండదు సుమండీ!

వర్షాలుపడతాయని జనాన్ని నమ్మించబూనేవారికి శాస్త్రానికీ, అశాస్త్రానికీ మధ్య తేడా యెలా తెలుస్తుంది?

కోపర్నికస్ ప్రతిపాదించింది కేవలం భూచలనాన్ని కాదు.

భూమి విశ్వానికి కేంద్రమనే భావనని ఆయన తొలగించాడు.

భూమి కూడా ఒక గ్రహమన్నాడు. చంద్రుడికి గ్రహాలలో స్థానం లేదన్నాడు.

భూమి చుట్టూ తిరిగే చంద్రుణ్ణి ఉపగ్రహమన్నాడు.

భూమి స్థానాన్ని శుక్రుడికీ, అంగారకుడికీ మధ్య చూపించాడు.

సూర్యుడు భూమి చుట్టూ తిరగడం లేదన్నాడు.

గ్రహాలన్నీ సూర్యుడి చుట్టూ తిరుగుతున్నాయన్నాడు.

ఈ ప్రతిపాదనలను గణిత బద్ధం చేసి సూర్య కుటుంబ వివరాలను అన్వేషించడానికి వాస్తవిక మార్గాన్ని చూపాడు.

కోపర్నికస్‌కు ముందు ఆ ప్రతిపాదనల్ని అంత సమర్థవంతంగాచేసి, దానికి గణిత శాస్త్ర ప్రతిపత్తి కల్పించినవారు ఈ లోకంలో లేరు – లేరంటే లేనేలేరు.

కాబట్టి వేదాలలో, వేదాంగాలలో, భారతంలో, రామాయణంలో, "అది వున్నది, ఇది వున్నది" అనే సొళ్ళు కబుర్లు మానివేయడం మనవారికి మర్యాద.

## జ్యోతిష ఫలాలు :

ఖగోళ విజ్ఞాన పద్ధతిని అర్థం చేసుకోవాలి, జ్యోతిష మౌఢ్యాన్నైతే నమ్మాలి. జ్యోతిషానికీ, ఖగోళ విజ్ఞానానికీ సంబంధం లేదు. జ్యోతిషం మార్మిక మౌఢ్యంపై ఆధారపడి వుంది. తప్పుడు ఖగోళ విజ్ఞానంతో లంకెవేసుకొని వుంది. అందువల్ల, జ్యోతిష ఫలాలనేవన్నీ అబద్ధాలే. మంచి, చెడ్డ ముహూర్తాల గురించి ఏ సందర్భంలో ఆలోచించినా – అదంతా అవివేకమే – జ్యోతిష ఫలాలు నిజమా, అబద్ధమా అని ప్రశ్నించుకున్న ప్రాచీనులే అది నిజం కానూవచ్చు, అబద్ధం కానూవచ్చు అని సమాధానపడ్డారు.

"జ్యోతిషం, ప్రశ్న, శకునం, వాస్తువు, సాముద్రికం మొదలైనవన్నీ ఒక్కొకప్పుడు ఫలిస్తాయి, మరొకప్పుడు ఫలించవు. అలానే, కల, మంత్రాలు తంత్రాలు కూడా ఒక్కొక్కప్పుడు ఫలిస్తాయి, మరొకప్పుడు ఫలించవు"[8] అని వాస్తు సర్వస్వం అంటుంది.

"మొదలైనవన్నీ (ఆదయః)" అనడంలో ప్రాచీనుల మార్మిక ప్రక్రియలన్నీ అదే తరగతి క్రిందకు వస్తాయి. "అయితే ఆడ, లేకుంటే మగ" అనే ప్రసవజోస్య ఫలాలవంటి లాటరీ మోసాలు మొదటి నుంచీ వుండేవని దీనివల్ల అర్థమవుతుంది.

---

8. జ్యోతిష ప్రశ్న శకున సాముద్రికాదయః
స్వప్నశ్చ మంత్ర తంత్రాణి క్వచిత్‌ఫలతి నక్వచిత్ (వాస్తు సర్వస్వం, ధనవాస్తు – 6)

జ్యోతిర్వాస్తు పండితులు చెప్పేవన్నీ గుడ్డివేటు ఫలాలే. వారు చెప్పిన ప్రకారం జరిగితే జ్యోతిర్వాస్తువుల మహిమ అంటారు. తప్పిపోతే, ఏదో గుడ్డిసాకు చెపుతారు. అయితే శుభం, కాకుంటే అశుభం.

**మా యింటి కథ :**

నేను చీరాలలో వుంటున్నాను. ఓ వాస్తు మిత్రుడు నన్ను కలిసి నాగండ్ల (మా స్వగ్రామం) లోని మా యింటి ప్లాను చెప్పమన్నాడు. 30 శెంట్ల స్థలంలో మధ్య మెరకమీద వున్న ఒక పాత మట్టి మిద్దె మా యిల్లు. అది నివాస యోగ్యంగా లేదు కాన, నేనెన్నడూ ఆ యింటిలో నివసించలేదు. పదిపదేనేళ్లు పూరిళ్లలోనే నా నివాసం. ఆ విషయమే చెప్పాను.

"అందుకేనండీ మీరింత ప్రతిభావంతులయ్యారు!" అన్నాడా వాస్తు మిత్రుడు. ఆ యింటి వాస్తుప్రభ గురించి యేకరువు పెట్టాడు.

ఆ యింటిని నేను మరో ఆసామి వద్దనుంచి కొన్నాను. అతనికి 5 గురు మగ సంతానం. ఈడు మించిన తర్వాత కూడా వారిలో ఏ ఒక్కరికీ వివాహం కాలేదు, ఆ దోషం ఆ యింటిలో వున్నదని ఆ ఆసామి నమ్మకం. అందుకే నాకు అమ్మాడు. నేను కొన్న తర్వాత అతని బిడ్డలందరికీ పెండ్లిండ్లయ్యాయి. "అతనికి దోషమైనది నాకెందుకు దోషం కాలేదు?" అని నా ప్రశ్న.

"ఈ యిల్లుకాక మీకు వేరేయిల్లేమైనా వుందా?" అని వాస్తుమిత్రుడి ప్రశ్న

"లేదు" అని నా సమాధానం. నిజంగానే నాకు వేరే యిల్లు లేదు.

"మీకు అమ్మిన ఆసామికి వేరే యిల్లేమైనా వుందా?" అని ప్రశ్న.

"అతనికి వేరే డాబా యిల్లు వుంది" అని నా సమాధానం.

"అదీ, విషయం" అంటూ వాస్తు మిత్రుడు చెప్పడం ప్రారంభించాడు.

ఆయన ఏమి చెప్పినా, నాకాయిల్లు ఒక్కటే వుండడంవల్ల ఉన్నతీ, నాకు అమ్మిన ఆసామికి మరో యిల్లు వుండడంవల్ల అధోగతి అనడంలోని వివేకమేమిటో ఆయన విడమరచి చెప్పలేకపోయాడు. నేను నాటికీ నేటికీ అద్దెయిళ్ళలో తప్ప, స్వంతయింటిలో నివసించలేదు. మా మట్టిమిద్దె కూడా 20 సంవత్సరాలకు పూర్వమే కూలిపోయింది. నాలో యేమయినా విశేషముంటే, అది నాకు పది పదారేళ్ళ వయసు నుంచీ, నేను మా ఉమ్మడి కుంటుంబలో వున్నప్పటినుంచీ, వేరైన తర్వాతనూ, యిప్పటికీ అలానే వుంది. అందులో ఉచ్చమూలేదు. నీచమూలేదు. అసలా యిల్లు వంద సంవత్సరాల క్రితం కట్టించిన బ్రాహ్మడు ఆస్తి అంతా కోల్పోయి, చివరకు కుళ్లి, కంపుకొట్టి దుర్మరణం పాలయ్యాడు. మా వాస్తు మిత్రుడు ముద్రగడ రామారావుగారి శిష్యుడు కూడా.

నిజానికి, మార్మిక ప్రక్రియలన్నీ, "బొమ్మ - బొరుసు" చిత్తాట ప్రయోగాలే. వాక్చాతుర్యంవల్ల జ్యోతిర్వాస్తు పండితులు జనాన్ని తేలికగా బుట్టలో వేసుకుంటారు.

## గ్రహశాస్త్రంలో కొత్తలేమీ లేవా?:

కొందరు వాస్తు గ్రంథకర్తలు సాంప్రదాయిక అజ్ఞానంతో సంతృప్తిపడతారు. గృహ నిర్మాణానికీ, వాకిళ్ళు యెత్తడానికీ, బావులు త్రవ్వడానికీ, గృహప్రవేశం చేయడానికీ ముహూర్తబలాలు చూస్తారు. దశ అంతా దిశలలో వుందని కొందరంటే, గ్రహచారాన్ని నిర్లక్ష్యం చేయరాదని కొందరంటారు. అయితే, పంచాంగాల గ్రహచారమా? లేక వాస్తవ గ్రహచారమా? ఇందులో వారు పరిగణనలోకి తీసుకొనేది ఏమిటి? అని ఆలోచిస్తే - పంచాంగాల గ్రహచారమే వారి ముహూర్త బలాలకు, ఫలాలకు గీటురాయి అని తేలుతుంది. అందువల్ల వాస్తవ గ్రహాచారానికీ, పంచాంగ గ్రహచారానికీ మధ్య తేడా యేమున్నదో చూడాలి.

"గ్రహశాస్త్రమందు కొత్త విషయములు కనిపెట్టవలసిన ఆవశ్యకత పెద్దగాలే"[9] దంటున్నాడొక జ్యోతిర్వాస్తు పండితుడు. ఇదొక పెద్ద జోక్. ఇలాంటి జోకుల వల్లనే ఇక్కడ జ్యోతిషం, ఖగోళ విజ్ఞానం ప్రసక్తి తేవలసివస్తుంది.

గ్రహశాస్త్రం గురించి ప్రాచీనులకు తెలిసిందే తక్కువ. అదీన్నీ తప్పుల తడక. ఆ తప్పుల తడక కూడా ఈనాటి జ్యోతిష్కులకు అంతంత మాత్రంగానే తెలుసు. ఈనాడు ఖగోళ విజ్ఞానం ఏ స్థాయికి పెరిగిందో తెలుసుకోడానికి మన జ్యోతిష్కులకు "వారి గ్రహచారం" అడ్డు వస్తున్నది.

## జ్యోతిష్కుల కేమి తెలుసు?

మన ప్రాచీనులు జ్యోతిషం పేరుతో చెప్పిన గ్రహ సిద్ధాంతమంతా తప్పుల తడక. ఆ విషయం ఇంతకు ముందు కొంత చూచాం. మన పంచాంగాలన్నీ ఆ తప్పుల తడక లెక్కలే. ఐనా, కేవలం "గ్రహశాస్త్రం" విషయంలోనే వాటి తప్పులతీరు ఎలా వుందో మరోసారి వివరించుకుందాం.

మన పంచాంగ జ్యోతిష్కులు రాహువు, కేతువు అనే రెండు గ్రహాలున్న వన్నారు. అలాంటి గ్రహాలు లేనేలేవు.

రాహుకేతువులు సూర్యచంద్రుల్ని మ్రింగడంవల్ల సూర్యచంద్ర గ్రహణాలు యేర్పడుతున్నాయన్నారు. అది శుద్ధ అబద్ధం.

---

9. అలుగులశెట్టి ఉమామహేశ్వరరావు: వాస్తుశాస్త్ర రహస్యములు, పే - 17

మన పంచాంగాల ప్రకారం అశుభాన్ని కలుగజేయడంలో రాహువుపాత్ర చాల ప్రధానమైంది. అసలు వునికిలోనే లేని గ్రహానికి దుష్టపాత్ర అప్పగించడం మన దివ్యజ్ఞుల జ్ఞాన దారిద్ర్యానికి గుర్తు.[10] పంచాంగాలు రాహుకాలాన్ని ప్రత్యేకంగా గుర్తించి, దాన్ని వర్జ్యంగా పేర్కొంటాయి.

మనవారు చంద్రుడు గ్రహమన్నారు. అది తప్పు

సూర్యుడు గ్రహమన్నారు. అది తప్పు

భూమి చుట్టూ నవగ్రహాలూ, నక్షత్రాలూ తిరుగుతున్న వన్నారు. అది తప్పు.

సూర్యచంద్రుల్నీ,రాహుకేతువుల్నీ గ్రహాలుగా లెక్కించి మొత్తం నవగ్రహాలున్నారు. అది తప్పు. మనవారి మేధాశక్తి నవగ్రహ పూజ కూడా చేయి స్తుంది అది శుద్ధ అజ్ఞానం! అయినా, దాన్ని సమర్థించే మేధావులున్నారు.

ప్రాచీన కాలంలో అభివృద్ధి చెందిన దేశాల మేధావులందరికీ 5 గ్రహాలు మాత్రమే తెలుసుననీ, మనవారికి తెలిసినవి కూడా ఆ 5 గ్రహాలేననీ, అవి అంగారక, బుధ, గురు, శుక్ర, శని గ్రహాలనీ లోగా చూచాం.

మనవారి మార్మిక పాండిత్య పటిమ వాటికి రాహుకేతువుల్ని కలిపింది. పిచ్చి పిచ్చి పురాణ కథలు అల్లింది. ప్రాచీనులకు తెలిసిన 5 గ్రహాలే కాక – శనికి అవతల యురేనస్, నెప్ట్యూన్, ప్లుటో అనే మూడు గ్రహాలున్నాయి. గణితం ప్రకారం వాటిని ఆధునికులు కనుగొన్నారు. వాటి కక్ష్యలు, వ్యాసాలు, బరువులు, సాంద్రతలు వగైరా వివరాలు చాలా కనుగొన్నారు. ఆ మూడు గ్రహాలు వున్నట్లే ప్రాచీనుల కెవ్వరికీ తెలియదు. 1781లో "విలియం హెర్షెల్ యురేనసును, 1846లో లెవెర్రీర్ గణితం ప్రకారం "గాలీ" నెప్ట్యూన్‌ను, 1930లో లోవెల్ చెప్పిన ప్రదేశంలో "టూంబా" అనే ఖగోళ

---

10. రాహుకేతువులనే గ్రహాలు లేనేలేవని ఈనాటి మనకు తెలుసు. సూర్య చంద్ర గ్రహణాల సందర్భంలో సూర్య, చంద్ర, భూములు ఒకే సరళ రేఖలోకి వచ్చినపుడు ఆ రేఖలోని ఊహామాత్ర బిందువుల్ని nodal Pointsగా కొంతమంది ప్రాచీనులు సైతం గుర్తించారు. మనవారు వాటికి గ్రహాలరంగు పులిమి అవి సూర్యచంద్రుల్ని మ్రింగుతున్నాయన్నారు. "వాస్తుశాస్త్ర రహస్యములు" (పే72-73) అనే గ్రంథంలో అలుగులశెట్టి ఉమామహేశ్వరరావుగారు రాహుకారకత్వాలంటూ ఒక జాబితా యిచ్చాడు. "దొంగ, విషం, శత్రువు" "ఆయుధభయం. రాజభయం..." అంటూ అనేక దుష్ఫలాల జాబితా యిచ్చాడు. ఆ జాబితాలో మతవ్యతిరేకత కూడా వుంది. రాహువంటే పాముతల అట! అది ఆకాశంలో వుంటుందట! ఈ రాహుతల జ్యోతిష్కుల తలల్ని పెట్టే బాధ అంతా యింతా కాదు. ఇదే, వారి శాస్త్రం తీరు!

కాళిదాసు చేత రచించబడిందన్న "ఉత్తర కాలామృతం" 5వ ఖండంలో రాహుకారకత్వ ఫలాలంటూ "క్రూరవాక్యాలు, కుత్సిర్కం, కడజాతి సంబంధం, పాపస్త్రీ సంగమం, జూదం" వగైరా పేర్కొనబడ్డాయి. అలానే కేతుకారకత్వ ఫలాలుగా క్షయ, వ్రణాలు, చాంచల్యం, స్ఫోటకం, అజున్నరోగం వగైరా పేర్కొనబడ్డాయి. లేనిగ్రహాల ఫలాలను ఇలా పేర్కొనడంలోని శాస్త్ర రహస్యం జ్యోతిష్కులకే అర్థం కావాలి.

పరిశీలకుడు ప్లటోను, ఇతర శాస్త్రజ్ఞులనేకులు, అంగారక – గురు గ్రహాలకు మధ్య 5000కు పైగా లఘు గ్రహాలను కనుగొన్నారు. మనుషుల భవిష్యత్తును చెప్పగలమంటున్న జ్యోతిష్కులు వాటిని కనుక్కోలేదు. వాటిని తమ జ్యోతిశ్చక్రాల్లో ఇముడ్చుకోలేదు. వారికివేమీ తెలియవు. వారి అజ్ఞాన జాబితాలో చాలా వున్నాయి కాని, అవి వాస్తవాలుగా లేవు. ఇటీవల ఆధునిక భారతీయ ఖగోళ పరిశీలకులు నవీన్ కె.షా, సిద్ధార్థ ఎన్.లల్కా అనేవారు మరో రెండు గ్రహాలను కనుగొన్నట్లు పత్రికల్లో వార్తలు వచ్చాయి. జ్యోతిష్కులకివేమీ తెలియవు.

భూమి గ్రహమన్నట్లు ప్రాచీనులకు తెలియదు.

అది సూర్యుడి చుట్టూ తిరుగుతున్నదని వారికి తెలియదు.

భూమికి చంద్రుడు ఉపగ్రహమని వారికి తెలియదు.

భూమి చుట్టూ చంద్రుడొక్కడే తిరుగుతున్నదని వారికి తెలియదు.

అసలు గ్రహాలకు వుపగ్రహాలుంటాయనే వూహే వారికి రాలేదు.

ఇతర గ్రహాలకు కూడా వాటి చుట్టూ తిరిగే వుపగ్రహాలు (చంద్రులు) వుంటాయని వారికి తెలియదు. అంగారకుడికీ, బృహస్పతికీ మధ్య 5000 అల్ప గ్రహాల కూటమి వుంటుందని వారికి తెలియదు.

వారికి తెలిసిన 5 గ్రహాలతోపాటు భూమి, అస్టిరాయిడ్స్, యురేనస్, నెప్ట్యూన్, ప్లుటో కూడా గ్రహాలేననీ, అవి అన్నీ సూర్యుడి చుట్టూ వేర్వేరు కక్ష్యలలో తిరుగుతాయనీ వారికి తెలియదు.

గ్రహాలన్నీ తమ చుట్టూ తాము తిరుగుతున్నాయని తెలియదు.

ఏయే గ్రహాలు సూర్యుడికి ఎంతెంత దూరాలలో వున్నవో, భూమికి ఎంతెంత దూరాలలో వున్నవో తెలియదు.

ఏ గ్రహం తర్వాత ఏ గ్రహం వున్నదో తెలియదు.

గ్రహాలు తమచుట్టూ తాము ఒకసారి తిరగడానికి పట్టే కాలాన్ని "రోజు" అంటామని వారికి తెలియదు.

భూగ్రహం యొక్క రోజుకూ, మిగతా గ్రహాల రోజులకూ తేడా వుంటుందని వారికి తెలియదు.

వేర్వేరు గ్రహాలు వేర్వేరు కక్ష్యలలో వేర్వేరు వేగాలతో సూర్యుడి చుట్టూ తిరుగుతున్నాయని తెలియదు.

అందువల్ల వేర్వేరు గ్రహాలకు వాటి సంవత్సర కాలాలు భిన్నంగా వుంటాయని వారికి తెలియదు.

అసలు గ్రహాలన్నిటికీ భూమికివలెనే రోజులు, నెలలు, సంవత్సరాలు

వుంటాయని వారికి తెలియదు.

సూర్యుడొక నక్షత్రమని వారికి తెలియదు. అది 6,000 కోట్ల కోట్ల మైళ్ళ వ్యాసంతో విస్తరించివున్న పాలపుంతలో తిరుగుతున్నదనీ, అలా ఒకసారి చుట్టి రావడానికి (సూర్యుడికి) 20 కోట్ల సంవత్సరాలుపడుతుందనీ తెలియదు.

ఏయే తోకచుక్కలు ఎన్ని సంవత్సరాలకొకసారి భూమికి దృశ్యమానమవతాయో వారికి తెలియదు.

వాటికి తోకలెందుకు యేర్పడతాయో తెలియదు.

ఎన్నేళ్ళ కొకసారి ఆకాశంలో ఉల్కాపాతం కాంతి వెల్లువలా దర్శనీయమవుతుందో వారికి తెలియదు. తోకచుక్కలూ, ఉల్కలూ సూర్య కుంటుంబంలోనివేనన్న విషయం వారికి తెలియదు.

ఇక, మన జ్యోతిష్కులకూ, పంచాంగకర్తలకూ ఏమి తెలుసు?

శుభాశుభ ఫలాలు చెప్పేవారికి ఏమి తెలుసు?

విరాట్పురుషుడి కంటి నుంచి సూర్యుడూ, మనసు నుంచి చంద్రుడూ పుట్టుకొచ్చాయన్న వేదాలకు (రుగ్వేదం, 10వ మండలం, 90వ సూక్తం) ఖగోళ విజ్ఞానం ఏ పాటి తెలుసు?

తోకచుక్కలవల్ల వుత్పాతాలు, గ్రహణాల వల్ల వైపరీత్యాలు, ఉల్కాపాతంవల్లప్రముఖుల మరణాలు సంభవిస్తాయన్న పచ్చి అబద్ధ కల్పనలు మాత్రం తెలుసు.

ఆధునిక శాస్త్ర విజ్ఞానం ఒక్కో నూతన విషయాన్ని కనుక్కున్నపుడు అది వేదాల్లోనో, మరో తాటాకులబొత్తిలోనో వున్నదని ఫోర్జరీదస్తావేజులు సృష్టించడం మన వారికి తెలుసు. వాటికి ఫోర్జరీ అర్థాలు సృష్టించడం మనవారికి తెలుసు. అంత మాత్రాన అవి శాస్త్రాలైపోవు.

ఏయే గ్రహాల వ్యాసాలు ఎంతెంతో, బరువులెంతెంతో, సాంద్రత లెంతెంతో, గురుత్వశక్తులెంతెంతో, ఏయే గ్రహాలకు ఎన్నెన్ని ఏ సైజు వుపగ్రహాలున్నవో, ఎన్నిటికి వుపగ్రహవలయాలున్నవో, ఏఏ గ్రహాలలో ఏఏ మూలద్రవ్యాలు, సంయోగద్రవ్యాలు ఉన్నవో, తోకచుక్కలు – ఉల్కలు ఏమిటో – ఒకటేమిటి? ఇలాంటి అసంఖ్యాక వివరాలను ఆధునిక ఖగోళ విజ్ఞానం కనుగొన్నది. ఇతోధిక పరిశోధన ఇంకా కొనసాగుతూనే వుంది.

పంచాంగాల గొంగళిలో దాక్కున్న చీరపేలనువెదకే వారికి ఈ వివరాలు కన్పించవు.

**మనవారి భూపరిజ్ఞానం :**

అసలు మనం నివసిస్తున్న భూమి గురించి ప్రాచీన ఖగోళ గణితశాస్త్రజ్ఞులకేమి తెలుసు? భూమి స్థిరంగాలేదు. గ్రహనక్షత్రాదులేవీ స్థిరంగా లేవు. కాగా, భూమిమీది మనిషికీ, గ్రహనక్షత్రాదులకీ మధ్య వుండే దూరం వారికెలా తెలుస్తుంది? కొన్ని నక్షత్రాలనుంచి కాంతి భూమికి చేరడానికి ఏండ్లు పూండ్లు పడుతుంది. ఐనపుడు, వాటి వాస్తవ స్థానం - స్థిరస్థానం ఎలా తెలుస్తుంది? వారిది ఖగోళ విజ్ఞానం కాదు - అది జ్యోతిరజ్ఞానం. దాన్ని అనుసరించే జ్యోతిష్కులకు ఏమి తెలుసు? ఎంత తెలుసు? భూమి వ్యాసాలు, చుట్టుకొలతలు తెలుసా? సూర్యుడి నుంచి అది ఏయే కక్ష్యల్లో తిరుగుతున్నదో తెలుసా? అది తనచుట్టూ తాను, తన అక్షం చుట్టూ తాను, సూర్యుడి చుట్టూ తాను తిరుగుతున్నదని తెలుసా? ఏయే వేగాలతో తిరుగుతున్నదో తెలుసా? భూమి ఘనపరిమాణమూ, బరువూ, ఉపరితలవైశాల్యమూ తెలుసా? నేల ఉపరితల వైశాల్యమెంతో, నీటి ఉపరితల వైశాల్యమెంతో తెలుసా? ఏమి తెలుసు?

ఆ మాత్రం తెలియనివారికి 'అఖిలాండ కోటి, బ్రహ్మాండాల' గురించి తెలుసా? వాటి ప్రభావం భూమి మీద నివసిస్తున్న మనుషుల మీదనే వుంటుందని తెలుసా!!

పశు, పక్షి, వృక్షాదుల మీద కూడా వుంటుందని తెలియదా! ఇలాంటి అబద్ధాలు చెప్పి, సాధారణ జనాన్ని మోసంచేసి, దోపిడి చేయడమేనా జ్ఞానానికి ప్రయోజనం?

ఫలానాగ్రహాలు మంచివనీ, ఫలానాగ్రహాలు మంచివికావనీ ఏ ప్రాతికపదికన నిర్ణయించారు పూర్వులు? అలానే నక్షత్రాలను, రాసులను శుభాశుభకారకాలుగా ఎలా నిర్ణయించారు? వాటిని పట్టుకొని ఈనాటి జ్యోతిష్కులూ, పంచాంగకర్తలూ, వారిని నమ్మేవారూ వురేగడమేనా శాస్త్రమంటే?

గ్రహనక్షత్రాదుల జ్యోతిర్వాస్తు ఫలాలు వాస్తవమైతే హిరోషిమా, నాగసాకీ (జపాన్ నగరాలు) లపై జరిగిన ఆటంబాంబుల దాడికి జ్యోతిషం సమాధానమేమిటి? ఆ బాంబుల ప్రయోగాలవల్ల లక్షలాది మంది మరణించారు. లక్షలాది మంది వికలాంగులయ్యారు. లక్షలాది గృహాలు విధ్వంసమయ్యాయి, కోట్లాది జీవజాలం ఒక్కసారిగా అంతరించింది. ఆ విస్ఫోటనంలో విడుదలైన రేడియోధార్మిక శక్తి అనంతర తరాలవారి మీద కూడా తన ప్రభావాన్ని చూపిస్తున్నది. ఇందుకు ఏ జ్యోతిషఫలాలు కారణం? ఏ వాస్తుఫలాలు కారణం?

తాము నివసిస్తున్న భూమి **గురించి** తెలియని జ్యోతిష్కులకు ఆకాశంలోని గ్రహ నక్షత్రాదులగురించీ, అవి మానవుడి మీద చూపే ప్రభావాన్ని గురించీ ఎలా తెలిసింది?

అంతేకాదు - భూమి చుట్టూ తిరుగుతున్న వుపగ్రహం ఒక్క చంద్రుడే. ఆ

చంద్రుడిమీదకు, ఆధునిక ఖగోళ విజ్ఞానులు మనుషుల్ని పంపించారు. ఆ మనుషులు చంద్రుడి మీద నుంచి చంద్రశిలల్ని భూమిమీదకు తెచ్చారు. చంద్రుణ్ణి గురించి మరెన్నో వివరాలు సేకరించారు. కాని, మనసనాతనులు చంద్రుణ్ణి దేవతగా పరిగణించారు. దాని కళలకు శాపాల కథలు తగిలించారు. తిథులు కల్పించి వాటికి మంచి చెడ్డల్ని అంటగట్టారు.

కాబట్టి, మన ఫోర్జరీ పండితులకు భూగ్రహాన్ని గురించి కానీ, చంద్రవుపగ్రహాన్నీ గురించి కానీ ఏమీ తెలియదు. ఏమీ తెలియకుండానే వారు వాటికి ఫలాలను అంటగట్టారు. అది వైజ్ఞానిక నేరమవుతుంది. తమకు తెలియని విషయాల్ని – తమకు తెలియదని తెలిసిన విషయాన్ని – తమకు తెలిసినట్లుగా అబద్ధాలాడి, జనాన్ని మోసగించడం ఎంతటి క్షమించరాని వైజ్ఞానిక నేరమో చెప్పడానికి వీలులేదు.

జ్యోతిషం ఒక మోసం, వాస్తువు మరొక మోసం, ఒక మోసానికి, మరో మోసానికి లంకెవేస్తే, అది శాస్త్రమవుతుందా? రెండు అశాస్త్రాలను గుణిస్తే అది శాస్త్రమవుతుందా?

మన జ్యోతిష్కులకేమి తెలుసు? అనే ప్రశ్న ఇప్పుడు వేసుకుందాం, మోస మొక్కటే తెలుసునని పై వివరాలు సమాధానమిస్తాయి.

## సూర్యకుటుంబ స్థూల వివరాలు :

విస్తరిస్తున్న విశ్వందాక, గెలాక్సీలదాక, నక్షత్రాలదాక పోనవసరం లేదు. మన జ్యోతిష్కుల పంచాంగ గ్రహజ్ఞానమెంతో గుర్తుకు తెచ్చుకొంటే, జ్యోతిష ఫలాల మీది నమ్మకం ఎంత అర్థరహితమైందో బోధపడుతుంది.

సూర్యుడొక మధ్య తరహా నక్షత్రం. అది మండుతున్న అగ్నిగోళం. నిమిషానికి 24 లక్షల టన్నుల పదార్థాన్ని అది అగ్నిజ్వాలల రూపంలో ప్రదేశంలోకి విరజిమ్ముతుంది. వేర్వేరు పొరల్లో దాని ఉష్ణోగ్రత 10,000F° నుంచి 2,76,00000F° దాక వుంటుంది. దాని సాంద్రత 1.409 కాగా, వ్యాసం 8,60,000 మైళ్లు. దాని వ్యాసం మీద భూమిని పేర్చుకొంటూ పోతే 109 భూములు పడతాయి. ద్రవ్యరాశితో పోలిస్తే అది భూమికి 3,32,000 రెట్లు. పరిమాణంలో పోలిస్తే భూమికి 13,00000 రెట్లు పెద్దది. అలాంటి సూర్యుణ్ణి భూమిచుట్టూ తిప్పే పంచాంగ జ్యోతిషాలగురించి మనం ఏమనుకోవాలి?!

ఇలా చెప్పుకొంటూ పోతే ఒక్క సూర్యుడే మహా గ్రంథమవుతుంది. ఇక గ్రహ కుటుంబం సరేసరి.

ఈనాటి ఖగోళ విజ్ఞాన పరిశోధనల్లో తేలిన కొన్ని అంశాలను పరిశీలిస్తే "గ్రహశాస్త్రంలో కొత్త విషయాలను కనిపెట్టవలసిన అవసరం" వుందో లేదో తెలుస్తుంది. అధునిక ఖగోళ విజ్ఞానం కనుగొన్న గ్రహ వివరాలను కొన్నిటిని ఒక పట్టికలో తెచ్చి చూద్దాం.

| గ్రహం పేరు | వ్యాసం మైళ్లలో | సూర్యుడి నుండి సగటు దూరం మైళ్లలో | పరిభ్రమణ కాలం | భ్రమణ కాలం | ద్రవ్యరాసి | సాంద్రత | ఉప గ్రహాలు |
|---|---|---|---|---|---|---|---|
| 1. బుధ | 3319 | 360 00000 | 87.97 రో॥ | 58 65 రో॥ | 0.054 | 5.42 | 0 |
| 2. శుక్ర | 7517 | 670 00000 | 224.7 రో॥ | 243 రో॥ | 0.815 | 5.2 | 0 |
| 3. భూమి | 7921 | 930 00000 | 365.26 రో॥ | గం. 24-56-04 సె | 1.000 | 5.51 | 1* |
| 4. అంగారక | 4222 | 1416 00000 | 687 రో॥ | గం. 24-37-23 సె | 0.107 | 3.9 | 2 |
| 5. అస్టిరాయిడ్స్ | వివిధ సైజులు | 2500 00000 | 4.5 సం. | - | - | - | - |
| 6. గురు | 88846 | 4830 00000 | 11.86 సం. | గం. 9-50-30 సె | 817.9 | 1.32 | 16 |
| 7. శని | 74897 | 88867 00000 | 29.4 సం. | గం. 10-14-0 సె | 95.14 | 0.69 | 20 |
| 8. యురేనస్ | 31763 | 17840 00000 | 84.01 సం. | గం. 23-15-0 సె | 14.58 | 1.21 | 15 |
| 9. నెప్ట్యూన్ | 30775 | 27987 00000 | 168.8 సం. | గం. 16-3-0 సె | 17.22 | 1.67 | 8 |
| 10. ఫ్లుటో | 1454 | 36745 00000 | 248.8 సం. | గం. 6-9-0 సె | 0.0026 | 2.1 | 1 |
| 11. పేరు స్థిరంకాలేదు | 91588 | 71710 00000 | - | 2.1 mps సె | | 0.11 | - |
| 12. పేరు స్థిరంకాలేదు | 72360 | 53880 00000 | - | వేగం 2.4 మై | | 0.13 | - |

*2160 మైళ్ళ వ్యాసం గల చంద్రుడు (భూమికివున్న ఒకే ఒక ఉపగ్రహం) భూమికి సగటున 238355 మైళ్ళ దూరంలో ఉండి 27 రోజుల 7 గంటల 43 నిమిషాల 12 సెకండ్ల కొకసారి తనచుట్టూ తాను తిరుగుతూ, అంతే సమయంలో భూమిచుట్టూ కూడా ఒకసారి తిరిగి వస్తుంది. ఈ ద్వివిధ చలనంవల్ల రెండు నెలపొడుపుల మధ్య కాలం 29.5 రోజులు తీసుకుంటుంది. ఇతర గ్రహాలకు గల ఉపగ్రహాల కొలతలు కూడా ఆధునిక ఖగోళ శాస్త్రజ్ఞులు కనుగొన్నారు. ఇంకా యితర విశేషాలను కనుగొంటూనే వున్నారు. ఈ పట్టికల్లోని 11,12 నంబరు గ్రహాలను భారతీయ ఖగోళ పరిశీలకులు సిదార్థ ఎస్.లల్కా నవీన్ కె.షా ఇటీవల కనుగొన్నారు. వాటికింకా పేర్లు పెట్టలేదు.

పై పట్టికలో మనం చాల స్థూలమైన విషయాలను తడవిచూచాం. ఇవి యిలా వుండగలవని ప్రాచీన జ్యోతిర్విద్యాప్రవీణుల వూహల్లోకైనా వచ్చిందా? గ్రహాల స్వరూప స్వభావాల్లో వీసమంతైనా తెలియనివారు జ్యోతిషఫలాలు చెప్పగలరా? అసలు గ్రహఫలాలు, బలాలు చెప్పడానికి ఏ వివరాలుంటే సరిపోతాయి? భూమి చుట్టూ గ్రహనక్షత్రాదులన్నిటినీ తిప్పే తప్పుడు "లెక్కలజ్ఞానం" వుంటే సరిపోతుందా?

ఈ ప్రశ్నలకు జ్యోతిర్విద్యావిశారదులే సమాధాం చెప్పాలి.

జ్యోతిషం భూకేంద్ర సిద్ధాంతాన్ని ఒకప్పుడూ ఆధారం చేసుకొంది, ఇప్పుడూ ఆధారం చేసుకొంటున్నది. భూమి లోపలి అయస్కాంత సూచనకు భిన్నంగా దిక్కులేర్పరచుకొన్నది. గ్రహాల పేర్లతో వారాలేర్పరచుకొన్నది. చంద్రకళల పేరుతో తిథులేర్పరచుకొన్నది. నక్షత్రాల గుంపులతో రాసులేర్పరచుకొన్నది. గ్రహాదులగమనాలన్నీ క్రమబద్ధంగా వున్నందువల్ల తప్పుడు అవగాహనతోనైనా ఇది సాధ్యమైంది. భూవాసుల స్థూలదృష్టికి అది సరైనదిగా తోచింది.

భూమికంటె సూర్యుడు, సూర్యుడికంటె గెలాక్సీలు, గెలాక్సీలకంటె విశ్వం లక్షలరెట్లు, కోట్ల రెట్లు పెద్దవి. భూమి మీద మనం గమనిస్తే వాటి స్థానాలు పెద్దగా మారుతున్నట్లు కన్పించకపోవచ్చుకాని, అవి వాస్తవంగా చాల పెద్దగా మారుతున్నాయి. వాటిని మనం తిథులతో, వారాలతో, మాసాలతో సంవత్సరాలతో కట్టిపడవేయాలనుకొంటే, అది సాధ్యం కాదు. కాని, సాధ్యంకాని ఆ పనినే తాము సాధిస్తున్నట్లు చెప్పుకొని జ్యోతిష్కులు జనాన్ని మోసం చేస్తున్నారు. శాంతులు చేస్తే గ్రహగతులు మారతాయంటున్నారు.

గ్రహనక్షత్రాదుల్లో మంచివీ, చెడ్డవీ వుండడమేమిటి? అవి తమ స్థానాలను బట్టి మంచీ, చెడ్డ ఫలితాలను యివ్వడమేమిటి? వారాల్లో, తిథుల్లో, నెలల్లో, సంవత్సరాల్లో మంచివీ చెడ్డవీ వుండడమేమిటి? అందుకు ప్రమాణమేమిటి? రుజువేమిటి?

**జాతీయ అహం :**

విజ్ఞానం దేశ కాలాతీతమైంది. ఏ దేశానికి చెందినవారైనా, ఏ "జాతి" వారైనా, ఏ కాలానికి చెందినవారైనా, వారు ఆర్జించిన విజ్ఞానాన్ని యావన్మానవ జాతీయ వారసత్వంగా పుచ్చుకొంటుంది, పుచ్చుకోవాలి. విజ్ఞానానికి అంటు ముట్టు జాడ్యాలు లేవు. ఎవ్వరికీ అది గుత్తసొత్తుకాదు, కారాదు. దానికి జాతి, మత, దేశ, వర్గాదులు అడ్డుగోడలు కావు, కారాదు.

కాని, ఈ దేశం విదేశీ రాజకీయాధిపత్యంలోకి పోకముందు ఇక్కడి విజ్ఞానమంతా రహస్యమే. దాన్ని ఆర్జించే హక్కు, అధ్యయనం చేసే హక్కు భారత జనాభాలో 80-85 శాతం ప్రజలకు నిషేధించబడింది. మిగతా జనాభాలోని కొద్ది శాతం మంది మేధావులు ఆర్జించిన విజ్ఞానమే ఈ దేశానికి చెందిన ప్రాచీన విజ్ఞానం. దాన్ని ఆధారం చేసుకొని ఈ దేశంలోని అగ్రవర్ణాలవారు సర్వసామాజికరంగాల్లోను

దోపిడి కొనసాగించి బానిసత్వాన్ని పోషించారు. పోషిస్తున్నారు. భారతీయ సంస్కృతి పునరుద్ధరణవాదుల ధ్యేయం ఇప్పటికీ అదే. దానికి మరో లక్ష్యం లేదు.

ఇటీవలికాలంలో ఈ దేశానికి విదేశీపాలకుల నుంచి రాజకీయవలస విముక్తి జరిగింది. వలస విమోచన పొందిన చాల విదేశాలలో జాతీయఅహం ప్రకోపించింది. వివేకం పనిచేయకపోతే, ఆ అహం స్వాభావికమే. భారతదేశం కూడా ఆ రోగానికి గురైంది. ఈ దేశంలో వున్న చాలా సామాజిక రోగాలకు జాతీయఅహం కూడా తోడయింది.

"మనదేశం గొప్పది, మనజాతి గొప్పది, మన సంస్కృతి గొప్పది, మన పాత విజ్ఞానం గొప్పది, మనకు సాటిరాగల జాతి ప్రపంచంలో లేదు" అనే జాతీయవాద అహాన్ని రెచ్చగొట్టగల ఫాసిస్టు జాడ్యం ఈదేశంలో అనుకున్నట్లే మొదలైంది. ఇలాంటి జాతీయఅహం మనకేకాదు, ఏదేశానికీ మంచిచేయదు. ఆర్యజాతీయ అహాన్ని రెచ్చగొట్టిన హిట్లర్ జర్మన్ ప్రజల్ని యిక్కట్లకు గురిచేయడమే కాక, దుర్మదంతో తానూ నాశనమయ్యాడు, మరువరాని దుర్మార్గుడుగా చరిత్రలో నమోదయ్యాడు.

ఐన్‌స్టీన్ ప్రపంచ ప్రఖ్యాత శాస్త్రజ్ఞుడు. సాపేక్ష సిద్ధాంతంలోను, క్వాంటం సిద్ధాంతంలోను ఆయన చేసిన నూతన ఆవిష్కరణలు విశ్వచిత్రాన్ని వాస్తవరీతిలో మనం అర్థంచేసుకోడానికి తోడ్పడ్డాయి. అలాంటి ఐన్‌స్టీన్ యూదు జాతీయుడైన కారణంగా ఆయన్ని తన శత్రువు నంబర్‌వన్‌గా హిట్లర్ ప్రకటించాడు. అతని దుష్టత్వానికి భయపడ్డ ఐన్‌స్టీన్ ప్రవాస జీవితం అనుభవించిక తప్పలేదు. ఐన్‌స్టీన్ కనుగొన్న శాస్త్రీయసిద్ధాంతాలు ఏజాతికీ చెందినవికావు. అవి యావన్మానవ జాతిజనులూ వారసత్వంగా పొందారు. అవి మానవజాతి సొత్తు.

కాగా, జ్ఞాన దౌర్భాగ్యవశాత్తు "భారతజాతి – సంస్కృతుల" పేర్లతో ఈ దేశీయుల్ని శిలాయుగంలోకి తీసుకుపోవడానికి మత పునరుజ్జీవనవాదులు ప్రయత్నిస్తున్నారు. మన యేలికలు కూడా జ్యోతిషం, వాస్తువులాంటి మార్మిక మూఢనమ్మకాలను యూనివర్సిటీలలో అధ్యయనాంశాలుగా చొప్పిస్తున్నారు.

వైజ్ఞానికంగా మనం హైటెక్ యుగంలోకి చేరబోతున్నాం. అందువల్ల, జ్యోతిర్వాస్తువుల్లాంటి మూఢ నమ్మకాలను కంప్యూటర్లద్వారా యెక్కించే దారుణ స్థితికి హైటెక్ కూడా చేరింది.

ఇక ముమ్ముందు జ్యోతిష ఫలాలను జ్యోతిష్కులు చెప్పరు. కంప్యూటర్ల చేత చెప్పిస్తారు. వాటిలోకి మౌఢ్యాలను ఫీడ్ చేస్తారు. ఇక ముందు జ్యోతిష ఫలాలను బజారు జ్యోతిష్కులు చెప్పరు. జ్యోతిషంలో పట్టభద్రులు, డాక్టొరేట్లు చెప్పబోతున్నారు.

అగ్రవర్ణాల గుత్తస్వామ్యం నుంచి క్రింది వర్గాలకు కూడా ఈనాటికైనా విజ్ఞానం లభించడానికి ముఖ్యకారణం ఈ దేశరాజకీయ బానిసత్వం. ముస్లిముల పాలన, పాశ్చాత్యులపాలన పరోక్షంగానైనా క్రింది వర్గాలకు వరంగా పరిణమించింది. మరోసారి యీదేశం వైజ్ఞానికుల వలసపాలనలోకైనా పోకుండా వుండాలంటే, మనం పాతగబ్బును పునరుద్ధరించే ప్రయత్నాలు మానుకోవాలి. ప్రాచీన "శాస్త్ర" దాస్యానికి వీడ్కోలు చెప్పాలి.

# 8. కొత్త బిచ్చగాళ్లు

వాస్తువును ఇంజినీరింగ్‌గా భ్రమించేవాళ్లున్నారు. ఇంజనీరింగ్‌తో పోల్చి సమర్థించేవారున్నారు.

పూర్వరుషులు గృహస్థుల ఆరోగ్యాన్ని కాంక్షించి గాలివాలు, నీటివాలు, వానవాలు పరిశోధించి వాస్తు నియమ నిబంధనలను రూపొందించారని వాదించే వారున్నారు.

వాస్తు కల్పన వందలాది సంవత్సరాలనాడు జరిగిన మాట నిజమే. ఐతే, వాటిని రుషులనబడే గుడిసెలవాసులు గ్రంథస్థం చేశారో, ఆ తర్వాత వచ్చిన 'కడుపాత్రంగాళ్ళు" రుషుల పేర ఫోర్జరీ చేశారో, అది మన ప్రస్తుత పరిశోధనాంశం కాదు. ఎందుకంటే మన పూర్వ చరిత్ర అంతా ఫోర్జరీల మయం.

మన ప్రాచీన హిందూ వాస్తు గ్రంధాలన్నిటి లక్ష్యం కులతత్వాన్ని నిలద్రొక్కడమేనని ఇంతకుముందే చూచాం. కాగా, ఇప్పుడు బయలుదేరిన కొత్త వాస్తు బిచ్చగాళ్ళలో చాలమంది కులవాస్తువును పాటించేవారు కాకున్నా, దాన్ని బుజాన వేసుకొని వూరేగే సంస్కృతభాషా బానిస వాస్తు పండితులు కూడా కొందరున్నారు.

ఇంజనీరింగ్ అనేది విజ్ఞానశాస్త్ర ప్రక్రియ. అది నిర్మాణ విజ్ఞానశాస్త్రం. దాన్ని ఇంగ్లీషులో ఆర్కిటెక్చర్ అంటాం. అందులో మార్మికత యేమీ వుండదు. గణిత, భౌతిక, రసాయనిక, భూగర్భాది శాస్త్రాల విజ్ఞానంలో అది పొందు పరచబడి వుంటుంది. కేవలం శ్లోకాలు వల్లించడం వల్ల, వాటికి విపరీతార్థాలు సాధించడంవల్ల అది రూపొందలేదు. ఇంజనీరింగ్ నిర్మాణశాస్త్రం వాస్తువులాంటిదికాదు. నిరంతరం పెరుగుతున్న విజ్ఞానాన్ని, నూతన పరిశోధన ఫలితాలను అది ఇముడ్చుకుంటుంది.

దాని సహాయంతో, ఆధునికయుగంలో రకరకాల నిర్మాణాలు జరుగుతున్నాయి.

ప్రాచీన కాలంలో కూడా చాలా దేశాలలో గొప్ప గొప్ప నిర్మాణాలున్నాయి. కాని, వాటిని ఈనాటి నిర్మాణాలతో పోల్చి, ఆనాటి నిర్మాణ శాస్త్రాన్ని జాతీయాభిమానాలతో కొనియాడడం సరయిన పద్ధతికాదు.

ఈనాటి బ్రిడ్జీలు (వంతెనలు) రామాయణకాలంలో కోతులు నిర్మించాయంటున్న వారధుల్లాంటివికావు. ఈనాడు నిర్మాణమవుతున్న 'వంద – నూటిపది' అంతస్థుల భవనాలు ద్వారకలో మయబ్రహ్మ నిర్మించగా సముద్రగర్భంలో మునిగిపోయినదంటున్న తొమ్మిది అంతస్థుల మేడల్లాంటివికావు. ఈనాడు బ్రిడ్జీలు లక్షలాది వున్నాయి. బహుళ అంతస్థుల కట్టడాలు లక్షలాదిగా వున్నాయి. న్యూయర్కు నగరం ఐదు భాగాలు. అందులో మన్‌హట్టన్‌లో నేలమీద సూర్యుడే కనపడనంతగా వందలాది బహుళ అంతస్థుల కట్టడాలు నిండివున్నాయి. ప్రపంచంలో ఈనాడు వేలాదే వంతెనలు, భూగర్భరైలుమార్గాలు, సముద్ర గర్భరైలుమార్గాలు. పట్టాలమీద అనకుండా రైలుబండ్లు నడిచే రైలుమార్గాలు, ఆధునిక సాంకేతిక విజ్ఞానం సహాయంతో నిర్మించబడ్డాయి.

ఈ నిర్మాణాలలో వేటిలోనూ మార్మికత చోటు చేసుకోలేదు.

4000 సంవత్సరాలు గడిచినా, ఈజిప్టులో నిర్మాణమైన పిరమిడ్లు ఇప్పటికీ యథాతథంగా నిలబడివున్నాయి. వాటిలో వున్న మమ్మీలు కూడా దర్శనమిస్తూనే వున్నాయి. కాని, వాస్తు "శాస్త్ర" ప్రావీణ్యంతో నిర్మించబడినవంటున్న మన పురాణ పురుషుల రాజప్రాసాదాలు కాని, కోటలుగాని, చివరకు వారి సమాధులుగాని వున్నట్టు ఎక్కడాజాడలేదు. పాలసముద్రాలు, పెరుగు సముద్రాలు, నేతి సముద్రాలు, సారాసముద్రాలు వుంటేకదా, పురాణ పురుషుల నగరాలు, ప్రాసాదాలు, సమాధులు వుండేదీ, వాటి ఆనవాళ్ళు దొరికేదీ? కట్టు కథలకూ, పిట్టకథలకూ మన పురాణాలు పుట్టిళ్ళు కదా?

వాస్తువులో యేమైనా పట్టు వుంటే, నమూనాగా అయినా ఒక్కటంటే ఒక్కటైనా ప్రాచీన కట్టడం మిగిలివుండేది. మధురలో దేవకీ వసుదేవులు నిర్బంధించబడ్డారన్న జైయిలు మేము చూచాం. చట్రాళ్ళతోకట్టి. చట్రాళ్ళనేల పరపకం కల ఆ గది వైశాల్యం మేము కొలవలేదు కాని, అంతా కలిసి 10 చదరపు గజాల లోపే వుంటుంది. అందులోనే శ్రీకృష్ణుడితో సహా మొత్తం 8 మంది బిడ్డల్ని దేవకి కన్నదని చెపుతుంటారు.

ఇటీవలి కాలంలో తెలుగుదేశంలో : తగా వాస్తు వ్యాప్తికి కారకుడుగా చెప్పబడుతున్న ముద్రగెడ రామారావుగారి గురించి 25–30 సంవత్సరాల క్రితమే నేను విన్నాను. శిష్య బృందంతో కలిసి వీధులగుండా నడుస్తూ గట్టి యిళ్ళు కన్పించిన చోట్లల్లా ఆయన ఆగి – ఆ యింటికి ఈ గోడ దోషం, ఈ యింటికి ఆ వాకిలిదోషం మరో యింటికి దిశలలోపం, అందులో వుండేవారికి మరణం, ఇందులో వుండేవారికి

రోగం, మరో యింట్లో ఉండేవారికి ధననష్టం అంటూ చెప్పుకుపోయేవాడట. గృహ యజమానులు అయన చుట్టూ మూగి, దక్షిణలర్పించి, ఆయన చెప్పినట్లుగా గోడలు పగల గొట్టించుకొని, వాకిళ్ళూ, కిటికీలూ మార్పించుకొని ఇండ్లకు కొత్త షేపులు చేకూర్చుకొనేవారట. ముద్రగెడవారు చీరాల దర్శించినపుడు ఇలానే జరిగిందని ఆయన వాస్తు అభిమానులు చెప్పగా నేను విన్నాను.

అయితే, వాస్తువు, ఇంజనీరింగు, ఒకటి కానేకాదని ముద్రగెడవారు చాల స్పష్టంగా చెప్పారు.[1] అంతేకాదు, కులవాస్తువునుకూగా ఆయన నిర్ద్వంద్వంగా తిరస్కరించారు.[2]

నివేశన స్థలాలకు జంత్వాదుల అకారాన్ని కల్పించడం కూడా ఆయన వ్యతిరేకించారు. నామవర్గు (పేరు ఫలాల) వాస్తువును కూడా నిరాకరించారు.[3]

ఆయన గ్రహచార ఫలాలను వాస్తువుకు ముడివేయలేదు.

అయితే, ముద్రగెడ దిశల వాస్తువును, మెరక పల్లాల వాస్తువును గట్టిగా పట్టుకు కూర్చున్నారు. వాటి మార్మికతను నిరాకరించలేకపోయారు.

ఇంజనీరింగ్ కేవలం ఇండ్ల నిర్మాణానికీ, ఇతర నిర్మాణాలకూ, వాటి గట్టితనానికి సంబంధించిన శాస్త్రమనీ, "జీవితంలోని సుఖదుఃఖాలకు, బోగభాగ్యాలకు సంబంధించినది వాస్తుశాస్త్ర"మనీ ఆయనవాదం. అందుకే, ఆయన గృహస్థుల సుఖసంతోషాలకోసం, భోగభాగ్యాలకోసం వాళ్ల యిళ్ల షేపులు మార్పించే ఉద్యోగాన్ని చేపట్టాడట.

## కొత్త సీసాలో పాత సారా :

ఆయన రచించిన "శాస్త్రరహస్యాలు" పాటించకపోతే, గృహస్థులు ఏ విధమైన నష్టాలు ఎదుర్కోవలసి వస్తుందో, ముద్రగెడ చాల స్పష్టంగా చెప్పారు. అది ఎంత అవాస్తవమో ఈ క్రింది విషయాలను పరిశీలించండి.

| | |
|---|---|
| ఈశాన్యంలోపమైతే | సంతానలోపం, సంతానమరణం |
| ఆగ్నేయం, నైరుతి పెరిగితే, లేక ఆదిశల్లో గోతులు, నూతులు వుంటే | గృహస్థులకు దీర్ఘ రోగాలు, సంతాన మరణం. |
| తూర్పు, ఉత్తరాలకంటె - దక్షిణం, పడమర ఆవరణలు ఎక్కువైతే | స్త్రీ సంతానం అధికం, దరిద్రం, అనారోగ్యం |

1. శ్రీరామరాయవాస్తు శాస్త్రము : ముద్రగెడ రామారావు, పే - 15
2. అందులోనే, పే - 59-61
3. అందులోనే, పే - 60

| | |
|---|---|
| దక్షిణం, పడమరకంటె - తూర్పు, ఉత్తరం ఆవరణలు ఎక్కువైతే | పురుషసంతానం అధికం, భాగ్యం, ఆరోగ్యం |
| పడమటింటికి పంచ దింపితే | పక్షవాతంతో మరణం |
| ఆగ్నేయ, నైరుతి, దక్షిణ పశ్చిమాల్లో నీరెల్లప్పుడూ పారితే | స్త్రీలకు కుసుమవ్యాధి |
| తూర్పు గోడపై ఎత్తయిన కట్టడం వుంటే | గ్రుడ్డితనం, నేత్రరోగాలు |
| ఈశాన్యంలో కట్టడం వుంటే | క్షయ, కుష్ఠు, ఉన్మాదం, బిడ్డల మరణం |
| ఈశాన్యం వంకరగా వుంటే | వికలాంగ సంతానం |
| నైరుతి పెరిగితే | పెద్దకొడుకు లిద్దరూ రోగులూ, దుర్మార్గులూ, మరణం, మూడో కొడుకు స్థానంభ్రంశం, నాలుగోవాడు పవిత్రుడు |
| వాయవ్యం మూసి యిల్లుకడితే | కలహాలు |
| తూర్పు, ఉత్తరం గోడలకు బల్లలుబిగిస్తే | అనారోగ్యం[4] |

ఇదంతా పనికిరాని పాతచింతకాయపచ్చడే. ముద్రగెడవారు గ్రహఫలాలను మాత్రమే వదలారుగాని, దిశాఫలాలను వదిలిపెట్టలేదు. ఇదే దిశాఫలాలు పూర్వ కులవాస్తుశిఖామణులు చెప్పిన వాటిలో కూడా వున్నాయి. ఆయా దిశాఫలాల విషయంలో కొందరు భిన్నంగా చెప్పినా, దిశాఫలాలుంటాయనే దానిలోనూ, అవి కొందరి వాస్తు ప్రతిపాదనల్లో ముద్రగెడవారు సూచించిన విధంగానే వున్నదనే దానిలోనూ సందేహం లేదు. ఇది పరీక్షకు, నిర్ధారణకు ఏ మాత్రం నిలవదు.

వాస్తు పండితులు స్వభావతః మంచివారు కావచ్చు, చెడ్డవారుకావచ్చు. కాని, వాస్తుప్రక్రియ అవశ్యంగా వారిని నీచస్థితికి దిగజారుస్తుందనే విషయం పైన పేర్కొన్న వాస్తు ఫలాలను బట్టి తేలుతుంది. అవి నిజంగానే గృహస్థులకు భీతికల్గిస్తాయి. అందులో ఏ ఒక్కటీ నిజమని ఏ వాస్తుపండితుడూ రుజువుచేయలేడు. అవి అన్నీ భయంకర మైన అబద్ధాలు. తమ కాతాదారుల్ని భయకంపితుల్ని చేయడానికి ఎలాంటి మోసాలకు వాస్తు పండితులు పాల్పడతారో, ఈ నవీన వాస్తువుకూడా రుజువు చేస్తుంది.

గృహాలకేకాదు, గ్రామాలకు, పట్టణాలకు, దేశాలకు సైతం వాస్తువున్నట్లు ముద్రగెడ చెపుతున్నారు. ఇదంతా ప్రాచీనకాలంనుంచీ వున్నదే. ఒకదేశం భాగ్యవంతంగా

4. అందులోనే, పే. 21-23

కానీ, దారిద్ర్యంతోకానీ వుండడానికి వాస్తు ప్రభావమే కారణమని యుక్తీకరించి చెప్పడం ముద్రగెడ ప్రత్యేకత. కాని, దానికి గీటురాయి యేమిటో ఎక్కడా చెప్పలేదు.

ప్రపంచంలో ఏ ఒక్కదేశమూ కలకాలమూ సంపన్నంగానో, దారిద్ర్యం లోనో వుండదు. ఆ స్థితుల్ని భౌగోళిక, చారిత్రక, వైజ్ఞానిక పరిస్థితులు మారుస్తుంటాయి.

ఒకప్పుడు కొండలు, బండలు, ఇసుక యెడారులతో పేదరికం అనుభవించిన మధ్య ప్రాచ్య దేశాలు గతకొద్ది యేళ్ళుగా పెట్రోలు నిక్షేపాల కారణంగా చాల సంపన్నవంతంగా మారాయి. ఏ వాస్తు మార్పువల్ల అది జరిగిందో దేశవాస్తు ఫలాలు నిర్ణయించేవారు చెప్పాలి.

ఒకప్పుడు రవి అస్తమించని సామ్రాజ్యంగా అద్వితీయంగా అధికారం చలాయించిన బ్రిటన్ ఇప్పుడు అత్యల్ప విస్తీర్ణంలో ముడుచుకోడానికీ, వలస రాజ్యాలను కోల్పోడానికీ కారణమేమిటి? అందులో ఏ వాస్తు రహస్యాలు ఇమిడి వున్నవో దేశవాస్తు పండితులు బయటపెట్టాలి.

ఆరణ్యాలతో, అనాగరికులతో నిండిన అమెరికాను అక్కడకు వలసపోయిన యూరపియనులు కేవలం 400 యేండ్లలో అత్యంత సంపన్నవంతంగా మార్చడానికి ఏ వాస్తు నియమాలు పనిచేశాయో వాస్తు పండితులే వ్యాఖ్యానించాలి.

అత్యంత సంపన్నవంతంగా వుండి, విదేశీ దండయాత్రికుల్ని గుంపులు గుంపులుగా ఆకర్షించిన ఒకప్పటి భారతదేశం, అనంతరం వెనుకబడిన దేశంగా మారడానికి ఏ వాస్తు నియమాలు పనిచేశాయో వివరించాలి.

భారతీయ హిందూ రాజుల డొక్కలు పగల దీసిన ముస్లిములు చివరకు పాశ్చాత్యులచేత డొక్కలు పగలదీయించుకోడానికి ఏ వాస్తు సూత్రాలు పనిచేశాయో చెప్పాలి.

ఆయాదేశాల్లో వున్న వనరుల్ని బట్టి, వాటిని వినియోగించుకోగల్గిన ప్రజల శక్తి సామర్థ్యాలను బట్టి, వైజ్ఞానిక స్థాయిని బట్టి, సాంస్కృతిక ప్రమాణాలను బట్టి, రాజకీయ పరిస్థితులను బట్టి ఆయా దేశాల సంపదకాని, పేదరికంగాని నిర్ణయమవుతుంది. సాంకేతిక విజ్ఞానం పెరగకముందు చాలదేశాలు, ప్రాంతాలు ఆటవిక దశలో వున్నాయి. చాలదేశాల పరిస్థితి యిప్పుడు మారిపోయింది. దేశాల హద్దు లెప్పుడూ మారుతూ వచ్చాయి. బ్రిటిష్ పాలనక్రింద భారతదేశం ఏకఖండంగా రూపొందడానికికానీ, స్వరాజ్యం వచ్చేటపుడే రెండుగా చీలడానికికానీ, ఆ తర్వాత పాకిస్థాన్ రెండుగా చీలడానికికానీ ఏ వాస్తు పరిస్థితులు కారణమయ్యాయి?

చారిత్రక పరిజ్ఞానంగాని, భౌగోళిక విజ్ఞానంకాని, లేనివాస్తు పండితులు ఓ మూల కూర్చుని వాస్తు ఫలాలను కలగన్నంత మాత్రాన అవి నిజాలు కావు.

## పాత సీసాలో కొత్త సారా :

ఐతే, గృహ నిర్మాణం ఏ సూత్రాల ప్రకారం చేపట్టాలి? అనే దానికి ముద్రగెడ చేసిన సూచనలు అన్నీ పాతధోరణిలోనే వున్నాయి:-

- ❊ గృహనిర్మాణానికి ముందుగా ఈశాన్యాన బావి త్రవ్వాలి.
- ❊ నీరుపడని ప్రదేశమైతే లోతుగా గోతి త్రవ్వాలి.
- ❊ తూర్పు, ఉత్తరం పల్లంగాను – దక్షిణం, పశ్చిమం మెరకగాను చేయాలి.
- ❊ అన్ని దిశలకంటె నైరుతి మెరకగా, ఈశాన్యం పల్లంగా వుండాలి.
- ❊ ఆగ్నేయ, వాయువ్యాలు నైరుతికంటే ·ల్లంగా వుండాలి.
- ❊ ఆగ్నేయ, వాయువ్యాలు ఈశాన్యంకంటె మెరకగా వుండాలి.
- ❊ ఆగ్నేయ, వాయువ్యాలు సమమట్టంలో వుండాలి.
- ❊ నైరుతిమూల సమకోణం (90 డిగ్రీలు)గా వుండాలి.
- ❊ ఈశాన్యం పెరగాలంటే ఆగ్నేయ వాయువ్యాలు గురుకోణాలుగా వుండాలి.
- ❊ ఈశాన్యం సమకోణంగానైనా వుండవచ్చుకాని, పెరగరాదు.
- ❊ గోడల కట్టుబడి నైరుతి నుండి ప్రారంభించి ఈశాన్యంలో పూర్తి చేయాలి.
- ❊ గోడలు నైరుతి ఎత్తుగాను, మిగతావి పల్లంగాను వుండాలి.
- ❊ సింహద్వారం దక్షిణానకాని, పడమరకాని వుండాలి.
- ❊ ఉత్తరం, తూర్పు ఆవరణలు ఎక్కువగా వుండాలి.
- ❊ తూర్పు, ఉత్తరాలలో వసారాలు దించరాదు.
- ❊ దక్షిణ, పశ్చిమాలు ఒకే ఎత్తు వుండాలి.
- ❊ ఆవరణలోని ఎత్తుపల్లాలను ఇంటి నిర్మాణంలో కూడా పాటించాలి.
- ❊ తూర్పు, ఉత్తరం గోడలకు ఆనించి బొమ్మరిళ్ళు, కోళ్ళగూళ్ళు కూడా వేయరాదు.
- ❊ తూర్పు, ఉత్తరం వైపులలో ఇంటి లోపల దిమ్మలు వేయరాదు.
- ❊ ఈశాన్యంలో పొరపాటున చేతికర్రనైనా వుంచరాదు.
- ❊ సరిహద్దు స్థలాలలోకాని, రాజవీధిలోకాని, ఆగ్నేయ, నైరుతి, వాయువ్యాల్లో, గోతులు, నూతులు వుండరాదు.

ఈ సూత్రాలను చాలమంది వాస్తు పండితులు తూచా తప్పకుండా పాటిస్తారు.

## లోకాభిరామాయణం :

ముద్రగెడవారి "శ్రీరామరాయ వాస్తుశాస్త్రం" లో వాస్తువు కంటె లోకాభిరామాయణమే యెక్కువగా వుంది. అందులో హరికథలలోలాగానే పిట్టకథల్నీ, కట్టుకథల్నీ యిరికించాడు. వేదాంత పాఠాలు చెప్పాడు. అసందర్భంగా వేమన పద్యాలను వుదహరించాడు. వ్యక్తుల్నీ, గృహాలనూ, దేశాలనూ, నగరాలనూ, దేవాలయాలనూ

గురించిన కథనాలను ఆ గ్రంథంలో దూర్చారు. చివరకు శ్రీరామరాయవాస్తు శాస్త్రాన్ని ఒక కాలక్షేప గ్రంథంగా తీర్చిదిద్దాలని విఫల ప్రయత్నం చేశాడు.

హిట్లర్ తాపీమేస్త్రీగానే జీవితం గడిపివుంటే బాగుండేదని ఆయన చెల్లెలు వ్యాఖ్యానించిందట. అందులోని వాస్తు సూత్రమేమిటో ముద్రగెడ చెప్పలేదు.

చర్చిల్ సైనికాధికారిగా వున్నప్పుడు బెంగుళూరులో నివసించిన భవనం ఇప్పటికీ చెక్కుచెదరలేదట. మిగతా భవనాలన్నీ చెక్కుచెదిరాయేమో ఆయన చెప్పలేదు.

ఉత్తరాన నీటివసతి, దక్షిణాన ఎడారి వున్నందువల్ల ఇజ్రాయెల్ ప్రపంచంలో గొప్ప రాజ్యంగా వర్ధిల్లుతోందట. అసలు ఇజ్రాయెల్ దేశం యేర్పడి అంతా 50 యేండ్లే. అంతకుముందు పాలస్తీనాలో భాగంగా వుండేది. పాలస్తీనా అప్పటికి-యిప్పటికి గొర్రెతోకలాగానే వుంది. 1948 మే 15న యేర్పడిన ఇజ్రాయేలు అప్పుడే అంత గొప్ప రాజ్యమైందా?

భారతదేశానికి ఉత్తరాన ఎత్తయిన హిమాలయాలున్నాయి కాబట్టి, ఈదేశం ఎల్లప్పుడూ దారిద్ర్యంతో బాధపడుతుందని ముద్రగెడ అంటారు. హిమాలయాలకు ఉత్తరాన పల్లుగావున్న సైబీరియా ఎడారి అంతా వాసయోగ్యంగా లేదనీ, కాన దరిద్రంగా వుందనీ ఆయనకు స్ఫురించలేదు. భారతదేశం ప్రస్తుత స్థితిలోకాక, ఒకప్పుడు సంపన్నంగా వున్నది కాబట్టే, వివిధ జాతులు దీని సంపదను కొల్లగొట్టడం కోసం దండయాత్రలు చేశారన్న వాస్తవ చరిత్ర వాస్తు నిద్రలో తోచదు.

జెరూసలేం నగరాన్ని గురించీ, అక్కడి యెహోవా దేవాలయాన్ని గురించీ ముద్రగెడ తెగ పొగిడారు. ఆ జెరూసలేం మీది అధిపత్యం కోసమే రెండు శతాబ్దాల పాటు (1096-1291) క్రైస్తవులకు, ముస్లిములకు మధ్య 8 సార్లు పవిత్ర యుద్ధాలు జరిగాయి. అవేనా, జెరూసలేం, యెహోవా దేవాలయ వాస్తు ఘనతలు?

ముద్రగెడ వారు ఎడింబరో నగర ప్రస్తావన తెచ్చారు కాని, దాని వాస్తు ప్రశస్తి చెప్పలేదు. 1329లో నిర్మాణం ప్రారంభమైన ఎడింబరో నగర వాస్తు, దానిలోని భవనాల వాస్తు ఆయన ఎందుకు వర్ణించలేదో అర్థం కాదు.

అమెరికా పార్లమెంటు భవనాన్ని, రష్యా అగ్ని దేవాలయాన్ని ఆయన వర్ణించనైతే వర్ణించారుకాని, అవి ఏ భారతీయ వాస్తు పద్ధతులలో దేన్నో ఒక దాన్నయినా ఎలా అనుసరించాయో చెప్పలేదు.

జంట నగరాలను కొన్నిటిని పేర్కొని, వాటిలో నైరుతిన సంపన్నులు, ఈశాన్యంలో పేదవారు నివసిస్తారని ఒక సూత్రాన్ని పేనారు ముద్రగెడ. ఇది నూటికి నూరుపాళ్ళు అబద్ధమని జంటనగరాలన్నిటినీ పరిశీలించినవారికి తేలుతుంది.

దక్షిణ సింహద్వారాలు కల భవనాలు 1వ తరగతికి, ఉత్తర సింహద్వారాలు కల భవనాలు 4వ తరగతికి చెందినవట. గుంటూరు జనరల్ హాస్పిటల్, విజయవాడ

రైల్వే హాస్పిటల్, గవర్నమెంటు హాస్పిటల్, విశాఖపట్టణం కింగ్‌జార్జి హాస్పిటల్, మద్రాసు జనరల్ హాస్పిటల్, కాకినాడ హాస్పిటల్ ఉత్తర సింహద్వారాలు కలిగివున్నాయిట, అయితే యేమిటట? వాటిని మార్చి దక్షిణ సింహద్వారాలు పెట్టమని ముద్రగెడవారు రికమెండు చేస్తున్నారా?

ఆయన మాటలు విని విజయవాడ కనకదుర్గమ్మ గుడి వాస్తు మారిస్తే, ఆ దుర్గమ్మ చివరకు కిరీటాన్నే పోగొట్టుకున్నది.

అవాకులు చవాకులు ప్రేలడంలో వాస్తు విద్యావిశారదులంతా సిద్ధహస్తులే.

## పురాణ వాస్తు - నవీనవాస్తు - బ్రాహ్మణ వాస్తు :

పురాణ వాస్తువులోనే ముద్రగెడ బ్రాహ్మణ వాస్తువును ఎన్నుకున్నారు. అంతకంటె ఆయన క్రొత్తగా కనుక్కున్న వాస్తు సూత్రాలు లేవు.

ఆగ్నేయం, దక్షిణం, నైరుతి దిశలు మెరకగాను - తూర్పు పల్లంగాను వుండే భూమి బ్రాహ్మణులకు శ్రేష్టమని "శిల్పరత్నం" చెప్పింది.[5]

ఉత్తరం, ఈశాన్యం, తూర్పు (ఆగ్నేయం) పల్లమైతే శుభమని కూడా ఆ గ్రంధమే చెప్పింది.[6]

దక్షిణం, పడమర బారుకీ మెరకగావుండి - ఉత్తరం, తూర్పు బారుకీ పల్లంగా వున్న భూమి బ్రాహ్మణ క్షత్రియులకు తగిన స్థలమని "బృహత్సంహిత చెప్పింది.[7]

పడమర, వాయువ్యం, ఆగ్నేయం, దక్షిణం, నైరుతి మెరకగావుండి మిగతా మూడు దిశలూ పల్లమైతే శుభమని "వాస్తువిద్య" చెప్పింది.[8]

ఈశాన్యం పల్లమైతే ప్రశస్తమని "వాస్తు వివేకం" అన్నది.[9]

పడమర, దక్షిణం మెరకగావున్న స్థలం బ్రాహ్మణులకు మాత్రమే శ్రేష్ఠమని "కాలామృతం" కూడా అన్నది.[10]

పైన పేర్కొన్న గ్రంథాలేకాదు. ప్రాచీన కుల వాస్తు గ్రంథాలన్నిటిలోనూ దక్షిణ, పశ్చిమాలు మెరకగా, తూర్పు ఉత్తరం పల్లంగా వున్న స్థలం బ్రాహ్మణుల గృహ నిర్మాణానికి శ్రేష్టమని చెప్పాయి.

మిగతా దిశల ఎత్తు పల్లాలు ఎలా వున్నా బ్రాహ్మణులు గృహ నిర్మాణం

---

5. ఈ పుస్తకం 25పేజి 17వ ఫుట్‌నోట్‌చూడండి.
6. ఈ పుస్తకం 49వ పేజి 3వ ఫుట్‌నోట్ చూడండి.
7. ఈ పుస్తకం 47వ పేజి 1వ ఫుట్‌నోట్ చూడండి.
8. ఈ పుస్తకం 43-42వ పేజీలు 1వ ఫుట్‌నోట్ చూడండి.
9. ఈ పుస్తకం 44వ పేజి 4వ ఫుట్‌నోట్ చూడండి.
10. ఈ పుస్తకం 46వ పేజి 10వ ఫుట్‌నోట్ చూడండి.

చేసుకోవచ్చుకాని, దక్షిణ పశ్చిమాలు మెరకగా, తూర్పు ఉత్తరాలు పల్లంగా వున్న భూమిలో బ్రాహ్మణులు తప్ప ఇతరులు గృహ నిర్మాణం చేయరాదని "బృహత్సంహిత" చెప్పింది.[11]

ప్రాచీన వాస్తు పండితులు దేన్ని బ్రాహ్మణ వాస్తువుగా చిత్రించారో, ఆ కులవాస్తువును సమర్ధించడం ఆధునికులమనుకునేవారికి సిగ్గనిపించడం లేదు. కాబట్టి, ముద్రగెడవారు బ్రాహ్మణ వాస్తువునే కొత్త వాస్తు పద్ధతిగా అనుసరించారు తప్ప, ఆయన కనిపెట్టిన కొత్త వాస్తుసూత్రాలేమీ లేవు. గోడలు కూల్చడం, వాకిళ్ళు – కిటికీలు మార్చడం, నైరుతి మూయించి ఈశాన్యం తెరవడం లాంటివి ఆయన కనిపెట్టినవి కానే కావు. అలా చేయడం శాస్త్రీయం కూడా కాదు. శాస్త్ర పరిధిలో అలాంటి మూఢ ప్రక్రియలుండవు.

## నిర్మాణ శాస్త్రం ఎటు పోయిందో!

సహజంగా యిండ్లు కట్టదలచుకున్న వారు వాస్తువుతో యెంతో కొంత పరిచయమున్న వారిని ఆయాలు – గీయాలు పెట్టడానికి పిలుస్తారు. వారు కొన్ని వాస్తుశ్లోకాలనో, వాటి పరిభాషనో పుక్కిటబట్టి వుంటారు. వాక్చాతుర్యంవల్ల వారు వాస్తుపండితులుగా, శాస్త్రజ్ఞులుగా ముద్రవేయించుకుంటారు. అలాంటి వారినైనా సంప్రదించకుండా, వారి సూచనలు – సలహాలు అందుకోకుండా, వాటిని అనుసరించకుండా ఇండ్లు కట్టుకొనే సంప్రదాయం హిందువుల్లో లేదు.

కేవలం నిర్మాణశాస్త్రంగా ఇంజనీరింగు విద్య పాశ్చాత్యుల సంసర్గం వల్ల మనకు దిగుమతి అయింది. పాశ్చాత్య ఇంజనీరింగు పద్ధతి మన దేశంలోకి దిగుమతి అయ్యాకనే ఈ దేశంలో చాల విశాలమైన గదులతో, గొప్ప గొప్ప ప్రాసాదాల నిర్మాణం సాధ్యమైంది. పూర్వకాలపు శిథిలగృహాలను, శిథిలకోటలను దర్శిస్తే, వాటి నిర్మాణం ఎంతెంత యిరుకుగదులతో వుందీ అర్థమవుతుంది. ప్రాచీన దేవాలయాలు, మంటపాలు సైతం చాల యిరుకుగా వుండేవి. ఈనాటి చిన్న సినిహాలంతహాలు కూడా ప్రాచీన శిథిలావశేషాల పునాదుల్లో కన్పించదు. మన ప్రాచీనుల నిర్మాణ శాస్త్రం ఎక్కువగా దేవాలయాలకు పరిమితమైపోయింది. నిజానికి వాస్తువూ, ఇంజనీరింగూ ఒకటికావు. ఆర్కిటెక్చర్ పూర్వకాలంలో కూడా వుండేది. వివిధ పద్ధతుల్లో గొప్ప నిర్మాణాలు జరిగాయి. మనదేశంలోని నిర్మాణాలలో దేవాలయాలదే అగ్రతాంబూలం. అయితే మధ్యయుగాలలో నిర్మాణమైన దేవాలయాలు తప్ప, అత్యంత పూర్వకాల నిర్మాణాలేమీ లేవు. అందుకొక కారణం అనాదినుంచీ ఈదేశం దండయాత్రలకు బలికావడమై వుండవచ్చు.

మనదేశంలోని నిర్మాణశాస్త్రంలో వాస్తువు పేరుతో మార్మికత చొరబడింది. గ్రహనక్షత్రాల ఫలాలు చొరబడ్డాయి. వాస్తు పురుషుడు చొరబడ్డాడు. దిశాపాలకుల పేరుతో అష్టదిక్పాలకులు చొరబడ్డారు. దిశాఫలాలు చొరబడ్డాయి. పూజాఫలాలు

11. ఈ పుస్తకం 42వ పేజీ 1వ ఫుట్‌నోట్ చూడండి.

చౌరబడ్డాయి. నిర్మాణశాస్త్ర- ఎటుపోయిందో, ఏమో! చివరకు వాస్తువుపేర అంతా మార్మికత చోటు చేసుకుంది. ధన వాస్తువు, శల్య వాస్తువు, జల వాస్తువు, కులవాస్తు విభాగాలతో వాస్తువే మిగిలింది కాని - నిర్మాణశాస్త్రం అంతూ పొంతూ లేకుండా పోయింది.

## మూస గ్రంథాలు :

పాత వాస్తువును కొత్త వాస్తురూపంలో పెనంమీద పెట్టినవారు ముద్రగెడ రామారావుగారే. ఆ తర్వాత వాస్తువుపై పుస్తకాలు వ్రాస్తున్న వారంతా ఆయన్నే తిరగరాస్తున్నారని కోనేరు నాగేంద్రప్రసాద్ అంటున్నారు.[12] నాగేంద్రప్రసాద్ అమెరికా కూడా సందర్శించి అక్కడి కట్టడాలలో చూచిన వాటన్నిటినీ హిందూ వాస్తు పద్ధతికి అన్వయించడానికి ప్రయత్నించారు. (పే - 163-181) ఆయన సాహసాన్ని మనం మన్నించవచ్చు. ఎందుకంటే "నైరుతిలో కొండ, ఈశాన్యంలో చెరువు, తూర్పు, ఉత్తరం ఖాళీస్థలం, ఈశాన్యం పెంపు.... మాత్రమే శాస్త్రమయితే మహర్షులు, అంతకష్టపడి శాస్త్రం ఎందుకు వ్రాశారో గ్రహించండి"[13] అన్నారు. అంతమాత్రమేకాక, ఇంకా యేదో రహస్యం వున్నట్లుగా ఆయన బాధపడిపోయారు. పాపం ఈయన మహర్షులకాలంలో వున్నట్లయితే, అమెరికాలో కూడా మన మహర్షుల కులవాస్తును బోధించి వుండేవారేమో! మనవారిచేత మహర్షులుగా పేర్కొనబడేవారు ఎంతటి స్కౌండ్రల్స్ కాకపోతే, ఎలాంటి వాస్తు నియమాలవల్ల నిష్టదరిద్రం ప్రాప్తిస్తుందో అలాంటి వాస్తువును శూద్రులకు కేటాయించేవారు? మరి, అమెరికావాసులు ఏ కులాలకు చెందుతారో! మన వాస్తుమహర్షులంతా పరమక్షుద్రులు. వారి వాస్తును విదేశ కట్టడాలకు అన్వయించడానికి ప్రయత్నించడం వెర్రిబాగులతనం.వారి కాలంలో వారిలాగే అమెరికా ఆటవికులతో నిండి వుండేది.

ప్రతివాస్తు పిచ్చుగాడికీ ప్రాచీన మహర్షుల్ని పొగడడం ఒక ఫాషనైంది. అలా పొగడకపోతే తమని అసమర్ధులనుకుంటారేమోనని వారి భయం. ఒక్క వాస్తు విషయంలోనేకాదు, సామాజిక సంబంధాలన్నిటి విషయంలోనూ మహర్షులనబడే వాళ్లే దొంగలు. ఈనాటి దొంగలకు కూడా వాళ్లే మార్గ దర్శకులుకావడం కాలవైపరీత్యం.

దశకన్నా దిశ గొప్పదనే వాస్తుపండితులకు, దిశకన్నా దశ గొప్పదనే జ్యోతిష్కులకు మధ్య కొంత తగాదావుంది. దిశ గొప్పదనుకుంటే, గృహ ప్రారంభాదులకు ముహూర్తాల నిర్ణయం అనవసరం. కానీ, గృహస్థులు ముహూర్తాలు చూడకుండా ఏపనీ మొదలుపెట్టరు. అలా ముహూర్త నిశ్చయంలేకుండా నాగేంద్రప్రసాద్‌గారు వాస్తు

12. శ్రీ రామకృష్ణ వాస్తుశాస్త్రం : కోనేరు నాగేంద్రప్రసాద్, పే - 14

13. అందులోనే, పే. 165

సలహాలిస్తారేమో మనకు తెలియదు. కాని, జ్యోతిషం వ్యక్తులకూ, వాస్తువు గృహాలకూ వర్తిస్తుందంటారు. గృహాల్లో వేర్వేరు జాతకాలవాళ్లు నివసిస్తున్నపుడు గృహఫలాలను వారికెలా అన్వయిస్తారో చెప్పలేదు. కాబట్టి జ్యోతిర్వాస్తువుల్లో ఒకటి రైటైతే, రెండవది తప్పు. కాని, వాస్తవానికి రెండూ తప్పులే. ఏ గ్రహనక్షత్రాదులకు వ్యక్తి ఎంతదూరంలో వుంటాడో చెప్పలేని జ్యోతిషం ఎప్పుడూ రైటు కావడానికి వీలులేదు. ఒకడిగ్రీ కోణానికి ఒక దిక్కు అనుకుంటే భూచక్రానికి 360 డిగ్రీలు. భూగోళానికి లక్షలాది డిగ్రీలు వుంటాయి. కాన, దిశల వాస్తువెన్నడూ రైటు కావడానికి వీలులేదు. దిక్కులు 4, విదిక్కులు 4 అని ఎందుకనుకోవాలో వాస్తు వేనాడూ తనను తాను ప్రశ్నించుకోలేదు. సమాధానం చెప్పుకోనూలేదు. భూచక్రానికి 360, లేక అంతకు మించిన దిక్కులెందుకేర్పరచుకోరాదో, సమాధానం అసలేలేదు.

కాగా, దేవాలయాల వాస్తువిషయంలో మాత్రం నాగేంద్రప్రసాద్ గారు తన గురువుగారికే ఎదురుతిరిగారు. నైరుతిన కొండ, ఈశాన్యాన కోనేరు గమనించిన ముద్రగెడ దాన్ని శుభవాస్తుగా పరిగణించి, 'అందుకే తిరుపతికి అంతవైభవం' అన్నారు. తూర్పున ఎత్తయిన రోడ్డు, చుట్టూ కొండలు వుండి, మధ్య పల్లులోవున్న వెంకన్న గుడి శుభవాస్తు వెలా అవుతుంది? అని నాగేంద్రప్రసాద్ ప్రశ్నించారు. అంతేకాక, ఈ 50 యేండ్లనుంచే కదా వెంకన్న వైభోగం? అంతకుముందు, తిరుపతిని దర్శించేవారి సంఖ్య వేళ్లమీద లెక్కబెట్టవచ్చు నంటున్నారు.[14]

శ్రీరాఘవేంద్రస్వామి వారి మఠానికి తూర్పున ఎత్తయిన వీధిపోటు వుందట. అయ్యప్పస్వామి వారిస్థలం కూడా వెంకన్న స్థలాన్ని పోలివుందట. అందుచేత గృహవాస్తుకు, దేవాలయవాస్తుకు తేడావుందని ఆయన అభిప్రాయం. అగమశాస్త్రం ప్రకారం దేవాలయాలకు నైరుతి, అగ్నేయాలలో కూడా బావులుండవచ్చని తెలుపబడిందట.[15]

గౌరుతిరుపతిరెడ్డిగారు కూడా ముద్రగెడ శిష్యవర్గంలోని వారే. ఆయన తన ప్రత్యేక ప్రతిభకు గుర్తుగా తిరుమలలో గుళ్లన్నిటికీ వాస్తువంకలు చూపారు. కంచి వరదరాజులు, కడప వెంకన్న, అహోబిలం నరసింహులు, హిందూపురం దగ్గరి లేపాక్షి, పుట్టపర్తి ప్రశాంతి నిలయం, కాళహస్తి శివన్న, కర్నూలు షిర్డీసాయి, విజయవాడ దుర్గమ్మ, భద్రాచలం రామన్న, సింహాచలం నరసిరిహం మొదలైనవారి గుళ్లవాస్తువును తిరుపతిరెడ్డి తప్పు పట్టారు. హైద్రాబాద్ బేగంపేటలోని గ్రీన్‌లాండ్స్ 7గురు కాంగ్రెస్ ముఖ్యమంత్రుల్ని పదవీకాలం ముగియకుండానే మార్చిందనీ, దానికి వాస్తుదోషం కారణమనీ చాల

14. శ్రీరామకృష్ణ వాస్తుశాస్త్రము : పే. 152-54
15. అందులోనే, పే. 156

వాస్తుసూత్రాలు యేకరువుపెట్టారు.[16] అసలు ఏ కాంగ్రెసు ముఖ్యమంత్రి ఏ భవనంలోవుండి తన పదవీకాలం పూర్తిగా చలాయించాడో ఆయన వ్రాస్తే బాగుండేది. తమ ఆంధ్రముఖ్యమంత్రిని తామే మార్చడంలో ఆంధ్రకాంగ్రెసువారు సిద్ధహస్తులని ఆయన గమనించలేకపోయారు. అదే పరిస్థితి తెలుగుదేశం పార్టీని కూడా ఆవహించినందున వారి నివాసాల వాస్తు దోషాలను ఎన్నడం ఆయన ఎందుకు చేపట్టలేదో! మరో జ్యోతిర్వాస్తు ఎంఎల్ఏ సలహాను పాటించినా, తెలుగుదేశం వారికి కూడా మధ్యంతరంలో ముఖ్యమంత్రి పదవిని వూడగొట్టడం ఆనవాయితీ అయింది. హైద్రాబాద్ వాస్తువే ముఖ్యమంత్రుల్ని పదవుల్లో నిలకడగా వుండనీయడంలేదేమో, మరోసారి వాస్తు లాటరీ వేసి చూడాలి. నిజాం నవాబు నివాస భవనంలో ఏ వాస్తు దోషం వుండడంవల్ల ఆ సంస్థానం భారత్‌లో విలీనమైందో తేల్చి చెప్పాలి.

ఇలా అనేక కట్టడాలపై వాస్తుదోషాలను తిరుపతిరెడ్డిగారు చూపారు. ఇదంతా కూడా మౌలికంగా బ్రాహ్మణ వాస్తువుమీద ఆధారపడి సాగించిన వాస్తుచర్చే. అంతా దిశలవాస్తు, ఎత్తుపల్లాల వాస్తు. రెడ్డిగారి వాస్తు సొంత వాస్తువని ఆయన ఎంత మొత్తుకున్నా, అది ఎంత మాత్రమూ ఆయన సొంత వాస్తువుకాదు.

జ్యోతిషం జోలికి తిరుపతిరెడ్డిగారు పోకపోయినా, మూఢనమ్మకాలు వద్దంటూనే ఆయన అనేక మూఢనమ్మకాల్ని పోషించారు. అసలు వాస్తువే మూఢ నమ్మకమైనపుడు, ఆయన మూఢ నమ్మకాలను ఆశ్రయించడం లేదనడం వట్టిబూటకం.

ఉత్తరాన హిమాలయాలు, దక్షిణాన సముద్రంవున్న మనదేశవాస్తువే సరిగా లేదుట.[17] ఈ విషయాన్ని ముద్రగెడ కూడా చెప్పారు.

జపాన్‌కు ముందుగా సూర్యోదయమవుతుంది కాబట్టి, అది ప్రపంచ పారిశ్రామిక రంగంలో అభ్యున్నతి సాధించిందట. అలా అనుకొంటే అంతకంటేముందే, కొరియాలో, న్యూజిలాండ్‌లో, ఆస్ట్రేలియాలో సూర్యదర్శనం జరుగుతుంది. దానికే మంటారు? అసలు సూర్యోదయం ముందు వెనుకలు జరగడమేమి వాస్తువు?

## క్షేత్రవాస్తువు పేర్కొవడం ఫాషనైంది :

ఇటీవల వెలువడుతున్న వాస్తు గ్రంథాలలో క్షేత్రవాస్తు ప్రసక్తియెక్కువైంది ఖాతాదారుల్ని ఆకర్షించడానికి అదో **వంచన** ప్రక్రియ. దాన్ని కూడా ముద్రగెడ ప్రారంభించారు. దేశాల వాస్తు, దేవాలయాలవాస్తు, రాజప్రాసాదాల వాస్తు దరిద్రంగా వుండడంవల్లనే గతకాలంలో ఆయాదేశాలు, దేవాలయాలు, రాజులు నష్టపోయారని ఉదాహరణలు చూపి ప్రజల్ని అనాయాసంగా మోసగించవచ్చు. అదే క్షేత్ర వాస్తువుకు బీజం.

16. వాస్తుశాస్త్ర వాస్తవాలు : గౌరు తిరుపతిరెడ్డి, పే. 204-270

17. అందులోనే, పే. 260-61

ఈనాటి వాస్తు పండితుల యిళ్ళన్నీ వాస్తు ప్రకారం పరిశుద్ధంగా వున్నవా? ఒక పండితుడి యింటిని చూపిస్తే, మరో పండితుడు తప్పుపట్టే అవకాశం పుష్కలంగా వుంది. అందుకు భిన్న వాస్తు పద్ధతులే మూలం. ప్రాచీన వాస్తు గ్రంథాల ప్రకారం ఒక్క వాస్తుదోషమైనా లేని "ఒక్క గృహాన్ని" ఏ వాస్తు పండితుడైనా చూపగలరా?

అయినా, దేశాల మీద తిరిగి, గోడలు కూల్చే వాస్తు పండితులు తాము సౌభాగ్యవంతంగా వుంటున్నారా? తాము ఎం. ఎల్. ఏ.లో, ముఖ్యమంత్రులో, అయ్యే విధంగా తమ గృహాలవాస్తువును ఎందుకు మార్చుకోరు? అప్పుడు యీ వాస్తుపండితుల మంద యేలడానికి దేశాలు, రాష్ట్రాలు చాలవని మానుకున్నారా?

వాస్తు ప్రాశస్త్యాన్ని గురించి వ్రాసిన ఒక పండితుడు గ్రంథ ప్రారంభంలోనే "అల వైకుంఠపురంబులో" అని యెత్తుకున్నాడు.[18] వైకుంఠాన్ని గురించీ, అక్కడి విష్ణువు గురించీ భారతీయ హిందువులలో "చదువు" కున్న అల్పసంఖ్యాకులకు పేర్లు మాత్రమే తెలుసు. ప్రపంచంలో మరెవ్వరికీ తెలియవు. అసలు వైకుంఠమూ, విష్ణువు మొదలైవన్నీ కల్పితాలే. పాపం, ఆ పద్యం వ్రాయదలచుకున్న పోతన్నగారికే ఆ వైకుంఠం ఎలా వుంటుందో తెలియదట. "అల వైకుంఠపురంబులో" అని మొదలుపెట్టి, ఆ తర్వాత విష్ణువు అడ్రసు ఏమి వ్రాయాలనేదీ తెలియక, చెంబు పట్టుకొని బయలికివెళ్లి వచ్చే లోపల, ఆ పద్యాన్ని మొత్తాన్నీ సరస్వతీదేవి వచ్చి వ్రాసివెళ్ళిందనే కట్టుకథ కూడా ప్రచారంలో వుంది. లేని వైకుంఠ వాస్తు ప్రశస్తిని గురించి ముద్రగెడ ఉటంకించగా, దాన్ని గ్రంథారంభంలోనే కాపీ కొట్టాడు "వాస్తు ప్రాశస్త్య" రచయిత.

ఆ తర్వాత ద్వారకానగరవాస్తు, కృష్ణుడి రాజాంతఃపురవాస్తు, శ్రీశైలదేవాలయవాస్తు, తిరుపతి వెంకటేశ్వరాలయవాస్తు, శబరిమల అయ్యప్పగుడివాస్తు, క్రీస్తు జన్మస్థలవాస్తు, యెరూషలేంలోని యెహోవా దేవాలయవాస్తు, మక్కామసీదువాస్తు, సాయిబాబా ప్రశాంతి నిలయవాస్తు అంటూ ఆ కట్టడాల వాస్తు ప్రాశస్త్యాన్ని వర్ణించడంలో రచయిత ముద్రగెడనే కాపీ చేశాడు.

అంతటితో వూరుకోక అశుభవాస్తు ఫలాలను కొన్నిటిని వర్ణించాడు.

శుభముహూర్తం తప్పించి ప్రారంభించడంవల్ల, 225 సంవత్సరాలకే విజయనగర సామ్రాజ్యం కూలిపోయిందట. కూలిపోని సామ్రాజ్యం ఏదైనా ఒకటి వుందేమో, దాని అడ్రసు వాస్తుపండితులివ్వగలరా?

ఢిల్లీలోని కుతుబ్‌మీనార్ ఈశాన్యం ఎత్తు, నైరుతి పల్లంకావడం వల్ల త్వరలో శిథిలమైందట. శిథిలం కాని గృహాల అడ్రసు వాస్తు సామ్రాట్టులివ్వగలరా?

మైసూరు శ్రీరంగ పట్టణంలోని టిప్పుసుల్తాన్ కోట నైరుతిన బావిచుట్టూ

18. వాస్తు ప్రాశస్త్యం : గుమ్మా శివవేంకట లక్ష్మీనారాయణ

కందకాలున్నందువల్ల త్వరగా శిధిలమైందట.[19] అలాగా?

ఏ సామ్రాజ్యం, ఏ కోట ఇప్పటిదాక స్థిరంగా వున్నవో రచయిత గుమ్మావారు లెక్కబెట్టి చెపితే బాగుండేది. పురాణకాలంనుంచి ఎన్ని రాజ్యాలు, ఎన్ని సామ్రాజ్యాలు నాశనమయ్యాయో, అవి యే వాస్తు లోపాలవల్ల కూలాయో, ఏ వాస్తు పండితుడూ చెప్పడం లేదు. ఒక్క సామ్రాజ్యాన్నయినా యీనాడు వాస్తు ప్రభువులు చూపగలరా? హంపిలో శిధిలాలైనా మిగిలాయి. మిగతా వాటి శిధిలాలు ఏవి?

కుతుబ్‌మీనార్ శిధిలావస్థలోనైనా ఈనాడు దర్శనమిస్తున్నది. పురాణపురుషుల ఏ 'మీనారూ' ఎక్కడా ఆనవాలుగా కూడా మిగలలేదు. ఎందువల్ల ? వాటి వాస్తు నిర్ణయం చేసిన "రుషులు" అంతటి అధములా?

అంతేకాదు - ఎంతగానో వాస్తు ప్రశస్తికల్గినదంటున్న ద్వారక ఏమైంది? కృష్ణుడి రాజప్రాసాదం ఏమైంది? సముద్రంలో అది ఎలా మునిగిపోయింది? వాస్తు వైభవమేమైంది? శ్రీకృష్ణ మహత్యం ఏమైంది?

స్వరాజ్యంలేనంతకాలం అడవులలో మరుగునపడి, స్వరాజ్యం వచ్చాక వైభవాలను అనుభవిస్తున్న తిరుమల, శ్రీశైలం గుళ్ళ వాస్తువు అంతగా గొప్పదైతే - ఈ దేశం పరాయి పాలకుల, పరాయి మతస్థుల చేతులలోకి పోయినప్పుడు ఆ గుళ్ళలోని దేవుళ్ళకేమి తెగుళ్లు వచ్చినట్లు? ఆ గుళ్ళ వాస్తువేమై పోయినట్లు? గుళ్ళ వాస్తు ఘనతేకాని, దేవుడి ఘనత యేమీ లేనట్లేనా?

ముద్రగెడవారి నమూనాలో గుమ్మావారు కూడా గుళ్ళు వెదుక్కొంటున్నారు. గుళ్లను దర్శిస్తే, గుండ్ల వాస్తువే ఎదురవుతుంది. గుండు ఎదురురావడం అపశకునం కాదా?

మన జ్యోతిషాలు, వాస్తువులు, దేవుళ్ళు, దేవాలయాలు, రాజ్యాలు, అంత ప్రశస్తికలవైతే, ఈదేశం కలకాలం దండయాత్రికులకు ఎలా లోకువైంది? చిరకాలంగా స్వాతంత్ర్యాన్ని ఎలా కోల్పోతూ వచ్చింది? మరల ఎప్పుడు అలా కోల్పోతుంది?

నిజానికి వాస్తు పండితులంతా కాపీగాళ్లే. కంటికి తగిలిన కట్టడాల లిస్టు తయారుచేసుకొని, వాటిలో వుండేవారి బలాబలాలను, మంచి చెడ్డలను బేరీజువేసి, వాటిని వాస్తు సూత్రాలకు అన్వయించడంలో చాల నేర్పును ప్రదర్శిస్తారు. ప్రజల బలహీనతలను వారు కనిపెట్టుకొని వుంటారు. కాని, వాస్తు బలహీనతను, బూటకాన్ని ప్రజలు గుర్తించరు. ఈ స్థితిని అవకాశంగా తీసుకొని వాస్తుపండితులు చెలరేగుతున్నారు.

---

19. అందులోనే 1 నుంచి 36వ పేజీ వరకు వాస్తు ప్రాశస్త్య భవనాల సోదే

# 9. అజ్ఞాన ప్రచారానికి వైజ్ఞానిక పరికరాలా?

మతాలన్నీ మానసిక జడత్వాన్ని పురికొల్పుతాయి, పాదుకొల్పుతాయి, పోషిస్తాయి. అవి నూరిపోసే మూఢనమ్మకాలు అన్నీ ఇన్నీకాదు. అందులో హైందవానిది అగ్రస్థానం. ఈ మాఢ్యాలన్నీ మతనమ్మకం మీది ఉపరినిర్మాణాలే.

మతస్థుల 'విపరీత' జ్ఞానానికీ, అపార్థాలకూ, అభూత కల్పనలకూ మనుషులు తేలికగా వశమైపోతారు. వారిని సరైన మార్గానికి తిప్పడం అంత తేలికకాదు. వారి నమ్మకాలన్నీ అవాస్తవాలమీద ఆధారపడి తయారయ్యాయి. అవి వారి భయసంశయాల మీద, ఆశా ప్రలోభాలమీద బ్రతుకుతూ, వంచకులకు బ్రతుకు తెరువులవుతున్నాయి. వాటి చుట్టూ మార్మికత పెనగొని వుంది. వాటిని ఎందుకు అనుగమిస్తున్నారో వారికి తెలియదు. అవి అహేతుకమైనవీ, అశాస్త్రీయమైన వీను. వివేకానికీ, విజ్ఞానానికీ అవి అందవు.

విజ్ఞాన శాస్త్రం తన తప్పుల్ని తానే దిద్దుకొంటుంది. అది అసమగ్రత నుంచి సమగ్రతవైపు పురోగమిస్తుంది. ప్రతి నిర్ణయానికి ఆధారాలను, రుజువులను ప్రయోగపూర్వకంగా ప్రదర్శిస్తుంది. ఆ ప్రయోగాలను ఎక్కడివారైనా, ఎప్పుడైనా, ఎక్కడైనా పరీక్షకు గురిచేసి వాటి నిక్కచ్చితనాన్ని నిరూపించుకోవచ్చు. ఏ ఒక్కరి పునఃపరీక్షలో విఫలమైనా, దాన్ని వైజ్ఞానిక సమాజం ఆమోదించదు. శాస్త్రీయ సత్యం విశ్వజనీనం.అదియెప్పుడూ పునఃపరీక్షకు సిద్ధంగా వుంటుంది. పునర్నిర్ణయానికి చోటు అట్టిపెడుతుంది.

మూఢనమ్మకాలు, మార్మిక ప్రక్రియలు అలాంటివికావు. శాస్త్రీయ ప్రయోగాల

వల్ల, ప్రక్రియలవల్ల అవి తప్పని తేలతాయి. రుజువు చేసుకోవలసిన మార్గాలన్నీ మూసుకొని వుంటాయి. అవి కేవలం నమ్మకాలు. ఒక తరం నుంచి మరో తరానికి అప్తవాక్యాలద్వారా అవి సంక్రమిస్తుంటాయి. వాటిని మూఢంగా నమ్మడమే కాని, పరీక్షకు గురిచేయడానికి సాహించే వివేకులు చాల అరుదుగా వుంటారు. అదే మౌఢ్యానికి బలం.

పూర్వం స్ఫోటకం, కలరా, ప్లేగూ, ఇతర అంటు వ్యాధులూ చాలవ్యాప్తిలో వుండేవి, వాటిని రాకుండా నివారించుకోడానికీ, వస్తే చికిత్స ద్వారా నయం చేయించుకోడానికీ వారికి సాధ్యమయ్యేది కాదు. పైగా, వాటిని క్షుద్రదేవతల ప్రకోపానికి ఫలితంగా వారు నమ్మేవారు. వాటిని అడ్డుకోడానికి గారమండల్లాంటి ముండ్లకంపల్ని ముంగిట వ్రేలాడగట్టేవాళ్లు. ముండ్లు వాటి ప్రవేశాన్ని అడ్డుకుంటాయని వారు నమ్మేవారు.

ఇండ్లలో పేడ అలుకుడు, గడపలకు పసుపు – కుంకుమలు, ముంగిట సున్నపు ముగ్గు వంటివి క్రిమిసంహారకాలని సమర్థించే వాస్తు పండితులు బయలుదేరారు.[1] పేడ అలుకుడు క్రిమి సంహారకం ఎలాగో వారు శాస్త్రీయ వివరణయిస్తే బాగుండేది. పంచగవ్యం పేరుతో అవుపేడ – ఉచ్చ వగైరా కలుపుకొని త్రాగేవారికి ఇంకా శాస్త్రమెందుకు? అలుకుడు నేలచదరం కోసమనీ, మిగతావి అలంకరణకోసమనీ వారు గ్రహించరు. వాటిని మూచూచి క్షుద్ర దేవతలు, క్రిములు వెనక్కు మళ్లేవారని వారి నమ్మిక. నమ్మిక కాక పోయినా, మూఢనమ్మకాలను సమర్థించడానికి అలాంటి వాదాలకు తలపడతారు.

అలానే, కొత్త యిండ్లలో ప్రవేశించబోయే ముందు వాకిలికెదురుగా గుమ్మడి కాయ వ్రేలాడగడతారు. దృష్టి దోషం వుంటుందని నమ్మేవారు సందర్శకుల 'దిష్టి' ముందుగా దానిమీద పడడానికి అలా చేస్తారు. ఆ విషయం కూడా గృహస్థులకు తెలియదు. అదో ఆచారం.

ఆధునిక విజ్ఞానం మనకు మైక్రోఫోన్లను అందించింది. కాని, మతస్థులు వాటిని అశాస్త్రీయమైన భజనలకు, ప్రార్థనలకు వినియోగించుకొంటున్నారు.

ఆధునిక విజ్ఞానం మనకు రేడియోలు, టెలివిజన్లు, సినిమాలు, ఆడియోలు, వీడియోలు అందించింది. మతస్థులు వాటిని మాయలు, మంత్రాలు, క్షుద్రప్రక్రియలు ప్రదర్శించడానికి వినియోగించుకుంటున్నారు. వాస్తువు, జ్యోతిషాన్నిప్రచారం చేయడానికి వినియోగించుకుంటున్నారు. ఆ సాంకేతిక విజ్ఞాన ఫలితాల లక్ష్యం వేరు. వాటిని మతస్థులు వినియోగించుకొంటున్న లక్ష్యం వేరు.

విజ్ఞానాభివృద్ధిని అజ్ఞానాభివృద్ధికి సైతం వాడుకోవచ్చునని దీనివల్ల తేలుతుంది.

---

1. వాస్తుశాస్త్ర రహస్యములు : అలుగులశెట్టి ఉమామహేశ్వరరావు, పే – 28.

అలా వాడుకుంటున్నవారు మతస్థులే. మైకుల్లో హిందువుల భజనలూ, క్రైస్తవుల భూతవైద్యాలూ, ముస్లింల అల్లాహో అక్బర్లూ వినలేక పౌరుల చెవులు తూట్లు పడుతున్నాయి. అంతగా అరిచి శబ్ద కాలుష్యం సృష్టించకపోతే, వాళ్ల మొరలు వేవుళ్లు వినరేమో! (వాటిని నిషేధించమని ప్రభుత్వాలకు సూచనలిస్తూ ఇటీవల సుప్రీంకోర్టు తీర్పుయిచ్చినా, ప్రభుత్వాలూ, హెూండిపార్టీమెంట్లూ చలించలేదు)

### డామేశా సరుకు :

మొదట్లో జ్యోతిషం, వాస్తువు సామాన్య పౌర జీవితానికి సంబంధించినవి కావు. అందుకు సంబంధించిన మాయలూ, మంత్రాలూ, ఆదిమ విజ్ఞానమూ ఆనాటి బ్రాహ్మణవర్గం సొత్తు. 'రుషులనబడేవారంతా' వారిలోని 'మేధావులే'. ఆ రుషులు కూడా మనుషులేనన్న జ్ఞానం ఈనాటి సనాతనులకు లేదు. జ్యోతిర్వాస్తు పండితులంతా ఆ సనాతనుల బడిలోనివారే. శ్లోకబద్ధం చేయబడినదంతా రుషి ప్రోక్తమనీ, రుషులు మహాజ్ఞానులనీ, వారి ఆదేశాలను మనం అవశ్యంగా ఆచరించాలనీ ఈనాటి డామేశా సరుకు రిక్తవాదం లేవదీశారు.

విజ్ఞానశాస్త్ర నిర్ణయాలు పరస్పర విరుద్ధంగా వుండవని ఇంతకుముందు చూచాం. ఒక నిర్ణయానికి మరొక నిర్ణయం భిన్నమైతే - అది ఎలా అయిందో, ఎందుకయిందో, ఏది సరైనదో, సమన్వయానికి మార్గమేమిటో ప్రయోగాల ద్వారా నిర్ధారణ చేసుకొని విజ్ఞానశాస్త్రజ్ఞులు ఏకీభావానికి వస్తారు. అలా వచ్చిన నిర్ణయాన్ని ప్రపంచంలోని శాస్త్రజ్ఞులంతా ఆమోదిస్తారు. అదీ విజ్ఞాన శాస్త్రం.

వేలాదియేండ్లు గడిచినా, తలకొకదారిగా నిర్ణయాలు తీసుకొనేది శాస్త్రం కాదు. వేలాది సంవత్సరాలుగా ఒకదారికి చేరని వాస్తువును శాస్త్రం అనడం నిస్సంశయంగా మూఢనమ్మకమే. అది పూర్తిగా, అక్షరం అక్షరం త్యాజ్యమే.

అయితే, వాస్తువులో శాస్త్రమేమిటో, కానిదేమిటో వివరించాలనే వుద్దేశ్యంతో "వాస్తుశాస్త్ర రహస్యాలు" గ్రంథకర్త ఒక రహస్య కథను కనిపెట్టాడు. ఆ కథ ప్రకారం (తొలి) వాస్తు పద్ధతులు రెండు మాత్రమే.

1. విశ్వకర్మ ప్రతిపాదించినది 2. మయుడు ప్రతిపాదించినది

విశ్వకర్మ దేవశిల్పి, మయుడు అసురశిల్పి అట.

రుషి ప్రోక్తాలనేవి ఆ తర్వాత వచ్చాయిట.[2]

దక్షిణం పిశాచభాగం కాబట్టి, అక్కడ యిల్లు కట్టి, ఉత్తరాన ఖాళీస్థలం వదలితే అష్టైశ్వర్యాలు కలుగుతాయని విశ్వకర్మ సిద్ధాంతమట.

---

2. అందులోనే, పే - 26

ఉత్తరాన యిల్లుకట్టి, దక్షిణాన ఖాళీస్థలం వదలడం మయసిద్ధాంతమట.

సారాత్రాగి, మనుషుల్ని చంపి నెత్తురుత్రాగే రాక్షసులకు మయసిద్ధాంతం అనువైనదట.

అలా విశ్మకర్మ, మయుడువారి వారి జాతులకు తగినట్లుగా వాస్తుశాస్త్రాన్ని చెప్పారుట.

కాగా, రుషులు తమ కాలానికి అనుగుణంగా జాతి, కుల, మత, వర్గాలకు అనువైన విధంగా వాస్తుశాస్త్రాన్ని తీర్చిదిద్దారుట.[3]

ఆ రుషిప్రోక్తాలలోఇప్పుడు మనం మన కాలానికి తగినట్లుగా ముఖ్యవాస్తు ధర్మాలను ఎంచుకోవాలిట.[4]

ఈ మాటలు నిజమైతే, మనం నాలుగో వాస్తు పద్ధతిలోకి ప్రవేశిస్తున్నామన్న మాట. కాని, జరుగుతున్నది అది కాదు. ఎవడు చెప్పినా, ఆ పాత తీటతోనే బాధపడి గోక్కుంటున్నాడు. అంతా "కడు పాత్రం".

**తలతిక్క ఉదాహరణ :**

"అలుగులశెట్టి" వారు చెప్పిన విషయంలో నిజమెంతవుందో చూడాలంటే, రావణ మందిర నిర్మాణం ఏ పద్ధతి ప్రకారం చేశారో ఉదాహరణగా చూడాలి. రావణ మందిర కథకు ఆరు పేజీలు వెచ్చించిన "గుమ్మా" వారు రామాయణం నుంచి దాన్ని ఉదహరించారు.

మయుడు అసురశిల్పి, అసురుడైన రావణుడు అతన్ని వాస్తు శిల్పిగా నియమించుకొని నూతన రాజప్రాసాదం నిర్మించుకున్నాడట. కాని, రామాయణ వర్ణనను బట్టి అది విశ్వకర్మగారి దేవతా (బ్రాహ్మణ) మతం ప్రకారమే నిర్మాణమైంది కాని, మయ (రాక్షస) మతం ప్రకారం నిర్మాణం కాలేదని తేలుతుంది. ఇది అపసవ్యం.

రాజప్రాసాదం దక్షిణాన వుందట. ఉత్తరాన ఉద్యానవనమూ, ఈశాన్యాన సరస్సూ వున్నాయిట. అది దేవతా వాస్తు కాబట్టి, ఆ ప్రాసాదం గొప్ప వాస్తు వైభవం కల్గి వుందట. విశ్మకర్మ శిష్యుడూ, వాస్తుశాస్త్ర ప్రవీణుడూ అయిన ఆంజనేయుడు ఆ భవన వాస్తు ప్రాభవాన్ని తగ్గించడానికి ఉత్తరానవున్న ఉద్యానవనాన్ని పీకి, ఈశాన్యాన వున్న సరస్సును పూడ్చాడుట. అందువల్లనే రాముడు రావణుణ్ణి వధించగల్గడం సాధ్యమైందట.[5] (వాస్తు రచనల్లో ఆంజనేయుడిది వున్నట్లు ఎక్కడా దాఖలా లేదు)

ఆంజనేయుడా పని చేయకుంటే రావణుణ్ణి చంపడం రాముడికైనా సాధ్యమయ్యేదా? సాధ్యం కాదన్నమాట. అప్పుడు అవతార బలమేమయ్యేదో! అంటే,

3. అందులోనే, పే - 26
4. అందులోనే, పే - 26

రాముడి అవతార బలమంతా వాస్తు బలమేన్నమాట. అలా బ్రాహ్మణ కవులు తమ బ్రాహ్మణ వాస్తువును ప్రతిగ్రంథంలోనూ దోపారని తేలుతుంది.

రావణుడు అసురుడు, మయుడు అసురశిల్పి, మయమతం ప్రకారం ఉత్తరాన ప్రాసాదం కట్టి వుండాలి.కాని, మయుడు తన మతాన్ని వదలి విశ్వకర్మ మతం ప్రకారం దక్షిణాన రాజప్రాసాదం ఎలా నిర్మించాడు? దీనికి సమాధానం "అలుగులశెట్టి" వారే చెప్పాలి. సురాసుర మతాలమధ్య సామరస్యం వారే కుదర్చాలి. ఇంగితజ్ఞానం వున్నవారు ఇలాంటివాటిని ఉదహరించరు.

## వాస్తువంటే పంచకూళ్ళ పంచాంగమా :

ఆలుగులశెట్టివారిది అచ్చంగా వాస్తువుకాదు. ఆయనది జ్యోతిర్వాస్తువు. అందులో కర్మసిద్ధాంతమూ, పూర్వజన్మలూ, పరజన్మలూ యిరికించాడు. వాస్తువు కంటే జ్యోతిషాన్నే ఆయన యెక్కువగా పాటించాడు. తన నమ్మకాలకు అనువుగా ఐదు వందలకుపైగా వాస్తుసూక్తులు కూడా పై గ్రంథంలో చేర్చాడు.

దిశ తిరిగితే దశ తిరుగుతుందనే సూత్రాన్ని ఆయన ఆమోదించడు. పుణ్య పాపకర్మల ఫలితాలను పూర్వోత్తర జన్మలదాక లాక్కుపోయాడు. తమాషా యేమంటే, ఇలాంటివారు కూడా హేతుపద్ధతి గురించి మాట్లాడం విస్మయం కల్గిస్తుంది. ఆ ప్రచ్ఛన్నత హేతువాదానికి చుక్కెదురు. మూఢంగా ఆచరించదలచుకొన్న వారికి హేతువాద అచ్ఛాదన ఎందుకు? దశ మాత్రమే సర్వస్వమైతే, ఇకవారి వాస్తునియమాలెందుకు?

ఒక జన్మలో చేసిన పుణ్యపాపఫలాలను ఆ తర్వాత ప్రతి జన్మలోనూ కొంత కొంతగా అనుభవిస్తారుట.[6] అయితే వాస్తుఫలాలు ఏమిచేస్తాయో జ్యోతిర్వాస్తువుల రెంటికీ పోటీ పెట్టి ఆయన వర్ణించలేదు.

మను ధర్మశాస్త్రాదుల్ని ప్రమాణంగా తీసుకొంటే మరుజన్మలో మనుషులు చీమలు, దోమలుగా పుట్టవచ్చు, మను ధర్మాదులు చెప్పినవన్నీ కర్మఫలాలేకాని, వాస్తు ఫలాలు కావు. అయినప్పుడు మరుజన్మల్లో జ్యోతిర్వాస్తు పండితులు వాస్తువెవరికి చెపుతారు? జ్యోతిషఫలాలెవరికి చెపుతారు?

తండ్రి చేసిన కర్మఫలం వంశపారంపర్యంగా సంక్రమిస్తుందట.

గురుపత్నిని కామిస్తే మరుజన్మలో కుష్టువ్యాధి వస్తుందట. ఇప్పటి కుష్టు రోగులందరూ గతజన్మలో ఆ పనిచేసినవారేనా? చంద్రుడికి కుష్టేనా?

కన్యల్ని, విధవల్ని కామిస్తే మరుజన్మలో శస్త్రగాయం తగులుతుందట. ఈనాటి శస్త్ర క్షతులంతా అలాంటివారేనా? పరాశరుడికి, వ్యాసుడికి కూడా అలాంటి స్థితి

5. వాస్తుశాస్త్ర ప్రాశస్త్యము : గుమ్మా శివ వేంకట లక్ష్మీ నారాయణ, పే - 7-10

6. వాస్తుశాస్త్ర రహస్యములు - అలుగులశెట్టి ఉమామహేశ్వరరావు

సంభవించిందా? సైనికులంతా గత జన్మల్లో, కన్యల్ని విధవల్ని కామించినవారేనా?

దాహం తీర్చకపోతే అతిసారవ్యాధి, అకారణ అబద్ధానికి తలనొప్పి, పెనవేసుకున్న జంట పాముల్ని చంపితే భార్యాభర్తల యెడబాటు, నమ్మినవారిని మోసంచేస్తే వాంతి, పూజాదులకు విఘ్నం కల్గిస్తే వృషణబాధ, బ్రాహ్మల్ని నిందిస్తే శిరోరోగం మొదలైనవన్నీ అనంతర జన్మలో వస్తాయట. కాబట్టి, ఈనాటి రోగగ్రస్తులంతా పూర్వ జన్మ కర్మపీడితులే. ఇలా అని సాయనాచార్యుడు కర్మవిభాగంలో చెప్పాడుట.[7] అవి యిప్పటి రోగాలు కావన్నమాట! అయితే, వాస్తు దోషాలు కల్పించే రోగాలేమిటి? జ్యోతిషం కల్పించే దశయేమిటి?

ఇలా రోగాలన్నీ పూర్వజన్మ కర్మలవల్ల జరిగితే, జ్యోతిర్వాస్తుదోషాలవల్ల రోగాలు వస్తాయనే జ్యోతిర్వాస్తు భయాలన్నీ అబద్ధమనేకదా భావం?

ఇలాంటి మౌఢ్యాలను బోధించేది మతమవుతుందా, శాస్త్రమవుతుందా?

మనుషులు పాపాలుచేయడంలో బాధ్యతను మొత్తాన్నీ కర్మకో, జ్యోతిషానికో, వాస్తువుకో అంటగడితే - ఇక మనిషి తానంటూ చేసే కర్మలేముంటాయి? కర్మలు మనుషులు చేయకపోతే, మంచి - చెడ్డ కార్యాలకు వాళ్లను బాధ్యుల్ని చేయడమెందుకు?

దిశల విషయంలో, ఎత్తు పల్లాల విషయంలో అలుగులశెట్టి కూడా ముద్రగెడ వారి బ్రాహ్మణబాటనే నడిచారు. భిన్నత్వమేమంటే ముద్రగెడకు అంతుపట్టని అనేక మూఢనమ్మకాలకు అలుగులశెట్టి చోటిచ్చారు. వాస్తువే మూఢనమ్మకంకాగా, దానివంకతో మరిన్ని మూఢనమ్మకాలను సృష్టించడం క్షంతవ్యంకాదు. ఒక మూఢ నమ్మకానికీ, మరో మూఢనమ్మకానికీ పడదనీ, వాటి మధ్య స్పర్ధ వుంటుందనీ వారి వివేకానికి అందదు.

## ఏమి వాస్తు రహస్యాలు :

మానవుణ్ణి శాసించేది విధి, విధినిశాసించేది వాస్తు

నైరుతినుయ్యి - స్త్రీకి బట్టవిడుపు వ్యాధి, ఆగ్నేయం బావి - వ్యాధులు

వాయువ్యంబావి - ఆయాసం, ఈశాన్యం బావి - ఉత్తమం

నైరుతి మెట్లు - వంశవృద్ధి, ఆగ్నేయం -మెట్లు స్త్రీకి అనారోగ్యం

వాయువ్యం మెట్లు - రుణబాధ, ఈశాన్యం - మెట్లు మరణం, దరిద్రం

ఒకే నెలలో సూర్యచంద్ర గ్రహణాలువస్తే - యుద్ధాలవల్ల జనమరణం

ఈశాన్యం తెరపి, నైరుతిమూత - వంశవృద్ధి

ఈశాన్యం పల్లం, నైరుతి మెరక - సంతానవృద్ధి

---

7. అక్కడే

దక్షిణం పల్లం - ఆర్థికలోటు, నైరుతి పల్లం - అపఖ్యాతి
ఈశాన్య నిర్మాణం - విధవపెత్తనం
ఒక వీధిలో ఎవరియింటి మట్టం ఎత్తయితే - వారు వున్నతులవతారు.

శని, ఆది, మంగళవారాలు క్షురకర్మకైనా నిషిద్ధం
బుధ, గురు, శుక్రవారాలు శుభదాయకాలు
పెరుగుకుండ పగిలితే ధన నష్టం
పేర్చిన కుండలు పగిలితే ప్రభుత్వ శిక్ష
అద్దం పగిలితే యజమాని శక్తి కోల్పోతాడు.
అలమర వాడకపోతే చెవిపోటు
తామరపువ్వులు పూస్తే బ్రాహ్మలకు జయం
జీడిచెట్లు కాస్తే భయం, బిళ్ళచెట్లు కాస్తే అగ్నిభయం
వెలగ చెట్లు కాస్తే గాలి ఎక్కువ, బుడమ చెట్లుకాస్తే యుద్ధాలు
చైత్ర, జ్యేష్ఠ శ్రావణ, ఫాల్గుణ మాసాల్లో గ్రహణం పడితే రాజులకు మరణం
శని, అంగారకులు ఒకేరాసిలో చేరితే కరువు, యుద్ధాలు
ఒకేరాసిలో 3 గ్రహాలుంటే రాజు మరణం
ఒకే రాసిలో 4 గ్రహాలుంటే బ్రాహ్మలకు కీడు
ఒకే రాసిలో 5 గ్రహాలుంటే ప్రజలకు కీడు

ఇలా జ్యోతిర్వాస్తు ఫలాల పేరుతో ఈ రహస్యాల రచయిత ఎన్ని అబద్ధాలు చెప్పాడో లెక్కబెట్టలేము. ఈయన కుల తత్వవాది అని వేరే చెప్పనవసరం లేదు.

ఇలాంటి అబద్ధాలతోనే మరో కులతత్వవాది "వాస్తు సుధానిధి" అనే పుస్తకం నింపాడు. దాని రచయిత ముళ్ళపూడి లీలాకృష్ణమూర్తి, ఓ సంస్కృత పండితుడు. మంచి చెడులకు ఇల్లే కారణమనడం అవివేకమని ఈ జ్యోతిర్వాస్తు సుధానిధి అంటున్నాడు. సంస్కృత పరిజ్ఞానం వుంటే తప్ప జ్యోతిర్వాస్తువులు అర్థం కావంటున్నాడు.[8] ఆయన వాస్తువుకు నిర్వచనం చెపుతూ ఏ వర్ణంవారు ఏయే ప్రదేశాలలో నివసించాలో చెప్పే శాస్త్రమే వాస్తువన్నాడు.[9] ఈశాన్యంలోనే కాక, తూర్పు, ఉత్తర, వాయువ్య పడమర దిశలలో బావులున్న సంసారాలుకూడా పుత్రపౌత్రాభివృద్ధితో సుఖంగా వున్నాయన్నాడు.[10] కాని, తన వాస్తు ప్రక్రియను ప్రతిపాదించడంలో బావుల దిశాఫలాలు భిన్నంగా చెప్పాడు.

8. ముళ్ళపూడి లీలాకృష్ణమూర్తి: వాస్తు యధానిధి, పే - 12
9. అందులోనే, పే - 4
10. అక్కడే

ఈశాన్యం - మేలు, ఐశ్వర్యం
తూర్పు - సంపద, పుత్రవృద్ధి
ఆగ్నేయం - పుత్రనాశనం
దక్షిణం - స్త్రీ నాశనం
నైరుతి - ప్రాణహాని, అరిష్టం
పడమర - కీడు, మరణం
వాయువ్యం - శత్రుబాధ, ధననష్టం
ఉత్తరం - అల్పసుఖం, శత్రుభయం[11]

సంస్కృత పండితులు కదా .!!! సంస్కృత గ్రంధాలలో వున్న పరస్పర వైరుధ్యాలను సమన్వయం చేయలేక ఆయన సతమతమయ్యారు.

సూర్యుణ్ణి గురించి ఆయన వెల్లడించిన అభిప్రాయాలు వింటే, ఆయనకు ఆధునిక విజ్ఞాన పరిచయం బొత్తుగా లేదనిపిస్తుంది. అదంటే గౌరవం కూడా లేనట్లుంది. సంస్కృపండితులు కదా!!! సంస్కారరీత్యానే వారు విజ్ఞానానికి దూరంగా వుంటారు.

సూర్యుడికి 1000 కిరణాలున్నాయట! వాటిలో 400 వర్షానికీ, 300 మంచుకూ, మిగతా 300 తెల్ల కిరణాలూ వున్నాయట! అందులో 2 చంద్రుడి వృద్ధికీ, కుజ, బుధ, గురు, శుక్ర, శని గ్రహాల వృద్ధికీ ఒక్కొకటి కారణమట.[12]

మరో విచిత్రమేమంటే సమస్త జగత్తూ సూర్యుడి ప్రభావంచేత గ్రహాలూ, నక్షత్రాలూ ప్రభావితమవుతూ వుంటాయిట.[13] నక్షత్రాలు సూర్యుడి చేత ప్రభావితమవుతుంటాయనేది ముళ్ళపూడి వారి సైన్సు కనిపెట్టిన అంశమేమో! ఆయన "ఒక సూర్యుండు" పద్యం బట్టీ పట్టినట్లున్నారు.

అయితే సాంప్రదాయికులకు వ్యతిరేకంగా ఈయన ఆగ్నేయంలోనే పొయ్యి వుండాలనే విషయం అన్నిటికీ కుదరదంటున్నారు. దానికి మరో మార్గం చెపుతున్నారు.[14]

పడమర, ఉత్తర ద్వారాలు కల యింటికి వెనుక ఆగ్నేయ గదిలో పొయ్యి వుండవచ్చునట. తూర్పు ద్వారం గల యింటికి వెనుకవైపు గది నైరుతిలో పొయ్యి వుండాలిట!!

అలానే బావుల త్రవ్వకానికైతే శుభాశుభ దిక్కుల ఫలాలు చెప్పారు. (పే-50) కాని, నీటి కుండీలకు దిక్కులు అవసరం లేదంటూ ఒక శ్లోకాన్ని ఉదహరించారు.

జల స్వీకార సౌకర్యే గృహాంతర్వా బహిస్థలే
దిక్ర్పశంసా వినాక్వా మిక్షిపే త్కృత్రిమ నీరథిమ్॥

దాని ప్రకారం నీటికుండి క్రిందకానీ, పైనకానీ, ఏ ఎక్కువనైనాకానీ పెట్టుకోవచ్చునన్నారు.[15] అయినా, దానికి కొందరు చెప్పిన అభ్యంతరాలను లెక్కలోకి

---

11. అందులోనే, పే - 50
12. అందులోనే, పే - 7
13. అందులోనే, పే - 8
14. అందులోనే, పే - 10
15. అందులోనే, పే - 20

తీసుకొని నీటికుండీల దిక్ఫలాలను చెప్పారు.[16]

| | |
|---|---|
| తూర్పు – అవమానాలు | పడమర – సంతాన నష్టం |
| ఆగ్నేయం – దారిద్ర్యం | వాయువ్యం – కుటుంబ కలహాలు |
| దక్షిణం – దీర్ఘవ్యాధులు | ఉత్తరం – అధిక వ్యయం |
| నైరుతి – శత్రువృద్ధి | ఈశాన్యం – సంతాన నష్టం |

ఇది గమనిస్తే, ఏ దిక్కులోనూ నీటి కుండీలు పెట్టుకోడానికి వీలులేదు. ఒక్కో దిక్కు ఒక్కో అరిష్టాన్ని కలగజేస్తుంది.

సంస్కృత శ్లోకాలను నమ్ముకుంటే వున్న మతి పోతుంది. అలా మతిపోగొట్టుకున్నందువల్లనే యిలాంటి వైరుధ్యాలు ఒకే రచయితలో కన్పిస్తున్నాయి.

ఇక గృహ నిర్మాణ స్థలాల ఎంపిక విషయంలోకివస్తే ముళ్ళపూడి వారు బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులకు ప్రాచీన కులతత్వవాదుల పద్ధతినే ఎంపిక చేసుకున్నారు.[17]

| | |
|---|---|
| బ్రాహ్మణులకు | ఆగ్నేయం, దక్షిణం, నైరుతి ఎత్తు, ఉత్తరం పల్లం |
| క్షత్రియులకు | నైరుతి, వాయువ్యం ఎత్తు, తూర్పు పల్లం |
| వైశ్యులకు | వాయువ్య, ఉత్తర, ఈశాన్యాలు ఎత్తు, దక్షిణం పల్లం |
| శూద్రులకు | ఈశాన్య, తూర్పు, ఆగ్నేయాల ఎత్తు, పడమర పల్లం |

ఇది పచ్చి బ్రాహ్మణవాస్తు, సిగ్గు విడిచిన వాస్తు, అంత్యకాలవాస్తు

అలానే మనుషుల పేర్లనుబట్టి, అక్షర వర్గాంకాలనుబట్టి, ఏ మనిషి ఏ గ్రామంలో నివసించదగునో, ఏ గ్రామంలో నివసించదగడో ముళ్ళపూడి చెప్పాడు.[18] అదొక విచిత్ర అబద్ధ పద్ధతి.

అంతటితో సరిపుచ్చుకోక ఏ వర్ణంవారు గ్రామంలో ఏ దిక్కులో నివసించాలో కూడా ముళ్ళపూడి వారు వివరించారు.[19]

| | | |
|---|---|---|
| బ్రాహ్మణులు | – | ఈశాన్యం, ఆగ్నేయం |
| క్షత్రియులు | – | తూర్పు, దక్షిణం |
| వైశ్యులు | – | వాయువ్యం, ఉత్తరం |
| శూద్రులు | – | పడమర |
| సంకరులు | – | నైరుతి |

16. అందులోనే, పే – 21
17. అందులోనే, పే – 23
18. అందులోనే, పే – 25
19. అందులోనే

దీన్నిబట్టి ముళ్ళపూడివారిలో కులచాద్దసం ఎంతగా బలిసి పోయిందో గ్రహించవచ్చు.

బావులు, చెరువులు, కాల్వలు మొదలైనవి ఇంటికి ఏ దిక్కునవుంటే ఎలాంటి ఫలితాలుంటాయో మరో చోట యిలా చెపుతాడు.[20]

| | | |
|---|---|---|
| తూర్పు | – | పుత్ర సంతతికి నష్టం |
| ఆగ్నేయం | – | అగ్నిభయం |
| దక్షిణం | – | శత్రుభీతి |
| నైరుతి | – | స్త్రీలతో కలహం |
| పడమర | – | దుర్బుద్ధి, స్త్రీతో వైరం |
| వాయువ్యం | – | దరిద్రం |
| ఉత్తరం | – | ధనధాన్యవృద్ధి |
| ఈశాన్యం | – | పుత్రవృద్ధి |

ఈ ప్రకారం ఇంటికి ఉత్తరం, ఈశాన్యాల్లో తప్ప జలాశయాలుండ కూడదన్నమాట.

ముళ్ళపూడికి వాస్తువు మీదికంటె తిథివార నక్షత్రాదుల ఫలాలమీద నమ్మకం యెక్కువ. అందువల్ల ఏ వారంలో బావితీస్తే ఎలాంటి ఫలం వుంటుందో ఆయన ఈక్రింది విధంగా చెప్పాడు.[21]

| | | |
|---|---|---|
| ఆదివారం | – | బండలుపడతాయి |
| సోమవారం | – | అమృతం వంటి నీరు పడుతుంది |
| మంగళవారం | – | నీరు పడనేపడదు |
| బుధవారం | – | ఉప్పునీరు పడుతుంది |
| గురువారం | – | స్వచ్ఛమైన నీరు పడుతుంది |
| శుక్రవారం | – | జలగల నీరు పడుతుంది |
| శనివారం | – | పచ్చిక గుంటల నీరు పడుతుంది. |

గృహారంభానికి విదియ, తదియ, పంచమి, సప్తమి, దశమి, త్రయోదశి తిథులు శుభప్రదమట.[22]

---

20. అందులోనే, పే – 52
21. అందులోనే, పే – 54
22. అందులోనే, పే – 75

గృహారంభానికి వృషభం, కటకం, తుల, మకరం, కుంభం, మీనం రాసులు శుభప్రదమట.[23]

అశ్విని, రోహిణి, మృగశిర, పునర్వసు, పుష్యమి, మఘ, ఉత్తర, హస్త, చిత్త, స్వాతి, అనూరాధ, శ్రవణం, ధనిష్ఠ, శతభిషం, ఉత్తరాభాద్ర, రేవతి శుభప్రదమైన నక్షత్రాలట.[24]

సోమవారం, బుధ, గురు, శుక్రవారాలు గృహారంభానికి మంచివట.[25]

వైశాఖ, శ్రావణ, కార్తీక, మాఘ, ఫాల్గుణ మాసాలలో గృహారంభం చేయడం శుభదాయకమట.[26]

వీటన్నిటినీ బట్టి ముహూర్తాలు నిర్ణయించాలి.

వీటికి తోడు గ్రంథాంతంలో రకరకాల యంత్రాలు పేర్కొన్నాడు.

అవి అన్నీ గృహస్థుడికి శుభం చేకూర్చడానికి చిట్కాలన్నమాట.

గ్రంథంలో వీలైన చోట్లల్లా కులతత్వాన్ని ప్రదర్శించాడు. అందువల్ల, ఇది పూర్తిగా కుల వాస్తుగ్రంథంగా తీరి కూర్చుంది.

పూర్వ వాస్తు గ్రంథాలన్నీ కులాలవారీగా శుభాశుభఫలాలను పేర్కొన్నట్లు ఇంతకు ముందేచూచాం. ఈ పుస్తకానికి "సహృదయభూమిక" వ్రాసిన డా॥ ప్రసాదరాయకులపతి వాస్తువు కుల, మత, వర్గాతీతంగా అందరి మనస్సుల్లో ఆకట్టుకొన్నదని సర్టిఫికెట్ యిచ్చాడు. ఈ గ్రంథం చదవకుండా యిచ్చిన ఆ సర్టిఫికెట్‌ను యిప్పుడు వెనక్కుతీసుకుంటారేమో చూడాలి. వెలమకన్ని హనుమయ్య వ్రాసిన "వాస్తుమకరందం" అనే అభిప్రాయంలో ప్రాచీన వాస్తుశాస్త్రమంతా సంస్కృతాధీనమై వున్నదన్నారు. ప్రాచీన వాస్తువును పునరుద్ధరించడానికి ముళ్ళపూడి వారు ఈ పుస్తకాన్ని వుద్దేశించినట్లు గమనించాలి.

కుల వాస్తువుగా పుట్టినది మానవవాస్తువు కాదు. ఒక మనిషికి ఒక ఫలాన్ని, మరో మనిషికి మరో ఫలాన్ని వుద్దేశించే గృహ వాస్తువు విజ్ఞానశాస్త్రం ఎలా అవుతుంది?

23. అందులోనే, పే - 76
24. అక్కడే
25. అందులోనే, పే - 77-78
26. అందులోనే, పే - 79-80

# 10. ఇంజనీరింగ్ - వాస్తువు

"వాస్తు వేలం వెర్రి" అ ప్రతిహతంగా వ్యాపిస్తున్నది. ప్రస్తుతానికి ముఖ్యంగా తెలుగుదేశంలో, దాన్ని అడ్డుకొని, అది శాస్త్రం కాదని చెప్పవలసిన బాధ్యత ఇంజనీరింగ్ శాస్త్రజ్ఞులది.

వాస్తువుతో నిర్మాణపద్ధతి మరుగునపడి, గృహ దిశాఫలాలు, గ్రహచార ఫలాలు ప్రాధాన్యత వహించాయి. అది సరైన వైఖరి అయితే ఇంజనీరింగ్ శాస్త్ర విభాగం పుట్టవలసిన పనిలేదు.

గృహ నిర్మాణానికి ఆరోగ్యప్రదమైన దిశను ఎన్నుకోవడం అవసరమే. దిశ ఒక్కటే ఆరోగ్య ప్రదం కాదు. దిశల మీద మన ఆరోగ్యాలు ఆధారపడడం లేదు. అది మౌఢ్యవైఖరి వ్యాప్తికి దోహదం చేస్తుంది.

గృహ నిర్మాణం చేపట్టడానికి ఎంపిక చేసుకున్న స్థలం ఒక దిశలో ఆ పని చేయడానికి అవకాశం యివ్వకపోతే, మరో దిశలో చేసుకోవచ్చు. కాని, అలా చేసుకొంటే ప్రమాదకరమైన రోగాలు వచ్చి మరణిస్తారనీ, దరిద్రంతో, బాధలతో జీవనం గడపాలనీ, చోరభయం, రాజభయం వుంటుందనీ, దంపతులు – సంతానం రకరకాల బాధలకు గురవతారనీ ఏవేవో భయాలు పెట్టి వాస్తు పండితులు గృహస్థుల్ని బెదరగొడతారు. దిశాఫలాలను, గ్రహచార ఫలాలను మన్నించి గృహాలు నిర్మించుకొంటే సర్వభోగాలూ, సంపదలూ లభిస్తాయని ఆశపెడతారు. ఆ ఆశాభయాలను పోగొట్టవలసిన బాధ్యత ఇంజనీర్లది.

అలాకాక, వాస్తు మౌఢ్యానికి శాస్త్రీయ కారణాలను కనిపెట్టడానికి ప్రయత్నిస్తే

గృహ నిర్మాణం వెనుకదాగిన వాస్తుమౌఢ్యం అలానే కొనసాగుతుంది. ఇంజనీరింగు విద్య సార్థకం కాకుండా పోతుంది. కొంతమంది ఇంజనీర్లు సంఘంగా యేర్పడి వాస్తుమౌఢ్యాన్ని సమర్థిస్తూ, వారి ఇంజనీరింగ్ విద్యను నిరర్థకం చేస్తున్నారు. వాస్తు సమర్థనకైతే ఇంజనీరింగ్ చదవనసరంలేదు.

గృహవాస్తు మౌఢ్యానికి బలయ్యే ప్రజలు రకరకాలుగా వుంటారు. గృహాలు కట్టుకొనేవారు, వాటిని కొనేవారు, వాటిలో అద్దెకుండేవారు వాస్తువును పట్టింపుగా పరిగణిస్తారు. బిల్డర్స్‌గా మారిన ఇంజనీర్లు సైతం తమ వ్యాపారం అనువుగా సాగడం కోసం వాస్తు పండితుల సలహాలను అనుసరిస్తారు. తాపీ మేస్త్రీలు, వడ్రంగులు సైతం "వాస్తు దోషం" వుండే యిళ్ళు నిర్మించడానికి సంకోచిస్తారు. మా గ్రామంలో నేను సర్పంచిగా వున్నపుడు రక్షిత మంచినీటికుండీ నిర్మాణ ప్రారంభానికి ఇద్దరు మంత్రులు వచ్చారు. వారు మేళతాళాలకోసం, పూలదండలకోసం, శంకువు కోసం, పురోహిత పూజకోసం, కొబ్బరికాయలకోసం ఎదురుచూచారు. ఆ కుండీ నిర్మాణానికి స్పాన్సరును నేనేకాన, అలాంటివేమీ వుండవని చెప్పాను. కొబ్బరికాయలు కొట్టి పని ప్రారంభించకపోతే, తమకు హాని జరుగుతుందని నాతోచెప్పిన తాపీ మేస్త్రీలను నేను ఎరుగుదును. కాని, అలాంటి తాపీమేస్త్రీలను నేనెప్పుడూ నాపనుల్లో పెట్టలేదు. ఏ వాస్తు నియమాలను, పూజను, శుభలగ్నాలను లెక్కచేయకుండా నిర్మించిన మా గ్రామ నీళ్లకుండే 15 యేళ్లుగా చెక్కుచెదరలేదు. ఎవరికీ హాని చేయలేదు.

వాస్తు పద్ధతులన్నీ పూర్వంనుంచి ఈనాటివరకూ ఒకదానికొకటి భిన్నంగా వున్నాయి. ఐనప్పుడు ఎవరు నిర్మించిన ఏ కట్టడాన్నయినా ఏదో ఒక పద్ధతి ప్రకారం తప్పు పట్టవచ్చు. అందువల్ల, అసలు వాస్తువనేదానినే సమూలంగా తిరస్కరించడం ఉచితమూ, అవసరమూకూడా. ఈ విషయాన్ని ఇంజనీర్లు గుర్తించాలి. అలాకాక, మర్యాదపోకడలుపోయి వాస్తు మార్మికతను ఉపేక్షించడం ఇంజనీరింగ్ డిగ్రీలకే అవమానం. అసలే వేదాలలో విమానాలున్నవని ప్రగల్భించే సంస్కృతిలో మనం వున్నాం. అందువల్ల గృహనిర్మాణానికీ, వాస్తువుకూ ముడివేయడానికి శ్రమపడడం వ్యర్థం. పాముచావకుండా, కర్ర విరగకుండా సర్కసుచేసే మాటలతీరు వాస్తు పునరుజ్జీవన వాదులకు కొంతైనా తోడుగా నిలుస్తుంది. అది గృహ నిర్మాణ విద్యకే హానికరమని ఇంజనీర్లు గుర్తించాలి.

## అతకని టంకం :

"వాస్తులో ఏముంది?" అనే గ్రంథంచూస్తే తాతమోకాటికీ, అవ్వబోడితలకీ ముడివేయడానికి రచయిత కొంతయినా ప్రయత్నించినట్లు కన్పిస్తుంది.[1]

1. వాస్తులో ఏముంది : కొడాలి శ్రీనివాస్ B.Tech (Civil), M.E. (Struct), MISTE, MASCF

"విజ్ఞానం, విశ్లేషణ, ఆత్మవిశ్వాసము ఏనాడూ 'దేవుడు - మతము' అనే సిద్ధాంతానికి వ్యతిరేకము కాదు. కాని, ఈ ముసుగులో సమాజంలో జరిగే దోపిడిని, అరాచకాలను, అక్రమాలను, అంధవిశ్వాసాలను ఎప్పుడు వ్యతిరేకించి తీరుతుంది?[2] అని ప్రశ్నించడం రచయిత గందరగోళాన్నికొంత పట్టిస్తుంది. అందుకే ఆయన "అతకని అతుకుడుకు" ప్రయత్నించాడు.

దేవుడనేది మూఢవిశ్వాసమని ఆయన అంగీకరించడంలేదు. మతం మూఢనమ్మకం తప్ప మరేమీకాదని ఆయన అంగీకరించడంలేదు. మూఢనమ్మకాలన్నిటికీ మౌలికంగా వాటిమీది విశ్వాస వైఖరే కారణమని ఆయన అంగీకరించడంలేదు. అరాచకాలు, అక్రమాలు వాటితోనే మొదలయ్యాయనీ, ఇప్పటికీ అవి కొనసాగుతున్నాయనీ అయన అంగీకరించడంలేదు. అందుకే ఆయన వాస్తువుకూ, గృహాదుల నిర్మాణ శాస్త్రానికీ ముడివేయడానికి ప్రయత్నించాడు.

"సమాజంలోని ఏ వ్యక్తికైనా తనకు సంబంధించినంతవరకు తాను నివసించే ఇంటిలోకాని, పనిచేసే ప్రదేశంలోకాని కొన్ని 'వాస్తుపరమైన దోషాలతో పాటు - వాస్తుకు అనుకూలంగా ఉన్న అంశాలలో కొంత వాస్తుబలము కూడా ఉంటుంది. అంటే ప్రతి వ్యక్తికి 'వాస్తు దోషాల' తోపాటు 'వాస్తు బలము' కూడా ఉంటుందన్నమాట".[3] అంటున్నాడు.

ఇది వాస్తు పండితుల మార్మికతనే తలపింపజేస్తుంది. ఎందుకంటే, ఈ గ్రంథంలో రచయిత వాస్తు దోషమంటే ఏమిటో ఎక్కడా చెప్పలేదు. అవి ఎక్కడ ఎలా వుంటాయో చెప్పలేదు. అలానే వాస్తుబలమంటే ఏమిటో చెప్పలేదు. ఏమి చేస్తే వాస్తు బలం వుంటుందో, వస్తుందో చెప్పలేదు. మూఢ విశ్వాసమంటే ఇదే. దాని కోసం ఎక్కడెక్కడో వెదకనవసరంలేదు.

"మూల గ్రంథాలలో చెప్పబడిన విషయాలను దాచిపెట్టి కేవలం మూఢవిశ్వాసాలను మాత్రమే పెంపొందించే విధంగా (ఈనాటి వాస్తు గ్రంథాలు) వ్రాయబడి ఉన్నాయి".[4] అంటున్నాడు.

అందువల్ల రచయిత "వాస్తులో చెప్పబడిన ప్రతి ముఖ్యసూత్రమునకు హేతువును వెదుకుటకు ప్రయత్నించాను. ప్రధాన సూత్రాలలో చాలావాటికి శాస్త్రీయమైన హేతువులు కన్పిస్తున్నాయి"[5] అంటూ తనపరిశోధన పర్యవసానాన్ని తేల్చాడు.

అంటే వాస్తువుకూ, ఆధునిక నిర్మాణశాస్త్రానికీ రచయిత వారధిని నిర్మించడానికి

---

2. అందులోనే, పే - 30
3. అందులోనే, 'ఈ రచనలో ఏముంది?' అనే ముందు మాటలో
4. అక్కడే
5. అక్కడే (పేజీ నంబరు లేదు)

ప్రయత్నించాడని దీనివల్లతేలుతుంది. మూలగ్రంథాలలో చెప్పబడిన వాటిలో మూఢవిశ్వాసం కానిదేమిటి? వాస్తువులో చెప్పబడ్డ ముఖ్యసూత్రాలేమిటి?

వాటికి శాస్త్రీయమైన హేతువులేమిటి?

ఈ ప్రశ్నలకు నేరుగా సమాధానం చెప్పడానికి రచయిత తన గ్రంథంలో ప్రయత్నించలేదు. కులానికొక దిశపల్లాన్ని ముఖ్యవాస్తుసూత్రంగా పరిగణించని ప్రాచీన గ్రంథం ఒక్కటికూడా లేదు. దిశలనీ, పల్లాలనీ ముఖ్య సూత్రాలుగా పరిగణించని గ్రంధమూలేదు. ఇవి కాని ముఖ్య సూత్రాలేవో రచయిత పేర్కొనలేదు కూడా.

## ఆర్య వాస్తువా?

"ప్రాచీనకాలంలో మొదట ఆర్యులు గంగానదికి దక్షిణ దిశలోని మైదానాలను మాత్రమే ఆక్రమించుకొని జీవనం సాగించారు. ఈ మైదానాల్లో కురిసిన వర్షపునీరు ఉత్తరంగా ప్రవహించి నదిని చేరుకొని, అటులనే తూర్పునకు ప్రవహించుచున్నది. కాబట్టి తూర్పుదిశగా ఏటవాలుగా ఈ మైదాలున్నాయి" అంటూ, ఆర్యులు ఉత్తరం, తూర్పు నీటివాలు యేర్పరచుకోడానికి కారణాన్ని రచయిత యుక్తీకరణ ధోరణిలో సమర్థించారు. కాని, హేతుత్వమూ, యుక్తీకరణ ఒకటికావు.

గంగా తీరంలో ఆర్యులున్నకాలం ఏదీ? వాస్తుగ్రంథాలు వ్రాయబడిన కాలం ఏదీ? క్రీ.పూ. ఏ 1000-1500 సంవత్సరాలనాడో ఆర్యులు గంగాతీరంలో వున్నారు. ఆ గుడిసెల, గుడారాల ద్రిమ్మరులకు వాస్తు 'శాస్త్రం' లేదు. ఆ తర్వాత క్రీ.శ. 5 శతాబ్ది తర్వాత రచించబడిన బృహత్సంహితాదులు ప్రధానంగా ఖగోళ శాస్త్రగ్రంథాలు, కాలామృతాదులు జ్యోతిష గ్రంథాలు. వాటిలో వాస్తువు ప్రస్తావించబడేనాటికి కూడా ఆర్యులు గంగాతీరంలోనే వుండిపోయారా? కాళిదాసు, వరాహమిహిరాదులు గంగా తీరవాసులా? సమర్థకులకు ఈ ప్రశ్నలు కావు.

వాస్తువుకు ప్రాధ్యానత యిచ్చిన గ్రంథాలన్నీ 10వ శతాబ్ది తర్వాతనే వ్రాయబడ్డాయి. వాటిలో ముహూర్తాదుల నిర్ణయానికి జ్యోతిషాదులు కూడా చొరబడ్డాయి. ఈ విషయాలు "కొడాలి" వారికి తెలియవనుకోడానికి వీలులేదు. తన గ్రంథంలో వాటిని ప్రస్తావించారు కూడా.[7] వాస్తు గ్రంథాలు వెలువడేనాటికి ఆర్యులు దేశమంతటా వ్యాపించారు. వారి సర్వాధికారాన్ని ఆనాటి సమాజంపై కూడా వ్యాప్తి చేశారు. ఆనాటికి దేశంలో జనాభా చాలా చాలా తక్కువ. 1600 లో ఈ దేశమంతటి జనాభా 10 కోట్లంటే, అంతకుముందు ఐదారుశతాబ్దాల నాడు ఈ దేశ జనాభా ఎంత తక్కువుండేదో వూహించుకోవచ్చు. ఎక్కడ చూచినా కావలసినంత మెల్లా వుంది. అలాంటి

6. అందులోనే, పే - 38
7. అందులోనే, పే - 22

స్థితిలో స్థలాల ఆకారాలతో, నీటివాలు వంకతో పిచ్చపిచ్చగా గృహనిర్మాణ వాస్తు సూత్రాలను ప్రజలపై రుద్దవలసిన అవసరంలేదు. ఎందుకు రుద్దారనే ప్రశ్నకు కుల వాస్తులో హేతుబద్ధ సమాధానం దొరకదు.

**భూతాలు - దిక్కులు :**

కొడాలి వారు పంచభూతాల్ని గురించి కూడా మాట్లాడారు.[8] భూతాలంటే ఏమిటి? అవి ఐదేనా? అనేది మరో ప్రశ్న. చార్వాకులు ఆకాశాన్ని భూతంగా అంగీకరించలేదు. 4 భూతాలతోనే సరిపెట్టుకున్నారు. వైదికం 5 భూతాలను ప్రచారం చేసింది. దార్శనికులు 25కు పైగా భూతాలను ప్రస్తావించారు. వారిలో ఎవరుపేర్కొన్నవీ భూతాలు (మూలద్రవ్యాలు) కావు. ఆకాశం మూలద్రవ్యం కాదు, నిప్పు శక్తేకాని మూలద్రవ్యంకాదు. నీరు రెండు మూలద్రవ్యాల సమ్మేళనమే కాని మూలద్రవ్యం కాదు. గాలి పదిదాక మూలద్రవ్యాల సమ్మేళనాల మిశ్రమమేకాని మూలద్రవ్యంకాదు. భూమి 92 మూలద్రవ్యాల, సమ్మేళనాల, మిశ్రమాల కలయికేకాని మూలద్రవ్యంకాదు. వేద సంస్కృతిలోని ప్రకృతి ఆరాధనను మనం మన్నించలేము. సూర్యుణ్ణి చూచి గాయత్రీ మంత్రం జపించడం ఆచరించే దశలో మనం లేము. వాటి ఆధారంగా వాస్తుశాస్త్రానికి రూపకల్పన చేశారని భావించడం అర్ధరహితం. ఒక ప్రదేశాన్ని గుర్తించడానికి దిక్కులేర్పరచుకున్నారని మనం అర్ధం చేసుకోవచ్చు. ఆ పరిమితి భూమి వరకే వుంటుంది. ఆ దిక్కుల్లో ఒకటి శుభం. మరొకటి అశుభం ఎలా అవతాయో, అందుకు రుజువులేమిటో చూపాలి, ఆ దిక్కులు 8 ఎందుకు కావాలో, ఇంకా ఎక్కువ సంఖ్యలో యెందుకు వుండకూడదో అర్ధవంతమైన సమాధానం కావాలి. ఆ దిక్కులకు పాలకులెందుకో చెప్పాలి. ఆ పాలకుల గుణగణాలను ఏరీతిగా నిర్ణయించారో చెప్పాలి. భూమిని దాటి రోదసిలోనికి పోతే, దిక్కులెందుకు ఎగిరిపోతాయో చెప్పాలి.

పంచభూతాలను, దిక్కులను ప్రస్తావించని వాస్తుపండితుడు లేడు. వాటి గురించిన వివరాలు వారు తెలిసి మాట్లాడుతున్నారో, తెలియకుండానే మాట్లాడుతున్నారో అర్ధం కాదు. అసలు "పంచభూతాలకు, దిక్కులకు" గృహ నిర్మాణానికి సంబంధమేమిటి? మార్మిక అభిప్రాయాలను యేర్పరచుకున్న పూర్వుల్ని సమర్ధించడానికి ఒక్కొకరు ఒక్కొక వేషంలో బయలుదేరడం శోచనీయం. కాళ్లున్నది వెనక్కు నడవడానికి కాదు, ముందుకు నడవడానికి, మేధవున్నది వెనక్కు తిరిగి ఆలోచించడానికి కాదు, ముందుకు జరిగి ఆలోచించడానికి -

'విజ్ఞాన శాస్త్రానికి మొదలేకాని చివరలేదు,'[9] అంటున్నారు కొడాలివారు. అది

8. అందులోనే, పే - 26-27
9. అందులోనే, పే - 17

నిజమే, కాని, మన మతవాదుల విజ్ఞాన "శాస్త్రాలకు" వున్నది మొదలొక్కటే, చివర కూడా అదే. ప్రాచీనకాలం నుంచి "శాస్త్రాల" పేరుతో మనకు దిగుమతి అయినవన్నీ దేవుళ్లు చెప్పినవేకాని, మనుషులు కనుగొన్నవికావు. వాస్తువుకూడా దేవుడు ప్రసాదించినదే! కాకపోతే, 'రుషులు' దాన్ని వల్లించి మన కాలందాక నిలబెట్టుకొంటూ వచ్చారు. అదే ప్రాచీన శాస్త్రాల మనుగడకు మూలం.

మన పూర్వులు "విజ్ఞానాన్ని నిగూఢంగా నిక్షిప్తం చేశారు,[10] అనికూడా అంటున్నారు - వాస్తువులో ఏమోవుందని చూపాలకున్న కొడాలివారు. దాన్ని అలా అనడంకంటె, పూర్వులు వారికున్న అల్పజ్ఞానాన్ని నిగూఢంగా నిక్షిప్తంచేసి, దాన్ని కొన్ని వర్ణాలకే అధ్యయనాంశంగాచేసి అజ్ఞానాన్ని బాహాటంగా వెదజల్లారని చెప్పడం అవసరం. ఎందుకంటే, చారిత్రకాసక్తితో ప్రాచీనుల్ని అధ్యయనంచేసి విలువకట్టడం వేరు, వారిని సమర్థించడానికి ప్రయత్నించడం వేరు.

### రాజీపడని విజ్ఞానం :

ఇంజనీరింగ్ కళాశాలాచార్యులైన కొడాలివారు వాస్తువులో కులతత్వాన్ని దోపడాన్ని వ్యతిరేకిస్తున్నారు. అలా వ్యతిరేకిస్తున్న ఇతర వాస్తుపండితులు కూడా వున్నారు. వ్యతిరేకించకుండా బుజాన వేసుకొని మోస్తున్న సంస్కృత పండితులూ వున్నారు. వాస్తువులో కులాలను వ్యతిరేకించేవారు ముఖ్యంగా అ బ్రాహ్మణ వాస్తు సిద్ధాంతులే!

అలానే మూఢనమ్మకాలను వ్యతిరేకిస్తున్నామంటూ, అనేక మూఢనమ్మకాలను పోషిస్తున్న వాస్తుపండితులున్నారు. అంతెందుకు? వాస్తువే మూఢనమ్మకంకదా? కాగా, వాస్తువనేది ఎలా మూఢనమ్మకంకాదో, శాస్త్రమైతే దాని శాస్త్ర ప్రాతిపదిక లేమిటో నిర్మాణశాస్త్రజ్ఞులైన కొడాలివారు చెప్పలేకపోయారు.

జ్యోతిషానికీ, వాస్తువుకూ ముడివేయడం తగదని కొడాలివారన్నారు. ఆ మాట అన్న వాస్తుపండితులు కూడా వున్నారు. కాని, అసలు జ్యోతిషం శాస్త్రమా, కాదా? అన్న విషయం మీద వారి అభిప్రాయం చెప్పలేదు. జ్యోతిషం శాస్త్రం కాకపోతే, వాస్తువు శాస్త్రమెలా అవుతుందో చెప్పలేదు.

ఖగోళ విజ్ఞానానికీ, జ్యోతిషానికీ పూర్వులు ముడివేశారు. అది తప్పు.

నిర్మాణ శాస్త్రానికీ వాస్తువుకీ ముడివేశారు. అది తప్పు.

జ్యోతిషానికీ వాస్తువుకీ ముడిలేశారు అది తప్పు.

జ్యోతిషమూ శాస్త్రం కాదు, వాస్తువూ శాస్త్రం కాదు. అవి రెండూ మౌఢ్యాలే ఈ విషయాలు చెప్పడంలో ఏ ఖగోళవిజ్ఞానీ, నిర్మాణ విజ్ఞానీ మెత్తబడనవసరం

10. అందులోనే, పే - 30

లేదు. అందువల్ల హేతువాదులకు జ్యోతిషంతో, వాస్తువుతో రాజీ ప్రసక్తి తలెత్తదు.

"ప్రకృతి యొక్క ప్రభావాన్ని ప్రతిబింబిస్తూ అష్టదిశలలోని ప్రతి ఒక్క దిశకు ఒక నిర్దిష్టమైన స్థానం వుంది."[11] అంటున్నారు కొడాలివారు, ఎంత చిత్రం!

ప్రకృతి ప్రభావం 8 దిశలకేనా పరిమితమయ్యేది?! అందుకే నేను లోగడ దిశల విషయానికి వస్తే ప్రకృతిలో అనంత దిశలున్నాయన్నాను. కాగా, భూమి మీద మన సౌకర్యం కోసం యేర్పరచుకున్న 8 దిక్కులమీదనే దాని ప్రభావం వుండడమేమిటి? కొడాలివారంటున్న నిర్దిష్ట స్థానమేమిటి? పుస్తకంలో ఎక్కడా చెప్పలేదు. అసలు వుంటే కదా చెప్పడానికి?

"వాస్తు పురుష మండలాన్ని గురించి సరిగా అర్థంచేసుకోలేక వాస్తు పురుషుని గురించి అవాకులు, చెవాకులు వ్రాసి ఎద్దేవా చేస్తున్నారు"[12] అని కొడాలివారన్నా, అది వాస్తుపండితుల్ని గురించే అన్నారు. కాని, అసలు వాస్తు పురుషుడు, వాస్తు మండలం అనేవి "గాడిదగుడ్డు" లాంటివి. ఇంజనీర్లుకూడా ఇలాంటి సమర్థనలు వ్రాయబూనుకుంటే, అదొక దయానందనీయం అవుతుంది.

ఇప్పటిదాక మనం వాస్తుసాహిత్యంలో కొన్ని గ్రంథాల్లో కొంత కొంత భాగాన్నే పట్టి చూచాం. నిజానికి, వాటిలో ఒక్కొక్క గ్రంథం మీదనే ఒక్కొక్క పుస్తకం వ్రాయవచ్చు. అన్నిటి బాణీ ఒక్కటేకాన, అంత శ్రమపడనవసరం లేదు. కాగా, కొడాలివారిది ప్రత్యేక బాణీ. వాస్తువును శాస్త్రానికి దగ్గరగా తీసుకువెళ్ళి కొంతగా సమర్థించినవారు ఆయన ఒక్కడే. విజ్ఞానశాస్త్రమంటే ఏమిటో ఈ పుస్తకంలో అక్కడక్కడ ప్రస్తావించాము. అందువల్ల వాస్తువు శాస్త్రం కాదని ప్రత్యేకంగా కొసమెరుపు వ్రాయనవసరం లేదు.

నిజానికి జ్యోతిష్కులూ, వాస్తుపండితులూ చెప్పేవి ఫలాలే. ఆ ఫలాలు జరుగుతాయని చెప్పి బెదరించడమే వారివృత్తికాని, జ్యోతిర్వాస్తువులు శాస్త్రాలని రుజువు చేయవలసిన అవసరం వారికి లేదు. వారికి ఖాతాదారులు కొరవైతే కదా?

---

11. అందులోనే, పే - 29
12. అందులోనే, పే - 33

# చివరిమాట

జ్యోతిషం, వాస్తువులు సూడోసైన్సులు - శుష్కశాస్త్రాలు.

మంత్రాలు, మహిమలు కూడా మనసాంప్రదాయిక సొత్తు.

వినాయకుడి విగ్రహాల తొండాలచేత పాలుత్రాగించే మూకమనస్తత్వం మన సాంక్రమిక వారసత్వం.

పిల్లిశాస్త్రాలూ, బల్లిశాస్త్రాలూ, హస్తసాముద్రికాలూ, శకున శాస్త్రాలూ, చిలకజోస్యాలూ, భూతవైద్యాలూ, మనకు చాలా వున్నాయి.

ఈ క్షుద్రపోకడల్ని చూస్తూ వూరుకోవడం మన ప్రభుత్వాల అసమర్థతకు నిదర్శనం కాకపోయినా, ఔదాసీన్యానికి చిహ్నం.

అమెరికా సమాజంలో యిప్పుడు కొత్తగా ఎగిరేపళ్లేల జబ్బు వ్యాపిస్తున్నది. ఇతర గ్రహాల పురుషులు వచ్చి అమెరికన్ స్త్రీలకు గర్భాలుచేసి వెళ్లుతున్నారనీ, ఆ స్త్రీలు సంతానాన్ని కంటున్నారనీ కొన్ని అమెరికన్ చెత్త పత్రికలు చచ్చు పుకార్లను అక్కడ పనికట్టుకొని ప్రచారం చేస్తున్నాయి. అదొక లాభసాటి వ్యాపారమైంది. పాత మానసిక దోపిడి, భావదాస్యం స్థానంలో మత వైఖరి కొత్తవాటిని కనిపెట్టి పాదుకొల్పుతున్నది.

లోగా యూరీగెల్లర్ అనే ఇశ్రాయేలీ గారడీవాడు మానసిక శక్తితో స్పూన్లను వంచుతానంటూ (సైకోకెనెసిస్) ప్రదర్శనలిచ్చేవాడు. అవి మోసాలని హేతువాదులు, మానవవాదులు రుజువుచేశాక అతను తన దుకాణాన్ని ఎత్తివేసుకున్నాడు.

సాయిబాబా మహిమల దుకాణాన్ని ఇంకా యెత్తివేయలేదు. కాని, అలాంటి దుకాణాలను మనదేశంలో యిప్పుడు సినిమాలవాళ్లూ, టివీ ఛానల్ల వాళ్లూ తెరిచారు. వారి సరుకు బాగానే అమ్ముడు పోతున్నది.

కాగా, యిప్పుడు మన విశ్వవిద్యాలయాలవాళ్లు వాస్తు దుకాణాలను సరికొత్తగా తెరుస్తున్నారు. మన జ్యోతిషాలు, వాస్తువులు కులతత్వంమీద, మతతత్వం మీద ఆధారపడి నిర్మాణమయ్యాయి. ఈ పరిస్థితులు చూస్తుంటే ఈ దేశం "హైందవీకరణ" వైపు పోవడం లేదా? అనిపిస్తుంది.

ఖగోళ విజ్ఞానం పేరు చెప్పుకొని జ్యోతిషమూ, ఇంజనీరింగు పేరు చెప్పుకుని వాస్తువూ బ్రతుకుతున్నాయి. ఖగోళ విజ్ఞానం అత్యంత వేగంతో పెరుగుతున్న వైజ్ఞానిక యుగంలో మనం వున్నాం. ఖగోళ విజ్ఞాన విషయాలు తెలియని టక్కరులు మాటల గారడీతో బ్రతుకుతుంటే, గృహ నిర్మాణ విషయాలేమీ తెలియని నయవంచకులు ఇళ్లూ వాకిళ్లూ పడగొట్టించే దిక్కుల గారడీ చేస్తున్నారు. విజ్ఞానం ఎంత పెరిగినా, మూఢబుద్ధి మాత్రం మారడంలేదు.

ఒకప్పటి జ్యోతిష్కులను నమ్మి యుద్ధాలుచేసి, రాజ్యభ్రష్టులైన రాజులున్నారు. హిట్లరు మదానికి పాక్షికంగాను, వినాశానికి పూర్తిగాను కారకులు జ్యోతిష్కులే.

ఒకప్పటి రాజధానీ నగరాలూ, రాజగృహాలూ, కోటలూ వాస్తువు ప్రకారం నిర్మించబడినవే. అందులో 90 శాతానికి పైగా శిధిలాలు కూడా లభ్యంకాని విధంగా విధ్వంసమయ్యాయి. జ్యోతిషాలు, వాస్తువులు వాటిని రక్షించలేదు.

ఐనా, ఈనాడు ఎన్నికలలో గెలుపుకోసమూ, గెలిచాక మంత్రి పదవి కోసమూ, మంత్రి పదవి వచ్చాక దాని నిలకడ కోసమూ జ్యోతిర్వాస్తు పండితుల్ని, ఫకీరుల్ని ఆశ్రయించి, వారి హుకుముల మేరకు తమ వసతి గృహాల షేపులు మార్పించుకొనేవారు మంత్రి పదవులు వెల,'బెడుతున్నారు. ఈ దేశాన్ని యిక వారేమి వుద్ధరిస్తారు?

వారికి తమ పదవుల భద్రత తప్ప దేశ భద్రత, సామాజిక భద్రత పట్టడం లేదు. దేశాన్ని యిక జ్యోతిష్కులకు, వాస్తు పండితులకు అప్పగిస్తే పోలేదా? మధ్యలో తమ పెత్తనమెందుకు?

మన దేశానికి ఉత్తర సరిహద్దున ప్రపంచంలోకెల్లా ఎత్తయిన హిమాలయ పర్వతాలున్నాయి. అందువల్ల ఈ దేశం సర్వదా దరిద్రంలోనే వుంటుందని ఒక వాస్తు సామ్రాట్టు వ్రాశాడు. ఎన్ని చీలికలు పేలికలుగా విభజన పొందినా, ఒకప్పుడీ దేశం సర్వసంపదలతో తులతూగిందనీ, అందువల్లనే ప్రపంచంలోని అనేక జాతులవారు ఈదేశం మీద వేల సంవత్సరాలుగా దండయాత్రలుచేసి, ఆక్రమించి యేలుతూ వచ్చారనేది చవట ఆలోచనలున్నవారి చారిత్రక పరిజ్ఞానానికి అందదు.

హిమాలయాలకు అవతల ఉత్తరానవున్న ప్రదేశమంతా వేలాది సంవత్సరాలుగా

సల్లంగానే వుంది. దానికి దక్షిణాన హిమలాయాలు చాల ఎత్తుగానే వున్నాయి. అయినా, ఆ ప్రదేశమంతామంచుయెడారిగానే ఇన్ని వేల సంవత్సరాలుగానూ వుంది. అక్కడివారి దరిద్రం వాస్తుమూఢుల చూపుకు అందదు.

మిగతా భూభాగంకంటె జపానులోని వారికి సూర్యదర్శనం ముందుగా అవుతుంది కాబట్టి, జపానువారు సౌభాగ్యవంతులుగా విలసిల్లుతున్నారని మరో వాస్తు వేషధారి వ్రాత. ప్రపంచాన్ని మొత్తాన్ని వదలి, జపానుమీదనే 1945లో రెండు యాటంబాంబులు ఎందుకు పడ్డాయో, అంతజననష్టం, విధ్వంసం జరిగితే సూర్యదర్శనం ఏమి చేస్తుండిపోయిందో, ఆ వెర్రిబాగులవారి చిలిపి ఆలోచనకు రాదు. ఏ భూ ఖండానికి ఎప్పుడు సూర్యదర్శనమయితే, అదే ముందు. అలాకాక సూర్యదర్శనం ముందయ్యే తూర్పు తీర ప్రాంతాలు సంపన్నమవతాయంటే, జపాను కంటె ముందు కొరియా, న్యూజిలాండు, ఆస్ట్రేలియాలు సంపన్నవంతం కావాలి. మనదేశంలో తూర్పురాష్ట్రాలు సౌభాగ్యవంతంగానూ, పడమటి రాష్ట్రాలు దరిద్రంగానూ వుండాలి. ప్రపంచంలోని అన్ని ప్రదేశాలలోనూ ఈ దామాషా ప్రకారం మేలు, కీళ్లు జరగాలి.

ఈ జాతకాల పిచ్చోళ్ళు, వాస్తు పిచ్చోళ్ళు "కాశీపట్నం చూడర బాబూ" అంటూ చుక్కానీ పెట్టెలో లాగా దేశవిదేశాలలోని కట్టడాల వాస్తును ప్రదర్శిస్తూ పుస్తకాలమీద పుస్తకాలు రాస్తున్నారు. వ్యాపారం బలే సాగుతోంది.

బీదా బిక్కీ అనే తేడా లేకుండా ఖగోళ విజ్ఞానం మీదుగా పేనబడిన మౌఢ్యం జ్యోతిషం. కలవారి మౌఢ్యాన్నీ, ఆశాభయాలను ఆధారం చేసుకొని వంచించే చిలిపి వృత్తి వాస్తువు. ఇవి జంటగా పయనిస్తాయి.

ఖగోళ విజ్ఞానమూ, గృహాదుల నిర్మాణశాస్త్రమూ బహుధా పెరిగిన రోజులలో మనం వున్నాం. గ్రహాదుల మీదకు, వాటి అవతలకు రోదసి అంతరాంతరాలలోకి రాకెట్లు పంపిస్తున్న యుగంలో మనం వున్నాం. రాకెట్ల నిర్మాణంలో ఖగోళ, గణిత, భౌతిక, రసాయనిక, జీవశాస్త్రాభివృద్ధి తోడ్పడుతూనే వుంది. తాటాకుల శ్లోకాలూ, వేమన పద్యాలూ ఆధారం చేసుకొని జ్యోతిషాన్ని, వాస్తువును శాస్త్రాలుగా భ్రమింపజేయడానికి సిగ్గుపడే రోజులు దగ్గరలో వస్తాయని ఆశిద్దాం.

# అనుబంధం - I

వాస్తువులో వాస్తవాలేమీలేవనే విషయాన్ని "వాస్తువు శాస్త్రమా?" అనే ఈ గ్రంథంలో మనం బారుకీ పరిశీలించి తేల్చుకున్నాం. వాస్తుపండితులు వేరు, గృహ నిర్మాణ శిల్పులువేరు, వాస్తుపండితులకు గృహ నిర్మాణ శిల్పం తెలియదు. వారి ఆసోది పాండిత్యంలో (కులాలు), దిక్కులు, ఎత్తు పల్లాలు, శుభాశుభ ఫలాలు ప్రముఖంగా వస్తాయి. పూజా పురస్కారాలు, ముహూర్తాలు వాటిని అంటిపెట్టుకొని వుంటాయి. అందువల్ల వాస్తు పండితులు చాదస్తులవతారు కాని,శాస్త్రజ్ఞులు కారు. నిర్మాణ శిల్పం తెలిసినవారే ఇంటి యజమాని అవసరాలు తెలుసుకొని, గోడలు, గదులు, కూసాలు, దూలాలు, వాసాలు, వాకిళ్లు, కిటికీలు ఏయే తరహాయిండ్లకు ఏ కొలతల్లో ఏ మేరకు అవసరమో వివరిస్తారు. ఏ నిర్మాణానికయినా ఇలాంటి వివరాలే అవసరంకాని, వాస్తు పండితులు సూచించే దిక్కుల, ఎత్తు పల్లాల గారడీ కాదు. వాస్తు పండితులు ప్రదర్శించే వాస్తు ఫలాల గారడీని ఈ గ్రంథంలో తొలినుంచి తుది దాక చూచాం.

ప్రొఫెసర్ కొడాలి శ్రీనివాస్ స్ట్రక్చరల్ ఇంజనీర్. వారు ప్రాచీన, ఆధునిక వాస్తు గ్రంథాలను బాగా అధ్యయనం చేశారు. ప్రాచీన వాస్తువీనాడు పనికి రాదంటారాయన. లోగా వారు "వాస్తులో ఏముంది?" అనే పెద్ద గ్రంథం వ్రాశారు. సంప్రదాయ వాస్తువును వారు అంగీరించకపోయినా, "వాస్తులో ఏమో వుంది" అనే వాస్తు పక్షపాతం ఆయన్ని బాధిస్తున్నట్లుమేమభిప్రాయపడి, ఈ పుస్తకం 10వ అధ్యాయంలో కొంత విమర్శ చేశాం. ఆ తర్వాతవారు "వాస్తులో వాస్తవాలు" అంటూ ఈ సంవత్సరం జనవరిలో మరో చిన్న పుస్తకం ప్రచురించారు. అందువల్ల, వాస్తవాలే లేని వాస్తువులో ప్రొ॥ శ్రీనివాస్ కనుక్కోడానికి ప్రయత్నిస్తున్న వాస్తవాలెలాంటివో చూడక తప్పడంలేదు.

ఈనాటి వాస్తు పండితులు ప్రాచీన వాస్తు గ్రంథాల్లోని పదాలకు సాంకేతిక అర్థాలు గ్రహించలేకపోతున్నారని ప్రొ॥ శ్రీనివాస్ ఆవేదన పడుతున్నట్లు కన్పిస్తున్నారు. ప్రాచీన వాస్తు గ్రంథాల్లోని ఐదు పది శ్లోకాలను ఆధారం చేసుకొని, అందులోని కొన్ని పదాలకు మారుమూల అర్థాలను సాధించడానికి ప్రయత్నిస్తున్నారు. ప్రాచీన వాస్తు గ్రంథాలను మరికొన్నిటిని అధ్యయనం చేస్తే, మరికొన్ని శ్లోకాలను కూడా పోగుచేసుకోవచ్చు. ఇదంతా కుండెడు విషంలో సంశయాస్పదమైన ఐదు పది పాలబొట్ల కోసం పరిశోధించినట్లుంటుంది.

చిత్రకవిత్వాలకు, ద్వ్యర్థికావ్యాలకు, త్ర్యర్థికావ్యాలకు బహుభిన్న అర్థాలు సాధించడం సంస్కృతాంధ్ర సాహిత్య ప్రక్రియల్లో మనం ఎరుగుదుం. కాని, ఆ పద్ధతి వాస్తువుకు కుదరదు. ప్రాచీన వాస్తు గ్రంథాల్లోని శ్లోకాలను పరిశీలిస్తే, తెలుగు బాగా

వచ్చిన వారికి కూడా అందలి బాష అర్థమయ్యేలా వుంది. అవి నిగూఢమైన భాషలో లేవు. అలా వుండవలసిన అవసరం లేదనుకున్నవారే సులభ సంస్కృత భాషలో ఆ శ్లోకాలను అల్లినట్లు తెలుస్తుంది. బాష అంతా సాంకేతిక పదాలమయం కాదు. కాన, ఏవో కొన్ని మారు మూలశ్లోకాలను ఎంపిక చేసుకొని, అందులోని పదాలకు కృతక అర్థాలను సాధించే పద్ధతి వాస్తువులో కొంతయినా వాస్తవమున్నదని రుజువు చేయడానికి చాలదు. ఆ భాగం వాస్తు పాండిత్య పరిధిలోకి రాదు. అది వాస్తుపునరుజ్జీవ ధోరణి. చివరకది మతపునరుజ్జీవన పరిధిలోకి చేరుతుంది.

గతంలో వేదవాఙ్మయానికి వేర్వేరు అర్థాలు తీస్తూ వేర్వేరు భాష్యాలు వెలువడినై. అవి చాలవన్నట్లు దయానందుడు కృతకఅర్థాలు తీస్తూ, వేదాలకు సరికొత్త భాష్యం వ్రాసి, వేదాల్లో విమానాలు, టెలిగ్రాఫులు మొదలైన సాంకేతిక విజ్ఞాన పరికరాలున్నవన్నాడు. వేదాల్లో లేనిదేమీ లేనే లేదు పొమ్మన్నాడు. వినాయకుడికి ఏనుగుతల అతికించిన శివుడు గొప్ప సర్జన్ అనీ, అంతటి వారు ఆధునికుల్లో లేరనీ మాజీ కేంద్రమంత్రి రాజనారాయణ పనిగట్టుకొని ప్రచారం చేశాడు. ఒకే భగవద్గీతకు మనమతాచార్యులు ద్వైత, అద్వైత, విశిష్టాద్వైత, శుద్ధాద్వైతాది సిద్ధాంతాలకు అనుగుణంగా ఎవరి భాష్యాలు వాళ్లు వ్రాయగా – ఆ గీతలోనే తిలక్ హింసను, గాంధీజీ అహింసను చూచారు. దశావతార కథనంలో మన జాతీయ మతపునరుజ్జీవనవాదులు డార్విన్ జీవపరిణామవాదాన్ని చూపడానికి ప్రయత్నిస్తారు. ఇదంతా ఇన్‌ఫీరియారిటీ కాంప్లెక్స్ ఫలితమే. ఈ విపరీత బుద్ధులు పురుషసూక్తంలో, ఇతర వైదికహిందూ వాఙ్మయంలోనూ వున్న మానవావిర్భావ కథనాన్ని ఏ చూరులో దోపుతారో మరి? (విరాట్ పురుషుడి ముఖం నుంచి బ్రాహ్మలు, భుజాలనుంచి క్షత్రియులు, తొడలనుంచి వైశ్యులు, పాదాలనుంచి శూద్రులు పుట్టినట్లు ఆ వాఙ్మయ కథనం)

జాతీయ అహంలో పుట్టుకొచ్చిన మతపునరుజ్జీవన జాడ్యం ప్రమాదకరమైన రోగం. ప్రొ॥ శ్రీనివాస్ పరిశోధన వాస్తు పండితులకు కొత్తదారి వేస్తున్నది. ఇక వాస్తు పండితులంతా ప్రాచీన వాస్తు శ్లోకాలకు అర్థభేదాలు సాధించుకుంటూ తన్నుకోవాలి. ఇంతకుముందు నుంచీ జ్యోతిష్కుల్లాగే వాస్తు పండితులు కూడా తమలో తాము తన్నుకుంటూనే వున్నారు. ఈ తన్నులాటలు విజ్ఞాన శాస్త్ర పరిధిలోకి చేరవు. విజ్ఞానశాస్త్ర సూత్రాలు సార్వజనీనం. విజ్ఞానశాస్త్ర విషయంలో శాస్త్రజ్ఞులు తమలో తాము తన్నుకోరు. విజ్ఞానశాస్త్రం కూడా ఫలితాలు చెపుతుంది. అవి అన్నీ భౌతిక – రసాయనిక ఫలితాలు. ఎవ్వరు, ఎక్కడ, ఎన్ని ప్రయోగాలు చేసినా అవే ఫలితాలు వస్తాయి. వాస్తువులాగా ఒక పండితుడు యిల్లు కట్టించే పద్ధతి చెపితే, మరొక పండితుడు వచ్చి దాన్ని పడగొట్టించే

పద్ధతి విజ్ఞాన శాస్త్రంలో వుండదు. కట్టించే వాడి వాస్తువు వేరుగా, పడగొట్టించే వాడి వాస్తువు వేరుగా వుండేది శాస్త్రమెలా అవుతుంది? అందుకే వాస్తువేనాడూ శాస్త్రం కాదంటున్నాం.

ఇప్పుడు ప్రొ॥ శ్రీనివాస్ ప్రవేశపెడుతున్న 'అర్థం లాగుడు పద్ధతిని' మున్ముందు వాస్తు పండితులు కూడా అనుసరించే ప్రమాదం వుంది.

రాజమందిరంలో రావణుడి చిత్రాన్ని చూచిన 'పామర' కాళిదాసు 'రాభణ' అని అరిచాడట. దానికి రావణ, కుంభకర్ణ, (వి) భీషణ శబ్దాల్లోని 1,2,3 అక్షరాలకు సంకేతంగా అతను 'రాభణ' అన్నాడని మంత్రికుమారుడు కళాధరుడు సమర్థించి చెప్పినట్లు మనకో కథ వుంది. ఆ కృతక అర్థాల పద్ధతి శాస్త్రాల విషయంలో సాధ్యం కాదు. పైగా, వాస్తు గ్రంథాలన్నిటా బండెడు శ్లోకాలున్నాయి. వాటన్నిటికీ ప్రొ॥ శ్రీనివాస్ లాగిన అర్థాలవంటి వాటిని లాగడానికి సాధ్యం కానే కాదు.

వాస్తు, జ్యోతిష గ్రంథాలన్నీ ఏ ఫలాలు చెప్పినా, మనుషులకే కాని, గృహాలకు, గ్రహాలకు కాదు. ఈ మౌలిక విషయాన్ని శ్రీనివాస్ మరచినట్లున్నారు. జ్యోతిర్వాస్తు గ్రంథాలన్నిటినీ తిరగవేయండి. వాటిలో చెప్పబడినవన్నీ మనుషులకు సంబంధించిన శుభాశుభ ఫలాలే. ఒక పదానికి నానార్థాలున్నంత మాత్రాన ఆ పదానికి ఏ అన్వయాన్నిపడితే ఆ అన్వయాన్ని చేయకూడదు. దార అంటే భార్య, ధార అంటే స్రోత. అవి రెండూ సంస్కృత పదాలే. వాటిరెంటినీ సమానార్థాలుకాలుగా భావించి, గందరగోళపడితే ఎలా?

గృహవాస్తు ఫలాలన్నీ గృహవాసులకే చెప్పబడ్డాయి. దేవాలయ వాస్తు ఫలాలన్నీ ప్రతిష్ఠిత దేవతా విగ్రహాల పూజనీయతకే చెప్పబడ్డాయి. రాజ గృహాలకు, దుర్గాలకు చెప్పబడిన ఫలితాలు రాజులకు, రాజ్యాలకు మాత్రమే చెందుతాయి. ఏ చిన్న వాస్తు గ్రంథం పరిశీలించినా, ఈ వాస్తవం తెలుస్తుంది. గృహస్థుల్ని భయపెట్టి, మోసంచేసి, డబ్బు గుంజడానికి చెప్పే ఫలాలు తప్ప, వాస్తువులో మరేమీ వుండదు. వాస్తు ఫలాలు ముందెన్నడూ నిజం కాలేదు, ఇకముందెన్నడూ నిజంకాబోవు. కాబట్టి, వాస్తువులో వాస్తవం వుండడానికి వీలులేదు. వాస్తవం కానిదేదీ శాస్త్రం కావడానికి వీలులేదు. ప్రొ॥ శ్రీనివాస్ తీస్తున్న అర్థాల తీరు ఎలా వుందో చూడండి:

విశ్వకర్మ ప్రకాశికలోని 13వ అధ్యాయం వాస్తుదోషాలను (వేధలను), వాటి ఫలాలను వర్ణించిన ఒకానొకశ్లోకం ఇలా వుంది.

వంశాగ్రేచాన్య వంశస్స్యాదగ్రేవా భిత్తి బాహ్యగా
తద్వంశే వేధయేద్గేహం వంశహానిః ప్రజాయతే

ఈ శ్లోకాన్ని వుదహరించి –దూలం గోడ వెలుపలకు వుంటే, అది చెడిపోతుంది – అనే అర్థాన్ని ప్రొ॥ శ్రీనివాస్ తీశారు. వేమన పద్యంలో ముద్రగెడవారు ఇలాంటి

అర్థాన్నే తీశారు. ఇలాంటి వాస్తవాలు ప్రాచీన "వాస్తు శాస్త్రం"లో వున్నాయనీ, అవి ఈనాటి వాస్తుపండితులకు అర్థం కావడంలేదనీ ఆక్షేపించారు. అసలు వాస్తువే ఆక్షేపణీయమైనపుడు, దానిలో వాస్తవాన్ని చూపడానికి ప్రయత్నించడం కూడా ఆక్షేపణీయమే.

వంశం అంటే దూలం అనే అర్థం కూడా వున్నమాట నిజమే. కాని, ఇక్కడ 'వంశహాని' లోని వంశ శబ్దానికి దూలం అని అర్థం కాదు. ఈ ఒక్క శ్లోకంలోని 'వంశహానికి' దూలం చెడుతుందని అర్థం చెప్పుకొంటే, మిగతా దోషా(వేధ)లకు ఏమి అర్థం చెప్పుకోవాలో ఆలోచించాలి. పై శ్లోకంలో ముందు. వెనుక చరణాల్లోని వేధలు, వాటి ఫలాలు ఎలా చెప్పబడినవో చూస్తే శ్రీనివాస్‌గారి అన్వయం సరికాదని తేలుతుంది.

కోణవేధే భవేద్వ్యాధి ర్ధననాశోవినిగ్రహం...
దృష్టివేధే భవేన్నాశోధనస్యమరణం ధ్రువం...
సమక్షుద్రం క్షుద్రవేధే పశుహానికరం పరం...
ఛాయావేధంతు తద్గేహం రోగదం, పశుహానితః
రుజువేధే మహత్రాసోజాయతే నాత్ర సంశయః
వంశాగ్రేచాన్య వంశస్యాదగ్రేవాభిత్తి బాహ్యగా
తద్వంశేవేధయేద్గేహం వంశహానిః ప్రజాయతే..
అక్షవేధం విజానీయా ద్వినాశం, కలహం భవేత్...
ఉచ్చవేధోభవేన్మూనం తద్వేధేన శుభప్రదం...
దంతవేధమిత్యాహుః శోకం రోగం కరోతితత్

ఏయే వాస్తుదోషాలకు (వేధలకు) ఏయే ఫలాలు చెప్పబడ్డవో, పై ఫలాలను బట్టి అర్థం చేసుకోవచ్చు. ఇంత చిన్న వ్యాసంలో ఈ వేధలకు అర్థం చెప్పుకోవడం కష్టం. స్థూలంగా చెప్పుకుందాం.

మరో యింటి కోణానికి ఎదురుగా వుంటే కోణవేధ – వ్యాధి, ధననష్టం, శత్రుత్వం
ఎదురింటి ముఖద్వారం రెట్టింపు యెత్తువుంటే దృష్టివేధ – ధననాశనం, మరణం
ప్రక్క యింటికి ఎక్కువ, తక్కువ యెత్తుంటే క్షుద్రవేధ – పశుహానికరం

మరో యింటి నీడపడితే ఛాయావేధ – రోగకరం, పశుహానికరం
గోడల వాస్తు సరిలేకపోతే రుజువేధ – భయం
రెండు యిళ్ల దూలాలు తాకితే వంశవేధ – వంశహాని
యూ పాగ్రంలో భుజాలు కలిస్తే అక్షవేధ – వినాశం, కలహం
ఒకే గోడ మీద రెండు యిళ్లుంటే దంతవేధ – దుఃఖకరం, రోగకరం, ఇవేకాక, ఉత్తరం, తూర్పు బాగా పల్లమైతే, ఉచ్చవేధ – శుభప్రదం

ఇతర సందర్భాల్లో కూడా విశ్వకర్మ ప్రకాశిక చెప్పిన ఫలాలు గమనార్హం:

❋ సర్పాభా పుత్రపౌత్రఘ్నీ, వంశాభా వంశహానిదా (1-47)= సర్పాకార భూమి పుత్ర పౌత్రులకు మరణం, వెదురు ఆకారం గల భూమి వంశహాని కల్గిస్తుంది.

❋ ముసలా ముసలాన్పుత్రాన్ జనయేత్ వంశఘాతకాన్ (1-56)= రోకలి ఆకారం గల భూమి వంశఘాతకులైన పుత్రుల్ని కల్గిస్తుంది.

❋ స్తంభేవంశవినాశః స్యాద్ద్వారే వహ్నిభయం భవేత్ (1-109)= రాహువు దిక్కులో స్తంభం నిల్పితే వంశనాశనం, ద్వారం పెడితే అగ్నిభయం

❋ గమనేకార్యస్స్యాత్ గృహారంభేకులక్షయం (1-109)=రాహుకాలంలోప్రయాణం చేస్తే కార్యహాని, గృహారంభం చేస్తే కులక్షయం (ఇక్కడ కులశబ్దానికి విపరీతార్థం తీయలేము)

❋ నక్షత్రై క్యే స్వామి మృత్యుర్వర్ణే వంశవినాశనం (2-87)=ఇంటికి, యజమానికి ఒకే నక్షత్రమైతే యజమాని చస్తాడు. వర్ణకూటం సరిగా లేకపోతే వంశం నాశనమవుతుంది.

❋ వాతాఖ్యం తద్విశాలంతు బంధునాశధనక్షయం (2-176)= వాతాఖ్యమనే ద్విశాలలో నివసిస్తే బంధునాశనం, ధనక్షయం జరుగుతుంది.

❋ సంతోషదాయకాల్లో ద్రవ్యదర్శనం కూడా పేర్కొనబడింది (1-125)

దీన్నిబట్టి, వంశ,కుల, బంధు, ద్రవ్యాది శబ్దాలకు ప్రొ॥ శ్రీనివాస్ తీసిన అర్థాలు సరికావనిపిస్తుంది.

విశ్వకర్మ ప్రకాశిక 16 ప్రధాన గృహవేధులను పేర్కొని వాటి ఫలాలను ఈ క్రింది విధంగా చెప్పింది. (13:7)

1. వాకిళ్లు, కిటికీలు లేని యిల్లు అంధకం - అసామాన్యమైన రోగం
2. విదిక్కుల్లో నిర్మించిన యిల్లు రుధిరం - అతిసారరోగం
3. వాస్తు పురుషాంగాలు లేని యిల్లు కుబ్జం - కుష్టురోగం
4. దిక్కుల్లో ఛిద్రాలు లేని యిల్లు కాణం - గుడ్డితనం
5. నేలకంటె పల్లంలో వాకిళ్లున్నయిల్లు బధిరం- సర్వదుఃఖం, మరణం
6. ఒకదానికొకటి సంబంధం లేకున్నయిల్లు దిగ్వక్త్రం - సంతతినాశనం
7. శాస్త్రరీత్యా తక్కువ కొలతలు గల యిల్లు చిపిటం - నీచుల సాంగత్యం
8. అశుభాలు కలిగించేయిల్లు వ్యంగం - వ్యంగతరోగం, మరణం
9. ప్రక్కభాగాలు ఎత్తుగల యిల్లు మురజం - క్షయ
10. చూరు తక్కువయిల్లు కుటిలం - క్షయ
11. కుట్టకం (లక్షణాలు చెప్పలేదు) - భూతదోషం
12. సుప్తకం (లక్షణాలు చెప్పలేదు) - యజమాని మరణం
13. స్తంభంలేని యిల్లు శంఖపాల్లం - కురూపం

14. దిక్కు, సింహద్వారాల మధ్యభాగం
ఒకే రేఖలోని యిల్లు వికటం - సంతాననాశనం
15. పార్శ్వ భాగాలు లేని యిల్లు కంకం - శూన్యం
16. నాగలివలె ఎత్తుగా వుండేయిల్లు కైంకరం - స్త్రీహాని

ఈ ఫలాలేకాదు, వాస్తు గ్రంథాలంతటా అడుగడుగునా శుభాశుభ ఫలితాలే చెప్పబడ్డాయి. వాటికి శాస్త్రీయార్థాలు తీయబూనే వారి వైజ్ఞానిక నిజాయితీ శంకాస్పదమవుతుంది. పై విధంగా చెప్పిన వాస్తువుశాస్త్రమా, కాదా? అది చెప్పే ఫలాలు వాస్తవమా, కాదా? వీటి నిక్కచ్చితనాన్ని తేల్చి చెప్పాలి. ఈ సందర్భంగామేమీ గ్రంథంలో వాస్తువు శాస్త్రం కాదనీ, అది చెప్పే ఫలాలు వాస్తవాలుకావనీ నిర్ద్వంద్వంగా తేల్చిచెప్పాం.

స్థలాల దిశల ఎత్తు పల్లాల విషయంలో ప్రొ॥ శ్రీనివాస్, ప్రాచీన వాస్తు గ్రంథాలతో రాజీపడీ - పడలేక, తికమకపడుతున్నట్లు కన్పిస్తున్నారు. "వాస్తులో వాస్తవాలు" 18వ పేజీలో "వాస్తు విద్య" గ్రంథంనుంచి రెండు శ్లోకాలను ఉదహరించాడు. 'కులం' అనే పదానికి 'జనపదం' అనే అర్థాన్ని సాధించి, ఆ అర్థంలోనే ఆ పదాన్ని ప్రాచీనులు వాడినట్లు చూపించాలని ప్రయత్నించారు.

సోమేశానంతరం నీచముచ్చం నిరృతి కాలయో
దీర్ఘాయుర్నామతద్వాస్తు ప్రశస్తం కులవర్ధనం॥
రుద్రేంద్రాస్తరముచ్చం స్యాన్నీచం వరుణరక్షసో ః
శ్మశానంనామతద్వాస్తు కేవలం కులనాశనం ॥

ఉత్తర, ఈశాన్యదిశలు పల్లు - నైరుతి, దక్షిణదిశలు మెరకగా వుండేది దీర్ఘాయర్వాస్తు కాబట్టి, ఆ ప్రదేశం నివాసానికి ప్రశస్తం

ఈశాన్యం, తూర్పుదిశలు మెరక - నైరుతి, పశ్చిమదిశలు పల్లుగా వుండేది శ్మశానవాస్తు కాబట్టి, ఆ ప్రదేశం కులాన్ని నాశనం చేస్తుంది.

పై రెండు శ్లోకాల్లోని కులవర్ధనం, కులనాశనం అనే పదాలకు వంశవర్ధనం, వంశనాశనం అనే అర్థాలు కావని రుజువుచేయడానికి ప్రొ॥ శ్రీనివాస్ ఇలా తంటాలు పడుతున్నాడు. మరి, ఆ "వాస్తు విద్య"లోనే మెరకపల్లాల ప్రకారం (1) గోవీధి, (2)వైశ్వానరవీధి (3) యమవీధి, (4) భూతవీధి, (5) జలవీధి, (6) నాగవీధి, (7) గజవీధి, (8) ధనవీధులను నిర్ణయించి - వాటి ఫలితాలుగా వరుసగా (1) శుభం,, (2) కలహాలు, (3) కులనాశనం (4) రోగాలు, (5) నాశనం (6) ప్రశస్తఫలం, (7) శుభం, (8) వంశవృద్ధిలను పేర్కొనడాన్ని గమనిస్తే ప్రొ॥ శ్రీనివాస్ ఫలాలకు తీసిన అర్థాలు కృతకమని బోధపడుతుంది. ఆయన అసమర్థనీయమైన దాన్ని సమర్థించబూనుకుంటున్నారని తేలుతుంది. వాస్తవాన్ని చూడడానికి పాండిత్యమొక్కటే

చాలదని మనంలోగా చాలాసార్లు చెప్పుకున్నాం. దిశల మెరకపల్లాలను బట్టి కులవర్ధన, కులనాశనాలు ఎలా జరుగుతాయో, మరియీ శ్లోకాలను ఆయన ఏ ప్రత్యేక కారణాల వల్ల ఉదహరించాడో, అందలి ఔచిత్యమేమిటో అర్థంకాదు.

వాగుల్ని మనం వంకలంటున్నాం. వంకలు తిరగకుండా పారే నదులు ప్రపంచంలో లేవు. అందువల్ల నదీప్రవాహాల దిఙ్ముఖంగా మన పూర్వులు గృహాల నీటివాలును వుద్దేశించారనడం శుద్ధ అబద్ధం. ఒకవేళ, అలా వుద్దేశించారని అంగీకరించినా, నదికి ఈదరినవున్నవారికి ఉత్తరం, ఈశాన్యం, తూర్పు దిశలు పల్లంగా వుంటే - నదికి ఆదరినవున్నవారికి అవి వరుసగా దక్షిణ, నైరుతి, పడమర దిశలవతాయికదా? అంటే, నదికి ఒకదరినవున్నవారికి ఏది శుభవాస్తువో, అవతలిదరిన వున్నవారికి అది అశుభవాస్తువన్నమాట! నదికి ఒకదరినవున్నవారికి కులవర్ధనమైన వాస్తువు, మరోదరినవున్నవారికి వినాశకర వాస్తువవుతుందన్నమాట! మరి మనపూర్వులంతా నదికి ఒకవైపునే నివసించారనుకోవాలా? దాన్ని బట్టే వాస్తు నియమాలు రూపొందాయనుకోవాలా?

అంతేకాదు, నది ఒడ్డున యిళ్లున్నవారికి అన్వయించిన దిక్కులు మైదానాల్లో వున్న యిళ్లకు ఎలా అన్వయించగలరు? నేల అంతా చదునుగా వుండదు కదా? మైదానాల్లో కూడా ఎక్కడికక్కడే ఎత్తు పల్లాలు వుంటాయి కదా? ప్రతిచోటా ఉత్తర, ఈశాన్య, తూర్పుదిక్కులకే నీరు పంపడానికి ఎలా వీలవుతుంది? పృష్టవాస్తు, వీధివాస్తుల పేర్లతో మూఢనమ్మకస్తుల జేబులు కొట్టడానికి కాక, అందులో శాస్త్రం, వాస్తవం ఏమున్నది? అన్ని వైపుల పల్లంగా వుండే కూర్మపృష్టవాస్తువు ధనధాన్య సుఖాలెలా యివ్వగలదు? శుభాశుభాలు తటస్థం కావాలి కదా? ఆ వాస్తులో నైరుతి, పడమర, దక్షిణ దిశలకు కూడా నీరు ప్రవహిస్తుంది కదా? కొండల చుట్టూ వుండే యిళ్లనీళ్లు ఎదురుగా ఏ దిక్కు వుంటే ఆ దిక్కుకే ప్రవహిస్తుంది. బ్రాహ్మణ వాస్తువు ప్రకారం కొండలకు తూర్పువైపున యిళ్లు కట్టుకోవాలి! అసలు "సోమేశానంతరం.... కేవలం కులనాశనం" అనే శ్లోకాలు రెండూ కేవలం బ్రాహ్మణులకోసం చెప్పబడినవేమో!

ఎందుకంటే, ఉత్తరం బారుకీ పల్లంగా వుండే స్థలం బ్రాహ్మణులకు తగిన స్థానమన్నారు కదా? అది శూద్రాదులకు పనికి రాదుకదా? పడమర బారుకీ పల్లంగా వుండే స్థలాన్ని శూద్రులకు నిర్ణయించారుకదా? పడమర పల్లమైతే నాశనం ప్రాపిస్తుందని "వాస్తు విద్యే" అన్నది. కాబట్టి "వాస్తు విద్యే" శూద్రుల నాశనాన్ని ఉద్దేశించిందని అర్థమవుతుంది.

కులవాస్తుగ్రంధాల్లో, గృహస్థులకు శాపనార్థాలు పెట్టే వాస్తుగ్రంధాల్లో శాస్త్రమున్నదని కృతకఅర్థాలు, విపరీతార్థాలు తీయడం, వాస్తువులో వాస్తవాలను

వెదకబూనడం వాస్తువులో గర్భితంగా ఇంకా ఏదో వున్నదనే భ్రమను కల్పిస్తుంది. స్వరాజ్యం వచ్చిన తర్వాత పెరుగుతూ వస్తున్న అనేకానేక-రుగ్మతల్లో వాస్తువు కూడా ఒకటి. వైజ్ఞానికులెవరైనా వాస్తువును సమర్థించబూనితే, వారివైజ్ఞానిక నిజాయితీనే శంకించవలసి వస్తుంది. దీన్నిబట్టి వాస్తువుపై విమర్శలు వ్రాసేవారు జాగ్రత్త వహించవలసివస్తుంది.

# అనుబంధం - 2

2000 సంవత్సరారంభంలో హైద్రాబాదు నుంచి టి.వి.రమణమూర్తిగారు "విజయవిహారం" అనే మాసపత్రికను ప్రారంభించారు. సంవత్సరాంతానికి దానిమీద ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంవారి శీతకన్ను పడింది. పత్రిక ప్రచురణ ఆగిపోయింది. ఫలితంగా, ఫిబ్రవరిలో ప్రారంభమైన "వాస్తు సంవాదమ్" శీర్షిక కూడా ఆగిపోయింది. పత్రిక ఆగిపోవడం తాత్కాలికమైనా, అందుకు కారణం అది కొన్ని మతమౌఢ్యాలపై రణభేరి మ్రోగించి సంచలనం సృష్టించడమే.

మూఢ నమ్మకాలపై పోరాడమని 2000 సెప్టెంబరులో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి పిలుపు యిచ్చాడు. కాని, మూఢ నమ్మకాలను చీల్చిచెండాడుతున్న విజయ విహారంపై ఆయన ప్రభుత్వమే ఆ తర్వాత 3 నెలలకు పగబట్టి క్రిమినల్ కేసు బనాయించింది. అందుకు చూపిన కారణం మాత్రం దయానందుడు వ్రాసిన "సత్యార్థ ప్రకాశిక"లోని అంశాలను కోట్ చేసిన వ్యాసం విజయవిహారంలో ప్రచురించడం - అందువల్ల మతోద్రేకాలు పెరుగుతాయట! 1875 నాటి ఆంగ్ల పాలకులకు ఆమోదయోగ్యమైన ఆ రచన, ఆ తర్వాత 125 యేండ్లనాటికి హింద్ స్వరాజ్యపాలకులకు నిషిద్ధ పాత్రమైనదన్న మాట! దీన్ని బట్టి, మూఢనమ్మకాలపై పోరాటం సల్పాలన్న ముఖ్యమంత్రి ప్రకటనలోని చిత్తశుద్ధినీ, నిజాయితీనీ మనం అంచనావేసుకోవచ్చు! అంతేకాదు, ఆంగ్లపాలనలో వచ్చిన ఏ సామాజిక సంస్కరణనూ హింద్ స్వరాజ్యపాలన తీసుకురాగలిగేది కాదని కూడా దీనివల్ల తేలుతుంది.

మూఢనమ్మకాలన్నిటికీ, మూఢాచారాలన్నిటికీ పునాదులు మతాల్లోనే వున్నాయి. ఆ మతాల పునాదులను కదిలిస్తున్న అవిశ్వాసులపై క్రిమినల్ చర్యలకు పాల్పడడమంటే, మతాలకు - మూఢనమ్మకాలకు వంతపాడడమే. స్వేచ్ఛా వాదులపై నేరాలు మోపి క్రిమినల్ శిక్షలు వేయడమనేది యూరపులో క్రైస్తవం క్రింద మధ్యయుగాల్లో జరిగింది. మధ్యయుగాల నుంచి ఇప్పటిదాక ఇస్లాం ఆపని చేస్తూనే వుంది. విదేశీపాలనకాలంలో ఆపిన ఆ అత్యాచారాలను స్వదేశీపాలనలో ఇప్పుడు హైందవం పునరుద్ధరించ బూనుకుంది.

మతాలను విమర్శించడమంటే మనుషుల్లోని వివేకానికి ఉత్ప్రేరకంగా పనిచేయడమే. హేతువాదమూ, సైన్సూ, తత్వమూ గతంలో ఆపనేచేశాయి, ఇప్పుడూ అదే పనిచేస్తున్నాయి. మతం నుంచి స్వేచ్ఛ కోరుతున్నవారంతా ఆ పనే చేస్తున్నారు. మత స్వేచ్ఛను వారు కాదనడం లేదు, మతం నుంచి కూడా స్వేచ్ఛ కావాలంటున్నారు. వారి బోధవారు చేస్తుంటే, వీరి విమర్శ వీరు చేస్తున్నారు. ఏ మతమూ ఎవరి సొంత ఆస్తీకాదు. అసత్యాన్ని సత్యమని వారంటుంటే, అసత్యాన్ని అసత్యమని వీరంటున్నారు. అసత్యాన్ని అసత్యమని చెప్పే హక్కును కత్తిరించే ప్రజాస్వామ్యానికి మనం మతస్వామ్యమని

అర్థం చెప్పుకోక తప్పదు.

"విజయ విహారం" లో ఫిబ్రవరిలో ప్రారంభమైన "వాస్తు సంవాదమ్" నవంబరుతో అర్ధంతరంగా ఆగిపోయింది. దజను మంది దాక ఆ చర్చల్లో పాల్గొన్నవారిలో ఆర్కిటెక్కులూ, సైంటిస్టులూ, హేతువాదులూ, జర్నలిస్టులూ వాస్తు ఫలితాలన్నీ అబద్ధాలని విమర్శించినవారే. వాస్తువు పేర జరుగుతున్న మోసాన్ని వారంతా ఖండించినవారే. వాస్తు పండితులనబడే వారిలో ఒక్క గౌరు తిరుపతిరెడ్డిగారు మాత్రమే అచర్చలో తలదూర్చి అభాసుపాలయ్యారు.

వాస్తువు నూటికినూరుపాళ్లు శాస్త్రం కాదని "వాస్తువు శాస్త్రమా?" అనే యీ గ్రంథంలో తొలి నుంచి తుదిదాక మేము నొక్కి చెప్పాము. ఈనాటి రాజకీయుల్లో అధికశాతం అధికసంపన్నులేకాక, అధికార పదవీలాలసులు కూడా. స్వరాజ్యలబ్ధి తర్వాత ఇబ్బడిముబ్బడిగా పెరిగిన నయాసంపన్నులు వారికి అనుడుబండలుగా వ్యవహరిస్తున్నారు. వెరసి మొత్తంగా వీరంతా వాస్తు పండితులకు ఆశ్రయమిచ్చి జనం మీదకు తోలారు. ఇప్పుడున్న "మంది" చాలరన్నట్లు, అలాంటివారిని ఉత్పత్తి చేయడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విశ్వవిద్యాలయాల్లో జ్యోతిర్వాస్తు పండితుల ఉత్పత్తి కేంద్రం ప్రారంభించింది. అది కూడా చాలదన్నట్లు యూనివర్సిటీ గ్రాంట్స్ కమీషన్ ఛైర్మన్ డా॥ హరిగౌతమ్ గారు పురోహితుల ఉత్తత్తి కేంద్రాలను ప్రారంభించమని విశ్వవిద్యాలయాలను ప్రోత్సహిస్తున్నారు. వేదాంగ జ్యోతిర్వాస్తుకోర్సుల్ని ప్రారంభించమని విశ్వవిద్యాలయాలకు యు.జి.సి. నుంచి సర్క్యులర్లుకూడా అందాయి. దానికి వ్యతిరేకంగా భారత శాస్త్రజ్ఞుల కమిటీలు ప్రతిస్పందిస్తున్నాయి. అశాస్త్రీయ మూఢ పోకడలకు బలికాకుండా ప్రజల దృష్టిని మరలించవలసిన బాధ్యత అభ్యుదయవాదులందరి మీదనూ వుంది. ఆపని రాజకీయులు చేయరు. దుస్సాంప్రదాయాలను మార్చే ప్రక్రియలను చేపట్టే వైఖరి మన ప్రభుత్వాలు ఇప్పట్లో అవలంబించే సూచనలు లేవు. పైగా, వాటిని బలపరిచే మానసిక వైఖరి నుంచి మన రాజకీయులు వెనుదిరిగే ఆశలు ప్రస్తుతానికి లేవు.

మనుషులకు ఆశలు, భయాలు వుండడం సహజం. వారిని ప్రలోభపెట్టడానికి వాస్తు పండితులకు అవే వరాలవుతున్నాయి. వాస్తు పండితుల బ్లాక్ మెయిలింగ్ పన్నుగడలకు చిక్కనివారు దొరకడం చాలా అరుదు. వారి మాటలను విని సెక్రటేరియట్ ద్వారాలు, దారులు మార్పించిన ఎన్.టి.రామారావు ముఖ్యమంత్రి పదవినేకాక, ప్రాణాలు కూడా కోల్పోయాడు. అలాంటి పనినే చేసిన గవర్నర్ మర్రిచెన్నారెడ్డి చెన్నైలో జయలలిత చేతిలో నానా అగచాట్లు పడి గుంజిళ్లు తీశాడు. ప్రధానమంత్రి భవనాన్ని వాస్తు ఆదేశాలకు అనుకూలంగా మార్పించిన దేవేగౌడ సంవత్సరకాలానికే పదవినుంచి దిగిపోయాడు. ఇలా చెప్పుకొంటూ పోతే, వాస్తు నిర్దేశాలకు బలైపోయిన రాజకీయనాయకుల జాబితా

కొండవీటి చేంతాడులా పెరిగిపోతుంది. వాళ్లంతా శిలవేసుకొని తామున్న పదవుల్లో శాశ్వతంగా నిలబడిపోవాలని పేరాస పెంచుకున్నారు. అయినా, వైఫల్యం ఎదురైంది.

ఎన్నికల్లో, దావాల్లో, ప్రమోషన్లలో చుక్కెదురైన తర్వాతనైనా – పదవులనుంచి భ్రష్టులై, చిక్కుల్లో యిరుక్కుపోయిన తర్వాతనైనా – వాస్తు ఫలాలు ఆచరణలో విఫలమైనాయనీ, విఫలంకాక తప్పదనీ రుజువైన తర్వాతనయినా – వాస్తువు మీద నమ్మకం సడలని వివేకహీనులు ముఖ్యంగా పెద్దవాళ్లమనుకునే వారిలోనే వున్నారు. అట్లని, చిన్నవాళ్లు మోసంపోవడంలేదనీ కాదు – వారున్నూ పెద్దవాళ్ల దారిలోనే నడుస్తున్నారు.

వాస్తువును గురించిన ఆశాభయాలు కాక – నమ్మకం వున్న పాలకులు పేదబడుగు వర్గాలకు కట్టించే యిండ్లు శుభవాస్తువుతో, ధనవాస్తువుతో కట్టిస్తే, ఆ వర్గాలవారికి ధనం కలసి వచ్చి, శుభోదయం అవుతుంది కదా? మరి, ఆపని మన పాలకులెందుకు చేయడం లేదో! పాలకులే దీనికి సమాధానం చెప్పాలి.

మోసమే వృత్తిగా బ్రతికే వాస్తు పండితుల్ని అచ్చోసిన ఆబోతుల్లా సమాజం మీద వదలరాదు. వారిని కూడా కన్స్యూమర్ యాక్టు పరిధిలోకి తీసుకురావాలి. డాక్టర్లు, న్యాయవాదులు, ఆర్కిటెక్కులు, వివిధ తరగతుల వ్యాపారులు వినియోగదారుడి నష్టానికి బాధ్యులుగా చట్టం వున్నపుడు – పచ్చిమోసగాండ్లయిన వాస్తు వృత్తిపరుల్ని ఆ చట్ట పరిధిలోకి ఎందుకు తీసుకురావడం లేదు? ప్రొ॥ ఆర్.వి. కొల్హాట్కర్, శ్రీ ఏ. బుచ్చిరెడ్డి గారలన్నట్లు, బోజరాజు చేత రచించబడినదంటున్న “సమరాంగణ సూత్రధారం” మిడి మిడి జ్ఞానంతో గృహ నిర్మాణం చేపట్టే వాస్తుశిల్పులకు (ఆర్కిటెక్ట్‌లకు) సైతం మరణశిక్ష విధించాలని చెపుతున్నది. ఈనాడు అశుభవాస్తుపేరుతో గృహస్థుల యిండ్ల గోడలు పడగొట్టించి, కొంపలు కూల్చే వాస్తు నటశిఖామణులకు ఎలాంటి శిక్షలు వేయాలి?

అసలు ఇంటి నిర్మాణాన్ని శుభాశుభాలతో ముడివేయని వాస్తుపండితులు ఎప్పుడైనా, ఎక్కడైనా వున్నారా? శుభాలుకాని, అశుభాలు కాని ఇండ్లు – వాకిళ్లు కల్పించగలవా? గృహస్థుల మరణాలను గృహనిర్మాణం శాసించగలదా? సంతాన భాగ్యాన్ని, సంతానలేమిని ఇంటికట్టుబడి, దిక్కులు, మెరకపల్లాలు నిర్ణయించగలవా? అలా అని ప్రయోగ పూర్వకంగా ఏ వాస్తు పండితుడైనా నిరూపించడానికి సాహసించి సిద్ధం కాగలడా?

తిరుపతిరెడ్డిగారికి ‘రాయనాసం’ ఎక్కువనిపిస్తుంది. ఆయన విజయవిహారం ప్రారంభించిన వాస్తువివాదంలోకి దిగి “వాస్తు వ్యతిరేకమైన ఇల్లు తాను చూపిస్తే, అందులో నివసించగలవారున్నారా?” అని సవాలు విసిరారు. కాని, ఆసవాళ్లను స్వీకరించినవారికెదురు నిలువలేక తోకముడిచారు. ఆ సవాళ్లు స్వీకరించగలవారు

ఆంధ్రప్రదేశ్‌లోనే వేలాదిమంది వున్నారని వారికి తెలియదు. ప్రొ॥ నాగిరెడ్డి, బుచ్చిరెడ్డి, పెన్మెత్స సుబ్బరాజు, డా॥ సజ్జల జీవానందరెడ్డిగారలూ, ఇంకా యితరులూ ఆయన తప్పుడు వాస్తువును, ధనదాహాన్ని, అఘాయిత్యాలను ఉదహరించి నిరుత్తరుల్ని చేశారు. (విజయవిహారం సంపుటం 1, సంచికలు 2 నుంచి 11 వరకు)

నిజానికి ఈనాడు, వాస్తుపండితులమనుకొనేవారికి తెలిసిన వాస్తువు స్థలాల దిక్కులకు,ఎత్తు పల్లాలకు సంబంధించింది మాత్రమే. అది బ్రాహ్మణ వాస్తువు. మహర్షుల వాస్తువులో బ్రాహ్మణ వాస్తువునే వీరంతా ఎన్నుకున్నారు. (కులవాస్తువును బుజాన వేసుకున్న కులమత్సరగ్రస్తులు కూడా కొందరీ నాడు లేకపోలేదు). వాస్తవానికి వాళ్లెవ్వరూ గృహ నిర్మాణ పద్ధతులు తెలిసిన వాస్తుశిల్పులు (ఆర్కిటెక్కులు) కారు. వారు చెప్పేవన్నీ వూకదంపుడు ప్రగల్భాలు. వారు రాసేవన్నీ పొల్లునదంచిన బియ్యం.

ప్రకృతిలో జరిగే ఉత్పాతాలన్నీ వాస్తు పండితులకు సవాళ్లే. 2001 జనవరి 26న - అంటే, మన రిపబ్లిక్ దినోత్సవం రోజు ఉదయం గుజరాత్‌లో భూప్రళయంలాంటి భూకంపం జరిగింది. ఫలితంగా దాదాపు లక్షల మంది జనం మరణించారు. కుటుంబాలు కుటుంబాలు సైతం నిర్వంశమయ్యాయి. ఏ వాస్తు దోషాలవల్ల ఆ జనమంతా మరణించారు? లక్షకు పైగా జనం క్షతగాత్రులై ఆస్పత్రుల పాలయ్యారు. ఏ వాస్తు దోషాలవల్ల వారు క్షతగాత్రులయ్యారు? వేలాది గృహాలు, చిన్న – పెద్ద యిండ్లు, బహుళ అంతస్థులభవనాలు ఏ వాస్తు దోషాలవల్ల కుప్పకూలిపోయాయి? ఏ వాస్తు దోషాలవల్ల తుఫానుల ఫలితంగా ఒకే రోజున అనేక గృహాలు కూలిపోతున్నాయి? దేశదేశాల్లో, వరదల్లో కూలి, కొట్టుకుపోతున్న గృహాలు ఏ వాస్తు దోషాలవల్ల నదులపాలవుతున్నాయి? రెండో ప్రపంచ యుద్ధంలో విధ్వంసమై పోయిన వేలాది గృహాలు, మరణించిన లక్షలాది జనం ఏ వాస్తుఫలాలకు బలైనట్లు?

ఏ ఒక్క గృహానికీ శుభవాస్తువులేదా?

ఏ వాస్తు పండితుడైనా ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పగలడా?

వాస్తు పండితులు కూసే అబద్ధాలు, కోసే కోతలు, చేసేమోసాలు అన్నీ ఇన్నీ కాదు. వారు చెపుతున్న వాస్తుఫలాలు ఎలా ఫలించినవో కథలు కథలుగా ప్రచారం చేసుకుంటారు. సవాళ్ల తిరుపతిరెడ్డిగారి పుస్తకమంతటా అకథలే. అయన ఒకసారి హైద్రాబాదులో డా॥ సజ్జల జీవానందరెడ్డిగారి యింటి చుట్టూ దిక్సూచి పట్టుకొని ప్రదక్షిణంచేసి, అయింటిలోని పిల్లలకు చదువు అబ్బేయోగ్యతలేదన్నాడట. కాని, జీవానందరెడ్డిగారి కుమారుడు అప్పటికే అమెరికాలో ఇంజనీరింగులో డబుల్ ఎం.ఎస్.చేసి అక్కడే ఉద్యోగం చేస్తుండగా, కుమార్తె కంప్యూటర్ బి.ఎస్‌సి.లో ప్రధమశ్రేణిలో పాసై, ప్రస్తుతం అమెరికాలో వున్నదట! అయితే, సవాళ్ల తిరుపతిరెడ్డిగారు ఇలాంటి సర్టిఫికెట్లను తన గ్రంధాల్లో వ్రాసుకోరు. అయన ఓ వాస్తు

సామ్రాట్టుననుకుంటారు.

ఇతర కులాల విషయం అలా వుంచుదాం. బ్రాహ్మణులు పండిత వంశీయులు. వాస్తు నియమాలు పాటించకుండా వారు గృహాలు నిర్మించుకోరు. మావూరి (నాగండ్ల) దగ్గరలో పావులూరు, ఇంకొల్లు గ్రామాల్లో నేనెరిగిన తర్వాతనే సంపన్న బ్రాహ్మణ కుటుంబాలు చాలా వుండేవి. వారి లోగిళ్లు చాలా పెద్దవి. సాగుకు యోగ్యమైన భూముల్లో, సగానికి పైగా వారివే. ఈనాడు చూస్తే, నాలుగింట మూడు వంతుల కుటుంబాలు ఆస్తులమ్ముకొని ప్రవాసం వెళ్లిపోయారు. ఇళ్లు పడగొట్టించే వాస్తు పండితులకోసం ఎదురుచూడకుండానే వారి యిళ్లు పాడుబడ్డాయి. స్థలాలు కొనుగోలు దార్ల పరమైనాయి. వాస్తు ఫలాలు ఆ బ్రాహ్మణ కుటుంబాలన్నిటినీ చిన్న చూపు చూచాయా! గ్రామాలన్నిటి పరిస్థితి యింతే!

మా గ్రామం ఒకప్పుడు బిజిబిళ్లవారి అగ్రహారం. 30కి పైగా వైదిక బ్రాహ్మణకుటుంబాలుండేవిట. గ్రామంలో సగానికిపైగా సేద్యపు భూమివారిదేనట. నేనెరిగిన తర్వాతనే మా గ్రామంలో 15కు పైగా వైదిక బ్రాహ్మణకుటుంబాలుండేవి. వారికి ఎద్దులు, యారగట్టవుండేవి. అందరివీ పెద్ద లోగిళ్లే. అందులో కొన్ని యిళ్లు ఆ బజారు నుంచి ఈ బజారు దాక ఆక్రమించుకొని వుండేవి. వాళ్ల యిళ్లపేర్లు చాల ఘనమైన వంశాలవే: కంభంపాటి, పిసపాటి, భాగవతుల, రాళ్లబండి, పోతుకూచి, పెనుమర్తి, మాజేటి, కప్పగంతుల, చివుకుల, ఏలేశ్వరం, మేడూరి వగైరా. ఇతరుల పరమైన ఒకటి రెండు తప్ప, వాళ్లయిళ్లన్నీ ఏనాడో కూలిపోయాయి. వాళ్లంతా యిళ్లమ్ముకొని వూరు విడిచిపోయారు. ఒక్కటంటే ఒక్కవైదిక బ్రాహ్మణకుటుంబమైనా ఈనాడు మావూళ్లోలేదు. వాస్తు నియమాలను ఉల్లంఘించి యిళ్లు కట్టుకోవడం వల్లనే వాళ్లు దివాలా తీసి దేశమ్మకాకులై పోయారా?

అంతేకాదు, నేనెరిగిన తర్వాత మా గ్రామంలో పదిపన్నెండు పచ్చని విశ్వబ్రాహ్మణ కుటుంబాలుండేవి. వారివీ పెద్దలోగిళ్లే. వారంతా కొంచెంపాటి ఆస్తిపరులే. విశ్వబ్రాహ్మణులుస్థపతి (నిర్మాణశిల్ప) వంశీయులు. వారు బంగారుపని, వడ్రంగం, కమ్మరం వృత్తుల్లో వుండేవారు. కొందరు వూరు విడిచిపోగా, మిగిలిన వారి ఆస్తులు సన్నగిలి, దాదాపు పాడుబడ్డ యిళ్లలో యిప్పుడు కాపురం చేస్తున్నారు. కాస్తో కూస్తో గృహనిర్మాణం మెలకువలు తెలిసిన విశ్వబ్రాహ్మణులు కూడా వాస్తు దోషాలకు బలయ్యారనుకుందామా?

వాస్తు పండితులు ఎన్నోసొళ్లు కబుర్లు చెపుతుంటారు. భూమిలోపల అయస్కాంతమున్నదనీ, దాని ఫలితాలు దిశలమీద కూడా వుంటాయనీ, అందువల్ల, ఆయాదిశలఫలాలు ఇండ్లమీద కూడా వుంటాయనీ కొందరు వాదిస్తారు. అంతేకాని, ఆ ఫలాలను ప్రయోగ పూర్వకంగా రుజువు చేయరు. వాస్తు ఫలాలకు ప్రాచీనులను

ప్రమాణంగా స్వీకరిస్తారు. అయితే, ఈ భూఅయస్కాంత విషయం మన ప్రాచీనులకు తెలుసా? తెలిసినట్లు ఏ ప్రాచీన వాస్తు గ్రంథమైనా పేర్కొందా? ఈ ప్రశ్నలకు యీనాటి వాస్తు పండితుల వద్ద సమాధానం దొరకదు. అయినా, ఈనాటి వ్యావహారిక దిశలు భూఅయస్కాంతదిశలకు $23^0$ తేడాగా వున్నవి. భూఅయస్కాంతం ప్రకారం దిక్కుల్ని నిర్ణయించడానికి ఈనాటి వాస్తు పండితులు దిక్సూచుల్ని పట్టుకొని బయలుదేరడం ఫ్యాషనుగా మారింది. ప్రాచీనులు కూడా దిక్సూచుల్ని వుపయోగించేవారా? లేక, భూ భ్రమణ పరిభ్రమణ కాలంలో ఉత్తరాయణ – దక్షిణాయణాల మధ్య సమయంలో అవుతున్న సూర్యదర్శనాన్ని బట్టి దిక్కుల్ని నిర్ణయించుకొనేవారా? లేక సామయిక సూర్యోదయాన్నే దిక్సూచిగా పరిగణిస్తారా? వ్యావహారిక దిక్కులకు, దిక్సూచి దిక్కులకు తేడా వున్నపుడు వాస్తు ఫలాలలో తేడాలు వస్తాయో, రావో, వాస్తు పండితులే చెప్పాలి.

ఇండ్లకు తెల్ల సున్నం కొట్టడాన్ని కూడా వాస్తువులో చేర్చేవారున్నారు. గోడలకు ప్లాస్టర్ చేయడం పురుగు పుట్ర, బూజు గోడలలో చేరకుండా వుండడానికే. తెల్ల సున్నం కొట్టడం అలంకరణ కోసమే. సూర్యుడి పరారుణ కిరణాలేకాదు, ఏ కిరణాలైనా సున్నం వల్ల పరావర్తనం చెందడానికి మాత్రం కాదు. అలా అనుకుంటే, ఇంటిలోపలి గోడలకు తెల్లసున్నం కొట్టవలసిన పనిలేదు. ఇలాంటి సమర్థనలను కనుగోవడం మత పునరుజ్జీవనవాదుల ప్రవృత్తి అని లోగా మనం చూచాం. పేడ అలుకుడు క్రిమిసంహారం కోసం అని వాదించిన వాస్తు పండితుల్ని చూచాం. పసుపు క్రిమిసంహారిణి అనుకున్నవారు, ముత్తయిదువులకు తప్ప, ముండమోపులకు దాన్ని ఎందుకు పూయరు? అనే మన ప్రశ్నలకు మత పునరుజ్జీవనవాదుల నుంచి ఏనాటికీ సమాధానం రాదు – రావడానికి వీలులేదు. గడపలకు పసుపు రాసి, కుంకుమబొట్లు పెట్టడం కూడా అలంకరణ కోసమే.

పూర్వం వాస్తు శిల్పులు (వాస్తు పండితులు కాదు సుమా) గృహనిర్మాణంలో ఆయా ప్రాంతాల్లో దొరికే సామాన్లను బట్టి, వాటి గట్టితనాన్ని బట్టి, అవి మోయగల కప్పుల బరువును బట్టి, గదుల కొలతలు నిర్ణయించేవారు. అందుకే ప్రాచీన దేవాలయాలు, రాజగృహాలు, దేవిడీలు, ఇతర గృహాలు, స్తంభాలపై చిన్నగదులుగా వుండేవి.

ఇప్పటికీ శిథిలావశేషాలుగా వున్న ప్రాచీన కట్టడాలను పరిశీలిస్తే, అవి అన్నీ ఇరుకుగదులతో వున్నట్లు తేలుతుంది. వెయ్యి స్తంభాల ఆలయ మండపాలుండవచ్చు కాని, ఆ స్తంభాల రెండిటిమధ్య కొలత మూడు, నాలుగు గజాలే వుంటుంది. సినిమాల్లో మనం చూచే రాజదర్బారులన్నీ ఇటీవలి కట్టడాల్లో సీనీకరించబడినవో, లేక, తాత్కాలిక సెట్టింగు యేర్పాటో. అంతేకాని, ఏ ప్రాచీన రాజదర్బారూ విశాలంగా వుండేదికాదు. అయినా, ప్రాచీన కట్టడాలన్నీ వాస్తు శిల్పుల (ఆర్కిటెక్కుల) ప్రతిభకు చిహ్నాలే కాని,

వాస్తుపండితుల పిచ్చి నియమాలకు ఫలితాలు కావు.

వాస్తు ఫలాలు నిజమనే పండితులకు పరీక్షగా, సవాలుగా యీ క్రింది ప్రతిపాదనలు చేస్తున్నాము :

1. అన్నీ అశుభఫలితాలిచ్చే గృహాన్ని నిర్మించి, దానిలో నివసించేవారికి ఎప్పుడెప్పుడు ఏయే అశుభాలు ఎదురవతాయో వాస్తు నియమాల ప్రకారం దస్తావేజు వ్రాయాలి. ఆ గృహంలో నివసించేవారిని మేము ఎంపిక చేసి పంపిస్తాము. దస్తావేజు వ్రాత ప్రకారం ఆ గృహవాసికి అశుభాలు ఎదురుకావాలి.
2. అన్నీ శుభఫలితాలు యిచ్చే గృహాన్ని నిర్మించి, దానిలో నివసించేవారికి ఎప్పుడెప్పుడు ఏయే శుభాలు ఎదురవతాయో వాస్తు నిమయాల ప్రకారం దస్తావేజు వ్రాయాలి. ఆ గృహంలో నివసించేవారిని మేము ఎంపిక చేసి పంపిస్తాము. దస్తావేజు ప్రకారం అగృహవాసికి శుభాలు ఎదురుకావాలి.

ఒకే ఒక గృహమైతే గుడ్డివేటుగా కొన్ని ఫలాలు నిజమయ్యే అవకాశం వుంది. అందువల్ల, 10 గృహాల చొప్పున పై రెండు తరహాల గృహాల నిర్మాణం చేస్తే, అందులో 90 శాతం వాస్తు ఫలాలైనా సరిపోతే, వాస్తువు పాక్షికంగానైనా శాస్త్రమేమో అనిశంకించడానికి వీలవుతుంది.

3. ఏ నగరంలోనైనా, ఏ పట్టణంలోనైనా, ఏ గ్రామంలోనైనా ఒకే వార్డులో, లేక ప్రాంతంలో వున్న 200 యిండ్లను వాస్తు పండితులు పరిశీలించి, ఆయా యిండ్ల వాస్తు ఫలాలను వ్రాయాలి. ఆ 200 మంది గృహస్తుల జీవనస్థితికి – వాస్తు పండితులు వ్రాసిన వాస్తు ఫలాలు సరిపోవాలి. అందులో, దోష పరిమితి 5 శాతం వరకు ఆమోదించబడుతుంది.
4. మేము 100 యిండ్లు చూపిస్తాము. ఆ యిండ్ల వాస్తువుకు, వాస్తు పండితులు చెప్పే ఫలాలు ఆ గృహవాసుల జీవితాల్లో ప్రతిబింబిస్తున్నట్లు రుజువుకావాలి. దోషపరిమితి ఇందులో కూడా 5 శాతం ఆమోదించబడుతుంది.

ఏ వాస్తు పండితుడైనా ఈ సవాళ్లలో ఏదో ఒక దాన్నయినా స్వీకరించడానికి సిద్ధపడి, ముందుకు రాగలిగితే నా అడ్రసుకు దానిని తెలుపవచ్చు. నా అనంతరం ఇదే సవాలును భారత హేతువాద సంఘం విసరినదిగా భావించి ఏ వాస్తు పండితుడైనా, ఎప్పుడైనా స్వీకరించి, ముందుకు రావచ్చు.

రావిపూడి వెంకటాద్రి, అధ్యక్షుడు,

మార్చి 2001 భారత హేతువాద సంఘం, చీరాల – 523 155.

C.No. 13687

# సంప్రదించిన కొన్ని గ్రంథాలు


విశ్వకర్మ ప్రకాశిక
విశ్మకర్మ వాస్తుశాస్త్రం
కాలామృతం
గృహకారిక
మయమతం
మత్స్యపురాణం
బృహత్సంహిత
భవిష్యోత్తర పురాణం
పంచవస్తు పారిజాతం
వాస్తు సర్వస్వం
వాస్తు దీపిక
శిల్పరత్నం
మానసారం
సమరాంగణసూత్రధారం
వాస్తువిద్య
మహాకపిల పాంచరాత్రం

Encyclopedea of Religion and Ethics
Mysterious Powers of the Pendulam - by A.R. Hari
The Blood of Kings - Linda Schele and Mary Ellen Miller
Time Among the Maya - Ronald Wright
Tradition : Science and Society - Dr.S. Balachandra Rao
Feng Shui - Lillian too

వాస్తుదర్పణం ... చల్లా లక్ష్మీనరసింహశాస్త్రి
వాస్తుశాస్త్ర వివేకం ... మధుర కృష్ణమూర్తిశాస్త్రి
శ్రీకృష్ణ వాస్తుశాస్త్రం ... సోమల గణపయామాత్య
వాస్తుశాస్త్ర వాస్తవాలు ... గౌరు తిరుపతిరెడ్డి
వాస్తుశాస్త్ర రహస్యములు ... అలుగుశెట్టి ఉమామహేశ్వరరావు
శ్రీరామరాయ వాస్తుశాస్త్రము ... ముద్రగెడ రామారావు
శ్రీరామకృష్ణ వాస్తుశాస్త్రము ... కోనేరు నాగేంద్రప్రసాద్
వాస్తు ప్రాశస్త్యము ... గుమ్మా శివవేంకట లక్ష్మీనారాయణ
వాస్తు సుధానిధి ... ముళ్ళపూడి లీలాకృష్ణమూర్తి
వాస్తులో ఏముంది? ... కొడాలి శ్రీనివాస్
శాస్త్రం – అశాస్త్రం ... రావిపూడి వెంకటాద్రి
వాస్తులో వాస్తవాలు ... కొడాలి శ్రీనివాస్
విజయవిహారం ... సంపుటి – 1

**IS GEOMANCY A SCIENCE?** Rs. 60/-; $ 15/-; £10/-
by Ravipudi Venkatadri, Praphulla Chandra

మూఢ నమ్మకాలు పాదుకోవడం చాల తేలిక.
వాటిని నిర్మూలించడం చాలా చాలా కష్టం.
జ్యోతి ర్వాస్తువులు రెండూ నిర్ద్వంద్వంగా మూఢ నమ్మకాలు.
అవి మార్మిక ప్రక్రియలే కాని, శాస్త్రాలు కావు.
వాటి శాస్త్ర వేషానికి మూలం ఆదిమ వైజ్ఞానిక అపార్థాలే.
ఆ అపార్థాలతో వ్యాపారం చేస్తూ ప్రజల్ని వంచిస్తున్నారు జ్యోతిర్వాస్తు పండితులు.
గృహబలం నిజమైతే, గ్రహబలం అబద్ధం కావాలి.
వాటిరెండి బలాల్లో ఏదో ఒకటి నిజమైనా, కర్మబలం అబద్ధం కావాలి.
ఆ మూటి బలాల్లో ఏదో ఒకటి నిజమైనా, దైవబలం అబద్ధం కావాలి
ఆ నాల్గింటి బలాల్లో ఏ ఒకటి నిజమైనా, మానవ బలం శూన్యం కావాలి.
ఇలా అన్ని మౌఢ్యాలూ మానవ బలాన్ని శూన్యానికి దించి వేస్తాయి.
అందులో జ్యోతిర్వాస్తు ప్రక్రియలకు కార్యార్థులంతా బలవుతున్నారు.
వాటి మనుగడకు మూలం కార్యార్థుల ఆశాభయాలే.
అందునా, వాస్తువు ఈదేశ వ్యాప్తమైన పరమ మూర్ఖ జాడ్యం.
గృహ నిర్మాతలు, కొనుగోలు దార్లు, కౌలుదార్లు అందరూ వాస్తు పీడితులే.
ప్రాచీన వాస్తు గ్రంథాలన్నీ భయంకర అబద్ధాలకు నిలయాలు.
వాటిమీద ఆధారపడని ఆధునిక వాస్తు గ్రంథం లేనేలేదు.
ఆ వాస్తు అబద్ధాలను బట్ట బయలు చేస్తున్న గ్రంథమే "వాస్తువు శాస్త్రమా?"
మూఢ నమ్మకాలను నిర్మూలించే కృషిలో ఓ చిన్నయత్నం "వాస్తువు శాస్త్రమా?"
వాస్తు పండితులందరికీ సవాలుగా నిలిచే గ్రంథం "వాస్తువు శాస్త్రమా ?"
విజ్ఞాన శాస్త్రాన్ని మార్మికమౌఢ్యానికి ఎదురొడ్డిన గ్రంథం

**"వాస్తువు శాస్త్రమా?"**

ముద్రణ : వాసు ఆఫ్‌సెట్, విజయవాడ-2. ఫోన్ : 438324